సమాజం
రూ॥ 60/-
పేజీలు: 64

నవచేతన పబ్లిషింగ్ హౌస్
ప్రతులకు:
నవచేతన పబ్లిషింగ్ హౌస్
గిరిప్రసాద్ భవన్, బండ్లగూడ(నాగోల్),
హైదరాబాద్-68, ఫోన్: 29884454/53
Email ID: navachethanaph@gmail.com
నవచేతన బుక్ హౌస్
అబిడ్స్, బండ్లగూడ,
హిమాయత్‌నగర్ (హైదరాబాద్)
హన్మకొండ.

www.prajapaksham.in
# ప్రజాపక్షం
ప్రతి అక్షరం ప్రజల కోసం
PRAJAPAKSHAM ★★★★

ఎస్ఐఆర్ పిటిషన్లపై నేడు 'సుప్రీం' విచారణ
జ్ఞానంలేని హక్కుల వల్ల ఉపయోగం లేదు
రాజ్యాంగాన్ని గౌరవించేవారు రాష్ట్రాలను 'యుటిలు'గా మార్చరు
13 రాష్ట్రాలలో 50శాతం పిల్లలకు అంగన్‌వాడీ పోషకాహారం
లోపలి పేజీల్లో

సంపుటి 08, సంచిక: 237 | సోమవారం | 28-07-2025 | ఖమ్మం
Published from: **Khammam, Hyderabad, Karimnagar, Mahabubnagar**
పేజీలు: 12+8 | వెల రూ. 5.00

## సరోగసి పేరుతో ట్రాఫికింగ్

● సంతానం పేరుతో మోసాలు ● అనుమతులు లేకుండా నిర్వహిస్తున్న యూనివర్సల్ సృష్టి టెస్ట్‌ట్యూబ్ సెంటర్
● ఏడుగురు అరెస్ట్ ● పిల్లల విక్రయాల రాకెట్ గుట్టురట్టు
● వివరాలు వెల్లడించిన హైదరాబాద్ నార్త్‌జోన్ డిసిపి



ప్రజాపక్షం/హైదరాబాద్

యూనివర్సల్ సృష్టి టెస్ట్ ట్యూబ్ సెంటర్‌ను సరైన అనుమతులు లేకపోయినప్పటికీ గుట్టుచప్పుడు కాకుండా కొనసాగిస్తున్నారని, 'సంతానం' పేరుతో దంపతులను మోసం చేస్తున్నారని, సరోగసి పేరుతో ట్రాఫికింగ్‌కు పాల్పడ్డారని హైదరాబాద్ పోలీసులు గుర్తించారు. ఈ కేసులో ఏడుగురిని అరెస్ట్ చేశారు. దంపతుల నుంచి 'సృష్టి టెస్ట్ ట్యూబ్ బేబీ సెంటర్' మొత్తం రూ. 35 లక్షలకు పైగా వసూలు చేశారని, పిల్లల విక్రయాల రాకెట్ గుర్తు రట్టు చేశామని హైదరాబాద్ నార్త్ జోన్ డిసిపి ఎస్. రష్మీ పెరుమళ్ వెల్లడించారు. హైదరాబాద్‌లో ఆదివారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో సృష్టి టెస్ట్ ట్యూబ్ సెంటర్ కేసుకు సంబంధించిన వివరాలను వెల్లడించారు. డిసిపి రష్మి పెరుమళ్ తెలిపిన వివరాలు ప్రకారం...ఒక జంట 2024 ఆగస్టులో సంతాన సాఫల్యం తరువాయి 2లో

## కొండాపూర్‌లో రేవ్ పార్టీ

ఎక్సైజ్ టాస్క్‌ఫోర్స్ బృందం దాడులు
9 మంది అరెస్ట్, డ్రగ్స్ స్వాధీనం



ప్రజాపక్షం/హైదరాబాద్

గ్రేటర్ హైదరాబాద్ కొండాపూర్‌లో రేవ్ పార్టీ నిర్వహించడం కలకలం రేపింది. భారీ రేవ్ పార్టీని పోలీసులు భగ్నం చేశారు. ఓ సర్వీస్ అపార్ట్‌మెంట్‌లో రేవ్ పార్టీ చేసుకుంటున్న 9మందిని పోలీసులు అరెస్టు చేశారు. నిందితుల నుంచి భారీ ఎత్తున డ్రగ్స్, మద్యం బాటిళ్లు, ఆరు కార్లను స్వాధీనం చేసుకున్నారు. ఈ వ్యవహారంలో మొత్తం 11మందిపై కేసు నమోదు చేశారు. విజయవాడకు చెందిన నాయుడు అలియాస్ వాసు, శివం రాయుడు అనే ఇద్దరు మరి కొంతమందితో కలిసి ముఠాగా ఏర్పడ్డారు. వీరంతా వీకెండ్‌లలో ఆంధ్రప్రదేశ్‌కు చెందిన జల్సారాయుళ్లను తరువాయి 2లో

## సిఎం రమేష్ వ్యాఖ్యలు వాస్తవమే

బిజెపి ఎంపి సవాల్‌కు కెటిఆర్ సమాధానం చెప్పాలి
వారి ఇద్దరికీ ఓ వేదిక ఏర్పాటు చేస్తా
తేదీ, సమయం చెప్పాలి
బండి సంజయ్ సవాల్



ప్రజాపక్షం/కరీంనగర్

ఎమ్మెల్సీ కవితపై లిక్కర్ కేసులు ఎత్తివేస్తే బిఆర్ఎస్‌ను బిజెపిలో విలీనం చేస్తామంటూ బిజెపి ఎంపి సిఎం రమేష్ ఎదుట బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ చేసిన ప్రతిపాదన ముమ్మాటికీ వాస్తవమేనని కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ కుండబద్దలుకొట్టారు. ఈ విషయం అవాస్తమని చెబుతున్న కెటిఆర్‌కు బండి సంజయ్ సవాల్ విసిరారు. తానే వేదిక ఏర్పాటు చేసి సిఎం రమేష్‌ను తీసుకొస్తానని, ఆధారాలతో సహా వివరిస్తానని, తేదీ, సమయం ఖరారు చేయాలని, దమ్ముంటే చర్చకు రావాలని డిమాండ్ చేశారు. కరీంగనగర్ జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రి ఆవరణలో నిర్మించిన క్రిటికల్ కేర్ యూనిట్‌ను ఆదివారం కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అవినీతి, కుటుంబ పార్టీ అయిన బిఆర్ఎస్‌ను విలీనం చేసుకునే ప్రసక్తే లేదని బిజెపి అధిష్ఠానం తేల్చి చెప్పిందన్నారు. బిజెపి కుటుంబ, వారసత్వ రాజకీయాలకు వ్యతిరేకమని బండి పేర్కొన్నారు. తండ్రి, కొడుకు, కుమార్తె, మేనల్లుడితో నడిచే పార్టీ బిఆర్ఎస్ అని, అవినీతి, అక్రమాలు చేసి తెలంగాణను దోచుకుందని మండిపడ్డారు. అలాంటి పార్టీతో ఎందుకు తరువాయి 2లో

## కాళేశ్వరంపై పిసి ఘోష్
# నివేదిక సిద్ధం

నేడు ప్రభుత్వానికి అందజేత?
మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీల నిర్మాణాల్లో లోపాలు, డిజైన్లపై విచారణ
కమిషన్ ముందు హాజరైన 116 మంది
ఈనెల 31తో ముగియనున్న కమిషన్ గడువు

ప్రజాపక్షం/హైదరాబాద్

కాళేశ్వరం ప్రాజెక్టుపై జస్టిస్ పినాకి చంద్ర ఘోష్ నేతృత్వంలోని న్యాయ విచారణ కమిషన్ తుది నివేదికను సిద్ధమైంది.. ఈ నివేదికను సోమవారం ప్రభుత్వానికి అందజేసే అవకాశాలు ఉన్నట్లు తెలిసింది. కాళేశ్వరం ప్రాజెక్టులో జరిగిన అవినీతి, మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీలకు జరిగిన నష్టంపై దర్యాప్తు చేయడానికి జస్టిస్ పిసి ఘోష్ నేతృత్వంలోని ఏకసభ్య కమిషన్ 2024 మార్చి 14న నియమించిన ప్రభుత్వం 2024 జూన్ 30 నాటికి నివేదిక సమర్పించడానికి గడువును విధించింది. దీంతో విచారణలో భాగంగా మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీల నిర్మాణాల్లో ఉన్న లోపాలు, డిజైన్ లోపాలు, నిర్వహణ సమస్యలు వంటి అంశాలపై క దృష్టి సారించిన ఈ కమిషన్ 16 నెలల పాటు మాజీ ముఖ్యమంత్రి కె.చంద్రశేఖరరావు మొదల్కొని అప్పటి ఆర్థిక శాఖ మంత్రి, ఈటల రాజేందర్, నీటిపారుదల శాఖ మంత్రి టి.హరీష్‌రావుతోపాటు మాజీ ప్రభుత్వ కార్యదర్శి, సిఎంఓ అధికారులు, నీటిపారుదలశాఖ మాజీ ఇఎన్‌సి తదితర ఉన్నతాధికారులతో మొత్తం 116 మందిని విచారించింది. ఈ నెల 31వతేదీతో కమిషన్ గడువు తీరనుండడంతో జస్టిస్ పి.సి. ఘోష్ నేతృత్వంలోని ఏక సభ్య కమిషన్ సోమవారం తుది నివేదికను అందజేయనున్నట్లు సమాచారం. ఒకవేళ కమిషన్ నివేదికను అందజేస్తే తరువాయి 2లో



## నేడు రాష్ట్ర మంత్రివర్గ సమావేశం



ప్రజాపక్షం/హైదరాబాద్

తెలంగాణ రాష్ట్ర మంత్రివర్గ సమావేశం సోమవారం మధ్యాహ్నం 2 గంటలకు హైదరాబాద్‌లోని డాక్టర్ బిఆర్.అంబేర్కర్ సచివాలయంలో జరగనుంది. ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి అధ్యక్షతన జరిగే ఈ సమావేశంలో కులగణనపై స్వతంత్ర నిపుణుల కమిటీ ఇచ్చిన నివేదిక, బిసి రాజర్వేషన్ల ప్రక్రియ, స్థానిక సంస్థల ఎన్నికలు, కొత్త రేషన్ కార్డుల పంపిణీ, భూముల తరువాయి 2లో



## హరిద్వార్‌లోని ఆలయంలో తొక్కిసలాట

ఆరుగురు మృతి, 28 మందికి గాయాలు
విద్యుత్ ప్రవహిస్తుందనే పుకార్లతో భక్తుల్లో భయాందోళనలు

**హరిద్వార్ :** ఉత్తరాఖండ్‌లో తీవ్ర విషాద ఘటన జరిగింది. హరిద్వార్‌లోని కొండపై ఉన్న మానసా దేవి ఆలయం ఆదివారం వందలాది మంది భక్తులతో కిటకిటలాడింది. ఈ నేపథ్యంలో అక్కడ తొక్కిసలాట జరిగింది. ఘటనలో ఆరుగురు ప్రాణాలు కోల్పోయారు. మరో 28 మంది గాయపడినట్లు పోలీసులు తెలిపారు. ఆలయానికి వెళ్లే మెట్లు ప్రారంభమయ్యే చోట విద్యుత్ ప్రవాహం వచ్చిందనే పుకార్లు ప్రజల్లో భయాందోళనలను రేకెత్తించాయి. ఇది తొక్కిసలాటకు దారితీసిందని హరిద్వార్ సీనియర్ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ (ఎస్ఎస్‌పి) తరువాయి 12లో



## ఇబ్బందుల్లేకుండా యూరియా సరఫరాకు
# చర్యలు తీసుకుంటున్నాం

వరద ముప్పును ఎదుర్కొనేందుకు అధికారులు సిద్ధంగా ఉండాలి
ముందస్తు ప్రణాళికలు రూపొందించుకోవాలి
ఇందిరమ్మ ఇళ్ల నిర్ణయం చరిత్రాత్మకం
మంత్రులు భట్టి, వాకాటి, తుమ్మల, పొంగులేటి స్పష్టీకరణ

ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం

రైతులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా యూరియా సరఫరా చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని, యూరియా అందించే బాధ్యత ప్రభుత్వానిదేనని, వర్షాభావ పరిస్థితులు ఎదుర్కొనేందుకు రైతులు, అధికారులు సిద్ధంగా ఉండాలని, ముందస్తు చర్యలు తీసుకోవాలని ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు వాకాటి శ్రీహరి, తుమ్మల, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డిలు స్పష్టం చేశారు. ఖమ్మం ఉమ్మడి జిల్లా అధికారులతో పాల్వంచలోని ఐడిఒసిలో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఉమ్మడి జిల్లా ఇంచార్జ్ మంత్రి వాకాటి శ్రీహరి, వ్యవసాయ మంత్రి తుమ్మల నాగేశ్వర రావు, రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి హాజరుకాగా ఉమ్మడి ఖమ్మం జిల్లా ప్రత్యేకాధికారి తరువాయి 12లో


## దేశ ఆర్థిక వ్యవస్థలో
# సహకార బ్యాంకులు కీలకం

దేశవ్యాప్తంగా 8.5 కోట్ల మందికి సేవలందించాయి
మొత్తం డిపాజిట్లు, రుణాలు రూ.5.5 లక్షల కోట్ల మార్క్‌ను దాటాయి
అగ్రసేన్ బ్యాంక్ అమీర్‌పేట బ్రాంచ్ ప్రారంభోత్సవంలో మంత్రి శ్రీధర్ బాబు

ప్రజాపక్షం/హైదరాబాద్



'దేశార్థిక వ్యవస్థలో సహకార బ్యాంకుల పాత్ర చాల కీలకమని, ముఖ్యంగా అట్టడుగు వర్గాలకు ఆర్థిక సేవలను అందించడంలో ఇవి ముందున్నాయని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు అన్నారు. ఆర్‌బిఐ వార్షిక నివేదిక 2024 ప్రకారం దేశవ్యాప్తంగా 8.5 కోట్ల మందికి సేవలను అందించడం ద్వారా మొత్తం డిపాజిట్లు, రుణాలు రూ. 5.5 లక్షల కోట్ల మార్కును దాటాయి మంత్రి తెలిపారు. ఆదివారం అగ్రసేన్ బ్యాంక్ అమీర్ పేట్ బ్రాంచ్ ను మంత్రి లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ ఒకప్పుడు బ్యాంకులంటే కేవలం డబ్బుల డిపాజిట్, విత్‌డ్రా మాత్రమే అనుకునేవారు అన్నారు. కానీ.. ఇప్పుడా ఆ నిర్వచనం పూర్తిగా మారిపోయిందని ఖాతాదారుల అవసరాలు, ఆకాంక్షలకు అనుగుణంగా టెక్నాలజీని మిళితం చేస్తూ మార్పులను అందిపుచ్చుకుంటూ వివిధ రకాల సేవలను అందిస్తున్నాయని వివరించారు. 'తెలంగాణలో 48 అర్బన్ కోఆపరేటివ్ బ్యాంకులు 321 శాఖల ద్వారా అర్బన్, సెమీ – అర్బన్ ప్రాంతాల్లో సేవలు అందిస్తున్నాయని, గత ఆర్థిక సంవత్సరంలో తరువాయి 2లో



## సీనియర్ జర్నలిస్టు సుమిత్ చక్రవర్తి మృతి

● సిపిఐ సంతాపం ● దృఢమైన వామపక్ష ఉద్యమ, ప్రగతిశీల గొంతుక అని నివాళి

**న్యూఢిల్లీ:** సీనియర్ జర్నలిస్టు, మెయిన్‌స్ట్రీమ్ వారపత్రిక సంపాదకులు సుమిత్ చక్రవర్తి మృతి చెందారు. పశ్చిమ బెంగాల్ రాజధాని కోల్‌కతాలో శనివారం రాత్రి 10.45 గంటలకు ఆయన తుది శ్వాస విడిచారు. తీవ్ర అనారోగ్యంతో ఢిల్లీలో చికిత్స పొందుతున్న ఆయనను కోల్‌కతాకు తరలించగా, అక్కడి ఆసుపత్రిలో సుమిత్ చక్రవర్తి మరణించినట్టు ఆయన కుటుంబానికి సన్నిహితులు వెల్లడించారు. సిపిఐ పూర్వ నాయకులు రేణు చక్రవర్తి, నిఖిల్ చక్రవర్తి కుమారుడు సుమిత్... సిద్ధాంతాలకు కట్టుబడి జర్నలిజం చేశారు. సిపిఐకు నిబద్ధతగల నాయకుడిగా తరువాయి 2లో

## కాలేజీలు ఇక్కడ.. తరగతులు ఎక్కడ?

ప్రైవేట్ ఇంటర్ కాలేజీల్లో అడ్మిషన్లు
ప్రైవేట్ ఐఐటి, నీట్ కోచింగ్ అకాడమీల్లో క్లాసులు
రూ.కోట్లలో దందా నిర్వహిస్తున్న నిర్వాహకులు



ప్రజాపక్షం/కరీంనగర్

విద్యారంగంలో జరుగుతున్న ఇష్టారాజ్యంపై సర్కారు నియంత్రణ కరువయ్యింది. కరీంనగర్ వేదికగా జరుగుతున్న ఓ దందా అమాయక తల్లిదండ్రులు, విద్యార్థులను మోసాలకు గురిచేస్తోంది. కాలేజీలు ఒక చోట అయితే తరగతులు మరో చోట నిర్వహిస్తూ కొందరు ప్రైవేట్ విద్యాసంస్థల నిర్వాహకులు కాసులు దండుకుంటున్నారు. ఐఐటి, జెఇఇ, నీట్ కోచింగ్ పేరిట కార్పొరేట్ల అకాడమీలు పేరుతో నిర్వహిస్తుండగా అందులో చేరిన విద్యార్థులకు మరో జూనియర్ కాలేజీలో ఇంటర్మీడియట్ అడ్మిషన్ తీసుకుని ఊరు పేరు లేని కాలేజీ నుంచే పరీక్ష రాయిస్తున్నారు. నిబంధనలకు విరుద్ధంగా వ్యహరిస్తున్నప్పటికీ ఇంటర్‌బోర్డు తరువాయి 2లో

## నేటి నుంచి పార్లమెంట్‌లో
# మాటల యుద్ధం!

పహల్గామ్ దాడి, ఆపరేషన్ సిందూర్‌పై ఉభయసభల్లోనూ 16 గంటల పాటు చర్చ




**న్యూఢిల్లీ :** పార్లమెంటు వర్షాకాల సమావేశాల్లో తొలివారం ప్రతిపక్ష సభ్యుల ఆందోళనతో ఎలాంటి కార్యకలాపాలు చేపట్టకుండానే ముగిసిన విషయం తెలిసిందే. అయితే సోమవారం నుంచి పహల్గామ్ దాడి, ఆపరేషన్ సిందూర్‌పై తీవ్ర చర్చ జరగనుంది. జాతీయ భద్రత, విదేశాంగ విధాన ఆవశ్యకతల చుట్టూ ఉన్న రెండు అంశాలపై పాలక కూటమి, ప్రతిపక్షాలు మధ్య మాటల యుద్ధం జరగనుంది. లోక్‌సభ, రాజ్యసభలో చర్చ సందర్భంగా బిజెపి నేతృత్వంలోని పాలక ఎన్‌డిఎ, ప్రతిపక్ష పార్టీలు ఒకదానిపై ఒకటి మాటల తూటాలను ఎక్కుపెట్టనున్నాయి. ప్రధాని నరేంద్ర మోడీ జాతీయ భద్రతపై తన ప్రభుత్వం బలమైన వైఖరిని తెలియజేయడానికి జోక్యం చేసుకునే అవకాశం ఉన్న నేపథ్యంలో హోంమంత్రి అమిత్ షా, రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్, విదేశాంగ మంత్రి ఎస్. జైశంకర్ ఈ అంశాలపై మాట్లాడతారని వర్గాలు తెలిపాయి. ఉభయ సభల్లోని ప్రతిపక్ష నాయకులు రాహుల్ గాంధీ, మల్లికార్జున్ ఖర్గే, సమాజ్‌వాదీ పార్టీ నాయకుడు తరువాయి 12లో

## డొనాల్డ్ ట్రంప్ వాణిజ్య బెదిరింపులు

చర్చలకు థాయ్–కాంబోడియా సమ్మతి, ఉల్లంఘన

**కౌలాలంపూర్:** అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ మరోసారి వాణిజ్యం పేరుచెప్పి, థాయ్‌లాండ్–కాంబోడియా దేశాలమధ్య వివాదంలో కూడా జోక్యం చేసుకున్నారు. దీంతో ఆ రెండు దేశాలూ కాల్పుల విరమణపై సంప్రదింపులకు అంగీకరించాయి. కానీ తర్వాత కొద్ది గంటలకే రెండు దేశాలూ సరిహద్దుల్లో ఆదివారం నాలుగోరోజు పరస్పరం దాడులు చేసుకున్నాయి. దీంతో ఒక రకంగా ట్రంప్ వాణిజ్య స్తంభన బెదిరింపులు విఫలమైనట్టు కనిపించింది. ఇరు దేశాల ప్రధానమంత్రులూ ట్రంప్‌కు తొలుత కృతజ్ఞతలు తెలియజేశారు. కాల్పుల విరమణపై కలిసి కృషి చేసేందుకు రెండు దేశాలు అంగీకరించాయని ట్రంప్ తరువాయి 12లో





# ప్రపంచం
WORLD NEWS

## సూడాన్‌లో ఆర్‌ఎస్‌ఎఫ్ సమాంతర ప్రభుత్వం



**ఖార్టూమ్ :** సూడాన్‌లో సమాంతర ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసినట్లు ఆర్ ఎస్ ఎఫ్‌కు చెందిన పారామిలిటరీ ఆదివారంనాడు ప్రకటించింది. రాజధాని ఖార్టూమ్‌లో ప్రభుత్వ మిలిటరీ పరిపాలనను సవాలు చేస్తూ సమాంతర ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసినట్లు ఆర్‌ఎస్‌ఎఫ్ నాయకుడు మహ్మద్ హమ్దాన్ హెమెద్‌తి దగలోవ్ ప్రకటించారు. ఈ సమాంతర ప్రభుత్వంలో హమ్దాన్ నాయకత్వాన 15 మంది సభ్యులతో కూడిన కౌన్సిల్ పరిపాలన చేస్తుంది. సూడాన్‌లో రెండు సైనికవర్గాల మధ్య మూడు సంవత్సరాలుగా దారుణమైన ఘర్షణ కొనసాగుతోంది. ఈ ఘర్షణ కారణంగా వేలాదిమంది ప్రజలు మరణించారు. లక్షలాదిమంది ప్రజలు దేశం వదలిపారిపోయారు.

## కాంగోలో చర్చిపై ఉగ్రవాదుల కాల్పులు
### 21 మంది మృతి : అనేక దుకాణాలు దగ్ధం



**బ్రజ్జవిల్లే :** కాంగోలో పెను విషాదం చోటుచేసుకుంది. ఇస్లామిక్ స్టేట్ (ఐఎస్) ఉగ్రవాదుల మద్దతుతో ఎడిఎఫ్ (ఎల్లైడ్ డెమోక్రటిక్ ఫోర్స్) తిరుగుబాటుదారులు ఒక చర్చిపై కాల్పుల దాడికి తెగబడటంతో 21 మంది మరణించారు. చర్చిలో ఆదివారంనాడు ప్రార్థనలు జరుగుతున్న సమయంలో చర్చి లోపలా, వెలుపలా తిరుగుబాటుదారులు కాల్పులు జరిపారు. తూర్పు కాంగో కోమండాలోని క్యాథలిక్ చర్చ ప్రాంగణంలో, చర్చి లోపలా మధ్యాహ్నం ఒంటిగంట సమయంలో ఉగ్రవాదులు దాడి చేశారు. దాడి సమయంలో అనేక దుకాణాలు, ఇళ్ళు ఆ పరిసరాల్లో అగ్నికి ఆహుతి చేశారు. సజీవదహనమైన మూడు మృతదేహాలను చర్చి లోపలి నుండి స్వాధీనం చేసుకున్నారు. సజీవదహనమైన మృతదేహాలు ఇంకేమైనా ఉన్నాయా? అనే విషయాన్ని తెలుసుకునేందుకు ముమ్మర గాలింపు చర్యలు ఇంకా కొనసాగుతున్నాయని కోమండాలోని పౌర సమాజ సమన్వయకర్త డియోడోన్ దురంత బోన్ చెప్పారు. ఐతే ఈ మృతుల సంఖ్యను కాంగో సైన్యం తక్కువ చేసి చూపించింది. దాడుల్లో పదిమంది మాత్రమే మరణించారని ఇటురి రాష్ట్రంలోని ఆర్మీ అధిపతి లెఫ్టినెంట్ జూల్స్ ఎన్‌గోంగో చెప్పారు. గడచిన పది సంవత్సరాలుగా ఉగాండా–కాంగో సరిహద్దుల్లో ఇస్లామిక్ స్టేట్ ఉగ్రవాదుల తరపున వారికి అనుబంధంగా ఉన్న ఎడిఎఫ్ తరచు ఉగ్రవాద దాడులు కొనసాగిస్తూ హింసను సృష్టిస్తున్నది. స్వేచ్ఛా ప్రజాస్వామ్యం, పెట్టుబడిదారీ వ్యవస్థల కంటే ఇస్లాం మతరాజ్య స్థాపన అత్యున్నతమైనదిగా భావిస్తున్న ఇస్లామిక్ స్టేట్ ఉగ్రవాదులు ఉగాండా, కాంగోలలో రాజకీయ వ్యవస్థపై ఆధిపత్యం సాధించేందుకు హింసాత్మక పోరాటం చేస్తున్నారు. ఐఎస్ తరపున ఎడిఎఫ్ ఈ కార్యకలాపాలు నిర్వహిస్తోంది. బగాండా, బసోగాలలో నివసిస్తున్న బంటూ తెగ ముస్లింలను ఎడిఎఫ్ ఉగ్రవాదులుగా తయారుచేసి దాడులు కొనసాగిస్తోంది. తూర్పు కివూ ప్రాంతాన్ని ప్రధానస్థావరంగా చేసుకుని ఎడిఎఫ్ రెండు దేశాలలో హింసాత్మక కార్యకలాపాలు నిర్వహిస్తోంది.

## గాజాలోని మూడు రద్దీ ప్రాంతాల్లో..
# రోజుకు 10 గంటలు కాల్పుల విరమణ



**డెయిర్ అల్ బలాహ్ :** ఇజ్రాయెల్ ఎట్టకేలకు గాజాలోని పాలస్తీనా ప్రజలపై కొద్దిమేరకు జాలి ప్రదర్శించింది. గాజాలో రద్దీగా ఉండే మూడు జనావాస ప్రాంతాల్లో రోజుకు 10 గంటలపాటు మానవతాదృక్పథంతో కాల్పుల విరామం పాటించాలని నిర్ణయించింది. అదేవిధంగా ఆహారాన్ని భద్రంగా లోపలికి సరఫరా చేసేందుకు సురక్షితమైన మార్గాలను ఏర్పాటుచేస్తున్నట్లు కూడా ఇజ్రాయెల్ ప్రకటించింది. ప్రతి రోజూ ఉదయం 10 గంటల నుండి రాత్రి 8 గంటల వరకు ఈ కాల్పుల ఉపశమనం పాలస్తినా ప్రజలకు లభిస్తుంది. ఆదివారం నుండే ఈ కాల్పుల ఉపశమనం ప్రారంభమైంది. అల్ మవసి, అల్ బలాహ్, గాజా సిటీలలో ఈ కాల్పుల ఉపశమనం అందుబాటులోకి వచ్చింది. ఐడిఎఫ్ తదుపరి ఆదేశాలు వచ్చేవరకూ ఈ కాల్పుల ఉపశమనాన్ని అమలుచేస్తుంది. ఇజ్రాయెల్ ప్రభుత్వ గణాంకాల ప్రకారం గాజాలో యుద్ధం మొదలై ఆదివారంనాటికి 660 రోజులు పూర్తయ్యాయి. 21 నెలల కాలంలో మొదటిసారి ఇజ్రాయెల్ అంతర్జాతీయ ఒత్తిడిని తట్టుకోలేక ఈ కంటి తుడుపు చర్య తీసుకుంది. గాజాలో పాలస్తినా ప్రజలను ఉద్దేశపూర్వకంగా పస్తులుపెట్టి చంపేస్తున్నారని, దీనిని ఒక యుద్ధ తంత్రంగా మార్చుకున్నారని ప్రపంచవ్యాప్తంగా ఇజ్రాయెల్‌పై విమర్శలదాడి ఇటీవల పదిరోజులుగా ఉధృతం కావడంతో నేతన్యాహూ ప్రభుత్వం ఒక్క అడుగు వెనక్కు వేసింది. గడచిన మూడు నెలలుగా ఆహార పంపిణీ కేంద్రాలవద్ద వేచి ఉన్న ప్రజలపై కాల్పులు విరామం లేకుండా కొనసాగడంతో కనీసం 1000 మందిపైగా మరణించారు.

ఈ కాల్పుల విరామం వల్ల గాజాలోకి ఆహార సరఫరా కూడా గణనీయంగా పెరుగుతుందని ఐక్యరాజ్యసమితి వరల్డ్ ఫుడ్ ప్రోగ్రాం (డబ్ల్యుఎఫ్‌పి) విభాగం ఆశాభావం వ్యక్తం చేసింది. తక్షణం గాజాలో లక్షమంది పిల్లలు, మహిళలు పోషకాహారలోపంతో బాధపడుతున్నారని, వారికి మంచి ఆహారాన్ని అందుబాటులోకి తేవాలని డబ్ల్యుఎఫ్‌పి చాలా రోజులుగా కోరుతున్నది. గాజాలో ఇక కరువు కాటకాలు తాండవించే పరిస్థితి వచ్చిందని ఆహార నిపుణులు కూడా హెచ్చరికలు చేస్తున్న తరుణంలో ఈ కాల్పుల ఉపశమనం గాజా ప్రజలకు లభించింది. అదేవిధంగా వచ్చిన ఆహారాన్ని అందరికీ సమానంగా పంచలేకపోతున్నామని, ఎందుకంటే అనేక ముఠాలు ముందుగానే దాడులు చేసి వాటిని తీసుకుపోతున్నాయని ఐక్యరాజ్యసమితి ప్రకటించింది.

కాగా ఇజ్రాయెల్ సైన్యం కూడా ఆహారం మోసుకొచ్చే ట్రక్కులను ఈజిప్టు వైపు నుండి గాజాలోకి వచ్చేందుకు అనుమతించింది. గాజాలోకి పుష్కలంగా ఆహారాన్ని అనుమతిస్తే, హమాస్ ఉగ్రవాదులు ఈ ఆహారాన్ని తీసుకుపోయి నెలలపాటు అందుబాటులో ఉండేవిధంగా నిల్వచేసుకుని ఎంజాయ్ చేస్తున్నారని, అందువల్ల ఆహారాన్ని వారికి అందకుండా కట్టడి చేస్తున్నామని, సొరంగాల్లో దాక్కున్న హమాస్ ఉగ్రవాదులు ఆహార నిల్వలు పెట్టుకుని హాయిగా కాలం గడుపుతున్నారని ఇజ్రాయెల్ సైన్యం ఆరోపిస్తున్నది. ఈ నెపంతోనే ఆహార కేంద్రాలవద్ద ఎదురుచూస్తున్న సామాన్యులపై కాల్పులు జరుపుతున్నది.


**53 మంది కాల్చివేత**

గాజాలో ఆదివారం నుండి కొత్త పద్ధతుల్లో మూడు రద్దీ ప్రాంతాల్లో 10గంటలసేపు కాల్పుల ఉపశమనం ఉంటుందని ఇజ్రాయెల్ ప్రకటించినప్పటికీ వేరువేరు దాడుల్లో 53 మంది పాలస్తినా ప్రజలను ఐడిఎఫ్ సైన్యం కాల్చి చంపింది.

ఎన్ని మాటలు వల్లించినప్పటికీ సామాన్యులపై మారణహోమం యథాతథంగా కొనసాగింది. ఆదివారం తెల్లవారకముందే ఈ కాల్చివేతలు జరిగాయి. అదేవిధంగా సరైన ఆహారం లభించక ఆకలితో అలమటించి మరో ఆరుగురు పాలస్తినా ప్రజలు మరణించారు. ఇజ్రాయెల్ ప్రదర్శిస్తున్న కాల్పుల ఉపశమన మానవతా దృక్పథం వల్ల ఎలాంటి ప్రయోజనం లేదని, పాలస్తినా ప్రజల ప్రాణాలు కాపాడటానికి ఇది నిజమైన అవకాశం ఇచ్చినట్లు కాదని గాజా ఆరోగ్యమంత్రిత్వశాఖ డైరెక్టర్ జనరల్ డాక్టర్ మునీర్ అల్ బౌర్ష్ విమర్శించారు. 21నెలలుగా గాజాలో ఐడిఎఫ్ చేస్తున్న యుద్ధంలో ఇప్పటివరకూ 59,733 మంది మరణించారు. మరో 1,44,477 మంది గాయపడ్డారు.

## ఈసారి నీ మీదే దాడి చేస్తాం జాగ్రత్త
### ఖమేనీకి ఇజ్రాయెల్ హెచ్చరిక

**మిట్జ్‌పే రామోన్ :** ఇరాన్‌కు ఇజ్రాయెల్ మరోసారి తాజా హెచ్చరిక జారీ చేసింది. ''మీరు ఇదేవిధంగా మమ్మల్ని బెదిరిస్తూ ఉంటే మా చేతులు మళ్ళీ టెహ్రాన్ వరకూ ముందుకు చాచుకొస్తాయి, దాడి చేస్తాం జాగ్రత్త'' అని ఇజ్రాయెల్ రక్షణమంత్రి ఇజ్రాయెలీ కట్జ్ హెచ్చరించారు. ప్రత్యేకించి ఇరాన్ సర్వాధినేత ఆయొతుల్లా అలీ ఖమేనీకి ఆయన నేరుగా ఈ హెచ్చరిక చేశారు. నెగెవ్ ఎడారి నడిబొడ్డున ఉన్న ఇజ్రాయెలీ వైమానికస్థావరాన్ని మంత్రి కట్జ్ ఆదివారంనాడు సందర్శించిన సందర్భంగా ఈ హెచ్చరిక చేశారు. 12 రోజులపాటు ఇరాన్‌తో ఇజ్రాయెల్ యుద్ధం చేసింది. ఈ యుద్ధం తర్వాత కాల్పుల విరమణ అమలులోకి వచ్చిన నెలరోజులకే కట్జ్ తిరిగి ఖమేనీకి ఈ హెచ్చరిక చేశారు. ''మమ్మల్ని తరచు బెదిరిస్తున్నారు, ఇంతకుముందు మిమ్మల్ని వదిలేశాం, కానీ ఈసారి ఈ చేతులు చాలా పొడుగ్గా టెహ్రాన్ దాకా చాచుకుని వస్తాయి, వ్యక్తిగతంగా మిమ్మల్ని పట్టుకుంటాయి జాగ్రత్త'' అని ఖమేనీకి కట్జ్ హెచ్చరిక జారీ చేశారు.



## గాజా ఆహార నౌకను అడ్డుకున్న ఇజ్రాయెల్
### 21 మంది నిర్బంధం

**టెల్‌అవీవ్ :** గాజాకు మానవతా సహాయాన్ని తీసుకువస్తున్న ఒక నౌకను ఇజ్రాయెల్ సైన్యం ఆదివారం అర్ధరాత్రి అంతర్జాతీయ సముద్ర జలాల్లో అడ్డుకుంది. ఈ నౌకలో ఆహార వస్తువుల తోపాటు ప్రయాణం చేసి వస్తున్న 21 మంది అంతర్జాతీయ సహాయకుల బృందాన్ని కూడా నిర్బంధంలోకి తీసుకుంది.గాజాలోకి ఎలాంటి ఆహార సరఫరాలు తమ అనుమతి లేకుండా తీసుకురాకూడదన్న నిబంధనలను ఉల్లంఘించి అక్రమంగా ఈ ఆహారాన్ని, మానవతా సహాయాన్ని తరలిస్తున్నారన్న ఆరోపణలపై నౌకను ఇజ్రాయెల్ అడ్డుకుంది. అందులో ఉన్న సహాయ బృందాలను కూడా కదలకుండా చేశారు. ఈ నౌకలో గాజాలో ప్రజలకు అవసరమైన ఔషధాలు, వైద్య పరికరాలు, ఆహార వస్తువులు ఉన్నాయని ఫ్రీడమ్ ఫ్లోటిల్లా కొయిలేషన్ ఆదివారంనాడు తెలియజేసింది. హండాలా నౌకను ఈ కొయిలేషన్ నడుపుతున్నది. గాజాకు 40 నాటికల్ మైళ్ళ దూరంలో ఇజ్రాయెల్ సైన్యం ఈ నౌకను గుర్తించి ముందుకు కదలకుండా అడ్డుకుంది. ఈ నౌకలో ఎలాంటి ఆయుధాలూ లేవు. ఉన్నవన్నీ మానవతా సహాయమేనని కొయిలేషన్ చెప్పింది. దీనిపై ఇజ్రాయెల్ ప్రభుత్వం వెంటనే ఎలాంటి వ్యాఖ్యలూ చేయలేదు.

## సుమిత్ చక్రవర్తి మృతి
(మొదటి పేజీ తరువాయి)

సేవలు అందించారు. ఎన్‌ఎఫ్ఐడబ్ల్యూకు తోడ్పాటు అందించారు. సుమిత్ భార్య, విద్యావేత్త, డాక్టర్ గార్గి చక్రవర్తి ఎన్‌ఎఫ్ఐడబ్ల్యూ నాయకురాలు. సుమిత్‌గార్గి దంపతులకు ఒక కుమారుడు ఉన్నారు.

**ప్రగతిశీలవాదిని కోల్పోయాం: సిపిఐ**

ప్రముఖ జర్నలిస్టు, నిబద్ధతగల మేధావి, విలువలకు, సిద్ధాంతాలకు, సత్యం, న్యాయం, లౌకికవాదానికి కట్టుబడే వ్యక్తి సుమిత్ చక్రవర్తి మరణంతో దృఢమైన ప్రగతిశీల గళాన్ని కోల్పోయామని సిపిఐ ప్రధాన కార్యదర్శి డి.రాజా, మాజీ ప్రధాన కార్యదర్శి సుధాకర్ రెడ్డి వేర్వేరుగా సంతాపం ప్రకటించారు. తమతో, పార్టీతో సుమిత్‌కు ఉన్న అనుబంధాన్ని గుర్తుచేసుకున్నారు. ప్రగతిశీల, ప్రజాస్వామ్య ఉద్యమాకు ఆయన గణనీయమైన తోడ్పాటు అందించారని, సీపీఐ నాయకులు, మాజీ ఎంపి రేణు చక్రవర్తి, దిగ్గజ జర్నలిస్టు, మెయిన్ స్ట్రీమ్ వీక్లీ వ్యవస్థాపకులు నిఖిల్ చక్రవర్తి సంతానంగా వారి వారసత్వాన్ని హుందాగా కొనసాగించారని రాజా శ్లాఘించారు. సుమిత్ మరణంతో వామపక్ష, ప్రగతిశీల, ప్రజాస్వామ్యబద్ధమైన సుస్థిర స్వరాన్ని కోల్పోయామని సుధాకర్ రెడ్డి పేర్కొన్నారు. సుమిత్ ఏ చర్చలో పాల్గొన్నా సమగ్రతతో, అంతర్దృష్టితో వ్యవహరించేవారని గుర్తుచేసుకున్నారు. విద్యార్థి దశతో తమకు పరిచయం ఏర్పడిందని, తరచూ సమస్యలు, ఉద్యమాలపై చర్చించేవారని ఆయనతో తనకున్న జ్ఞాపకాలను సుధాకర్ రెడ్డి నెమరవేసుకున్నారు. సుమిత్ మరణం వామపక్ష ఉద్యమానికి తీరని లోటుగా పేర్కొన్నారు. సిపిఐ జాతీయ కార్యదర్శి వర్గం కూడా వేరొక ప్రకటనలో సంతాపం ప్రకటించింది. భయం తెలియని జర్నలిస్టుగా విలువలకు, ప్రగతిశీల మార్పునకు కట్టుబడిన వ్యక్తిగా సుమిత్ చక్రవర్తి సేవలు మరవలేనివని, ఆయన మరణం తీరని లోటని పేర్కొంది. సుమిత్ కుటుంబానికి ప్రగాఢ సానుభూతి ప్రకటించింది.

## సహకార బ్యాంకులు కీలకం
(మొదటి పేజీ తరువాయి)

వీటి బిజినెస్ టర్నోవర్ రూ.17వేల కోట్లు కాగా, క్రెడిట్, డిపాజిట్ నిష్పత్తి 66.7 శాతంగా ఉందన్నారు. 'సహకార బ్యాంకులు లాభాపేక్షతో కాకుండా, ఖాతాదారుల ప్రయోజనాల కోసం కమ్యూనిటీ ఆధారిత సేవలను అందిస్తున్నాయని తెలిపారు.కేర్(కమ్యూనిటీ ఫోకస్డ్ అఫర్డబుల్ అండ్ యాక్సెసిబుల్ క్రెడిట్, రిలేషన్‌షిప్ బేస్డ్ బ్యాంకింగ్, ఎంపవరింగ్ లోకల్ ఎంటర్‌ప్రెన్యూర్స్) మోడల్‌లో పని చేస్తున్నాయని తెలిపారు. యువత, వెనుకబడిన వర్గాలకు స్వయం ఉపాధి రుణాలు, మహిళా స్వయం సహాయక బృందాలకు రుణ అనుసంధానాలు, గ్రీన్ లోన్స్ వంటి పథకాలను ప్రోత్సహిస్తున్నాం' అని పేర్కొన్నారు. కార్యక్రమంలో తెలంగాణ అగర్వాల్ సమాజ్ ప్రెసిడెంట్ అనిరుధ్ గుప్తా, టిబారుమల్ జ్యూవెల్స్ ప్రైవేట్ లిమిటెడ్ రాంభరోసే గుప్తా, సోమాని ఇస్పాత్ ప్రైవేట్ లిమిటెడ్ ఎండీ అశోక్ కుమార్ సోమాని, అగ్రసేన్ బ్యాంక్ ఛైర్మన్ ప్రమోద్ కుమార్ ఖేడియా, సీనియర్ వైస్ ఛైర్మన్ నవీన్ కుమార్ అగర్వాల్, వైస్ ఛైర్మన్ సురేష్ కుమార్ అగర్వాల్ తదితరులు పాల్గొన్నారు.

## సరోగసి పేరుతో ట్రాఫికింగ్
(మొదటి పేజీ తరువాయి)

కోసం యూనివర్సల్ సృష్టి ఫెర్టిలిటీ సెంటర్‌ను సంప్రదించారు. ఐవిఎఫ్ సాధ్యం కాదని, సరోగసీ ద్వారా బిడ్డను పొందవచ్చని, ఇందుకు రూ.30లక్షలు ఖర్చు అవుతుందని, వారిని సరోగసీ కోసం నమ్రత ఒప్పించారు. ఆ క్లినిక్ ద్వారా సరోగసీ తల్లిని ఏర్పాటు చేస్తామని ఆ దంపతులని నమ్మించారు. ఆ తర్వాత దంపతుల నుంచి అండం, వీర్యం సేకరించి, విశాఖలోని ఒక గర్భిణిని 'సరోగసీ మదర్'గా చూపించారు. తొమ్మిది నెలల పాటు ఆ జంట క్లినిక్‌కు డబ్బులు చెల్లించారు. 2025 జూన్‌లో సరోగసీ తల్లికి విశాఖపట్నంలో అబ్బాయి పుట్టాడని, డెలివరీ ఛార్జీలను చెల్లించి ఆ శిశువును తీసుకెళ్లాలని ఆదంపతులకు సమాచారం అందించారు.

హాస్పిటల్‌లో ఒక శిశువును విశాఖ దంపతులకు అప్పగించారు. అయితే సరోగసీకి అంగీకరించిన సదరు మహిళ అదనంగా డబ్బును అడుగుతున్నారని డాక్టర్ నమ్రత సదరు సరోగతి దంపతులకు తెలియజేయడంతో వారు అడిగినంత అదనపు డబ్బులను కూడా ఇచ్చారు.

**డిఎన్‌ఎ పరీక్షతో వెలుగులోకి....**

విశాఖ దంపతులకు అనుమానం వచ్చి తమ శిశువుకు డిఎన్‌ఎ పరీక్షలు నిర్వహించారు. ఈ పరీక్షలో ఆ శివువు డిఎన్‌ఎ ఈ దంపుతులతో కలువలేదు, తమ శిశవు కాదని, తమను మోసం చేశారని వారు గుర్తించారు. దీంతో వారు సృష్టి ఫెర్టిలిటీ సెంటర్‌ను సంప్రదించగా వారిని డాక్టర్ నమ్రత కొడుకు బెదిరించారు. దీంతో ఆ దంపతులు హైదరాబాద్‌లోని గోపాలపురం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ కేసులో పోలీసులు దర్యాప్తు మొదులుపెట్టగా, ఈ కేసులో నమ్రత అసలు సరోగసినే చేయలేదని పోలీసులు గుర్తించారు. శిశువు వద్దనుకున్న అసోంకు చెందిన ఒక మహిళకు డాక్టర్ నమ్రత రూ.90వేలను చెల్లించారు. ఆమెకు శిశువు పుట్టగానే తీసుకున్నారు. ఆ శిశువునే విశాఖ దంపతులకు అప్పగించారు.

**సంతానం లేని దంపుతులను మోసం చేస్తున్న డాక్టర్ నమ్రత : డిసిపి**

సృష్టి టెస్ట్ ట్యూబ్ సెంటర్ నిర్వాహకులు చాలా నిబంధనలను ఉల్లంఘించారని, ఆ హాస్పిటల్‌కు సరైన అనుమతులు లేవని, దీనిపైన అనేక ఫిర్యాదులు ఉన్నాయని డిసిపి రష్మి పెరుమాళ్ తెలిపారు. ఈ సెంటర్‌లో డాక్టర్, సిబ్బంది ఎవరూ సరైన నిపుణులు కాదని, హాస్పిటల్ రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్ గడువు 2021లోనే ముగిసిందని వివరించారు. మెడికల్ కౌన్సిల్ రిజిస్ట్రేషన్ లేకుండా అక్రమంగా నిర్వహిస్తున్నారన్నారు. ఇది వరకే న్యాయస్థానంలో కేసులు కూడా కొనసాగుతున్నామయని, అందుకే హాస్పిటల్‌ను చాటుమాటుగా నిర్వహిస్తున్నారని, దీంతో వైద్య అధికారులు కూడా ఈ సెంటర్‌ఌ గుర్తించలేకపోయారని డిసిపి చెప్పారు. సంతానం లేని దంపతులను గుర్తించి, వారిని డాక్టర్ నమ్రత మోసగిస్తున్నారని, ఇది సరోగసీ కాదని, అందుకే చైల్డ్ ట్రాఫికింగ్ కేసు నమోదు చేశామని రష్మి తెలిపారు. డాక్టర్ నమ్రత పెద్దఎత్తున అక్రమ సరోగసీ నిర్వహిస్తున్నారన్నారు. విజయవాడ,సికింద్రాబాద్, విశాఖపట్నం, కొండాపూర్‌లో యూనివర్సల్ సృష్టి ఫెర్టిలిటీ సెంటర్లను నిర్వహిస్తున్నామని చెబుతూనే దంపతుల నుంచి డాక్టర్ నమ్రత రూ.20 నుంచి రూ.30లక్షల వరకు వసూలు చేసి, వారిని మోసం చేస్తుందని తమ దర్యాపులో తేలిందని డిసిపి వెల్లడించారు.

## తరగతులు ఎక్కడ?
(మొదటి పేజీ తరువాయి)

అధికారులు అవినీతి మత్తులో చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారన్న ఆరోపణలు వెల్లువెత్తున్నాయి. ఐఐటి, నీట్ కోచింగ్ పేరిట ఇష్టారాజ్యంగా ఫీజులు వసూలు చేస్తున్న ప్రైవేట్ కోచింగ్ సెంటర్ల నిర్వాకంతో ప్రభుత్వం, ఇంటర్ బోర్డు నిర్లక్ష్యం స్పష్టమవుతోంది. కరీంనగర్‌లోని గణేష్ నగర్ బైపాస్ రోడ్డులో ఓ ప్రైవేట్ జూనియర్ కాలేజీ ఉంది. కాలేజీ బోర్డు కనిపిస్తుండగా ఇంటర్మీడియట్ మొదటి, ద్వితీయ సంవత్సరం విద్యార్థులు కలిపి వెయ్యికిపైగా అడ్మిషన్లు జరిగాయి. కాగా ఆ కళాశాలలో బోర్డు, బిల్డింగ్ తప్ప విద్యార్థులు కనిపించరు. కాగితాల్లోనే సదరు కళాశాల కనిపిస్తోంది. తరగతులు, ప్రాక్టికల్స్ అక్కడే జరుగుతున్నట్లు కాలేజీ యాజమాన్యం చూపుతోంది. అయితే అడ్మిషన్లు పొందిన ఆ వెయ్యి మంది విద్యార్థులకు ఎక్కడ క్లాసులు నిర్వహిస్తున్నారనే విషయాన్ని ఆరా తీస్తే ..కరీంనగర్‌లోని ప్రముఖ ఐఐటి, నీట్ అకాడమీ నిర్వాహకులు తమ అకాడమీలో చేరే విద్యార్థులను ఇంటర్మీడియట్‌లో ఎన్‌రోల్ చేసుకునేందుకు ఈ కాలేజీని వినియోగించుకున్నట్లు తెలిసింది. తద్వారా రూ.కోట్లలో దందా నడిపిస్తున్నారు. బహుళ అంతస్తుల భవనాల్లో క్లాసులు నడుపుతూ ఐఐటి, జెఇఇ అడ్వాన్స్, నీట్ పేరిట ఆకర్షణీయమైన హోర్డింగ్‌లతో జనాన్ని బుట్టలో వేసుకుంటున్నారు. ఐఐటి, ఎన్ఐటి, టాప్ ఇంజనీరింగ్ కాలేజీల్లో సీటు గ్యారంటీ అంటూ విద్యార్థుల తల్లిదండ్రులను మాయ చేస్తూ మభ్యపెడుతూ ఒక్కో విద్యార్థి నుంచి రెండేళ్లకు రూ.3లక్షలకు పైగా వసూలు చేస్తుండడం విశేషం.

**నిబంధనలు బేఖాతరు..** కరీంనగర్‌లో కోటా, ఆకాష్, బన్సాల్ క్లాసెస్ లాంటి పేర్లతో దాదాపు 5కు పైగా ఐఐటి, జెఇఇ, నీట్ అకాడమీలున్నాయి. వీటిలో టెన్త్ పూర్తయిన విద్యార్థులకు ఇంటర్ అడ్మిషన్‌తో పాటు ఐఐటి, జెఇఇ, నీట్ కోచింగ్ ఇస్తున్నారు. వాస్తవానికి నగరంలోని ఇలాంటి ఏ అకాడమీకి ఇంటర్మీడియట్ బోర్డు అనుమతులు లేవు. ఇవి జూనియర్ కాలేజీలు కాకపోయినా వీటి నిర్వాహకులు ఇంటర్మీడియట్‌లో అడ్మిషన్ తీసుకుని వారి పేర్లను అడ్మిషన్లు తక్కువగా ఉన్న ఇతర ప్రైవేట్ జూనియర్ కాలేజీల నుంచి ఎన్‌రోల్ చేయిస్తున్నారు. ఆ కాలేజీల నుంచే పరీక్ష రాయిస్తున్నారు. తమ అకాడమీ పేరుతో విద్యార్థులను చేర్పించుకుని మరో జూనియర్ కాలేజీ నుంచి అడ్మిషన్లు చేయిస్తూ తమ కోచింగ్ వ్యాపారాన్ని కొనసాగిస్తున్నారు.

**కఠిన చర్యలు తీసుకోవాలి**

**మచ్చ రమేష్, ఎఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి**

ఐఐటి నీట్ అకాడమీ పేరుతో ప్రచారం నిర్వహిస్తూ నిబంధనలకు విరుద్ధంగా ఇంటర్ తరగతుల నిర్వహణ చేస్తూ, అనుమతి ఒకచోట తరగతులు మరోచోట నిర్వహిస్తున్న ఇంటర్ కళాశాలలపై కఠిన చర్యలు తీసుకోవాలి. ఇంటర్ బోర్డు అధికారుల అండదండలతోనే యజమాన్యాలు ఈ విధంగా వ్యవహరిస్తున్నాయి. అనుమతి లేకుండా తరగతులు నిర్వహిస్తూ విద్యార్థులు, వారి తల్లిదండ్రులను మోసం చేస్తున్న కళాశాల యాజమాన్యాలపై చీటింగ్ కేసు నమోదు చేయాలి.

## రేవ్ పార్టీ
(మొదటి పేజీ తరువాయి)

హైదరాబాద్ కొండాపూర్‌కి తీసుకువచ్చి సర్వీస్ అపార్ట్‌మెంట్‌లలో రేవ్ పార్టీ నిర్వహిస్తుంటారు. ఈ క్రమంలోనే శనివారం నాడు ఆంధ్రప్రదేశ్‌కి చెందిన కొంతమంది వ్యక్తులను అలాగే యువతులను తీసుకువచ్చి రేవ్ పార్టీ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సదరు అమ్మాయిలతో అసభ్యకర నృత్యాలు చేయిస్తూ, మందు, చిందు, డ్రగ్స్‌లలో మునిగిపోయారు. అయితే రేవ్ పార్టీ విషయమై శనివారం రాత్రి పోలీసులకు సమాచారం అందింది. ఈ మేరకు ఎక్సైజ్, స్టేట్ టాస్క్‌ఫోర్స్ బిటీమ్ ఎస్ఐ సంధ్య బాలరాజు సిబ్బందితో కలిసి దాడి చేశారు. ఈ దాడిలో మొత్తం 9 మందిని అరెస్టు చేశారు. వారి నుంచి 2.080కేజీల గంజాయి, 50 గ్రాముల ఓజీ కుష్ గంజాయిని, 11.57 గ్రాముల మ్యాజిక్ ముష్రూమ్, 1.91 గ్రాముల చెరస్ డ్రగ్స్ స్వాధీనం చేసుకున్నారు. నాలుగు కార్లు, 11 సెల్‌ఫోన్లు సీజ్ చేశారు. ప్రధాన నిందితులను ఆంధ్రప్రదేశ్‌కి చెందిన వాసు, శివం రాయుడుగా పోలీసులు గుర్తించారు. వీరంతా ముఠాగా ఏర్పడి గుట్టుచప్పుడు కాకుండా ఈ వ్యవహారం సాగుస్తున్నారని ఎస్ఐ సంధ్య బాలరాజు తెలిపారు. డబ్బులుండి సరదాగా గడపాలని అనుకునే వారిని నిందితులు వారానికి రెండు రోజులపాటు హైదరాబాద్‌కు తీసుకువచ్చి ఎంజాయ్ చేయించి తీసుకెళ్తుంటారని చెప్పారు. పక్కా సమాచారం మేరకు వారిని అరెస్టు చేసినట్లు తెలిపారు. మొత్తం 11 మందిపై కేసు నమోదు చేయగా 9 మందిని అరెస్ట్ చేశారు. కింగ్ కెన్ షేర్ రాహుల్ అనే వ్యక్తి డ్రగ్స్ తెప్పించే వాడన్నారు. పట్టుపడిన వారిలో నిర్వాహకుడు ప్రవీణ్ కుమార్ అలియాస్ మనెన, అశోక్ కుమార్, సమ్మెల సాయికృష్ణ, హిట్ జోసఫ్, తోట కుమారస్వామి, అడపా యశ్వంత్ శ్రీ దత్, నంద, సమతా, తేజ ఉన్నట్లు తెలిపారు. వీరితో పాటు మరో ముగ్గురిపైనా కేసు నమోదు చేశామని ఎస్ఐ సంధ్యా బాలరాజు చెప్పారు. నిందితులను పట్టుకున్న అనంతరం శేరిలింగంపల్లి ఎక్సైజ్ పోలీసులకు అప్పగించారు.

## వ్యాఖ్యలు వాస్తవమే
(మొదటి పేజీ తరువాయి)

సంబంధం పెట్టుకుంటామన్నారు. ప్రధాని నరేంద్రమోదీ ఎన్నికలకు ముందు నిజామాబాద్ సభలో మాట్లాడుతూ తాము వారసత్వ రాజకీయాలకు వ్యతిరేకమని, వాటిని ప్రోత్సహించమని స్పష్టం చేశారన్నారు. కామారెడ్డి బిసి డిక్లరేషన్ పేరుతో కాంగ్రెస్ ప్రభుత్వం ముస్లిం డిక్లరేషన్ బిల్లును తీసుకొచ్చిందని అన్నారు. రాష్ట్రంలో 27 శాతం రిజర్వేషన్లు బిసిలకు అమలవుతున్నాయని, అదనంగా వారికి 5 శాతం రిజర్వేషన్లు ఇస్తూ ఆ ముసుగులో ముస్లింలకు 10 శాతం రిజర్వేషన్లు కల్పిస్తున్నారని, అంటే తెలంగాణలో ముస్లింలకు 100 శాతం రిజర్వేషన్లు కల్పించబోతున్నారని అన్నారు. అలాంటప్పుడు అది బిసి డిక్లరేషన్ ఎలా అవుతుందని ప్రశ్నించారు. అది ముమ్మాటికీ ముస్లిం డిక్లరేషనే అని స్పష్టం చేశారు. అంబేద్కర్ రాజ్యాంగం ప్రకారం తాము మత రిజర్వేషన్లకు విరుద్ధమన్నారు. నూతనంగా నిర్మించిన క్రిటికల్ కేర్ యూనిట్‌కు నిధులన్నీ కేంద్ర ప్రభుత్వానివేనని అన్నారు. రూ.23.75 కోట్ల కేంద్ర ప్రభుత్వ నిధులతో ఈ భవనాన్ని నిర్మించినట్లు తెలిపారు.

## నేడు రాష్ట్ర మంత్రివర్గ సమావేశం
(మొదటి పేజీ తరువాయి)

ధరలు పెంపు, ఇందిరమ్మ ఇళ్ల ప్రక్రియ తదితర అంశాలపై చర్చించనున్నట్లు సమాచారం. కాగా, కాళేశ్వరం ప్రాజెక్టులో అవకతవకలపై విచారణ చేస్తున్న జస్టిస్ పి.సి.ఘోష్ కమిషన్ తుది నివేదికను సిద్ధం చేసి సోమవారం ప్రభుత్వానికి సమర్పించే అవకాశం ఉందని సమాచారం. అయితే కమిషన్ నివేదికను సమర్పిస్తే ఆ నివేదికపై కూడా మంత్రివర్గ సమావేశంలో చర్చించే అవకాశం ఉందని ప్రభుత్వవర్గాల సమాచారం. మంత్రివర్గ సమావేశంలో చర్చించాల్సిన పలు అంశాలపై ప్రత్యేక ప్రధాన కార్యదర్శులు, ప్రిన్సిపల్ సెక్రటరీలు, ప్రభుత్వ కార్యదర్శులు అజెండా అంశాలను సాధారణ పరిపాలన విభాగానికి (జిఎడి)కి పంపాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సిఎస్ రామకృష్ణరావు గత బుధవారం సర్క్యూలర్ జారీ చేశారు.

తొలుత నిర్ణయించిన ప్రకారం మంత్రివర్గ సమావేశం ఈ నెల 25వ తేదీనే జరగాల్సి ఉంది. అయితే, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, నీటిపారుదలశాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి, పలువురు మంత్రులు వివిధ అధికారిక, పార్టీ కార్యక్రమాల నిమిత్తం రెండు రోజుల పాటు ఢిల్లీలో పర్యటించడం వల్ల మంత్రివర్గ సమావేశం ఈ నెల 28వ తేదీకి ప్రభుత్వం వాయిదా వేసిన విషయం తెలిసిందే.

## నివేదిక సిద్ధం
(మొదటి పేజీ తరువాయి)

నేడు మధ్యాహ్నం రెండు గంటలకు జరగనున్న మంత్రి వర్గ సమావేశంలో దీనిని పై చర్చించే అవకాశం సైతం ఉంది.

**కమిషన్ విచారణ సాగింది ఇలా...**

2014 మార్చి 14న ఇంజినీర్లు, నిపుణుల కమిటీలు, సెంట్రల్ డిజైన్ ఆర్గనైజేషన్ (సిడిఓ) ప్రతినిధులు, హైడ్రాలజీ విభాగం ఇంజినీర్లు తదితరులను విచారించింది. కమిషన్ విచారణలో భాగంగా నీటి పారుదల శాఖ ఇఎన్‌సి మురళీధర రావుతోపాటు ఐఎఎస్ అధికారులు రాహుల్ బొజ్జా, వికాస్ రాజ్, స్మిత సభర్వాల్, కె రామకృష్ణారావు, రిటైర్డ్ అధికారులు ఎస్.కె.జోషి, వి.నాగిరెడ్డి, రజత్ కుమార్, సోమేశ్ కుమార్‌లను కమిషన్ ముందు హాజరై అఫిడవిట్లు సమర్పించారు. ప్రభుత్వం గడువు విధించిన నాటికి విచారణ పూర్తి కాకపోవడంతో ఇదే క్రమంలో జస్టిస్ పిసి ఘోష్ అభ్యర్థన మేరకు ప్రభుత్వం కమిషన్ పదవీకాలాన్ని ఆగస్టు 31వరకు పొడిగించింది. దీంతో విచారణను వేగవంతం చేసిన కమిషన్ నీటిపారుదల శాఖలోని మరింత అధికారులు,రిటైర్డ్ ఇంజనీర్లను క్రాస్ ఎగ్జామిన్ చేసింది. విచారణలో పలు అంశాలు వెలుగులోకి రావడంతో ప్రాజెక్ట్ మాజీ ఇంజనీర్ ఇన్ చీఫ్ ఎన్.వెంకటేశ్వర్లును కమిషన్ మరోసారి విచారించింది. ఇదే క్రమంలో కమిషన్ గడువును ప్రభుత్వం మూడోసారి మరో నెలలు పొడిగించగా, నీటిపారుదల శాఖకు చెందిన 18 మంది ఇంజనీర్లను కమిషన్ బ్యారేజీల ప్రాజెక్ట్ డిజైన్, కార్యకలాపాలు, నిర్వహణపై వారిని క్రాస్‌ఎగ్జామిన్ చేసింది. అయితే విచారణ మరింత కొనసాగించాల్సిన అవసరం ఏర్పడడంతో కమిషన్ అభ్యర్థన మేరకు ప్రభుత్వం మూడోసారి కమిషన్ గడువును డిసెంబర్ 31 వరకు మళ్లీ పొడిగించింది. ఈసారి కమిషన్ ముందు హాజరై అప్పటికే అఫిడవిట్లను సమర్పించిన పలువురిని విచారించింది. అప్పటికి విచారణ పూర్తికాకపోవడంతో కమిషన్ పదవీకాలాన్ని 4వ సారి 2025 ఫిబ్రవరి 28వ తేదీ వరకు మళ్లీ పొడిగించారు.

విచారణ సమయంలో లేవనెత్తిన ప్రశ్నలకు సంబంధించి స్పష్టత కోసం మాజీ ప్రధాన కార్యదర్శి సోమేశ్ కుమార్, మాజీ నీటిపారుదల కార్యదర్శి స్మితా సభర్వాల్ కమిషన్ మరోసారి విచారించింది. ఈసారి కేంద్ర నిధుల సంస్థల నుండి తీసుకున్న నిధులు, రుణాల సమీకరణపై ఆర్థిక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణారావుతోపాటు పలువురిని కమిషన్ విచారించింది. అయితే అప్పటికి విచారణ పూర్తి కాకపోవడం కమిషన్ గడువును ప్రభుత్వం మళ్ళీ ఐదవసారి ఏప్రిల్ 30వరకు పొడిగించారు. ఈసారి మరింత లోతుగావిచారించిన కమిషన్ అధికారుల నుంచి మరింత విషయాలను రాబట్టి ప్రాథమిక నివేదికను సిద్ధం చేసింది. దీంతో అధికారుల విచారణను దాదాపుగా పూర్తిచేసిన ప్రభుత్వం మరింత విచారణకు గాను సమయం కోరడంతో కమిషన్ గడువును జూన్ 30వరకు పెంచుతూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. దీంతో తుది దశగా జూన్ 5న మాజీ ఆర్థిక శాఖ మంత్రి ఈటల రాజేందర్, 6వ తేదీ మాజీ నీటి పారుదల శాఖ మంత్రి టి.హరీష్‌రావునుల విచారించిన కమిషన్ జూన్ 11వ తేదీన మాజీ ముఖ్యమంత్రిని కమిషన్ విచారించింది. దీంతో ప్రాజెక్టు నిర్మాణానికి సంబంధించి అన్ని నిర్ణయాలు మంత్రివర్గ సమావేశాల ఆమోదంతో తీసుకున్నట్లు వారంతా వెల్లడించడంతో కమిషన్ ఇందుకు సంబంధించి మినిట్స్‌ను అందజేయాలంటూ ప్రభుత్వానికి కమిషన్ లేఖ రాసింది.

దీంతో గత జూన్ 30వ తేదీన రాష్ట్ర ప్రభుత్వం గత బిఆర్ఎస్ ప్రభుత్వ హాయంలో జరిగిన మంత్రివర్గ సమావేశాలకు సంబంధించి మినిట్స్‌ను కమిషన్‌కు అందజేయడంతో వీటి పరిశీలనకు మరింత గడువు కోరడంతో కమిషన్ గడువును ఈనెల 31వరకు పొడిగించింది. ఇదే క్రమంలో తుది నివేదికను సిద్ధం చేసిన ఏకసభ్య కమిషన్ నేడు ప్రభుత్వానికి అందజేయనున్నట్లు సమాచారం.



# జనరల్
STATE & REGIONAL NEWS

## స్వామికి 'గ్రీన్ అచీవ్‌మెంట్ అవార్డు-2025'

ప్రజాపక్షం/హైదరాబాద్: 'దక్షిణ మధ్య రైల్వే ఎంప్లాయిస్ కోపరేటివ్ సొసైటీ అధ్యక్షులు చిలుక స్వామికి అమెరిక యూనివర్సిటీ 'గ్రీన్ అచీవ్‌మెంట్ అవార్డు 2025 హానర్ ఆఫ్ డాక్టరేట్'ను ప్రధానం చేసింది. గోవాలో ఆదివారం యుఎస్ యూనివర్సిటీ పురస్కారోత్సవ కార్యక్రమంలో స్వామికి 'డాక్టరేట్'ను అందజేశారు. ఆలేరు మండలం షారాజిపేట గ్రామానికి చెందిన స్వామి రైల్వే ఉద్యోగిగా పనిచేస్తూనే, గ్రామంలో ఎయిడ్స్ పట్ల అవగాహన రక్తదానం, శ్రమదాన శిబి రాలు నిర్వహిస్తూ గ్రామ యువకులను చైతన్య పరుస్తున్నారు. ఆయన సేవలను గుర్తిం చిన 'యుఎస్ యూనివర్సిటీ 'గ్రీన్ అచీవ్‌మెంట్ అవార్డు 2025 హానర్ ఆఫ్ డాక్టరేట్' అందజేసింది. చిలుక స్వామి డాక్టరేట్ లభించడం పట్ల పలువురు రైల్వే ఉద్యోగులు, దక్షిణ మధ్య రైల్వే ఎంప్లాయిస్ కోఆపరేటివ్ సొసైటీ కార్యవర్గ సభ్యులు హర్షం వ్యక్తం చేశారు.



## రాష్ట్రంలో రాగల రెండు రోజులు భారీ వర్షాలు



ప్రజాపక్షం/హైదరాబాద్ : రాష్ట్రంలో రాగల రెండు రోజులు భారీ వర్షాలు కురిసే అవకాశాలున్నాయని హైదరాబాద్ వాతావరణ కేంద్రం అధికారులు హెచ్చరించారు. ఈ క్రమంలో ఆయా జిల్లాలకు ఎల్లో హెచ్చరికలు జారీ చేశామని తెలిపారు. ఆదిలాబాద్, ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, నిజామాబాద్, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల, కరీంనగర్, పెద్దపల్లి, భూపాలపల్లి, ములుగు, కొత్తగూడెం, మహబూబాబాద్, వరంగల్, హన్మకొండ, జనగాం, సిద్దిపేట, యాదాద్రి భువనగిరి, రంగారెడ్డి, హైదరాబాద్, మేడ్చల్ మల్కాజిగిరి, వికారాబాద్, సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి జిల్లాల్లో అక్కడక్క భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందన్నారు. సోమవారం నుంచి తేలిక పాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందన్నారు. పలుచోట్ల బలమైన ఈదురుగాలులు వీస్తాయన్నారు.

## సమాజాభివృద్ధి ప్రతి పౌరుడి సామాజిక బాధ్యత

ప్రజలు బాధ్యతలను నిర్వర్తించకుండా హక్కులను అనుభవించలేరు

'హెచ్ఎన్ఎస్ చికిత్సాలయ్' ప్రారంభోత్సవంలో తెలంగాణ గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ



ప్రజాపక్షం/హైదరాబాద్: సమాజాన్ని అభివృద్ధి చేయడం సమాజంలోని ప్రతి పౌరుని సామాజిక బాధ్యత అని తెలంగాణ గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ అన్నారు. అందులో భాగంగా వివిధ వర్గాల సంఘాలు, స్వచ్ఛంద సేవా సంస్థలు ఎవరి శక్తి మేరకు వారు సేవా కార్యక్రమాలను కొనసాగించాలని సూచించారు. హర్యాణ నాగరిక్ సంఘ్ (హెచ్ఎన్ఎస్) ప్రజలకు కనీస ఫీజులతో వైద్య సేవలందించడం అభినందనీయమన్నారు. సికింద్రాబాద్ సిక్ విలేజ్‌లో హర్యాణా నాగరిక్ సంఘ్ (హెచ్ఎన్ఎస్) ఆధ్వర్యంలో నూతనంగా ఏర్పాటు చేసిన 'హెచ్ఎన్ఎస్ చికిత్సాలయ్'ను గవర్నర్ ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా హెచ్ఎన్ఎస్ చికిత్సాలయ్ చైర్మన్ అంజనీకుమార్ అగర్వాల్ అధ్యక్షతన జరిగిన సభలో గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ, ఎంపి ఈటల రాజేందర్, హెచ్ఎన్ఎస్ అధ్యక్షులు పదమ్ జైన్, సలహాదారులు రామ్ గోయల్, హెచ్ఎన్ఎస్ చికిత్సాలయ్ అధ్యక్షులు పురుషోత్తం అగర్వాల్, సికింద్రాబాద్ కంటోన్మెంట్ బోర్డ్ సభ్యురాలు బి.నర్మద మల్లిఖార్జున్ తదితరులు ప్రసంగించారు. సభలో గవర్నర్ ప్రసంగిస్తూ సమాజం లేకుండా మానవుని మనుగడ అసాధ్యమని, సమాజం శక్తివంతంగా ఉంటేనే ప్రజలు శక్తివంతంగా ఉంటారన్నారు. దేశ ప్రగతికి వైద్య సేవలు పునాది లాంటివని, కులం, మతం, ప్రాంతం, భాష అనే బేధాలు లేకుండా ప్రజలందరికీ వైద్య సేవలు అందాలన్నారు. రాజ్యాంగం ప్రకారం పౌరులందరికీ హక్కులు, విధులు ఉంటాయని, కానీ సమాజంలోని కొంత మంది తాము నిర్వర్తించే విధులను విస్మరిస్తూ హక్కులను మాత్రమే అడుగుతున్నారన్నారు. సమాజంలో ప్రజలు తమ విధులు, బాధ్యతలను నిర్వర్తించకుండా హక్కులను అనుభవించలేరని గవర్నర్ స్పష్టం చేశారు. అంజనీకుమార్ అగర్వాల్ మాట్లాడుతూ చికిత్సాలయ్‌లో హెచ్ఎన్ఎస్ సొసైటీ సభ్యులతో పాటు సమాజంలోని అన్ని వర్గాల వారికి కనీస చార్జీలతో వైద్య పరీక్షలు, సేవలను అందించనున్నట్లు ప్రకటించారు. ప్రభుత్వం జారీచేసిన తెల్ల రేషన్ కార్డుదారులకు తమ చికిత్సాలయ్ ఉచితంగా వైద్య సేవలను అందించేందుకు చర్యలు చేపడతామన్నారు. పురుషోత్తం అగర్వాల్ మాట్లాడుతూ భవిష్యత్‌లో చికిత్సాలయ్‌లో మరిన్ని ఆధునాతన వైద్య సేవలను అందించేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నామన్నారు. కార్యక్రమంలో హెచ్.ఎన్.ఎస్ చికిత్సాలయ్ ప్రధాన కార్యదర్శి దీపక్ బింజ్రాజ్ ఉపాధ్యక్షులు సుశీల్ అగర్వాల్, సంయుక్త కార్యదర్శి సందీప్ మిట్టల్, కోశాధికారి నారాయణ్ చౌదరి, హర్యాణా సేవా సంఘం అధ్యక్షులు రాజేందర్ అగర్వాల్ పాల్గొన్నారు.

## మానవ హక్కుల ఉల్లంఘన కేసులపై నేడు, రేపు విచారణ

ప్రజాపక్షం/హైదరాబాద్: రాష్ట్రంలో 109 మానవ హక్కుల ఉల్లంఘన కేసులను జాతీయ మానవ హక్కుల కమిషన్ (ఎన్‌హెచ్‌ఆర్‌సి) సోమ, మంగళవారం రెండు రోజుల పాటు హైదరాబాద్‌లోని ఎంసిహెచ్‌ఆర్‌డిలో ప్రత్యేక బహిరంగ విచారణ చేపట్టనుంది. ఎన్‌హెచ్‌ఆర్‌సి ఛైర్‌పర్సన్ జస్టిస్ వి.రామసుబ్రమణియన్, సభ్యులు జస్టిస్ విద్యుత్ రంజన్ సారంగి, విజయ భారతి సయానిలు సంబంధిత రాష్ట్ర అధికారుల సమక్షంలో కేసులను విచారించనున్నారు. ఈ విచారణకు ఎన్‌హెచ్‌ఆర్‌సి ప్రధాన కార్యదర్శి భరత్ లాల్, డైరెక్టర్ జనరల్(దర్యాప్తు) ఆర్‌పి మీనా, రిజిస్ట్రార్ (లా), జోగిందర్ సింగ్‌తో పాటు సీనియర్ అధికారులు హాజరుకానున్నారు. ప్రత్యేక విచారణ సందర్భంగా కేసుల్లో పోలీసుల అధికార దుర్వినియోగం, ప్రభుత్వం ఇచ్చే వివిధ సామాజిక సంక్షేమ పథకాల కింద ప్రయోజనాలను తిరస్కరించడం, జైలులో అక్రమాలు, షెడ్యూల్ కులాలు, షెడ్యూల్ తెగలకు చెందిన మానవ హక్కులను పరిరక్షించడంలో నిర్లక్ష్యం, రాష్ట్ర వ్యాప్తంగా వివిధ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థుల హక్కులు ముఖ్యంగా గర్భిణులు, పాలు ఇచ్చే తల్లులు ఎదుర్కొంటున్న ఆరోగ్య సమస్యలు, అక్రమ రవాణా లాంటి పలు కేసులు ఉన్నాయి. అనంతరం ఈనెల 29న రాష్ట్ర ప్రభుత్వ సీనియర్ అధికారులతో ఎన్‌హెచ్‌ఆర్‌సి సమావేశం కానుంది. మానవ హక్కులకు సంబంధించిన వివిధ సమస్యలు, మానవ హక్కుల ఉల్లంఘన బాధితులకు త్వరిత గత న్యాయం అందించేందుకు ఉన్న ప్రాముఖ్యతపై వారికి అవగాహన కల్పించనుంది. అలాగే సమాజంలోని వివిధ వర్గాల సంక్షేమం ఎన్‌హెచ్‌ఆర్‌సి ఇచ్చిన వివిధ సలహాలపై రాష్ట్ర ప్రభుత్వం, అనుబంధ సంస్థలు తీసుకున్న క్రియాశీల చర్యలను కూడా కమిషన్ సమీక్షించనుంది. అనంతరం మానవ హక్కుల సమస్యల విషయంలో పౌర సమాజ సంస్థలు, స్వచ్ఛంద సంస్థలతో భేటీ కానుంది. గత వారం ఒడిశా రాజధాని భువనేశ్వర్‌లో విచారణ చేపట్టగా, గతంలో ఉత్తర ప్రదేశ్, బీహార్, కర్నాటక, గుజరాత్, అస్సాం, మేఘాలయ, ఛత్తీస్‌ఘఢ్, మణిపూర్, మధ్యప్రదేశ్, పంజాబ్, కేరళ, పుదుచ్చేరి, ఆంధ్రప్రదేశ్, జార్ఖండ్, అండమాన్‌నికోబార్, నాగాలాండ్, ఉత్తరాఖండ్, రాజస్థాన్, అరుణాచల్ ప్రదేశ్, పశ్చిమబెంగాల్, తమిళనాడు, మహారాష్ట్రలలో ఈ కార్యక్రమాలను నిర్వహించింది.

## వరంగల్, హనుమకొండ జిల్లాలను కలిపి ఉత్తర తెలంగాణ అభివృద్ధి కేంద్రంగా తీర్చిదిద్దాలి

పౌర సమాజం, రాజకీయ పార్టీలు, ప్రజాసంఘాలు డిమాండ్



ప్రజాపక్షం/హనుమకొండ : హనుమకొండ, వరంగల్ జిల్లాలను కలిపి ఒకే వరంగల్ జిల్లాగా ప్రకటించాలని కోరుతూ ఆదివారం హనుమకొండ నక్కలగుట్ట హరిత కాకతీయ హోటల్‌లో తెలంగాణ ఉద్యమకారుల వేదిక, ఫోరం ఫర్ బెటర్ వరంగల్ సంయుక్తంగా ఏర్పాటుచేసిన చర్చా వేదికలో జాతీయ పార్టీల జిల్లాల నాయకులు, పుర ప్రముఖులు మేధావులు పాల్గొన్నారు. సభకు ప్రొఫెసర్ కూరపాటి వెంకట్ నారాయణ అధ్యక్షత వహించగా పుల్లూరు సుధాకర్ ప్రారంభ ఉపన్యాసం చేస్తూ వరంగల్,హనుమకొండ రెండు పరస్పరం కలవాలని, రాజకీయ నాయకులు చొరవ చూపాలని అన్నారు. వరంగల్, హనుమకొండలు ఒకదాని అభివృద్ధితో మరొకటి ముడిపడి ఉన్నాయని చెప్పారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న ప్రముఖ జర్నలిస్టు పాశం యాదగిరి మాట్లాడుతూ వరంగల్ ఉమ్మడి జిల్లాను అభివృద్ధి కాకుండా రాజకీయ చైతన్యం ఎదగకుండా గత పాలకులు విభజించారని అన్నారు. వరంగల్, హనుమకొండ జిల్లాలను కలిపి వరంగల్ జిల్లాగా మార్చాలని ముఖ్యమంత్రికి వినతి పత్రం ఇవ్వాలని మాజీ శాసనసభ్యులు వన్నాల శ్రీరాములు అన్నారు. గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ మాజీ మేయర్ డాక్టర్ టి.రాజేశ్వరరావు మాట్లాడుతూ ఉమ్మడి జిల్లా వాసులు వరంగల్ జిల్లా గతం, వర్తమానం, భవిష్యత్తును గుర్తుంచుకోవాలని దాని రాజకీయ చైతన్యాన్ని ఉనికిని చరిత్రను అభివృద్ధి గతిని కాపాడుకోవాలని గత పాలకులు జిల్లాను ఆశాస్త్రీయంగా విభజించి అభివృద్ధిని అడ్డు కున్నారన్నారు. సీనియర్ రాజకీయ నాయకులు, సామాజిక విశ్లేషకులు కన్నెబోయిన రాజయ్య యాదవ్ మాట్లాడుతూ గత పాలకులు కొంటెతనంతో కుట్రబుద్ధితో వరంగల్ ఉమ్మడి జిల్లాను అశాస్త్రీయంగా విభజించి దీని సమగ్ర అభివృద్ధిని అడ్డుకున్నారని అన్నారు. సిపిఎం జిల్లా కార్యదర్శి ప్రభాకర్ రెడ్డి మాట్లాడుతూ వరంగల్ పరిసరాల ప్రాంతాల్లో వివిధ రకాల పరిశ్రమలను అభివృద్ధి చేయాలని రెండు జిల్లాలను కలపాలని అన్నారు. వరంగల్ ఉమ్మడి జిల్లా అభివృద్ధికి భారతీయ జనతా పార్టీ కేంద్ర ప్రభుత్వం అన్ని విధాలా కృషి చేస్తున్నదని వరంగల్, హనుమకొండ జిల్లాలను కలపడం ప్రజల కోరిక అని భాజపా హనుమకొండ జిల్లా అధ్యక్షులు కొలను సంతోష్‌రెడ్డి అన్నారు. వరంగల్, హనుమకొండ జిల్లాలను కలిపి కార్యాచరణ కమిటీ ఏర్పాటు చేయాలని న్యూడెమోక్రసీ సీనియర్ నాయకులు నూనె అప్పారావు అన్నారు. తెలంగాణ ఉద్యమ నాయకులు అడ్వకేట్ చిల్ల రాజేంద్రప్రసాద్, ప్రముఖ రచయిత తెలంగాణ మేధావి పొట్టపల్లి శ్రీనివాసరావు మాట్లాడుతూ వరంగల్ జిల్లా ప్రాధాన్యతను పునరుద్ధరించాలనీ అన్నారు. ఈ సమావేశంలో హనుమకొండ రెడ్ క్రాస్ కోశాధికారి బొమ్మినేని పాపిరెడ్డి, సీపీఎం నాయకులు ఎం.చుక్కయ్య, ప్రముఖ విద్యావేత్త గంటా రామ్ రెడ్డి,రిటైర్డ్ అధ్యాపకులు బాబురావు, చరిత్రకారుడు ప్రొఫెసర్ విజయబాబు, సామాజికవేత్తలు సోమ రామమూర్తి, సాయిని నరేందర్, చాపర్తి కుమార్, సీనియర్ కార్పొరేటర్, కాంగ్రెస్ నాయకులు అబూబకర్, డాక్టర్ చింతం ప్రవీణ్, రైతు సంఘం నాయకులు సోమిడి శ్రీనివాస్‌తో పాటు అనేకమంది ఉద్యమకారులు సామాజికవేత్తలు పాల్గొన్నారు.

## బిజెపి మతోన్మాద విధానాలకు వ్యతిరేకంగా పోరాటం

స్థానిక ఎన్నికల్లో సత్తా చాటుదాం

సిపిఐ జాతీయ సమితి సభ్యుడు భాగం హేమంతరావు



ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం : సమాజ మార్పు యువత వల్లే సాధ్యమని, నేటి యువత రేపటి రాజకీయ భవిష్యత్‌కు ఎంతైనా అవసరం అని సిపిఐ జాతీయ సమితి సభ్యులు భాగం హేమంతరావు అన్నారు. కేంద్రంలో అధికారాన్ని చెలాయిస్తున్న బిజెపి మతోన్మాద విధానాలకు వ్యతిరేకంగా పోరాడాల్సిన అవసరం ఎంతైనా ఉందని సిపిఐ జాతీయ సమితి సభ్యులు భాగం హేమంతరావు అన్నారు. ఆదివారం అశ్వారావుపేట నియోజకవర్గ కేంద్రంలో గల శ్రీశ్రీ ఫంక్షన్ హాల్ (మియా జానీ నగర్)లో భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ) భద్రాద్రి కొత్తగూడెం జిల్లా 3వ మహాసభలు రెండో రోజు ఉత్తేజపూరిత వాతావరణంలో జరిగాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కులాలు, మతాల పేరుతో ప్రజల మధ్య చీలికలు తెచ్చి హిందుత్వ ఎజెండాను దేశప్రజలపై బలంగా రుద్దుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. దేశ రాజకీయాలను మోదీ సర్కార్ భ్రష్టు పట్టిసోందని, రాజకీయ పబ్బం గడుపుకునేందుకు స్వతంత్ర ప్రతిపత్తిగల ఎన్నికల సంఘాన్ని సైతం పావుగా వాడుకుంటున్నారని మండిపడ్డారు. ప్రజాస్వామ్య లౌకిక వ్యవస్థను కాపాడుకునేందుకు పోరాటాలు చేయాలని పిలుపునిచ్చారు. బిజెపి వల్ల కమ్యూనిస్టులకు కూడా ప్రమాదం పొంచి ఉందని, అయినప్పటికీ దేనికీ భయపడకుండా అమరుల స్ఫూర్తితో ముందుకు సాగాలని, పేదలు, కర్షకులు, కార్మికుల అభ్యున్నతి కోసం పుట్టిన కమ్యూనిస్టు పార్టీని, ఎర్రజెండాలను అంతమొందించడం ఎవరి తరం కాదని, నేడు ప్రపంచం మొత్తం కమ్యూనిస్టుల అవసరాన్ని గుర్తెరుగుతోందని చెప్పారు. రాజకీయాల్లో కూడా శాస్త్రసాంకేతిక రంగ పోకడలు పెరిగిపోయాయని, ఏఐ ప్రభావం విద్యావైద్యంతో పాటు తదితర అంశాల్లో ప్రాధాన్యత మరింత పెరిగిందన్నారు. సోషల మీడియా ద్వారా బిజెపి వ్యూహాత్మకంగా అబద్దాలను నిజాలుగా ప్రచారం చేస్తుందన్నారు. రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకిచ్చిన హామీలను పూర్తిగా నెరవేర్చాలని చెప్పారు. జిల్లాలో సీతారామ ప్రాజెక్టు ద్వారా ప్రతీ ఎకరాకు నీరందించాలన్నారు. పార్టీ ప్రజా సంఘాల నిర్మాణానికి ప్రజలతో మమేకమైన ముందుకు సాగాలని, రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలిపే లక్ష్యంగా వ్యూహాలు రచించాలన్నారు.

**ప్రతీ కమ్యూనిస్టు సైనికునిగా పని చేయాలి**

ప్రతీ కమ్యూనిస్టు సైనికునిలా పనిచేయాలని, ప్రజా సమస్యల పరిష్కారానికి పెద్ద పీట వేయాలని సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బల్లోజు అయోధ్య అన్నారు. ఎన్నో ఉద్యమాలు, త్యాగాలతో పునీతమైన పార్టీ సిపిఐ అన్నారు. ఆ నాటి రోజుల్లో పార్టీని విస్తరించే క్రమంలో ప్రాణాలకు సైతం తెగించి పోరాటాలు చేశామని, భూస్వాములు, జమీందార్లకు వ్యతిరేకంగా నిలిచి పేదలకు భూములు పంచామని చెప్పారు. పార్టీ మండల కార్యదర్శులు, ప్రజాసంఘాల బాధ్యులు చర్చల్లో పాల్గొనగా తీర్మానాలు ఆమోదించారు. సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కే సాబీర్ పాషా, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బలోజు అయోధ్య, ముత్యాల విశ్వనాథంతో పాటు కల్లూరి వెంకటేశ్వరావు, మున్నా లక్ష్మీ కుమారి, జిల్లా కార్యవర్గ సభ్యులు సయ్యద్ సలీం, ఏపి రాష్ట్ర కమిటీ సభ్యులు ఎండి మునీర్, దారయ్య, సిపిఐ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కార్యవర్గ సభ్యులు కే సారయ్య, సరెడ్డి పుల్లారెడ్డి, రావులపల్లి రవికుమార్, నరాటి ప్రసాద్ చంద్రా నరేంద్ర, చలిగంటి శ్రీనివాస్, చంద్రగిరి శ్రీనివాస్, రేసు ఎల్లయ్య, దేవరకొండ శంకర్, కమటం వెంకటేశ్వరావు, దుర్గరాశి వెంకన్న, గన్నెని రామకృష్ణ, విజయ్, సాయిబాబు, పూర్ణచంద్రరావు, రాహుల్, హరీష్, అజిత్ తదితరులు పాల్గొన్నారు.

### సిపిఐ భద్రాద్రి జిల్లా కార్యదర్శిగా ఎస్‌కె.సాబీర్ పాషా తిరిగి ఎన్నిక



ప్రజాపక్షం/అశ్వారావుపేట : భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ) భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కార్యదర్శిగా ఎస్‌కే సాబీర్ పాషా ఎన్నికయ్యారు. అశ్వారావుపేట నియోజకవర్గ కేంద్రంలోని శ్రీశ్రీ ఫంక్షన్ హాల్ (మియాజానీ నగర్)లో రెండవ రోజు ఆదివారం జరిగిన భద్రాద్రి కొత్తగూడెం జిల్లా సిపిఐ 3వ మహాసభల్లో సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు, రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు భాగం హేమంతరావు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బొల్లోజు అయోధ్య సమక్షంలో ఈ ఎన్నిక ఏకగ్రీవమైంది. ఈ మహాసభలో సిపిఐ నూతన జిల్లా కౌన్సిల్‌ను ఎన్నుకున్నారు. 79 మంది కౌన్సిల్ సభ్యులు, 27 మంది కార్యవర్గ సభ్యులు మరో ముగ్గురు ఆహ్వానితులుగా 30 మందితో కార్యవర్గం మహాసభ ఏకగ్రీవంగా ఎన్నుకుంది.

## కాంగ్రెస్ వైఖరితో తరలుతున్న కంపెనీలు

ప్రభుత్వ తీరుపై కెటిఆర్ ధ్వజం



ప్రజాపక్షం/పరకాల : దేశానికి తలమానికంగా ఉన్న వరంగల్‌లోని ఆజంజాహీ వస్త్ర పరిశ్రమలు దివాలా తీయించి అక్కడి భూములను రియల్ ఎస్టేట్ వ్యాపారాలకు అమ్ముకున్న కాంగ్రెస్‌ను తరిమికొట్టాలని బిఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ ప్రజలకు పిలుపునిచ్చారు. ఆదివారం పరకాల పట్టణంలోని లలిత కన్వెన్షన్ హాల్లో ఏర్పాటు చేసిన పోచంపల్లి ఫౌండేషన్ ఆధ్వర్యంలో కుట్టు మిషన్ల పంపిణీ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. తెలంగాణలోని ఎంతోమంది చేనేత తయారీ కార్మికులు ఉపాధి లేక ఇతర రాష్ట్రాలకు పొట్టచేత పట్టుకొని వలస వెళ్లిపోయారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఆ బాధలను తీర్చడంలో భాగంగానే తెలంగాణలోని చేనేత కార్మికులకు చేతినిండా పని కల్పించి దేశం గర్వించదగ్గ రీతిలో పరకాల నియోజకవర్గంలో కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్కును ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. గత బిఆర్ఎస్ ప్రభుత్వం వేలాది ఎకరాల భూమిని సేకరించి ఎన్నో విదేశీ కంపెనీలను కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్కుకు తీసుకురావడం జరిగిందని అన్నారు. ఇప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలకు విరక్తి చెంది ఎన్నో కంపెనీలు తరలిపోతున్నాయని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. పోచంపల్లి ఫౌండేషన్ ఆధ్వర్యంలో వరంగల్ జిల్లాలోని ఐదువేల మంది మహిళలకు కుట్టు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించి స్వశక్తితో ఉపాధి పొందేలా శిక్షణ ఇవ్వడం జరిగిందన్నారు. గత ప్రభుత్వానికి కాంగ్రెస్ ప్రభుత్వానికి ఉన్న తేడాను ప్రజలు గమనించి స్థానిక సంస్థల ఎన్నికల్లో టిఆర్ఎస్ పార్టీ పట్ల ఆకర్షితులవుతున్నారని కేటీఆర్ తెలిపారు. ఎంతోమంది రైతులు యూరియా బస్తాలు లేక ఇబ్బంది పడుతున్న విధానాన్ని చూసిన తరువాతనైనా బుద్ధి తెచ్చుకొని రైతులకు సకాలంలో యూరియాను అందించాలని ఆయన డిమాండ్ చేశారు.

**ప్రజలు తిరగబడతారు జాగ్రత్త**

పరకాల నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు చేస్తున్న విధానాలతో ఆ పార్టీపై ప్రజలు తిరగబడే రోజులు దగ్గరలోనే ఉన్నాయని మాజీ ఎమ్మెల్యే చల్ల ధర్మారెడ్డి విమర్శించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యేలు, మాజీ మంత్రులు టిఆర్ఎస్ రాష్ట్ర నాయకులు, జిల్లా నాయకులు, వివిధ కార్పొరేషన్ల చెందిన మాజీ కార్పొరేషన్లు పాల్గొన్నారు.

### ఇంటికి వెళ్తే తప్పేంటి?



సిఎం రమేష్ ఇంటికి కెటిఆర్ లేదా తాను వెళ్తే తప్పు ఏమిటని బిఆర్ఎస్ మాజీ మంత్రి జి.జగదీష్ రెడ్డి ప్రశ్నించారు. తాను ఒక మిత్రునిగా సిఎం రమేష్ ఇంటికి వెళ్ళానని అన్నారు. సిసి టివి ఫుటేజ్‌లు తీస్తే సిఎం రమేష్ తన జీవితకాలంలో ఎక్కువగా చంద్రబాబు, సిఎం రేవంత్ రెడ్డి ఇంట్లోనే ఉంటారన్నారు. హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో ఆదివారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాజీ ఎమ్మెల్యేలు గొంగిడి సునీత, ఫైళ్ల శేఖర్‌రెడ్డి, కూసుకుంట్ల ప్రభాకర్ రెడ్డి, బొల్లం మల్లయ్య యాదవ్, బూడిద భిక్షమయ్య గౌడ్, బిఆర్ఎస్ నేత చింతల వెంకటేశ్వర్ రెడ్డితో కలిసి జగదీష్ రెడ్డి మాట్లాడుతూ తమను భయపెడితేనే బిజెపిలోకి వెళ్లామని, తాము ఎప్పటికీ చంద్రబాబు మనుషులమేనని స్వయాన సిఎం రమేష్ చెప్పినట్టు వివరించారు. కవిత జైలుకు వెళ్తే బెయిల్ ఇవ్వాల్సింది కోర్టు అని, అలాంటప్పుడు కవిత అరెస్ట్ విషయంలో బిజెపిలో బిఆర్ఎస్‌ను విలీనం చేస్తామని కెటిఆర్ ఎలా చెబుతారని జగదీష్ రెడ్డి ప్రశ్నించారు. కంచె గచ్చిబౌలి భూముల విషయంలో బిజెపి ఎంపి మధ్యవర్తిత్వం వహించిన విషయాన్ని కెటిఆర్ ముందే చెప్పారన్నారు. ఒక పథకం ప్రకారమే బిజెపి, చంద్రబాబు నాయుడు, రేవంత్ రెడ్డి కలిసి డ్రామాలు ఆడుతున్నారని ఆరోపించారు. జైపాల్ రెడ్డికి ఉన్న మంచిపేరును తన ఖాతాలో వేసుకోవాలని రేవంత్ రెడ్డి ప్రయత్నం చేస్తున్నారన్నారు. బిజెపి తెలంగాణ రాష్ట్రానికి పనికొచ్చే పార్టీ కాదని, బిఆర్ఎస్, బిజెపి భావజాలం వేర్వేరుగా ఉంటుందన్నారు.

## బిఆర్ఎస్ నాయకులు డ్రామాలు ఆపండి

ఎంపి చామల కిరణ్‌కుమార్‌రెడ్డి



ప్రజాపక్షం/హైదరాబాద్: రాష్ట్రంలో కాంగ్రెస్‌ను బిఆర్ఎస్ నేతలు రాజకీయంగా ఎదుర్కోలేకనే ధైర్యం లేక డ్రామాలు ఆడుతున్నారని, ఇలాంటి డ్రామాలు ఆపాలని కాంగ్రెస్ ఎంపి చామల కిరణ్‌కుమార్‌రెడ్డి అన్నారు. బిఆర్ఎస్ నేతలు ముఖ్యంగా మాజీ మంత్రి జగదీష్‌రెడ్డి, ఎంఎల్‌ఎ పాడి కౌశిక్ రెడ్డిలు క్యారెక్టర్ ఆర్టిస్టుల మాదిరిగా వ్యవహరిస్తున్నారని వ్యాఖ్యానించారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి బిసిలకు 42 శాతం రిజర్వేషన్లు ఇచ్చేందుకు కృషి చేస్తూ దేశానికి ఆదర్శంగా నిలిచారని, రేవంత్‌రెడ్డితో మాజీ సిఎం కెసిఆర్‌ను పోల్చలేమన్నారు. కెసిఆర్ కంటే అనేక రెట్లు సిఎం రేవంత్‌రెడ్డి సామాజిక న్యాయం కోసం తెలంగాణ అభివృద్ధి కోసం పోరాడుతున్న నాయకుడని దేశమంతా గుర్తించిందన్నారు. కెటిఆర్‌కు స్వతంత్రంగా గుర్తింపు లేదని, గోబెల్స్ ప్రచారం చేయడంలో ఆయనకు ఆయనే సాటి అన్నారు. సిఎం రేవంత్ రెడ్డి మంత్రుల ఫోన్లు టాప్ చేస్తున్నారని జగదీశ్ రెడ్డి విమర్శించడంలో అర్థం లేదన్నారు.

## ఇంటికి వెళ్లారో లేదో? కెటిఆర్ చెప్పాలి

ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్



ప్రజాపక్షం/హైదరాబాద్: బిజెపిలో బిఆర్ఎస్ పార్టీ విలీనం కోసం సిఎం రమేశ్ ఇంటికి వెళ్లారో లేదో కెటిఆర్ చెప్పాలని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ప్రశ్నించారు. హైదరాబాద్ ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ కెటిఆర్ ఎలాంటి వ్యక్తి అనేది రాష్ట్ర ప్రజలు గమనించాలని అన్నారు. బిఆర్ఎస్‌ను బిజెపిలో విలీనం చేసేందుకు సిఎం రమేశ్ ఇంటికి వెళ్లారా, లేదా? అనే విషయంపై కెటిఆర్ స్పష్టంగా సమాధానం చెప్పాలన్నారు. 'కవితపై ఉన్న కేసులు ఎత్తివేస్తే బిజెపిలో బిఆర్ఎస్‌ను విలీనం చేస్తామని చెప్పారా, లేదా? బిఆర్ఎస్ ఒక అవినీతి పార్టీ అని, ఆ పార్టీని కలుపుకునేది లేదని బిజెపి అధిష్టానం చెప్పింది నిజం కాదా? పలు సామాజిక వర్గాలపై కెటిఆర్ తీవ్ర వ్యాఖ్యలు చేయలేదా? అని ఆయన నిలదీశారు. ఈ వ్యవహారాన్ని పక్కదారి పట్టించకుండా సిఎం రమేశ్ అడిగిన ప్రశ్నలకు కెటిఆర్ సమాధానం చెప్పాలన్నారు.

## కేటాయింపులు ఘనం - ఖర్చు పాక్షికం

గిరిజన సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు రామ్మూర్తి నాయక్

ఘనంగా ఖమ్మం జిల్లా ఏడవ మహాసభ



ప్రజాపక్షం/ఖమ్మం : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు గిరిజనులకు సంబంధించి బడ్జెట్‌లో కేటాయింపులు ఘనంగా చేస్తున్నా ఖర్చు మాత్రం చేయలేకపోతున్నారని చాలా సందర్భాల్లో గిరిజన బడ్జెట్‌ను ఇతర శాఖలకు మళ్లిస్తున్నారని తెలంగాణ గిరిజన సమాఖ్య రాష్ట్ర అధ్యక్షులు అజ్మీర రామ్మూర్తి నాయక్ ఆరోపించారు. ఆది నుంచి గిరిజనులకు కేటాయించిన బడ్జెట్‌ను పూర్తి స్థాయిలో ఖర్చు చేయకపోవడం శోచనీయమన్నారు. తెలంగాణ గిరిజన సమాఖ్య ఏడవ జిల్లా మహాసభ ఆదివారం ఖమ్మం గిరిప్రసాద్ భవన్‌లో జరిగింది. బోనోత్ భరత్, తేజావత్ కృష్ణ, అమరయ్య, బానోత్ జగన్, ఇర్పా సురేష్ అధ్యక్ష వర్గంగా వ్యవహరించిన మహాసభలో రామ్మూర్తి నాయక్ మాట్లాడుతూ స్వాతంత్ర్యం వచ్చిన దగ్గర నుంచి గిరిజనులకు ఏదో ఒక రూపంలో అన్యాయం జరుగుతూనే ఉందన్నారు. ఇచ్చిన హామీలను అమలు చేయడంలో పాలక వర్గాలు వివక్ష ప్రదర్శిస్తున్నాయన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీల్లో భాగంగా విద్య, ఉద్యోగ, ఉపాధి కల్పించాలని రామ్మూర్తి డిమాండ్ చేశారు. ఇప్పటికీ మౌలిక వసతులకు నోచుకోని అనేక గిరిజన గ్రామాలు ఉన్నాయని వెంటనే మౌలిక వసతులు కల్పించేందుకు నిధులు కేటాయించాలన్నారు. గిరిజనులు పోడు నరికి సాగు చేసుకుంటున్నారని పోడు సాగు చేసుకుంటున్న గిరిజనులందరికీ భూ హక్కు పత్రాలు అందజేయాలని, పాసు పుస్తకాలు జారీ చేసి రుణ సౌకర్యం కల్పించాలని రామ్మూర్తి కోరారు. మహాసభలో పేర్కొన్న డిమాండ్లకు అనుగుణంగా భవిష్యత్తు పోరాట కార్యక్రమాన్ని నిర్వహించాలని ఆయన కోరారు. ఈ సభలో సిపిఐ రాష్ట్ర కంట్రోల్ కమిషన్ ఛైర్మన్ మహ్మద్ మౌలానా, సిపిఐ జిల్లా కార్యదర్శి దండి సురేష్, సహాయ కార్యదర్శి జమ్ముల జితేందర్ రెడ్డి, జిల్లా కార్యవర్గ సభ్యులు శింగు నర్సింహారావు, జాగర్లమూడి రంజిత్, రామ్మూర్తి, బానోత్ బచ్చారావు, రిటైర్డ్ ఆర్డీవో నునావత్ పాండురంగా, బానోత్ రాంకోటి తదితరులు పాల్గొన్నారు.

**నూతన కమిటీ ఎన్నిక :**



ఏడవ మహాసభలో నూతన కమిటీని ఎన్నుకున్నారు. గౌరవాధ్యక్షులుగా నునావత్ పాండురంగా, అధ్యక్షులుగా నాగేశ్వరరావు, కార్యదర్శిగా జగన్, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా బోడా వీరన్న, ఆర్గనైజింగ్ కార్యదర్శిగా రాంబాబులు ఎన్నికయ్యారు.

## ఉప్పొంగిన గోదారమ్మ..!

ప్రమాదకర స్థాయిలో ప్రవాహం, భక్తులకు హెచ్చరికలు..



ప్రజాపక్షం/బాసర : నిర్మల్ జిల్లాలోని పవిత్ర పుణ్యక్షేత్రం బాసర వద్ద గోదావరి నది ప్రమాదకర స్థాయిలో ఉప్పొంగి ప్రవహిస్తోంది. గత వారం రోజులుగా తెలంగాణ, కర్ణాటక, మహారాష్ట్రల్లో కురుస్తున్న భారీ నుంచి అతి భారీ వర్షాలకు తోడు, ఎగువ ప్రాంతాల నుంచి వస్తున్న వరద నీటితో శనివారం నుంచి గోదావరి ప్రవాహం గణనీయంగా పెరిగింది. ఆదివారం నాటికి నది నిండుకుండలా మారి, అత్యంత వేగంగా ప్రవహిస్తోంది. ఈ పరిణామంతో బాసర సరస్వతి ఆలయానికి తరలివచ్చే భక్తులు, యాత్రికులు అప్రమత్తంగా ఉండాలని ఆలయ అధికారులు సూచించారు. నిర్మల్ జిల్లా కలెక్టర్, జిల్లా ఎస్పీ సూచనల మేరకు,అత్యవసరమైతే తప్ప ఇళ్ల నుంచి బయటికి రావద్దని, లోతట్టు ప్రాంతాలు ప్రజలు సురక్షిత ప్రాంతాలకు వెళ్లాలని సూచించారు.

## మిర్యాలగూడ సమగ్రాభివృద్ధే నా కర్తవ్యం



**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** మిర్యాలగూడ సమగ్రాభివృద్ధే తన ముందున్న కర్తవ్యమని ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి అన్నారు. ప్రధాన రహదారిపై పారిశుద్ధ్య కార్మికులు చేపడుతున్న స్పెషల్ డ్రైవ్ పనులను ఆదివారం ఆయన పరిశీలించి మాట్లాడారు. అన్ని రంగాల్లో మిర్యాలగూడను అగ్రస్థానంలో నిలిపేందుకు కృషి చేస్తున్నామన్నారు. అందుకు అన్ని వర్గాల ప్రజల సహకారం అవసరమన్నారు. ప్రజలకు తాగునీరు, డ్రైనేజీ, వీధి దీపాల కల్పనకు ప్రత్యేక చర్యలు చేపడుతున్నామన్నారు. ప్రజలు వ్యర్థాలను ఆరుబయట వేయవద్దని సూచించారు. డెంగ్యూ, మలేరియా, టైఫాయిడ్ విష సర్పాల బారిన పడకుండా ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు.

## మహాసభలకు వేలాదిగా తరలుదాం



**ప్రజాపక్షం/ఆలేరు :** ఈనెల 29న వలిగొండలో జరిగే యాదాద్రి భువనగిరి జిల్లా సిపిఐ నాలుగోవ మహాసభలను జయప్రదం చేయాలని సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు చెక్క వెంకటేష్ పిలుపునిచ్చారు. ఆదివారం ఆలేరు పట్టణంలో జరిగిన ఆ పార్టీ సమావేశం పోతు ప్రవీణ్ అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. మహాసభలలో యాదాద్రి జిల్లాలో నెలకొన్న సమస్యలపై ప్రణాళిక తయారుచేసి సమస్యల పరిష్కారం కై ఉద్యమిస్తామన్నారు. మహాసభలకు మీలాదిగా తరలి వెళ్లి విజయవంతం చేయాలని ఆయన కోరారు. ఈ సమావేశంలో బుజ్జి శంకరయ్య, పోతే భవాని, యాట ఉపేందర్, యాదమ్మ, ఉన్న బోయిన రవి, సరిత,మహేందర్, ప్రశాంతం ఉన్నారు.



## రేషన్‌కార్డుల పంపిణీ నిరంతర ప్రక్రియ

### మాజీ మంత్రి గుంటకండ్ల జగదీష్‌రెడ్డి

**ప్రజాపక్షం/సూర్యాపేటకలెక్టరేట్:** రేషన్‌కార్డుల పంపిణీ నిరంతర ప్రక్రియ అని మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీష్‌రెడ్డి అన్నారు. గత ఉమ్మడి రాష్ట్రంలో కార్డుదారులకు కేవలం నాలుగు కిలోల బియ్యంమాత్రమే అందేవనిన్నారు. తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం ఏర్పడిన తర్వాత తమ కెసిఆర్ పాలనలో రాష్ట్ర వ్యాప్తంగా 6.47 లక్షల కార్డులను పంపిణీ చేసి, ప్రతి లబ్ధిదారునికి ఆరుకిలోల బియ్యం అందజేయడం జరిగిందన్నారు. ఆదివారం సూర్యాపేట జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలో లబ్ధిదారులకు నూతన రేషన్‌కార్డులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రేషన్‌కార్డు దారులు ఎక్కడ ఉంటే అక్కడ రేషన్ తీసుకునే వెసులుబాటు కూడా తమ ప్రభుత్వంలో కల్పించిందన్నారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను నేరవేర్చాల్సిన బాధ్యత పాలకులపై ఉందన్నారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ముందు ఇచ్చిన హామీలన్ని అమలు చేస్తే ప్రభుత్వాన్ని తప్పక అభినందిస్తామన్నారు. మహిళలకు రూ. 2500 మహాలక్ష్మి పథకం ద్వారా అందిస్తామని చెప్పి ఎందుకు ఇవ్వలేదని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. రైతు రుణమాఫీ కూడా పూర్తిస్థాయిలో చేయలేదన్నారు. రైతుబంధు రెండుసార్లు ఎగొట్టారని అన్నారు. నిరుద్యోగబృతి, మహిళలకు స్కూటీలు ఇవ్వాలన్నారు. జిల్లా కలెక్టర్ తేజస్‌నందలాల్ పవార్, తెలంగాణ పర్యాటక అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ పటేల్ రమేష్‌రెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ వంగవీటి రామారావు, సూర్యాపేట వ్యవసాయ మార్కెట్ చైర్మన్ కొప్పుల వేణారెడ్డి లు మాట్లాడుతూ నూతన రేషన్‌కార్డు దారులు ప్రభుత్వం అందజేసిన కార్డుల ద్వారా సన్నబియ్యం పొంది తమ ఆకలి తీర్చుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ పి.రాంబాబు, సూర్యాపేట వ్యవసాయ మార్కెట్ వైస్ చైర్మన్ గట్టు శ్రీనివాస్, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షులు అంజద్‌అలీ పాల్గొన్నారు.

## రుచి కరమైన ఆహారాన్ని పెడుతున్నారా?

### గిరిజన కళాశాల వసతిగృహన్ని తనిఖీ చేసిన కలెక్టర్



**ప్రజాపక్షం/యాదాద్రి :** భువనగిరి పట్టణంలోని గిరిజన కళాశాల వసతిగృహన్ని యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ హనుమంత రావు ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆదివారం గిరిజన కళాశాల వసతి గృహాన్ని సందర్శించి హాస్టల్ గల వంటశాల గదిని పరిశీలించారు. వంట సామగ్రిని శుభ్రంగా కడిగి వండాలన్నారు. వంటకు అవసరమైన రేషన్ సరుకులను పరిశీలించారు. నాణ్యమైన సరుకులనే వాడాలన్నారు. వండిన ఆహారాన్ని పరిశీలించడం జరిగింది. మెనూ ప్రకారం విద్యార్థులకి అందించే భోజనం పరిశీలించారు. విద్యార్థులతో కలెక్టర్ మాట్లాడుతూ రుచి కరమైన ఆహారాన్ని పెడుతున్నారా లేదా అని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. మీ హాస్టల్‌లో ఏమైనా సమస్యలు ఉన్నాయా అని ఏమైనా సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకురావాలన్నారు. మెనూ ప్రకారం నాణ్యమైన భోజనాన్ని అందించాలని సంబంధిత అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## పచ్చని చెట్లు ప్రగతికి మెట్లు



**ప్రజాపక్షం/సూర్యాపేట :** పచ్చని చెట్లే ప్రగతికి మెట్లని సూర్యాపేట వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కొప్పుల వేణారెడ్డి అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని మార్కెట్ యార్డులో శ్రీ సత్య సాయి యూత్ ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రేమతరవు (మొక్కలు) నాటే కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని, మార్కెట్ సెక్రటరీ ముక్రంతో కలిసి మొక్కలు నాటి మాట్లాడారు. కోట్ల రూపాయలతో ప్రభుత్వాలు మొక్కలు నాటుతున్న వాటిని పరిరక్షించడం అధికారులు, ప్రజలందరి బాధ్యత అన్నారు. మానవునికి కావలసిన ఆక్సిజన్ తో పాటు, ఆరోగ్యాలను కూడా మొక్కల ద్వారా అందింపబడుతుందని, అదేవిధంగా ఆ ప్రాంతం కూడా అన్ని విధాల బావుంటుందన్నారు. ఈ కార్యక్రమంలో సత్యసాయి జిల్లా అధ్యక్షులు వంకాయల సుబ్బారావు, జిల్లా యూత్ కోఆర్డినేటర్ శర్విరాల రాంబాబు, కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు అంజద్ అలీ, నాయకులు మల్లేష్, వాసు, సాయినేత, మార్కెట్ కమిటీ సభ్యులు, సేవాసమితి సభ్యులు పాల్గొన్నారు.

## ఆశావహులకు రిజర్వేషన్లు కలిసొచ్చేనా...

### ఎన్నికల నోటిఫికేషన్ కోసం ఎదురుచూపులు

**ప్రజాపక్షం/గుండాల :** యాదాద్రి భువనగిరి జిల్లా గుండాల మండలంలో ఎంపిటిసి, జడ్పిటిసి, సర్పంచ్‌లకు పదవి కాలం సర్పంచ్‌లకు 2024 ఫిబ్రవరిలో, జెడ్పిటిసి, ఎంపిటిసిలకు 2024 జూలైలో పదవి కాలం ముగిసింది. దీంతో గ్రామాలలకు అప్పటి నుండి ఇప్పటి వరకు స్పెషల్ అధికారుల పాలన కొనసాగుతుంది. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం సర్పంచ్, ఎంపిటిసిల పదవి కాలం ముగిసిన ఎన్నికలు నిర్వహించకుండా సంవత్సరం పాటు అధికారుల పాలన కొనసాగిస్తుంది. రాష్ట్రంలో సెప్టెంబర్ నెల కల్లా స్థానిక ఎన్నికలు నిర్వహించాలని కోర్టు తీర్పు ఇవ్వడంతో మండలంలో సర్పంచ్‌లకు, ఎంపిటిసిల స్థానాలకు పోటీ చేసే రాజకీయ నాయకులు ఓటర్లను, కుల సంఘాల నాయకులను, ఊర్లో ఉండే పెద్ద మనుషులను ఈసారి తమకు సపోర్ట్ చేయాలని తనను గెలిపించాలని మచ్చికల పర్వం సాగుతుంది. అందులో భాగంగా గత ఎన్నికల్లో ఓడిపోయిన అభ్యర్థులు ఈసారి గెలిపించాలని, గతంలో గెలిచిన అభ్యర్థులు ఊరిని అభివృద్ధి చేశానని మరోసారి నాకే అవకాశం కల్పించాలని కోరుకుంటున్నా రు. గతంలో రిజర్వేషన్లు అనుకూలించని నాయకులు, కొత్తగా పోటీ చేసే నాయకులు కూడా మాకు సపోర్టు చేయాలని ఓటర్లను వేడుకుంటున్నారు. రేపో, మాపో ఎన్నికల నోటిఫికేషన్ వస్తుందని ఆశతో ఆశావాహులు ఎదురుచూస్తున్నారు. ఆ తర్వాత ఆయా గ్రామాలకు వచ్చే రిజర్వేషన్లతో ఆశావాహులకు అవకాశం కలిసి వచ్చేనా వేచి చూడాల్సిందే..

# గత ప్రభుత్వం ఒక్క రేషన్ కార్డూ ఇవ్వలే

### ఎస్‌సి, ఎస్‌టి, మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్

### పోలేపల్లిలో నూతన రేషన్ కార్డుల పంపిణీ




**ప్రజాపక్షం/చందంపేట:** నల్లగొండ జిల్లా చందంపేట మండలం దేవరకొండ నియోజకవర్గంలో షెడ్యూల్ కులాలు, తెగలు, అల్పసంఖ్యాక వర్గాల ప్రజల సంక్షేమానికి తన వంతుగా ఎక్కువ నిధులు అందించి సహకరిస్తానని, నల్గొండ జిల్లా ఇంచార్జీ మంత్రి, రాష్ట్ర ఎస్సి, ఎస్టి, మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ తెలిపారు. ఆదివారం దేవరకొండ నియోజకవర్గంలోని చందంపేట మండలం పోలేపల్లిల్లో లబ్దిదారులకు నూతన రేషన్ కార్డులను పంపిణి చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎంఎల్‌ఎ బాలునాయక్ కోరిన విధంగా గిరిజన ప్రాంతాల అభివృద్ధికి, రోడ్ల అభివృద్ధికి, ఎస్‌సి, ఎస్టి సబ్ ప్లాన్ నిధులు కేటాయించి తన వంతు సహకారాన్ని అందిస్తానని తెలిపారు. గత ప్రభుత్వం ఒక్క రేషన్ కార్డు ఇవ్వలేదని, అలాంటిది తమ ప్రభుత్వం రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాయకత్వంలో రాష్ట్రంలో అర్హులైన ప్రతి పేదకు రేషన్ కార్డు ఇవ్వడం జరుగుతుందని, సన్న బియ్యం, ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణానికి రూ. 5లక్షలు,మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, 200యూనిట్ల ఉచిత విద్యుత్ అమలు ఘనత తమదేఅని అన్నారు. తమ ప్రభుత్వంలో ఎస్టీ వర్గీకరణతో పాటు, బిసిలకు 42 శాతం రిజర్వేషన్‌కు సిఫారస్ చేయడం జరిగిందని, ఎక్కడా లేని విధంగా కులగణన చేశామని, రాష్ట్ర ప్రభుత్వం పేద ప్రజలకు అమలు చేస్తున్న కార్యక్రమాలు పేదలకే చేరాలని తెలిపారు. తన మంత్రిత్వ శాఖల ద్వారా తప్పనిసరిగా నియోజకవర్గానికి ఎక్కవ నిధులను ఇచ్చేందుకు కృషి చేస్తానని మంత్రి తెలిపారు. అనంతరం ఎంఎల్‌ఎ బాలునాయక్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం పేద ప్రజల సంక్షేమానికి అనేక కార్యక్రమాలు అమలు చేస్తుందని అందులో భాగంగానే నియోజకవర్గానికి ఇప్పటి వరకు కొత్తగా 11,736 రేషన్ కార్డులను ఇవ్వడం జరిగిందని, రేషన్ కార్డులలో 15,837 మందిని సభ్యులుగా చేర్చి వారందరికి సన్న బియ్యాన్ని ఇవ్వనున్నామని తెలిపారు. ఈ ప్రాంత చిర కాల వాంఛ అయిన ఎస్‌ఎల్‌బిసి, డిండి ప్రాజెక్టులను పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటామని, ఇతర నియోజకవర్గాలతో సమానంగా దేవరకొండను అభివృద్ధి చేస్తానని తెలిపారు. దేవరకొండ నియోజకవర్గానికి ఎస్సి, ఎస్టి సబ్ ప్లాన్ నిధులు ఎక్కువ కేటాయించాలని, రహదారులు లేని తండాలకు రహదారులకు నిదులు మంజూరు చేయాలని, మైదాన ప్రాంతంలో ఐటిఏ ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని మంత్రిని విజ్ఞప్తి చేశారు. అనంతరం ఎంఎల్‌సి శంకర్ నాయక్ మాట్లాడుతూ తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక 1800కోట్లతో డిండి ప్రాజెక్టును చేపట్టడం జరిగిందని, దేవరకొండ సర్వతోముఖాభివృద్ధికి కృషి చేస్తామని, భూ భారతి, బిసి కులగణన చేపట్టామని, దేవరకొండ లాంటి వెనుకబడిన ప్రాంత అభివృద్ధికి అందరూ సహకారం అందించాలని కోరారు. జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి మాట్లాడుతూ రేషన్ కార్డులు నిరంతర ప్రక్రియ అని, చనిపోయిన వారి పేర్లను రేషన్ కార్డుల్లో నుండి తొలగించే విధంగా స్వచ్ఛందంగా ముందుకు వచ్చి తెలపాలని కోరారు. సన్న బియ్యం పంపిని విషయంలో చౌకధరల దుకాణా డీలర్లు పారదర్శకంగా ఉండాలని, ఈ విషయంలో ఎలాంటి ఆరోపణలున్న తమ దృష్టికి తీసుకురావాలని ప్రజలకు సూచించారు. అన్ని ప్రభుత్వ పథకాలు పొందేందుకు ముఖ్యంగా హెల్త్ ఇన్సూరెన్స్ పథకాన్ని పొందేందుకు రేషన్ కార్డు తప్పనిసరి అని అన్నారు. రెవెన్యూ అదనపు కలెక్టర్ శ్రీనివాస్ మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా ఇప్పటివరకు 62,155 కొత్త రేషన్ కార్డులు జారీ చేశామని, అంతేకాక 80,201 మందిని రేషన్ కార్డులలో కొత్తగా సభ్యులుగా చేర్చడం జరిగిందని తెలిపారు? ఈకార్యక్రమంలో జిల్లా పౌరసరఫరాల అధికారి వెంకటేశం, పౌరసరఫరాల జిల్లా మేనేజర్ హరీష్, గృహ నిర్మాణ శాఖ పీడి రాజ్‌కుమార్, గిరిజన సంక్షేమ అధికారి చత్రు, జిల్లా సంక్షేమ అధికారి కృష్ణవేణి, ఆర్డీవో రమణా రెడ్డి, తహాశీల్దార్ శ్రీధర్‌బాబు, ఎంపిడివో లక్ష్మి, సాంఘీక సంక్షేమ శాఖ డిడి శైలజ పాల్గొన్నారు.



## నేత్రదానానికి అనూహ్యస్పందన

**ప్రజాపక్షం/ నల్లగొండ టౌన్ :** నల్లగొండ జిల్లా కనగల్ మండలం అమ్మగూడెంకి చెంది న మాచర్ల రాములు ఆదివారం మృతి చెందారు. ఈవిషయము తెలిసిన వెంటనే వీరి కుటుంబ సభ్యులు నరసింహ,బుజ్జమ్మ లను లయన్స్ క్లబ్ చారిటబుల్ ట్రస్ట్ ఐ డొనేషన్ సెంటర్ కోఆర్డినేటర్ చంద్రశేఖర్ చిరునోముల సంప్రదించి నేత్ర దానం విశిష్టతను దాని యొక్క ఆవశ్యకతను వివరించగా వీరి అంగీకారంతో నేత్రదాన సేకరణ చేశారు. ఐ డొనేషన్ సెంటర్ చైర్మన్ లయన్ కె వి ప్రసాద్,డాక్టర్ హరనాథ్,మేనేజర్ డాక్టర్ పుల్లారావులు మాట్లాడుతూ కుటుంబ సభ్యులను కోల్పోవడం ఎంతో బాధాకరమైనప్పటికీ ఈ విషాద సమయంలో కూడా నేత్రదానానికి ముందుకు వచ్చిన వీరి కుటుంబ సభ్యులను అభినందించారు.తమ ఐ డొనేషన్ సెంటర్ ఆధ్వర్యంలో ఇది 155వ నేత్రదానం అని, వీటి ద్వారా సేకరించిన 310 కార్నియా అనుకంటే పొరల ద్వారా 310 మంది కార్నియల్ అంధులకు కంటిచూపును అందించగలిగామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఐ డొనేషన్ సెంటర్ సభ్యులు డాక్టర్ ప్రనూష, డాక్టర్ నితీష, శ్రీమతి ఏచూరి శైలజ, కోట సరిత, ఇండియన్ మెడికల్ అసోసియేషన్ సభ్యులు డాక్టర్ దామర యాద య్య, డాక్టర్ కొనకంచి విజయ్ కుమార్, డాక్టర్ ప్రవీణ్, డాక్టర్ దైవాదినం పాల్గొన్నారు.

## ప్రశాంతంగా లైసెన్స్, సర్వేయర్, గ్రామ పరిపాలన అధికారుల పరీక్షలు




సూర్యాపేట జిల్లా కలెక్టర్ తేజస్‌నందలాల్ పవార్

**ప్రజాపక్షం/సూర్యాపేటటౌన్:** ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా రూపొందించిన భూభారతి చట్టం అమల్లో భాగంగా అధికార వికేంద్రీకరణ ధ్యేయంగా గ్రామాల్లో భూ సమస్యలను పరిష్కరించుట కోసం లైసన్స్ సర్వేయర్ గ్రామానికి ఒక రెవెన్యూ అధికారిని నియమించేందుకు నిర్వహించిన పరీక్షలలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఆదివారం ప్రశాంతంగా ముగిసాయని జిల్లా కలెక్టర్ తేజస్‌నందలాల్ పవార్ అన్నారు. పట్టణంలోని సూర్యపేటలోని ఎస్‌వి డిగ్రీ కళాశాలలో జరిగిన లైసన్స్ సర్వేయర్, గ్రామ పరిపాలన అధికారి పరీక్షల కేంద్రంను జిల్లా అదనపు కలెక్టర్ పి.రాంబాబుతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ లైసన్స్ సర్వేయర్ పరీక్షకి 238 మందికి గానూ 195 మంది హాజరయ్యారని, 43 మంది గైర్హజరయ్యారని, గ్రామ పరిపాలన అధికారి పరీక్షకి 80 మందికి గానూ 77 మంది హాజరయ్యారని, ముగ్గురు గైర్హజర్ అయ్యారని తెలిపారు. ఈ కార్యక్రమంలో డిఆర్‌డిఎ పిడి వివి అప్పారావు, ఎస్‌డిఎస్‌ఎల్ శ్రీనివాసరెడ్డి, ఆర్డీవో వేణుమాదవరావు, సూపరిండెంట్ సంతోష్, కిరణ్, తహసిల్దార్ కృష్ణయ్య, కళాశాల ప్రిన్సిపాల్ వెంకటేశ్వర్లు, అధికారులు పాల్గొన్నారు.

### లైసెన్సెడ్ సర్వేయర్ పరీక్షా కేంద్రం తనిఖీ చేసిన కలెక్టర్

**ప్రజాపక్షం/యాదాద్రి :** గ్రామ పాలన అధికారి, లైసెన్సెడ్ సర్వేయర్ పరీక్షా కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ హనుమంత రావు తనిఖీ చేశారు. ఆదివారం నిర్వహిస్తున్న గ్రామ పాలన అధికారులు, లైసెనన్స్డ్ సర్వేయర్ల నియామకం కోసం భువనగిరి జిల్లా కేంద్రం లోని ( వెన్నల కాలేజీ ఆవరణలో గల ) భువనగిరి కాలేజీ అఫ్ ఎడ్యుకేషన్, అనంతారంలో నిర్వహిస్తున్న పరీక్షా కేంద్రాన్ని కలెక్టర్ తనిఖీ చేశారు. పరీక్షల నిర్వహణ తీరును పరిశీలించారు. అభ్యర్థుల హాజరు వివరాలు అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా, పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని కలెక్టర్ సూచించారు. ఉదయం 10.00 గంటల నుండి మధ్యాహ్నం 1.00 గంట వరకు కొనసాగిన గ్రామ పాలన అధికారి పరీక్షకు 37 మంది అభ్యర్థులకు గాను, 34 మంది హాజరయ్యారని, 3 మంది గైర్హాజరు అయినట్లు కలెక్టర్ తెలిపారు. లైసెనస్డ్ సర్వేయర్ల పరీక్షకు సంబంధించి ఉదయం సెషన్ లో 10.00 గంటల నుండి మధ్యాహ్నం 1.00 గంట వరకు జరిగిన పరీక్షకు 145 మంది అభ్యర్థులకు గాను 139 మంది హాజరయ్యారని, 6 మంది గైర్హాజరు అయినట్లు తెలిపారు. లైసెన్సెడ్ సర్వేయర్ అభ్యర్థులకు మధ్యాహ్నం 2.00 గంటల నుండి సాయంత్రం 5.00 గంటల వరకు జరిగే పరీక్షను కూడా కట్టుదిట్టంగా నిర్వహించాలని కలెక్టర్ అధికారులకు సూచించారు. కలెక్టర్‌తో పాటు రెవెన్యూ అదనపు కలెక్టర్ వీరారెడ్డి, అడ్మినిస్ట్రేషన్ అధికారి జగన్మోహన్ ప్రసాద్, మధుసూదన్ రెడ్డి, శ్యాంసుందర్ రెడ్డి, శ్యాంసుందర్ సంబంధిత అధికారులు పాల్గొన్నారు.



### రెండు పరీక్షలు ప్రశాంతం

**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్ :** జిల్లా కేంద్రంలో ఆదివారం నిర్వహించిన గ్రామ పాలనాధికారులు, లైసెన్స్ సర్వేయర్ల పరీక్షలు ప్రశాంతంగా నిర్వహించినట్లు జిల్లా ఇన్చార్జి రెవెన్యూ అధికారి, నల్గొండ ఆర్ డి ఓ వై.అశోక్ రెడ్డి తెలిపారు. జిల్లా కేంద్రంలోని ఎన్జీ కళాశాలలో నిర్వహించిన ఈ రెండు పరీక్షల వివరాలను పర్యవేక్షించడం జరిగిందని, లైసెన్స్ సర్వేయర్ల పరీక్షకు 378 మంది హాజరు కావలసి ఉండగా, 300 మంది హాజరయ్యారని, 78 మంది గైరాజరైనట్లు తెలిపారు. గ్రామ పాలనా అధికారుల పరీక్షకు 129 మందికి గాను 110 మంది హాజరుకాగా, 19 మంది గైర్హాజరయ్యారని ,పరీక్షల సందర్భంగా ఏలాంటి సంఘటన చోటు చేసుకోలేదని, పరీక్షలు ప్రశాంతంగా నిర్వహించినట్లు వెల్లడించారు.






## ఏం కొనేటట్లు లేదు? ఏం తినేటట్లు లేదు..

### జీతాలు లేక విలవిలడుతున్న పారిశుద్ధ్య కార్మికులు

**ప్రజాపక్షం/నందికొండ:** గత మూడు నెలలుగా జీతాలు లేక పోవడంతో పండుగ సమయంలో చేతిలో డబ్బులు లేక నందికొండ మున్సిపాలిటీ పొరుగు సేవల పారిశుధ్య కార్మికులు జీతాలు అందక విలవిల లాడుతున్నారు.దీనికి సంబంధించి పారిశుద్ధ్య కార్మికులు గతంలో చాలాసార్లు కలెక్టర్‌ను కలిసి వినతి పత్రాన్ని కూడా అందించమన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమకు ఇచ్చే అరకొర జీతాలను కూడా ప్రభుత్వం ప్రతి నెల ఇవ్వటం లేదని అప్పులతో కుటుంబాలను నెట్టుకొస్తున్నామని, ప్రతిరోజు క్రమం తప్పకుండా కష్టపడి రిస్కు తీసుకొని పనిచేస్తున్నా కానీ ప్రభుత్వం జీతం ఇవ్వడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.ఇలా కొన్ని నెలలుగా జీతాలు ఇవ్వకపోతే తమ కుటుంబ పోషణ ఎలా జరుగుతుందని ఇదే పరిస్థితి కొనసాగితే మా బ్రతుకులు ఆగమ్య గోచరంగా మారతాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.సంవత్సరాల తరబడి కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులతో ప్రభుత్వం రెగ్యులర్ ఉద్యోగుల కంటే ఎక్కువగా పని చేయించుకుంటున్నా ఆ స్థాయి జీతాలు ఇవ్వక కాకపోయినా తమకు వచ్చే అరకొర జీతాలు కూడా ఇవ్వకపోతే ఎలా బతకాలని అంటున్నారు .సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలి అన్న సుప్రీంకోర్టు ఆదేశాలు ఏ ప్రభుత్వ శాఖలు అమలు చేయడం లేదని అన్నారు.

## సఫాయి కార్మికులకు గుర్తింపుకార్డులివ్వాలి

**ప్రజాపక్షం/గుండాల:** సఫాయి కార్మికుల సమస్యలపై రాష్ట్ర ప్రభుత్వం, అధికారులు దృష్టి సారించి సఫాయి కార్మికులకు గుర్తింపు కార్డులను, ఈపిఎఫ్ సౌకర్యాలను అందించాలని సఫాయి కార్మికుల సంఘం జేఏసి నాయకులు, గ్రామపంచాయతీ వర్కర్ బుడిద రాములు ప్రభుత్వాన్ని, అధికారులను కోరారు. ఆదివారం గుండాల మండల పరిధిలోని మర్రిపడిగ గ్రామంలో ఆయన మాట్లాడుతూ సఫాయి కార్మికులు సేఫ్టీ కిట్స్, మాస్కులు, సబ్బులు, ఆయిల్, షూ, గ్లౌజులు, యూనిఫాంలు తదితర సామాగ్రిని అందించాలని, సఫాయి కార్మికుల సమస్యలను పరిష్కరించాలని, అపరిశుభ్ర వాతావరణంలో పనిచేస్తున్న సఫాయి కార్మికులకు సంవత్సరంలో రెండు సార్లు వైద్య పరీక్షలు నిర్వహించి, అవసరమైన వైద్య చికిత్సలను అందించాలని, సఫాయి కార్మికుల సంక్షేమానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందిస్తున్న సంక్షేమ పథకాలను అందే విధంగా చర్యలు తీసుకోవాలని, అన్ని ప్రభుత్వ కార్యాల యాలలో నియమించి ఉపాధి లభించేలా చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.

## తల్లిదండ్రుల రుణం తీర్చలేనిది

### కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్



**ప్రజాపక్షం/సూర్యాపేట :** తల్లిదండ్రుల రుణం తీర్చలేనిదని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ తల్లిదండ్రుల దినోత్సవం సందర్భంగా తెలిపారు.ఈ సందర్భంగా కలెక్టర్ అందరికి తల్లిదండ్రుల దినోత్సవం శుభాకాంక్షలు తెలుపుతూ ఈ సాంకేతిక యుగంలో తల్లిదండ్రులు అందరు పిల్లల్ని చదివించాలనే, వారు ఆరోగ్యంగా ఉండే విధంగా పోషకాహారం అందించాలనే తల్లిదండ్రులకి కోరిక ఉంటుందని ఆ విషయంలో తల్లిదండ్రుల కృషి ఎంతగానో ఉంటుందని తెలిపారు.పిల్లలను భావి పౌరులుగా తయారు చేయడంలో తల్లిదండ్రుల కృషి ఎంతగానో ఉంటుందని,వారి రుణం తీర్చలేనిదని ఈ విషయం లో ప్రతి ఒక్కరు తల్లిదండ్రులకి శిరస్సు వంచి నమస్కరించాలని అన్నారు.పిల్లల చదువు బాగుందా లేదా తల్లిదండ్రులు కూడా తమ పిల్లలు ఎలా చదువుతున్నారని, పిల్లల హోం వర్క్ ను ఇంటి వద్ద చేస్తున్నారా లేదా,తరగతి గదిలో మంచిగా ఉంటున్నారా లేరా అని ప్రత్యేక దృష్టి పెట్టాలని కోరినారు. ఇంటర్, డిగ్రీ చదివే పిల్లలు మత్తు పదార్థాలు లాంటి వాటికి అలవాటు పడి వారి జీవితాలను నాశనం చేసుకుంటున్నారని కొన్ని సందర్భాలలో మనం చూస్తున్నామని, అలాంటి వాటికి సంబంధించి తల్లిదండ్రులు కూడా అప్రమత్తంగా ఉండాలని, అలాగే యువత కుడా తల్లిదండ్రుల ఆశయాలను సాధించి జిల్లాకి తెలంగాణ రాష్ట్రానికి భారతదేశానికి మంచి పేరు తెచ్చే విధంగా ఎదగాలని అన్నారు.పిల్లల కి ఇష్టమైన రంగాలలో స్థిరపడేలా తల్లిదండ్రులు ప్రోత్సహించాలని, వచ్చే రోజుల్లో పిల్లల వారి జీవితంలో స్థిరపడితే తల్లిదండ్రులు కుడా చాలా సంతోషంగా ఉంటారని, అప్పుడు తల్లి తండ్రుల కష్టానికి సార్థకత ఏర్పడుతుందని కలెక్టర్ ఈ సందర్భంగా తెలిపారు.


## ఇన్‌స్టాగ్రామ్‌లో పరిచయం.. ప్రియుడితో జంప్‌కు యత్నం!

### నల్లగొండ బస్టాండ్‌లో కన్న బిడ్డను వదిలి వెళ్ళిన తల్లి

### వెంటనే స్పందించి బాలుడిని రక్షించిన పోలీసులు




**ప్రజాపక్షం/నల్లగొండ :** కనికరం లేకుండా కన్న బిడ్డనే వదిలి వెళ్లిన ఓ హృదయవిదారక ఘటన ఆదివారం నల్లగొండ బస్టాండ్‌లో చోటు చేసుకుంది.ప్రియుడి మోజులో పడిన ఓ మహిళ తన కొడుకును బస్టాండ్ లో వదిలేసి ప్రియుడితో జంప్ అయ్యింది. ప్రయాణికులు బాబును గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. నల్లగొండ టూ టౌన్ ఎస్ఐ సైదులు తెలిపిన వివరాల ప్రకారం నల్లగొండ జిల్లా కేంద్రంలోని ఆర్‌టిసి బస్టాండ్‌లో ఓ మహిళ 15 నెలల బాబును వదిలేసి వేరే యువకుడితో బైక్ మీద వెళ్లింది. పట్టణంలోని పాతబస్తీకి చెందిన ఒక యువకుడితో హైద్రాబాద్‌కు చెందిన నవీన అనే మహిళ ఇన్ స్టాగ్రామ్ లో పరిచయం అయ్యింది. నవీనకు పెళ్లి అయ్యి 15 నెలల బాబు ధనుష్ ఉన్నాడు. ఈ క్రమంలోనే భర్తను,15 నెలల కొడుకును వదిలేసి ప్రియుడితో వెళ్లేందుకు ప్లాన్ వేసింది. డైరెక్ట్‌గా నల్లగొండ ఆర్‌టిసి బస్టాండ్‌కు బాబుతో పాటు వచ్చి ఆ బాబును బస్టాండ్ లోనే వదిలేసి వెళ్ళింది. ఆ తర్వాత బాలుడు తల్లి కోసం వెతుకుతూ ఏడవడం చూసిన ప్రయాణికులు, డిపో సిబ్బంది నల్లగొండ టూ టౌన్ పోలీసులకు సమాచారం ఇచ్చారు. టూటౌన్ ఎస్ఐ సైదులు వెంటనే స్పందించి స్టేషన్ లోని సిబ్బందిని ఆర్‌టిసి బస్టాండ్ కు పంపారు. పోలీసులు బస్టాండ్ లోని అన్ని సీసీ కెమెరాల ఫుటేజీని పరిశీలించగా బైక్ మీద వెళుతున్న ఓ మహిళ వీడియోను చూసి ఆ బాలుడు మమ్మీ అంటూ గుర్తించాడు.ఆ బైక్ నెంబర్ ప్లేట్ ఆధారంగా విచారణ చేపట్టిన పోలీసులకు బైకు యజమాని నుంచి అతని స్నేహితుడు బైక్ తీసుకెళ్లినట్లు తేలింది.. అటువైపుగా విచారణ చేపట్టగా ఇంస్టాగ్రామ్ లో ఒక యువకుడు పరిచయమై భర్తను పిల్లాడిని వదిలేసి మహిళ వెళ్లేందుకు చేసిన ప్రయత్నమేనని పోలీసుల విచారణలో బయటపడింది. అనంతరం మహిళను,ఆమె ఇన్ స్టాగ్రామ్ ప్రేమికుడిని ఆమె భర్తను పోలీస్ స్టేషన్ కి పిలిపించి వారితో సుదీర్ఘ కౌన్సిలింగ్ నిర్వహించి, చట్టబద్ధంగా బాలుడిని తిరిగి తండ్రికి అప్పగించా రు. నల్లగొండ టూ టౌన్ ఎస్ఐ సైదులు గౌడ్, పోలీసు సిబ్బంది పనితీరుపై జిల్లా ప్రజానీకం హర్షం వ్యక్తం చేశా రు. ఈ ఘటన స్థానికంగా తీవ్ర కలకలం రేపింది. ప్రియుని కోసం ము క్కు పచ్చలారని చిన్నారిని నిర్ధాక్షిణ్యంగా బస్టాండ్లో వదిలి వెళ్ల డం ఏమిటని సదరు మహిళపై నెటిజన్స్ దుమ్మెత్తిపోస్తున్నారు.



# జాతీయం
NATIONAL & GENERAL NEWS

## ధన్‌ఖడ్ రాజీనామాపై మాకేమీ తెలియదు : ఖర్గే



న్యూఢిల్లీ : జగ్‌దీప్ ధన్‌ఖడ్ ఉపరాష్ట్రపతి పదవికి రాజీనామా చేయడానికి అసలు కారణం ఏమిటో తనకు తెలియదని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే అన్నారు.రాజీనామా విషయం ధన్‌ఖడ్, ప్రధాన మంత్రి నరేంద్ర మోదీకి మధ్యే ఉన్నందున నిజంగా ఏమి జరిగిందో మాజీ ఉపరాష్ట్రపతే చెప్పాల్సి ఉందని ఆయన అన్నారు. ఆదివారం ఖర్గే కర్నాటకలోని విజయ్‌పురలో మీడియాతో మాట్లాడారు. ధన్‌ఖడ్ ఎల్లప్పుడూ ప్రభుత్వం వైపు ఉండేవారని పేర్కొంటూ, రాజ్యసభలో ప్రతిపక్ష నాయకుడు ప్రతిపక్షం రైతులు, పేదల గురించి, విదేశాంగ విధాన సమస్యలపై, ఇతర అంశాలు లేవనెత్తడానికి ప్రయత్నించినప్పుడల్లా ఆయన ఎప్పుడూ అనుమతించలేదని అన్నారు. రైతులకు అనుకూలంగా మాట్లాడినందున ధన్‌ఖడ్ రాజీనామా చేయవలసి వచ్చిందా అనే ప్రశ్నకు సమాధానంగా ఖర్గే స్పందించారు. 'రైతులు, పేదలు, అంతర్జాతీయ సమస్యలు లేదా విదేశాంగ విధానానికి సంబంధించిన అనేక అంశాలను మేము లేవనెత్తినప్పుడు, ఆయన మాకు (రాజ్యసభలో దాని చైర్మన్‌గా) ఎప్పుడూ అవకాశం ఇవ్వలేదు' అని అన్నారు.

## అంతరిక్షరంగంలోకి 200 అంకుర సంస్థల ప్రవేశం

### శుభాంశు శుక్లా యాత్రతో పిల్లల్లో ఆసక్తి పెరిగింది
### 'మన్‌కీ బాత్'లో ప్రధాని మోదీ ప్రశంస



న్యూఢిల్లీ: భారత వ్యోమగామి శుభాంశు శుక్లా అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రానికి వెళ్ళి వచ్చిన తర్వాత దేశంలోని విద్యార్థుల్లో విశ్వాంతరాళంపట్ల ఆసక్తి బాగా పెరిగిందని ప్రధాన మంత్రి నరేంద్రమోదీ ప్రశంసించారు. అదేవిధంగా ఒక్క అంతరిక్షరంగంలోనే 200 పైగా అంకుర సంస్థలు వచ్చాయని అన్నారు. ఆకాశవాణి,దూరదర్శన్ నిర్వహిస్తున్న నెలవారీ మోదీ మన్ కీ బాత్ కార్యక్రమం ఆదివారంనాడు ప్రసారమైంది. నెలవారీ ప్రసారమయ్యే ఈ 124వ మన్ కీ బాత్ కార్యక్రమంలో మోదీ భారత్ గురించి తన అంతరంగాన్ని ఆవిష్కరించారు. 2047 నాటికి భారత్‌ను అభివృద్ధి చెందిన దేశంగా తీర్చిదిద్దడంలో భాగంగా స్వయంసమృద్ధి సాధించే దిశగా ముందుకు ప్రయాణం చేస్తున్నామని చెప్పారు. ముఖ్యంగా దేశీయ పరిశ్రమలను అభివృద్ధి చేసుకుని, దేశీయ అవసరాలకోసం ఎవరిమీదా ఆధారపడకుండా దేశంలోనే అన్ని ఉత్పత్తులు తయారు చేసుకునేందుకు, ఆ దిశగా ఆలోచించి ఉద్యమాన్ని ముందుకు తీసుకువెళ్ళే ఆత్మనిర్భర్ భారత్ ప్రాతిపదికపై ముందుకు వెళుతున్నామన్నారు. ఈ కార్యక్రమాన్ని పెద్ద ఎత్తున కొనసాగిస్తున్నామని చెప్పారు. గడచిన కొద్దివారాలుగా క్రీడలు, సంస్కృతి, శాస్త్రసాంకేతికరంగం ఏదైనా కావచ్చు ఈ రంగాలలో చాలా చాలా ఘటనలు జరిగాయని, భారతదేశం గర్వించదగిన పరిణామాలు సంభవించాయని చెప్పారు.

''ఇటీవలికాలంలో శుభాంశు శుక్లా రోదసీ యాత్ర గురించి యావత్ దేశం ఎడతెరపిలేకుండా మాట్లాడుకుంటున్నది. అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రానికి వెళ్ళిన శుక్లా తిరిగి సురక్షితంగా భూమికి చేరుకోగానే దేశ ప్రజలు సంతోషంలో ఓలలాడారు. ఎంతో స్ఫూర్తిని పొందారు. ముఖ్యంగా విద్యార్థులు విశ్వాంతరాళం గురించి తెలుసుకోవడానికి దృష్టి సారించారు. యావత్ దేశం శుక్లా యాత్రను గర్వకారణంగా భావించింది. ఈ సందర్భంగా గుర్తుచేసుకుంటున్నా, 2023 ఆగస్టునెలలో చంద్రయాన్–3 ఎంతో సురక్షితంగా చంద్రుడిపై దిగింది. దీంతో దేశంలో కొత్త ఆశలు చిగురించాయి. కొత్త ఆలోచనలకు రూపం దిద్దుకుంది. రోదసీ గురించి, శాస్త్రసాంకేతిక రంగాల గురించి కొత్తరకమైన ఆసక్తి విద్యార్థుల్లో పుట్టుకువచ్చింది, చిన్న చిన్న పిల్లలు కూడా ఇప్పుడు చెబుతున్నారు, మేం అంతరిక్షంలోకి వెళతాం అని. మేం కూడా చందమామ మీద కాలు మోపుతాం, మేం కూడా రోదసీ శాస్త్రవేత్తలమవుతాం'' అని పిల్లలు చెబుతున్నారు'' అని ప్రధానమంత్రి అన్నారు. 6 నుండి 12 వ తరగతి వరకూ చదువుకునే విద్యార్థులకు ప్రేరణ కలిగించేందుకు కేంద్ర డిఎస్‌టి విభాగం ఏర్పాటు చేసిన ''ఇన్‌స్పైర్–మానక్ (లక్షలాదిమంది జాతి జనుల ఆలోచనల్లో ఉమ్మడి ఆశయాలను, ఉమ్మడి లక్ష్యాలను పెంపొందించే విజ్ఞాన కార్యక్రమం) అభియాన్ గురించి ప్రధానమంత్రి మోదీ ప్రస్తావిస్తూ, పిల్లల్లో ప్రచారం చేయడానికి, దేశ లక్ష్యాలను వారిలో నాటేందుకు ఇదొక ప్రచారంగా ఉపయోగపడుతుందన్నారు. ఈ ఇన్‌స్పైర్–మానక్ కార్యక్రమం కింద ప్రతి పాఠశాల నుండి ఐదుగురు విద్యార్థులను ఎంపిక చేసి, ప్రతి విద్యార్థిలో సరికొత్త ఆలోచనలను పాదుగొల్పుతారని, చంద్రయాన్–3 తర్వాత ఇప్పటివరకూ లక్షలమంది పిల్లలు ఈ కార్యక్రమంలో చేరారని మోదీ చెప్పారు.

అదేవిధంగా రోదసీ విజ్ఞానంపై దేశంలో రోజు రోజుకూ ఆసక్తి పెరుగుతోందని, ఎంతోమంది ముందుకు వస్తున్నారని, అంతరిక్షరంగాన్ని జల్లెడపట్టేందుకు అనేక అంకుర సంస్థలు శరవేగంగా దేశంలో ఉద్భవిస్తున్నాయని చెప్పారు. గతంలో కేవలం 50 అంకుర సంస్థలు మాత్రమే అంతరిక్ష రంగంలో ఉండేవని, కానీ ఇప్పుడు 200కు పైగా అంకుర సంస్థలు వచ్చాయన్నారు. 21వ శతాబ్దం భారతదేశానిదేనని, సరికొత్త శక్తితో విజ్ఞానశాస్త్రం అభివృద్ధి చెందుతోందని అన్నారు.

''కొద్దిరోజుల క్రితం మన విద్యార్థులు అంతర్జాతీయ రసాయన శాస్త్ర ఒలింపియాడ్‌లో పతకాలు గెలుచుకున్నారు, దేవేశ్ పంకజ్, కూచీ, దేవ్‌దత్ ప్రియదర్శి, ఉజ్వల్ కేసరి నలుగురూ భారత్‌కు కీర్తిప్రతిష్ఠలు తీసుకువచ్చారన్నారు. వచ్చేనెల ముంబైలో ఖగోళశాస్త్రంపై ఒలింపియాడ్ జరుగుతుందని చెప్పారు. అదేవిధంగా యునెస్కో మనదేశంలోని 12 మరాఠా, తమిళనాడులలో ఫోర్టులను ప్రపంచ వారసత్వ ప్రదేశాలుగా గుర్తించిందన్నారు. దేశంలో ఆగస్టు నెల విప్లవాలకు నిలయంగా ఉందన్నారు. 1908 ఆగస్టు 11న ఖుదీరామ్ బోస్ తన 18 ఏళ్ళ వయసులో బ్రిటిష్ వారిని ఎదిరించి ధైర్యంగా ఉరిశిక్షను అనుభవించాడని, అతడి ధైర్యానికి యావత్ దేశం దిగ్భ్రాంతి చెందిందనీ, అదేవిధంగా ఆగస్టు 1న లోకమాన్య బాలగంగాధర్ తిలక్ వర్థంతి జరుగుతుందని, ఆగస్టు 15వ తేదీన స్వాతంత్ర్య దినోత్సవంకాగా, ఆగస్టు 8వ తేదీన మహాత్మాగాంధీ నాయకత్వంలో క్విట్ ఇండియా ఉద్యమం ప్రారంభమైందని గుర్తుచేశారు.

**జార్ఖండ్‌లో రైతులుగా మారిన నక్సలైట్లు**

మాజీ నక్సలైట్లు రైతులుగా పరివర్తన చెందడాన్ని ప్రధాన మంత్రి నరేంద్రమోదీ మన్ కీ బాత్ కార్యక్రమంలో ప్రశంసించారు. జార్ఖండ్‌లోని గుమ్లాజిల్లాలో ఒకప్పటి నక్సలైట్ తీవ్రవాదులు ఈనాడు రైతులుగా పరివర్తన చెందారని, హింసా మార్గాన్ని వారు వదిలిపెట్టి వ్యవసాయం చేస్తున్నారని, అభివృద్ధి అనే దీపం ఎన్నో సంక్లిష్టమైన సందర్భాలలో కూడా వెలుగుతుందనడానికి ఇదే ఒక పెద్ద ఉదాహరణ అని అన్నారు. పిటిఐ వార్తాసంస్థ జూన్ 27న ప్రచురించిన ''గన్స్ టూ గ్రిల్స్'' అనే ఈ కథనాన్ని మోదీ మన్ కీ బాత్ కార్యక్రమంగా ప్రముఖంగా ప్రస్తావించారు.హింసా మార్గాన్ని వదిలిపెట్టి జనజీవన స్రవంతిలోకి ప్రవేశించిన స్ఫూర్తిమంతమైన మాజీ నక్సలైటు ఓం ప్రకాశ్ సాహూ కథనాన్ని మోదీ ప్రముఖంగా ప్రస్తావించారు. జార్ఖండ్ గుల్మాలని బసియా బ్లాక్ మావోయిస్టుల హింసాకాండకు ఒకప్పుడు ఎంతో ప్రసిద్ధి చెందిందని, భయంతో ఒకనాడు ప్రజలు గ్రామాలను వదిలి పారిపోయేవారని, ఉద్యోగాలు లేక యువకులు ఆ ప్రాంతం నుండి మరో ప్రాంతానికి తరలిపోయేవారని అన్నారు. హింసా మార్గాన్ని వదిలిపెట్టాలని ఓం ప్రకాశ్ సాహూ నిర్ణయించుకున్న తర్వాత పరిస్థితులన్నీ మారిపోయాయన్నారు. ఒకప్పుడు తుపాకులు పట్టుకున్న సాహూ ఈనాడు జాలరి వలలు పట్టుకున్నాడన్నారు. 2002లో మాజీ నక్సలైటు జ్యోతి లక్రా కూడా ఆయుధాలు వదిలేసి ఈనాడు చేపల ఆహారం తయారు చేసే మిల్లు పెట్టుకుందని, ఏటా రూ.8 లక్షలు లాభాలు ఆమె సంపాదిస్తోందని చెప్పారు. ఈశ్వర్ గోప్ కూడా జనజీవన స్రవంతిలోకి వచ్చి చేపల చెరువుల ద్వారా ఏటా రూ.2.50 లక్షలు విలువైన ఎనిమిది క్వింటాళ్ళ చేపలు పండిస్తున్నారన్నారు.



### 13 ఏళ్ల తర్వాత.. తొలిసారి మాతోశ్రీలోకి అడుగుపెట్టిన రాజ్ థాక్రే

ముంబయి : మహారాష్ట్ర నవనిర్మాణ సేన (ఎంఎన్ఎస్) చీఫ్ రాజ్ థాక్రే 13 ఏళ్ల తర్వాత ఆదివారం తొలిసారి ముంబయిలోని మాతోశ్రీలోకి అడుగుపెట్టారు. శివసేన (యుబిటి) చీఫ్ ఉద్ధవ్ థాక్రేకు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు. సోదరులైన ఉద్ధవ్ థాక్రే, రాజ్ థాక్రేలు బాలాసాహెబ్ చిత్రం ముందు ఫోటో దిగారు. 'నా అన్నయ్య శివసేన అధినేత ఉద్ధవ్ థాక్రే పుట్టినరోజు సందర్భంగా, దివంగత గౌరవనీయ బాలాసాహెబ్ థాక్రే నివాసం అయిన మాతోశ్రీని సందర్శించా. శుభాకాంక్షలు తెలియజేశా' అని ఎక్స్‌లో పేర్కొన్నారు. ఎంఎస్ఎస్ నేతలు బాలా నందగావ్కర్, నితిన్ సర్దేశాయ్ కూడా రాజ్ థాక్రే వెంట ఉన్నారు. కాగా, రాజకీయ విభేదాల కారణంగా 2006లో మాతోశ్రీని రాజ్ థాక్రే వీడారు. ఆ తర్వాత మహారాష్ట్ర నవనిర్మాణ సేన (ఎంఎన్ఎస్) పార్టీని ఏర్పాటు చేశారు. 2012లో బాలాసాహెబ్ థాక్రే మరణించినప్పుడు చివరిసారి మాతోశ్రీకి ఆయన వచ్చారు. 13 ఏళ్ల తర్వాత తొలిసారి మాతోశ్రీని ఆయన సందర్శించారు. మరోవైపు మహారాష్ట్రలోని ప్రాథమిక స్కూళ్లలో తప్పనిసరిగా హిందీ భాషను అమలు చేయాలని ప్రభుత్వం నిర్ణయించడం వివాదానికి దారి తీసింది. ఈ నేపథ్యంలో మరాఠీ గుర్తింపు కోసం పోరాటంలో భాగంగా ఉద్ధవ్, రాజ్ థాక్రేలు రెండు దశాబ్దాల తర్వాత తొలిసారి ఒకే రాజకీయ వేదికపైకి వచ్చారు. వర్లిలో జరిగిన విజయోత్సవ ర్యాలీలో కలిసి ప్రసంగించారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో కలిసి పోటీ చేయాలని వారిద్దరూ నిర్ణయించారు.

## ఎస్ఐఆర్ పిటిషన్లపై నేడు 'సుప్రీం' విచారణ



న్యూఢిల్లీ : త్వరలోనే ఎన్నికలు జరుగనున్న బిహార్‌లో ఓటర్ల జాబితాల స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్) చేపట్టాలన్న ఎన్నికల సంఘం (ఇసి)నిర్ణయాన్ని సవాల్‌చేస్తూ దాఖలైన పిటిషన్ల బ్యాచ్‌పై సోమవారం (నేడు) సుప్రీంకోర్టు విచారణ జరుపనుంది. బిహార్‌లో కొనసాగుతున్న ఓటర్ల జాబితా ఎస్ఐఆర్‌ను ఇసి సమర్థించుకున్న జస్టిస్ సూర్యకాంత్, జోయ్‌మాల్యా బాగ్చీ నేతృత్వంలోని ద్విసభ్య ధర్మాసనం ఈ విషయమై విచారణ చేపట్టనుంది. ఎస్ఐఆర్ ఓటర్ల జాబితా నుంచి అనర్హులైన వ్యక్తులను తొలగించడం ద్వారా ఎన్నికల స్వచ్ఛతను పెంచుతుందని ఎన్నికల సంఘం పేర్కొన్నది.జూన్ 24న ఎస్ఐఆర్‌ను నిర్దేశిస్తూ తీసుకున్న నిర్ణయాన్ని సమర్థించుకుంటూ అన్ని ప్రధాన రాజకీయపార్టీలు పాల్గొన్నాయి అని, అర్హులైన ఓటర్లను చేరుకోవడానికి 1.5లక్షలకు పైగా బూత్‌స్థాయి ఏజెంట్లను నియమించాయని పోల్ ప్యానెల్ పేర్కొంది. కానీ సుప్రీంకోర్టులో దానిని వ్యతిరేకిస్తున్నాయి. ఓటర్ల జాబితా నుంచి అనర్హులైన వ్యక్తులను తొలగించడం ద్వార ఎన్నికల స్వచ్ఛతను స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ పెంచుతున్నదని పలువురు రాజకీయ నాయకులు, పౌర సమాజం సభ్యులు, ఆర్గనైజేషన్లు సహా పిటిషనర్ల ఆరోపణలను ఎదుర్కోవడానికి దాఖలుచేసిన వివరణాత్మక అఫిడవిట్‌లో భారత ఎన్నికల సంఘం (ఇసిఐ) పేర్కొన్నది. ఈ కేసులో ప్రధాన పిటిషనర్ అయిన అసోసియేషన్ ఫర్ డెమొక్రటిక్ రిఫార్మ్స్ (ఏడిఆర్) అనే ఎన్‌జిఓ తన రీజాయిండర్ అఫిడవిట్‌లో ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ ఆఫీసర్లు (ఇఆర్ఓలు) విస్తృత, అనియంత్రిత విచక్షణతో ఉన్నారని, పర్యవసానంగా బిహార్ జనాభాలో గణనీయమైన భాగం ఓటు హక్కును కోల్పోయే అవకాశం ఉందని ఆరోపించింది. 2025 జూన్ 24న నాటి ఎస్ఐఆర్ ఉత్త్వర్వును రద్దుచేయలేదని, ఏకపక్షంగా, తగిన ప్రక్రియ లేకుండా పౌరులు తమ ప్రతినిధులను ఎన్నుకోకుండా హక్కును కోల్పోతారని, తద్వారా దేశంలో స్వేచ్ఛాయుతమైన, నిష్పాక్షికమైన ఎన్నికలు ప్రజాస్వామ్యానికి అంతరాయం కలిగిస్తుందని పిటిషన్ దాఖలు చేసింది. 'ఇది రాజ్యాంగ నిర్మాణంలోని ప్రాథమిక అంశంలో భాగం' అని ఎన్‌జిఓ అసోసియేషన్ ఫర్ డెమొక్రటిక్ రిఫార్మ్స్ తెలిపింది.

## జ్ఞానంలేని హక్కుల వల్ల ఉపయోగం లేదు

### భారత ప్రధానన్యాయమూర్తి బిఆర్.గవాయ్



శ్రీనగర్ : జ్ఞానంలేని హక్కులు ప్రయోజనం లేనివని భారత ప్రధాన న్యాయమూర్తి (సిజెఐ) బిఆర్.గవాయ్ ఉద్ఘాటించారు. పౌరులకు వారి హక్కుల గురించి అవగాహన కల్పించాల్సిన ప్రాముఖ్యతను ఆయన నొక్కిచెప్పారు. ఆదివారం ఆయన ఇక్కడ జరిగిన నేషనల్ లీగల్ సర్వీసెస్ అథారిటీ (నల్సా) నార్త్‌జోన్ రీజియనల్ కాన్ఫరెన్స్‌లో ప్రసంగించారు. సిజెఐ ప్రసంగిస్తూ గతంలోని అసమానతలను సరిదిద్దాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందన్నారు. అన్ని సమాజాలు సామరస్యంగా నివసించే పాత కశ్మీర్‌ను పునరుద్ధరించాల్సిన అవసరం ఉన్నదని చెప్పారు. నేషనల్ లీగల్ సర్వీసెస్ అథారిటీ ఈ దిశగా పనిచేస్తోందన్నారు. మేం 'నల్సా' పనిని దేశంలోని మారుమూల ప్రాంతాలకూ అది లడఖ్ కావచ్చు, ఈశాన్య లేదా రాజస్థాన్ కావచ్చుని 'నల్సా' పని విస్తరించాల్సిన అవసరం ఎంతైనా ఉందని సిజెఐ తెలిపారు. బాబాసాహెబ్ బిఆర్.అంబేద్కర్ ఒక వ్యక్తిఒక ఓటు ద్వారా రాజకీయ న్యాయాన్ని తీసుకొచ్చారని, రాజ్యాంగ రచయిత సామాజిక విభజన, ఒక కంపార్ట్‌మెంట్ నుంచి మరొక కంపార్ట్‌మెంట్‌కు వెళ్లడం ఎంత కష్టం అనే విషయం గురించి మాట్లాడారని సిజెఐ చెప్పారు. నేను నా స్థలానికి వచ్చినట్లు అనిపిస్తోంది. నాపై చూపిన ప్రేమ, ఆప్యాయతలకు నేను కృతజ్ఞుడిని. నేను జమ్ము కశ్మీర్ లడఖ్‌లోని అన్ని ప్రాంతాలకూ వెళ్లాను. ఇక్కడి సూఫీ సాంప్రదాయం భారత రాజ్యాంగంలో పొందుపరచబడిన లౌకికతను ప్రోత్సహిస్తోంది. అన్ని మతాల ప్రజలు ఇక్కడి దర్గాలు, దేవాలయాలు, ఇతర మతపరమైన స్థలాలను సందర్శిస్తుంటారని గవాయ్ చెప్పారు. లడఖ్, కశ్మీర్, జమ్ము నుంచి బార్ ప్రతినిధులు లేవనెత్తిన అంశాలపై సిజెఐ మాట్లాడుతూ వీటిని పరిష్కరించే అధికారం తనకు లేనప్పటికీ కొలీజియం సహా సంబంధిత అధికారులకు తాను అదే విషయాన్ని తెలియజేస్తానని గవాయ్ భరోసా ఇచ్చారు.

## రాజ్యాంగాన్ని గౌరవించేవారు రాష్ట్రాలను 'యుటి'లుగా మార్చరు

### ఆర్టికల్ 370ని రద్దు చేసి బిజెపి సర్కార్ ఏం సాధించింది?



న్యూఢిల్లీ : దేశ రాజ్యాంగం గౌరవించబడాలంటే జమ్ముకశ్మీర్‌కు రాష్ట్ర హోదా పునరుద్ధరించాలని, స్థానిక ప్రభుత్వం భద్రతా బాధ్యతలను నిర్వహిస్తే ఇటీవల జరిగిన పహల్గామ్ ఉగ్రవాద దాడిని నివారించవచ్చని ప్రముఖ రాజకీయ నాయకుడు, నేషనల్ కాన్ఫరెన్స్ అధ్యక్షుడు ఫరూక్ అబ్దుల్లా అన్నారు. ఇది ఆశాజనకమైన ప్రశ్న కాదన్నారు. కేంద్ర పాలిత ప్రాంతంలో రాష్ట్ర హోదా పునరుద్ధరణ కోసం పెరుగుతున్న డిమాండ్ గురించి అడిగిన ప్రశ్నకు సమాధానంగా అబ్దుల్లా అన్నారు. భారత రాజ్యాంగాన్ని గౌరవించేవారు రాష్ట్రాలను ఎప్పుడూ కేంద్రపాలిత ప్రాంతాలుగా మార్చరని, ఒక కేంద్రపాలిత ప్రాంతాన్ని రాష్ట్రంగా మారుస్తారని అన్నారు. ఇక్కడ విషాదం ఏమిటంటే బిజెపి సర్కార్ ఒక రాష్ట్రాన్ని కేంద్రపాలిత ప్రాంతంగా మార్చిందని, దీంతో ఏమి సాధించిందని ప్రశ్నించారు. ఇటీవల ఫరూక్ అబ్దుల్లా పిటిఐతో మాట్లాడారు. ఆరు సంవత్సరాల క్రితం ఆగస్టు 5, 2019న ఆర్టికల్ 370 రద్దు చేయబడినప్పుడు ఉగ్రవాదం కనుమరుగవుతుందని వాగ్దానాలు చేశారని అబ్దుల్లా గుర్తు చేశారు. మరి ఉగ్రవాదం అదృశ్యమైందా లేదా అది పెరిగిందా అని నిలదీశారు. కేంద్రం పార్లమెంటులో దీనికి సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. జమ్ముకశ్మీర్‌కు త్వరలో రాష్ట్ర హోదా ప్రకటించబడుతుందని ప్రజలు ఆశిస్తున్నారని అబ్దుల్లా అన్నారు. ఇప్పటికే, అన్ని ప్రతిపక్ష పార్టీలు పార్లమెంటులో కూడా తమ కోసం పోరాడుతున్నాయని, రాష్ట్ర హోదాను పునరుద్ధరించాలని కోరుతూ ఖర్గే, రాహుల్ గాంధీ ఇటీవల ప్రధానమంత్రి (నరేంద్ర మోడీ)కి లేఖ రాయడం తెలిసిందేనన్నారు. కేంద్ర ప్రభుత్వం పార్లమెంటులో తమకు వాగ్దానాలు చేసిందన్నారు. గతంలో మూడుసార్లు ముఖ్యమంత్రిగా, కేంద్ర మంత్రిగా కూడా పనిచేసిన అనుభవజ్ఞుడైన రాజకీయ నాయకుడు రాష్ట్రాన్ని దిగజారుడు చేయడం వెనుక కేంద్రం ఉద్దేశ్యాన్ని ప్రశ్నించారు. జమ్ముకశ్మీర్‌ను విభజించి రెండు కేంద్రపాలిత ప్రాంతాలుగా చేసి ఏమి సాధించారని, ఆర్టికల్ 370ని రద్దు చేసే సమయంలో ఉగ్రవాదం అంతమవుతుందని చెప్పారని, మరి అయిందా అని విమర్శించారు. ఇక ప్రస్తుత పరిస్థితిని తెలియజేస్తూ ఎన్నికైన ప్రభుత్వానికి భద్రత, పరిపాలనా విషయాలపై నియంత్రణ లేకపోవడం పట్ల అబ్దుల్లా విచారం వ్యక్తం చేశారు. స్థానిక ప్రభుత్వం భద్రతా బాధ్యత వహించి ఉంటే ఇటీవలి పహల్గామ్ ఉగ్రవాద దాడిని నివారించవచ్చని అన్నారు. పహల్గామ్‌కు భద్రతా వైఫల్యాన్ని లెఫ్టినెంట్ గవర్నర్ అంగీకరించడాన్ని ప్రస్తావిస్తూ, లెఫ్టినెంట్ గవర్నర్ తన వైఫల్యాన్ని అంగీకరించినందుకు సంతోషంగా ఉంది, అయితే ఆయన రాజీనామా చేసే ధైర్యం చేసి ఉండాలని సూచించారు. జమ్ముకశ్మీర్‌కు రాజ్యసభకు ఎన్నికను ఎందుకు నిరాకరించారని, అసెంబ్లీలో రెండు సీట్లు ఖాళీగా ఉన్నా ఎన్నికల కమిషన్ ఏం చేస్తోందని ప్రశ్నించారు. పార్టీలో అంతర్గత విభేదాల గురించి మాట్లాడటాన్ని నేషనల్ కాన్ఫరెన్స్ చీఫ్ తోసిపుచ్చారు. 'ఈ పార్టీ ప్రజాస్వామ్య పార్టీ. ఇది నిరంకుశ పార్టీగా మారిన బిజెపి లాంటిది కాదు. ఇక్కడ ప్రజలు తమకు కావలసినది మాట్లాడే హక్కు ఉంది' అని పార్టీ, శ్రీనగర్ ఎంపి అగా రుహుల్లా మెహదీ మధ్య అభిప్రాయ భేదం గురించి అడిగిన ప్రశ్నకు సమాధానమిస్తూ ఆయన అన్నారు. వేర్పాటువాద నాయకుడు బిలాల్ లోన్ ప్రధాన స్రవంతిలో చేరుతున్నట్లు ప్రకటించిన విషయం గురించి అడిగిన ప్రశ్నకు, జెకె భారతదేశంలో ఒక భాగమని వారు గ్రహించినందుకు నేను చాలా సంతోషంగా ఉన్నాను అని ఆయన అన్నారు. సంవత్సరాల తరబడి అరణ్యంలో గడిపిన తర్వాత ఆ నాయకుడు ఇప్పుడు ప్రజల సంక్షేమానికి దోహదపడగలడని ఆశాభావం వ్యక్తం చేశారు.




## 'ఆపరేషన్ సిందూర్' తరువాత ఏమైంది!

### జరిగిన పరిణామాలను ఎత్తి చూపిన కాంగ్రెస్

న్యూఢిల్లీ : ఆపరేషన్ సిందూర్‌పై పార్లమెంటులో సోమవారం నుంచి చర్చ జరగనున్న నేపథ్యంలో కాంగ్రెస్ ఆదివారం చర్చకు నేపథ్యంగా మారిన ఘటనలను తిరిగి ప్రస్తావించింది. వాటిలో ముఖ్యమైనవి అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ భారతదేశంతో వాణిజ్యాన్ని నిలిపివేస్తానని బెదిరించడం ద్వారా ఆపరేషన్ సిందూర్‌ను ఆపివేసినట్లు మే 10 నుండి 26 సార్లు పేర్కొన్నారు. ఈ అంశంపై పార్లమెంట్‌లో చర్చ జరపాలని చాలా కాలం నుంచి డిమాండ్ చేస్తున్నామని, అయితే దీనిపై ఆలస్యం చేయకపోవడమే మంచిదని ప్రతిపక్ష పార్టీ పేర్కొంది. ఆపరేషన్ సిందూర్ అకస్మాత్తుగా నిలిపివేసిన వెంటనే రెండు రోజులు పార్లమెంటును ప్రత్యేకంగా సమావేశపరిచి చర్చించాలని కాంగ్రెస్ డిమాండ్ చేసినట్లు పార్టీ ప్రధాన కార్యదర్శి జైరామ్ రమేశ్ చెప్పారు. అయినా తమ డిమాండ్‌ను కేంద్ర సర్కార్ విస్మరించిందని మండిపడ్డారు. ఈ మేరకు ఆదివారం ఆయన ఎక్స్‌లో పోస్టు చేశారు. పహల్గామ్ ఉగ్రవాద దాడి ఏప్రిల్ 22న జరిగితే, ప్రత్యక్షంగా బాధ్యత వహించిన ఉగ్రవాదులపై ఇప్పటికీ చర్యలు తీసుకోలేదన్నారు. ఈ ముష్కరులు పూంచ్ (డిసెంబర్ 2023), గంగాగిర్, గుల్మార్గ్ (అక్టోబర్ 2024) లలో గతంలో జరిగిన ఉగ్రవాద దాడులలో పాల్గొన్నట్లు నివేదికలు చెబుతున్నాయని రమేశ్ పేర్కొన్నారు. కాంగ్రెస్ అభ్యర్థన మేరకు ఏప్రిల్ 24నఖిలపక్ష సమావేశం ఏర్పాటు కాగా, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ కాకుండా, రక్షణ మంత్రి అధ్యక్షతన అఖిలపక్ష సమావేశం జరిగిందని, ఈ భేటీల ప్రతిపక్షాలు నిఘా లోపాలపై ప్రశ్నలు లేవనెత్తాయన్నారు. మే 30న, చీఫ్ ఆఫ్ డిఫెన్స్ స్టాఫ్ జనరల్ అనిల్ చౌహాన్ ఆపరేషన్ సిందూర్‌లో జరిగిన వ్యూహాత్మక తప్పిదాలపై సింగపూర్‌లో వెల్లడించారన్నారు. జూన్ 29, ఇండోనేషియాలోని భారత డిఫెన్స్ అటాచ్, గ్రూప్ కెప్టెన్ శివ్ కుమార్ మాట్లాడుతూ, ఆపరేషన్ సిందూర్ సమయంలో రాజకీయ నిర్ణయాలు సైనిక కార్యకలాపాలకు ఆటంకం కలిగించాయని చెప్పినట్లు జైరామ్ గుర్తుచేశారు. ఈనెల 4న, డిప్యూటీ చీఫ్ ఆఫ్ ఆర్మీ స్టాఫ్ లెఫ్టినెంట్ జనరల్ రాహుల్ ఆర్ సింగ్ వెల్లడించిన వివరాల ప్రకారం, ఆపరేషన్ సిందూర్ సమయంలో భారతదేశం హార్డ్‌వేర్, సాఫ్ట్‌వేర్ పరంగా చైనాతో పోరాడిందన్నారు. 14న, పహల్గామ్ ఉగ్రవాద దాడులు నిస్సందేహంగా భద్రతా వైఫల్యమేనని జమ్ముకశ్మీర్ లెఫ్టినెంట్ గవర్నర్ మనోజ్ సిన్హా బహిరంగంగా అంగీకరించారన్నారు. ఇక ట్రంప్ భారతదేశంతో వాణిజ్యాన్ని తెగతెంపులు చేసుకుంటానని బెదిరించడం ద్వారా ఆపరేషన్ సిందూర్‌ను ఆపివేసినట్లు మే 10 నుండి 26 సార్లు పేర్కొన్నారని రమేశ్ ఎత్తి చూపారు. ఐదు ఫైటర్ జెట్‌లు కూలిపోయి ఉండవచ్చని కూడా ట్రంప్ పేర్కొన్నారని ఆయన గుర్తు చేశారు.

## గంగైకొండ చోళపురం ఆలయాన్ని సందర్శించిన ప్రధాని





చెన్నై : ప్రధాని నరేంద్ర మోదీ తమిళనాడు పర్యటనలో భాగంగా గంగైకొండ చోళపురం ఆలయాన్ని సందర్శించారు. ఆదివారం రాజేంద్ర చోళుడి జయంతి సందర్భంగా ఈ పర్యటన జరగడం విశేషం. మాల్దీవుల పర్యటన ముగించుకున్న ఆయన శనివారం రాత్రి తమిళనాడులోని తూత్తుకూడికి ప్రత్యేక విమానంలో చేరుకున్నారు. దక్షిణ భారతదేశంలో అతిపెద్ద శివాలయాల్లో ఒకటి గంగైకొండ చోళపురం ఆలయం. ఆదివారం ఉదయం స్వామి దర్శనానికి సంప్రదాయ పంచెకట్టులో ప్రధాని మోదీ వచ్చారు. ఆలయ పూజారులు ఆయనకు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా స్వామివారికి మోదీ హారతి ఇచ్చారు. అనంతరం తీర్థ ప్రసాదాలను స్వీకరించారు. ఆదితిరువతైరై ఉత్సవాల్లో ప్రధాని పాల్గొన్నారు. తమిళనాడు పర్యటన సందర్భంగా రూ.450 కోట్లతో అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా తూత్తుకూడి విమానాశ్రయంలో విస్తరించిన కొత్త టెర్మినల్‌ను కూడా శనివారం ప్రధాని మోదీ ప్రారంభించారు. రాష్ట్రంలో రూ.4,900 కోట్లతో పూర్తిచేసిన వివిధ రహదారులు, రైల్వే మార్గాలను ఆయన జాతికి అంకితం చేశారు.

## 13 రాష్ట్రాలలో 50 శాతం పిల్లలకు అంగన్‌వాడీ పోషకాహారం



న్యూఢిల్లీ: దేశంలోని 13 రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలలో ఉన్న 63 జిల్లాలలో 50 శాతం పిల్లలకు అంగన్‌వాడీల ద్వారా పోషకాహారాన్ని అందజేశారు. పార్లమెంటుకు సమర్పించిన పలు పత్రాల విశ్లేషణలో ఈ విషయం వెల్లడైంది. దేశంలో అనేక సంవత్సరాలపాటు పిల్లలకు సరైన పోషకాహారం గనుక లభించకపోతే స్టంటింగ్ సమస్య వస్తుంది. స్టంటింగ్ అనేది ఒకరకమైన అతి తీవ్రమైన పోషకాహార లోపం. చాలా తక్కువస్థాయిలో ఇలాంటి పిల్లల్లో పోషకాలు ఉంటాయి. ఇలాంటి పిల్లల్లో 30 నుండి 40 శాతం మేరకు అతి తీవ్రమైన పోషకాహార లోపం ఉన్నట్లు 199 జిల్లాలలో గుర్తించారు. అంగన్ వాడీలలలో ఇలాంటి తీవ్ర పోషకాహారలోపం ఉన్న 50 శాతం పిల్లల పేర్లు నమోదయ్యాయి. ఉత్తర ప్రదేశ్‌లోని 34 జిల్లాలలో కూడా ఈ తీవ్ర పోషకాహార లోపం పిల్లలు నమోదయ్యారు. ఈ విధంగా అతి తీవ్రస్థాయిలో పోషకాహారలోపం ఉన్న పిల్లలు మహారాష్ట్రలోని నందర్‌బార్‌లో 68.12 శాతం మంది అంగన్‌వాడీలలో నమోదయ్యారు. జార్ఖండ్‌లోని పశ్చిమ సింగ్భూంలో 66.27 శాతం పిల్లలు, ఉత్తర ప్రదేశ్‌లోని చిత్రకూట్‌లో 59.48 శాతం పిల్లలు, మధ్యప్రదేశ్‌లోని శివపురిలో 58.20 శాతం, అసోంలోని బంగైగాఓన్‌లో 54.76 శాతం పిల్లలు అంగన్‌వాడీలలో పేర్లు నమోదు చేసుకున్నారని 2025 జూన్ నాటి స్త్రీ శిశు సంక్షేమాభివృద్ధి పోషణ్ ట్రాకర్ డేటా వెల్లడించింది. పైన పేర్కొన్న ఈ ప్రాంతాలలో పిల్లలు చాలా దారుణంగా పోషకాహారలోపంతో బాధపడుతున్నావారే. వారందరికి అంగన్‌వాడీల ద్వారా పోషకాహారాన్ని సమకూర్చారు. ఉత్తర ప్రదేశ్‌లోని 34 జిల్లాలలో 50 శాతం పిల్లలకు ఈ అతి తీవ్రమైన పోషకాహారలోపం ఉంది. దేశంలోని ఈ జాబితాలో ఈ లోపం ఉన్న పిల్లలు ఎక్కువగా ఉన్నది ఈ ప్రాంతంలోనే.దేశ వ్యాప్తంగా అంగన్‌వాడీల ద్వారా 8.19 కోట్లమంది ఆరేళ్ళలోపు పిల్లలను గుర్తించారు. వీరిలో 35.91 శాతం మంది అతితీవ్రమైన పోషకాహారలోపంతో బాధపడుతున్నవారే. అదేవిధంగా 6.5 శాతం మంది చాలా తక్కువ బరువుతో ఉన్న పిల్లలు ఉన్నారు. వీరిలో అతి తీవ్ర పోషకాహారలోపం ఎక్కువగా ఉందని స్త్రీశిశు సంక్షేమాభివృద్ధిశాఖ పత్రాలు తెలియజేశాయి.




# సాహిత్యంలో విప్లవాత్మక శక్తి.. మహాశ్వేతా దేవి

భారతీయ సాహిత్య చరిత్రలో మహాశ్వేతా దేవిది ముమ్మాటికీ తిరుగులేని స్థానమే. రాజకీయ చైతన్యాన్ని, వాస్తవిక చిత్రణను, సాహిత్య నైపుణ్యాన్ని ఒకే రేఖలో మలచి, ఒక విచిత్ర సంధానాన్ని సొంతం చేసుకుంది కాబట్టి, ఆమె పేరును సామాన్యంగా పేర్కొనడం అసాధ్యం. భారతీయ సాహిత్యంలో ఆమె ఓ విప్లవాత్మక శక్తి. రాజకీయ వైరుధ్యాలను... సైద్ధాంతిక విభేదాలను పక్కకుపెడితే, రచయిత్రిగా నవ సమాజ నిర్మాణాన్ని ఆమె చిత్తశుద్ధితో ఆకాంక్షించిన విషయం నిజం. అన్యాయపు నిశ్శబ్దాన్ని ఛేదించిన అక్షర శబ్దంగా మారిందనేది కూడా వాస్తవమే. మహాశ్వేతాదేవి రచనలలో శోషిత వర్గాల ప్రతిఘటన, సాహిత్య ప్రకటన విస్పష్టంగా వినిపిస్తాయి. సాధారణంగా సాహిత్యం అనేది సమాజానికి దర్పణమని అంటారు. కానీ, మహాశ్వేతా దేవి రచనలు కేవలం ఒక అద్దం మాదిరికాకుండా, ఆయుధంగా మారుతాయి. ఆమె కలం నుంచి జాలువారిన ప్రతి పదం ఒక శస్త్రంగా రూపుదిద్దుకుంటుంది. సామాజిక చైతన్యానికి సాహిత్య స్వరూపం ఆమె. ఒక రకంగా, మహాశ్వేతాదేవి రచనలు ఒక నిర్దిష్ట సామాజిక పరిణామానికి స్పందనగా పుట్టాయి. 20వ శతాబ్దం మధ్య నాటి బెంగాల్ రాజకీయ, సామాజిక సంక్షోభం, ముఖ్యంగా నక్సల్బరీ ఉద్యమం, ఆదివాసీ ప్రతిఘటనలు, భూమి స్వాధీన పోరాటాలు ప్రేరణలయ్యాయి. అందుకే, ఆమె రచనలు విముక్తి వేదికలుగా, వంచిత వర్గాల జీవిత శబ్దాలుగా మారాయి. మహాశ్వేతా దేవి కేవలం వాస్తవికత పరిస్థితులను చిత్రించడంతో బాధ్యత తీరినట్టు భావించలేదు. ఆయా పరిస్థితులను ఆమె విశ్లేషించింది. స్వయంగా అనుభవిస్తున్నట్టు పాఠకుల మనస్సుల్లోకి జొప్పించగలిగింది. ఉదాహరణకు, 'ద్రౌపది' కథలోని దోప్దీపై పోలీసులు అత్యాచారం చేస్తారు. ఆ సందర్భాన్ని వివరిస్తూ, 'ఆమె నగ్నంగా ఉంది. కానీ, తలెత్తుకొని నిటారుగా నిల్చుంది' అంటూ, ఒక మహిళ తన శరీరం మీద జరిగిన హింసను ప్రతిఘటన శక్తిగా ఎలా మార్చుకుంటుందో వివరిస్తుంది. దోప్దీ నగ్న శరీరాన్ని దాస్యానికి సంకేతంగా కాకుండా, నిరాకరణకు నిలువెత్తు రూపంగా ఆవిష్కరిస్తుంది. అలాగే 'హజార్ చురాశిర్ మా' నవలలో, తల్లి పాత్ర ద్వారా విప్లవం కుటుంబ సంబంధాలను ఎలా ధ్వంసం చేస్తుందో, తల్లి ప్రేమ ఎలా విప్లవ బలిదానానికి మాధ్యమమవుతుందో రచయిత్రి మనకు చూపిస్తుంది. ఈ కోణంలో చూస్తే, మహాశ్వేతాదేవి ఆదివాసీలకు ప్రతినిధి మాదిరి కాకుండా, వారిలో ఒకరిగా కనిపిస్తుంది. బిర్సా ముండా, సిదూ కానూ, బషాయి టుడూ వంటి పాత్రలు... చరిత్రకు మిగిలిపోయిన శబ్దరహిత గాథలకు స్వరమిచ్చిన ఉదాహరణలు. 'అరణ్యేర్ అధికార్' నవలలో బిర్సా ముండా జీవిత కథను వర్ణిస్తూ, బ్రిటీష్ సామ్రాజ్యాన్ని ఎదుర్కొన్న ఆదివాసీ ప్రజా శక్తి ఎలా తయారైందో, చరిత్రను రాజకీయంగా తిరగరాసింది. మహాశ్వేతా దేవి రచనా శైలిని 'అశ్లీలతను తిరుగుబాటుగా మలచిన విప్లవ సాహిత్యం'గా పేర్కోవచ్చు. ఆమె రచనా విధానం మక్కువ కలిగించే మాధుర్యాన్ని కాక, క్రూరమైన నిజాన్ని తేలికగా చెప్పే శక్తితో నిండి ఉంటుంది. ఆమె వాక్య నిర్మాణం సహజమైనదైనా, ఆంతర్యం మాత్రం వధ్యశిలపై క్షణాలు లెక్కించే బలిపశువు ఆవేదనను ప్రకటిస్తునే ఉంటుంది. ఆమె సామాజిక యథార్థాన్ని అశ్లీలంగా చెప్పిందనే అపవాదును ఎదుర్కొంది. అయితే, శూలాల్లాంటి పదాల్లో బాధితుల మనోవేదనను, విముక్తి ప్రేరణను చూడాలి. మహిళలపై, ప్రత్యేకించి ఆదివాసీల మహిళలపై జరుగుతున్న అత్యాచారాలను, పెరుగుతున్న దమనకాండను పరిశీలించి, పరిశోధించింది కాబట్టే ఆమె రచనా శైలి మృదుత్వానికి విరుద్ధంగా, సమ్మెట పోటులా ఉంటుంది. కాబట్టే, మహాశ్వేతాదేవి రచనల్లో మహిళ పాత్రలను, బాధలోంచి బయలుదేరిన రౌద్ర శక్తులుగా వీక్షించవచ్చు. ఆమె కథలు మృదువుగా పలికే పల్లవులు కాదు.. అవి ఆక్రోశ పూరితమైన నినాదాలు. ఆమె తన రచనల ద్వారా, భాష, శబ్దం, శబ్దరహితత అన్నింటినీ ఒక ఆర్థిక రాజకీయ వ్యవస్థగా అన్వయించే ప్రయత్నం చేసింది. ఆదివాసీ ఉద్యమాల్లో ఆమె రచనలు ఆత్మగౌరవ ప్రతీకలుగా... పాత్రలు పాఠ్యాంశాలుగా మారాయి. ఆమె జీవితమే ఒక సాహిత్య ఉద్యమం. 1926, జనవరి 14న జన్మించిన మహాశ్వేతా దేవి, 2016 జులై 28న తుదిశ్వాస విడిచింది. కానీ, నేటికీ ఆమె రచనలు శ్వాసిస్తునే ఉన్నాయి. ఆమె రచనలు కృతకంగా కాకుండా, ప్రజల నడుమ జీవించే పాత్రలతో సహజత్వానికి దగ్గరగా ఉంటాయి. ప్రజల నడుమ జీవించిన రచయిత్రి కాబట్టే, ఆమెకు ఉత్కృష్ట సాహిత్య సృష్టి సాధ్యమైంది. మహాశ్వేతాదేవి రచనలు శోభన పదాలతో అలంకరించబడిన కళాత్మక సాహిత్యం కాదు. అవి పేదరికపు శబ్దం.. శ్రమికుడి కేక.. మహిళ ధ్వని.. మానవాధికారాల బలవంతపు మౌనాన్ని ధ్వంసించే అస్త్రం. ఆమె రచనలు చదవడమంటే, చరిత్రను కొత్త కోణంలో చూడడం. ఆమె పాత్రలను అర్థం చేసుకోవడమంటే, విప్లవాన్ని మనసులో ఆవహించుకోవడం. మహాశ్వేతాదేవి భారతీయ సాహిత్యంలో ఓ విప్లవాత్మక శక్తి. ఆమె రచనలు సామాజిక న్యాయం, దళిత హక్కులు, ఆదివాసీల జీవితాలు, విప్లవ మార్గాలపై దృష్టి మరల్చాయి. నిజ జీవిత స్ఫూర్తితో, అనుభవాలతో కూడిన ఆమె రచనలు భారతీయ సామాజిక అవస్థలను ప్రశ్నించే ధైర్యాన్ని ఇస్తాయి. మహాశ్వేతా దేవి రచయిత్రిగా మాత్రమేగాక, సామాజిక కార్యకర్తగా, రాజకీయ న్యాయ ఉద్యమకారిణిగా బహుముఖ పాత్రలు పోషించింది. ఆమె రచనలు, ముఖ్యంగా నవలలు, కథలు, నాటకాలు, సమాజంలోని మౌలిక వర్గాల జీవితాలను కళ్ల ముందు ఉంచుతాయి. పాత్రలను చిత్రీకరించడంలో ఆమె చూపిన అద్భుత నైపుణ్యం పాఠకులను ఇట్టే ఆకట్టుకుంటుంది. ఆమె కథనాల్లోని యథార్థత, ఆవేశం, సమాజపట్ల విమర్శనాత్మక దృష్టికోణం తార్కిక చింతన చదువులకు కొత్త కోణాన్ని పరిచయం చేస్తాయి. వాస్తవాలను వెల్లడిస్తాయి. కర్తవ్యబోధ చేస్తాయి.




అణచివేతపై గళమెత్తిన రచయిత్రి జయంతి నేడు

### సామాజిక రచయిత్రి..

భారతీయ సాహిత్యంలో రచయిత్రులు వేలు.. లక్షల్లో ఉండవచ్చు. కానీ, బాధిత ప్రజలతో మమేకమై, వారి బాధగాథలను ప్రత్యక్షంగా చూసి... స్పందించి... అనుభవాలను అక్షరబద్ధం చేసిన లేదా చేస్తున్నవారు అతి కొద్దిమంది మాత్రమే. అలాంటి అరుదైన సామాజిక రచయిత్రుల్లో మహాశ్వేతా దేవిది గౌరవ ప్రదమైన స్థానం. జీవితానుభవాలే ఆమె రచనలకు బలమైన ఆధారాలు. ఆదివాసీల జీవితాన్ని స్వయంగా అనుభవించడం, వారి పోరాటాలను అక్షర బద్ధం చేయడం ఆమెకు సామాజిక రచయిత్రిగా ఖ్యాతిని తెచ్చిపెట్టాయి. ఆమె రాసిన 'హజార్ చురాశిర్ మా' అనేది నక్సలైట్ ఉద్యమంలో మరణించిన యువకుడి తల్లి దృష్టికోణంలో సాగే నవల. ఆదివాసీలపై నిరాటంకంగా కొనసాగుతున్న దౌర్జన్యాలు.. తత్ఫలితంగా తలెత్తిన విప్లవం.. ఆ పంథాపట్టిన పిల్లల తల్లి పడే బాధ.. రాజ్యహింస వంటి కీలకాంశాలను అన్వయిస్తూ రచన కొనసాగుతుంది. అదే విధంగా 'ద్రౌపది' అనే రచన ఆదివాసీ యువతిగా ఉన్న దోప్దీ మెజెన్ అనే పాత్ర ద్వారా, సైనిక హింస, బలాత్కారం, మరియు తిరుగుబాటు శక్తిని ప్రతిబింబిస్తుంది. 'అరణ్యేర్ అధికార్' అంటూ 'ఎవరిది అడవి' అని ప్రశ్నిస్తుంది. ఆదివాసీ పోరాట యోధుడు బిర్సా ముండా జీవితం ఆధారంగా మహాశ్వేతా దేవి ఈ నవల రాసింది. దీనికి 1979లో జ్ఞానపీఠ్ అవార్డు లభించింది. ఆమె రచనలు మితిమీరిన భావుకతను కాకుండా, మట్టి వాసనలతో కూడిన నిశిత వాస్తవికతను ప్రతిబింబిస్తాయి. జాతి, వర్గ, లింగ వివక్షల దయనీయ రూపాన్ని తేటతెల్లం చేస్తాయి. ఆదివాసీ, శ్రమజీవి, మహిళల జీవన యథార్థం పరిస్థితులు.. ఘటనలు.. సమస్యలు.. కన్నీళ్లు.. అస్తిత్వ పోరాటాలు ఆమె రచనల్లో ప్రధాన వస్తువులు. నిర్లక్ష్యానికి గురైన, అణగారిన వర్గాల గురించి ఇంతలోతుగా అధ్యయనం చేసినవారు చాలా అరుదు. ఆ అధ్యయన సారాంశాన్ని అక్షరబద్ధం చేసిన వారు మరీ అరుదు. ఆమె పాత్రలు నిస్సహాయంగా కనపడినా, ఆఖరికి వారు తిరుగుబాటును ఎన్నుకుంటాయి. 'ద్రౌపది'లో నాయిక బాధితురాలు మాత్రమేకాదు. ప్రతికారేచ్ఛతో రగిలిపోయే నెగడుగా నిలబడే శక్తిమంతురాలిగా కూడా సాక్షాత్కరిస్తుంది. భారతీయ విద్యావ్యవస్థ, న్యాయ వ్యవస్థ, పోలీసు వ్యవస్థల శోషణాత్మక స్వరూపాన్ని ఆమె తన రచనల్లో సాధికారికంగా విశ్లేషిస్తుంది. లోపాలను ఎండగడుతుంది. సాహిత్యాన్ని సామాజిక మార్పు సాధనంగా మార్చిన మహాశ్వేతాదేవి రచనలు సామాజిక ఉద్యమాలలో ప్రేరణగా నిలుస్తాయి. ఆమె ప్రతి రచనలోనూ ప్రత్యక్షంగా లేదా పరోక్షంగా సామాజిక రుగ్మతులు, దోపిడీ, అణచివేతలపై తిరుగుబాటు తప్పదనే సందేశం ఉంటుంది. ఆదివాసీ జీవితాలు, భాషలు, సంస్కృతి ఒకదానితో ఒకటి ఎలా ముడిపడుతున్నాయో చెప్పడంలో, సమకాలీన పరిస్థితులను వాటికి అన్వయించడంలో ఆమె నైపుణ్యం అనితర సాధ్యం. సాహిత్య రంగంలో ఉద్యమకారిణిగా పేరుపొందిన మహాశ్వేతా దేవికి పద్మశ్రీ (1986), పద్మవిభూషణ్ (2006), జ్ఞానపీఠ్ అవార్డు (1996) లభించాయి.

> మహాశ్వేతా దేవి కథలు చాలా విశిష్టమైనవి. భారతీయ సమాజంలో కుల, వర్గ దోపిడీ పీడనలకు ప్రత్యక్ష ప్రామాణికాలు. పిడికెడు సత్తు పిండి కోసం.. గుప్పెడు మెతుకుల కోసం.. కాసింత గంజి కోసం.. జానెడు నేల కోసం... తమను తాము వేలానికి పెట్టుకునే మనుషుల దైన్యానికి ప్రతీకలు. వీళ్లంతా బతకడం కోసం నిత్యం చస్తూ ఉంటారు. చస్తూ చస్తూ బతుకుతుంటారు.అస్తిత్వ పోరాటం సాగిస్తునే ఉంటారు. ఈ దుస్థితిని మహాశ్వేతా దేవి తన రచనల్లో కళ్లకుకడతారు. ఆమె సృష్టించిన పాత్రలు అన్యాయాన్ని ప్రతిఘటిస్తాయి. స్వేచ్ఛను చాటుతాయి. పోరాటాలకు సిద్ధమవుతాయి.




## చదవాల్సిన పుస్తకం


# 'అల్పజీవి' విశ్వరూపం

రావి శాస్త్రిగా లబ్ధప్రతిష్టుడైన అందరి వాడు... ఒక గాడికి కట్టాలంటే అందని వాడు, రాచకొండ విశ్వనాథ శాస్త్రి కథకుడిగానేకాదు.. నవలా రచయితగా కూడా అద్భుతాలు సృష్టించగలడని 'అల్పజీవి' రుజువు చేస్తుంది. కథా రచయితగా ఎనలేని పేరుప్రఖ్యాతులు ఆర్జించిన రావి శాస్త్రి చాలా తక్కువ సంఖ్యలో నవలలు రాశారు. వాటిలో, నిస్సందేహంగా 'అల్పజీవి' అత్యద్భుతమైనది. తెలుగు సాహితీ రంగంలో విశ్వరూపమై వెలుగొందుతున్నది. 1952లో రచించిన ఈ నవలలో రావి శాస్త్రి దార్శనికత అడుగడుగునా కనిపిస్తునే ఉంటుంది. ఇందులోని కథానాయుకుడు సుబ్బయ్య 'అల్పజీవి'. కొందరికి అతను ఏమీ చేతగాని చవటలా కనిపిస్తాడు. మరికొందరికి అమాయకుడిలా గోచరిస్తాడు. వెర్రిబాగులవాడన్న ముద్ర కూడా వేయించుకుంటాడు. 'లౌక్యం'గా పేర్కొనే 'బతకనేర్చినతనం' అతనికి లేదు. ప్రభుత్వ ఉద్యోగం... మంచి సీటు... కానీ, బల్లకింద చేయిపెట్టి సంపాదించడం తెలియదు. తోటి ఉద్యోగులు 'పిరికివాడు' అనే బిరుదు కూడా ఇచ్చేస్తారు. పుస్తకం చదువుతున్నంత సేపూ, మంచివాడికీ, పిరికివాడికీ మధ్య తేడా ఏమిటనే ప్రశ్న పాఠకుల మెదళ్లను తొలిచివేస్తునే ఉంటుంది. సుబ్బయ్య బావమరిది వెంకట్రావు మహా ఘటికుడు. ఆస్తులు పోగొట్టుకున్నా 'గీర' తగ్గలేదు. అతను గురువయ్య దగ్గర అప్పు తీసుకోని, తిరిగి చెల్లించడు. వెంకట్రావు నుంచి డబ్బు రావన్న నిర్ధారణకు వచ్చిన గురువయ్య, బాకీ వసులు చేసుకోవడానికి 'అల్పజీవి' సుబ్బయ్యను వేధించడం మొదలు పెడతాడు. ఈ పరిణామంతో సుబ్బయ్యలో జరిగే సంఘర్షణే ఈ నవలకు ప్రాణం. 'చైతన్య స్రవంతి' ప్రక్రియలో కొనసాగే ఈ నవల పేరే కొత్తగానూ, ఆలోచనాత్మకంగానూ ఉంది. ఈ నవల గొప్పతనమంతా సుబ్బయ్య అంతర్మథనమే. ఒక్కొక్కసారి ఈ సుబ్బయ్య మీద మనకి జాలి కలుగుతుంది. అలాగే ఇంకొకసారి ఇతని చేత కాని తనం చూసి కోపం వస్తుంది. 'మంచితనం, పిరికితనం ఒకచోట ఉండలేవు' అంటాడు రచయిత. ఈ నవల మనుషుల జీవితాల్లోని వివిధ కోణాలను స్పృశిస్తుంది. పుస్తకం మొత్తం చదివిన తర్వాత మనకు ఎదురయ్యే ప్రశ్న 'అల్పజీవి' ఎవరు? ఈ ప్రశ్న సమాధానం వెతుక్కునే పని పాఠకుడిదే. పాఠకుడి మీదే వదిలేస్తారు రచయిత. ఒక మంచి పుస్తకాన్ని చదివిన అనుభూతిని మిగిల్చే 'అల్పజీవి' తప్పనిసరిగా చదాల్సిన పుస్తకాల్లో ఒకటి. ఇది మనిషి నైజాలను, జీవిత నిజాలను ఎత్తిచూపే కవాటం. దీని ద్వారా సమాజం మీద, మనషుల మనస్తత్వాల మీద రావి శాస్త్రి తక్కువ మాటల్లో గంభీరమైన ప్రశ్నలు సంధించారు. ఈ పుస్తకం చదువుతున్నప్పుడు, ఏదో ఒక దశలో కథానాయకుడి స్థానంలోకి చొచ్చుకుపోయి, ఏదో ఒకటి చేసేద్దామని అనుకోని పాఠకుడు ఉండడు.ఆటపాటల్లో కాలం గడపాల్సిన బాల్యంలోనే రావి శాస్త్రి రచనలు ప్రారంభించాడు. 13వ ఏట ప్రారంభమైన రావి శాస్త్రి రచనా ప్రస్థానం, సాహిత్యం పట్ల ఆసక్తి, 1993 నవంబర్ 10న, తన 71వ ఏట తుదిశ్వాస విడిచేవరకూ కొనసాగింది. 1953లో తన తొలి నవల 'అల్పజీవి'తో విశేష ఆదరణ పొందాడు. సామాజిక స్పృహతో ఆయన నవలా ప్రక్రియకు కొత్త రూపాన్నిచ్చారు. పతితులు, భ్రష్టులు, బాధాసర్పదష్టులకు ప్రతినిధిగా నిలబడడంలో శ్రీశ్రీ సరసనే ఉంటారు రావి శాస్త్రి. 'అల్పజీవి' నవలను శ్రీశ్రీ రాస్తే బాగుండేదని ఆయనే స్వయంగా అంటారు. శ్రీశ్రీది కవితా ఝురికాగా, రావి శాస్త్రిది కథా స్రవంతి. ఇద్దరూ సామాన్యుల పక్షాన నిలబడిన వారే. ధనిక, పెత్తందారీ వర్గాలు, ఆధిపత్య శక్తుల చేతిలో సగటు జీవి విలవిల్లాడే పరిస్థితులను నిరశించారు. అక్షరాలే ఆయుధంగా మలచి, పోరాటాలకు ఊపిరిపోశారు. పోలీసు వ్యవస్థలో లోపాలను, పాలక వర్గాలకు కొమ్ముకాస్తూ, సామాన్యుడిని వేధించే విధానాలను రావి శాస్త్రి సునిశితంగా విమర్శించారు. వాస్తవాలు తెలుసుకొని, మంచిచెడులను విశ్లేషించి, ప్రజలకు మార్గదర్శకం చేసినప్పుడే రచనలకు సార్థకత చేకూరుతుందని ఆ యన అంటారు. తాను అనుసరించి చూపారు. తర్వాతి తరాల రచయితలకు మార్గదర్శకులయ్యారు. 'అల్పజీవి' నవల ఆయన కీర్తి ప్రతిష్టలను మరింత ఉన్నత స్థాయికి చేర్చింది.




# పాలస్తీనియన్ల ప్రతినిధి జకారియా

పాలస్తీనా కవి జకారియా మహమ్మద్ వ్యక్తిత్వం, సాహిత్యయాత్ర, స్వేచ్ఛ కోసం జరుగుతున్న ఉద్యమం పట్ల ఉన్న నిబద్ధత అతనికి ప్రత్యేక స్థానాన్ని సంపాదించిపెట్టాయి. జకారియా లక్షలాది మంది పాలస్తీనియన్లకు ప్రతినిధి.. వారు ఎదుర్కొంటున్న అణచివేతను ప్రపంచ దృష్టికి తీసుకెళ్లే వారధి. స్వరాజ్య ఆశల పల్లకీని మోసిన కవి. కొన్ని దశాబ్దాలుగా పాలస్తీనా ఓ రగులుతున్న జ్వాల. దౌర్జన్యాలను ఎదుర్కొంటున్న భూభాగం. అక్కడ వీచేగాలి.. పారే నీరు.. మొలిచే గడ్డి... పెరిగే ప్రాణి... ప్రతిదీ ఆవేదనను అనుభవిస్తున్నవే. అటువంటి నిస్సహాయత, అణచివేత, పోరాటాన్ని తన కలం ద్వారా ప్రపంచానికి పరిచయం చేసినవారిలో జకారియా అగ్రస్థానంలో ఉంటాయి. పాలస్తీనా ప్రజల నమ్మకాన్ని, ఉద్యమ గాథలను కవిత్వంగా వ్యక్తీకరించిన ఆయన రచనలు అక్కడి సాహిత్యంలో ఒక శాశ్వత వెలుగు రేఖలా నిలిచిపోయాయి. నాబ్లస్ సమీపంలోని అల్ జావియాలో, 1951లో జన్మించిన జకారియా అక్కడి అనిశ్చిత పరిస్థితులపై స్పందించి, పాలకవర్గాల ఆగ్రహానికి గురై, ఇరాక్ రాజధాని బాగ్దాద్‌కు వలస వెళ్లాడు. అక్కడ అరబిక్ లిటరేచర్‌లో పట్టాపొందాడు. సుమారు 25 సంవత్సరాల తర్వాత తిరిగి పాలస్తీనా భూభాగంలోకి అడుగుపెట్టిన అతను, 2023 ఆగస్టు 2న తుదిశ్వాస విడిచాడు. పాలస్తీనియన్ల ఆశలు... ఆకాంక్షలకు అక్షర రూపాన్నిచ్చిన జకారియాను ప్రజావేదనకు రాయబారిగా పేర్కొంటారు. పాలస్తీనా ప్రజల జీవితాన్ని దగ్గరగా గమనించిన జకారియా, రాజకీయ అణచివేతలు, ఇజ్రాయెల్ ఆధిపత్య వ్యతిరేక పోరాటాలు, శరణార్థ శిబిరాల్లో జీవితం వంటి అంశాలను తన కవిత్వంలో నిలిపారు. అతని రచనలు పాలస్తీనా ప్రజల బాధను, నిశ్శబ్దం వెనకున్న ఆక్రోశాన్ని వ్యక్తపరుస్తాయి. కవిత్వం ఆయనకు ఒక ఆయుధంగా, ప్రజల ఆశలకు ప్రతిరూపంగా మారింది. జకారియా కవితల్లో అధికంగా చిన్న వాక్యాలే కనిపిస్తాయి. కానీ వాటి లోతు మాత్రం అనంతం. జకారియా రాసిన తొమ్మిది కవితా సంకలనాలు, నాటికలతో కూడిన ఒక సంకలనం ఇటీవల విడుదలయ్యాయి. పాత్రికేయుడిగా, సంపాదకుడిగా, రచయితగా జకారియా భిన్న పాత్రలు పోషించినప్పటికీ, ప్రతి క్షణం పాలస్తీనియన్ల గురించే ఆలోచించాడు. వారి హక్కుల కోసమే గళం విప్పాడు. వారి ప్రతినిధిగా మారాడు. సమస్యలపై ఎలుగెత్తాడు. అందుకే ఆయన రచనలకు అంతటి ఆదరణ... ప్రత్యేకత.




### 'నేను నా ఇంటిని కోల్పోయాను

కానీ నా కలల్ని కాదు' అనే వాక్యాలే ఆయన శైలిని చెప్పగలవు. పాలస్తీనా ప్రజల సాంస్కృతిక గుర్తింపును నిలబెట్టేందుకు ఆయన కవిత్వం ఒక గొంతుగా మారింది. ప్రతి చెట్టు వద్ద ఒక కవిత.. ప్రతి రాయి వెనక ఒక కథ.. అనే రీతిలో జకారియా ప్రతి అంశాన్నీ తన రచనల్లో ఆవిష్కరించాడు. జకారియా కవిత్వం ఆవేదనను మాత్రమే వ్యక్తీకరించదు... అది మానవత్వాన్ని, నమ్మకాన్ని కూడా పోషిస్తుంది. పాలస్తీనా ఉద్యమాన్ని సరళంగా, కానీ లోతుగా ప్రపంచానికి పరిచయం చేసింది. అతని రచనలు జాతీయతను ప్రతిబింబించాయి. మానవ హక్కులను కూడా పద్యంలో బంధించాయి. ఒక్క మాటలో చెప్పాలంటే, జకారియా లాంటి కవులు పాలస్తీనా ప్రజల గొంతులు. వారు చెప్పలేని బాధను, ఆశను, విరహాన్ని కవిత్వంగా ప్రపంచానికి అందించినవారు. పాలస్తీనా భూభాగంపై ఆటుపోట్లు తగ్గినప్పుడు కూడా జకారియా కవితలు మారుమూల శిబిరాల్లో, మూతపడిన తాళం గదుల్లో, ఆకలితో తేలిపోయిన హృదయాల్లో జీవించగలవు. ఆయన కవిత్వం స్వాతంత్ర్య ఆశకి ప్రతిరూపం.

# పీటర్ ర్యాబిట్‌కు 'ప్యాటర్' ప్రాణప్రతిష్ఠ

బాల సాహిత్యం అంటే ముందుగా గుర్తుకువచ్చే పుస్తకాల్లో ముందు వరుసను ఆక్రమిస్తుంది 'ది  ది ఆఫ్ పీటర్ ర్యాబిట్'. బాల సాహిత్యాన్ని కొత్త పుంతలు తొక్కించిన హెలెన్ బీయాట్రిక్స్ ప్యాటర్ ఈ పుస్తకాన్ని రాయడమేకాదు.... స్వయంగా అందమైన బొమ్మలు వేసి ప్రాణప్రతిష్ట చేసింది. 1866, జులై 28న లండన్ (ఇంగ్లాండ్)లో జన్మించిన ప్యాటర్, 1943, డిసెంబర్ 22న తుదిశ్వాస విడిచింది. వందేళ్లకుపైగా ప్యాటర్ రచనలు పిల్లల హృదయాలను అలరిస్తునే ఉన్నాయంటే, ఆమె శైలి, బొమ్మల తీరు ఎంత విలక్షణమైనవో ఊహించుకోవచ్చు. 1902లో విడుదలైన 'ది  ది ఆఫ్ పీటర్ ర్యాబిట్' ఆమెకు ఎనలేని కీర్తిప్రతిష్టలను సంపాదించిపెట్టింది. 'ది  ది ఆఫ్ జమీమా పడల్‌డక్', 'ది  ది ఆఫ్ టామ్ కిట్టెన్', 'ది  ది ఆఫ్ బెంజిమిన్ బన్నీ' తదితర రచనలు బాల సాహిత్యంలో మైలురాళ్లుగా నిలిచి ఉన్నాయి. ఈ రచనలన్నీ చిన్న పిల్లల మానసిక అభివృద్ధికి అనుగుణంగా, జంతువుల పాత్రలతో, బొమ్మలతో పాఠశాల వయస్సులో ఉన్న పిల్లలకు ఎంతో ఆహ్లాదకరంగా ఉంటాయి. ప్యాటర్ స్వయంగా తన కథలకు అందమైన, ఆకర్షణీయమైన బొమ్మలను కూడా వేసేది. ఆమె బొమ్మల శైలిలో ప్రకృతి, పక్షులు, జంతువులు చాలా సహజంగా, చక్కగా ఉంటాయి. ప్యాటర్ స్వతఃగా ప్రకృతి ప్రేమికురాలు. లేక్ డిస్ట్రిక్ట్ ప్రాంతం అంటే ఆకు ఎంతో ఇష్టం. తన రచనల ద్వారా సంపాదించిన డబ్బుతో భూములు కొనుగోలు చేసి, ప్రకృతిని పరిరక్షించేందుకు శక్తివంచన లేకుండా ప్రయత్నించింది. నేషనల్ ట్రస్ట్‌కు తనవంతు సహకారాన్ని అందించడం ద్వారా లేక్ డిస్ట్రిక్ట్ ప్రాంతాన్ని ఆక్రమణలు, కాలుష్యం నుంచి కాపాడగలిగింది. శాస్త్రీయ సూక్ష్మ జీవశాస్త్ర పరిశోధకురాలిగా కూడా రాణించింది. నేటికీ చాలా ప్రాంతాల్లో ప్రత్యక్షంగానో, పరోక్షంగానో కొనసాగుతునే ఉన్న పురుషాధిక్యత అప్పట్లో మరింత ప్రబలంగా ఉండేది. అందుకే, శాస్త్రవేత్తగా ఆమె ప్రతిభకు తగినంత గుర్తింపు రాలేదు. కానీ, రచయిత్రిగా మాత్రం ఆమె సామర్థ్యాన్ని ఎవరూ అడ్డుకోలేకపోయారు. అనేక టీవీ షోలు, కార్టూన్లు, సినిమాలకు స్ఫూర్తిదాయకమైన 'ది  ది ఆఫ్ పీటర్ ర్యాబిట్' నేటికీ అత్యుత్తమ బాల సాహిత్యంలో కిలకితురాయిగా వెలుగుతున్నది.



పిల్లల సాహిత్యంలో ఆధునిక శకానికి బీజం వేసిన ఒక గొప్ప రచయిత్రిగా ప్యాటర్ పేరు చరిత్ర పుటల్లో నిలిచిపోయింది. 'పీటర్ ర్యాబిట్' కథ విషయానికి వస్తే, తల్లి నక్క, తన నాలుగు పిల్లలు, ఫ్లోప్సీ, మాప్సీ, కాటన్‌టేల్, పీటర్‌లతో సంతోషంగా ఉంటుంది. పొరపాటున కూడా మిస్టర్ మెక్‌గ్రెగర్ తోటలోకి వెళ్లకూడదని పిల్లలకు హితబోధ చేస్తుంది. స్కాట్‌లాండ్‌కు చెందిన మెక్‌గ్రెగర్ ఏ విధంగా కుందేళ్లను తన తోటలోకి రాకుండా అడ్డుకుంటాడో, అక్కడికి వెళ్లిన తన భర్త ఏ విధంగా చిక్కుకుపోయి, తిరిగి రాలేకపోయాడో వివరిస్తుంది. తల్లి మాటలు పట్టించుకోని పీటర్, తన సహజమైన కుతూహలంతో మెక్‌గ్రెగర్ తోటలోకి జారుకుంటాడు. అక్కడ తనకు ఇష్టమైన ముల్లంగి, క్యారెట్, బీన్స్ తింటూ, ఆనందిస్తుంటాడు. అయితే, మెక్‌గ్రెగర్ హఠాత్తుగా ప్రత్యక్షం కావడంతో, అక్కడి నుంచి తప్పించుకోవడానికి నానా తంటాలు పడతాడు. తోటలు పరుగులు తీస్తున్న క్రమంలో తన కోటు, బూట్లు కోల్పోతాడు. చివరికి ఒక ఎలుక సాయంతో తల్లి వద్దకు చేరుకుంటాడు. జరిగిన ఉదంతాన్ని తెలుసుకున్న తల్లి, ఆ రోజు రాత్రికి టీ మాత్రమే ఇస్తుంది. పీటర్ ఆ రోజు భోజనాన్ని కోల్పోతాడు. పెద్దల మాట వినకపోతే చిక్కుల్లో పడతారన్న నీతితో కథ ముగుస్తుంది. ప్యాటర్ స్వయంగా ఈ కథకు అందమైన బొమ్మలు వేసింది. నీలం రంగు కోటు వేసుకున్న నక్కగా పీటర్ పాత్ర ప్రత్యేక గుర్తింపు తెచ్చుకుంది. ఈ కథ ఆధారంగా అనేక కార్టూన్లు, టీవీ షోలు, సినిమాలు వచ్చాయి. 2018లో 'పీటర్ ర్యాబిట్' అనే హాలీవుడ్ యానిమేటెడ్ మూవీ విడుదలైంది.

## ఆచార్య వాసిరెడ్డి భాస్కరరావు స్మారక సాహిత్య పురస్కారం 2025 కోసం

## విమర్శా గ్రంథాలకు ఆహ్వానం

అరసం వరంగల్ శాఖ ప్రతి సంవత్సరం ఒక్కో సాహిత్య ప్రక్రియకు ఆచార్య వాసిరెడ్డి భాస్కర రావు స్మారక సాహిత్య పురస్కారం ప్రదానం చేస్తున్న విషయం తెలిసిందే. 2025 సంవత్సరానికి గాను 'సాహిత్య విమర్శ'కు ప్రదానం చేయాలని నిర్ణయించిన నేపథ్యంలో, సాహిత్య విమర్శనా గ్రంథాలను ఆహ్వానిస్తున్నారు.

నిబంధనలు

- 2021 జులై నుండి 2025 జూన్ మధ్యకాలంలో ప్రచురించినవై ఉండాలి.
- మొదటి ముద్రణలు మాత్రమే పంపాలి.
- ఒక్కో పుస్తకం నాలుగు ప్రతులు పంపాలి.
- అన్ని ప్రాంతాల వారు పంపవచ్చును.
- వివిధ రచయితల కూర్పు లేదా సంకలనాలు పంపరాదు.
- ప్రతులు చేరవలసిన చివరి తేదీ 31 ఆగస్టు.
- ఎంపికైన గ్రంథకర్త కు అక్టోబర్‌లో హనుమకొండలో జరిగే ప్రత్యేక కార్యక్రమంలో, శాలువా, జ్ఞాపికలతో పురస్కారాన్ని ప్రదానం చేసి, నగదు బహుమతి అందిస్తారు.
- పుస్తకాలు పంపవలసిన చిరునామా

**బూర భిక్షపతి**
**ఇంటి నెంబర్, 2–12–293/20**
**రోడ్ నెంబర్ 2B**
**విజయనగర్ కాలని, గోపాలపురం రోడ్డు**
**హనమకొండ 506009 (తెలంగాణ)**
**ఫోన్: 9866612712**

## ఈ వారం కవితలు

### అమ్మా నీకు వందనం



వందనమమ్మా వందనం
అమ్మ నీకు వందనం
మా అమ్మ నీకు వందనం
పాదాభివందనం

పురిటి నొప్పులు తీసినావు
పురుడు నాకు పోసి నావు
మరో జన్మ ఎత్తి నీవు
జన్మ నాకు ఇచ్చినావు

అమ్మ నీకు వందనం
మా అమ్మ నీకు వందనం
పాలిచ్చి లాలిస్తూ..
ఒడినే ఉయ్యాల జేసి

కంటికి రెప్పలా కాపాడిన
తల్లివమ్మా
వందనమమ్మా వందనం
అమ్మ నీకు వందనం

తనువంతా ధారవోసి
కూటి కోసం పని జేసి
నీ ఆకలి సంపుకొని
నా ఆకలి తీర్చినావు

నీ ప్రేమ ఎంత త్యాగమో
నీ మనసు అంత అమోఘం
సుఖ మంటే తెలియకుండా
కష్టాలను ఈదినావునా

చదువుకు నీనగలు అమ్మి
ఫీజు కట్టి నావు అమ్మ నిన్ను
మరువలేను
నన్ను కడుపులో మోసినట్లు
నిన్ను గుండెలో దాచుకున్న
కలకాలం తల్చుకుంటూ..
చిరకాలం పూజిస్తా
అమ్మ నీకు వందనం
పాదాభివందనం

**– చంద్రమోహన్ గౌడ్**
**9866510399**

### సాధిద్దాం బిసిల స్వప్నం

పెంకు మీద రొట్టెల్లా కాల్చుకు తిన్నారు
గాని ఒక్కనాడు పెంకు గురించి ఆలోచించలె
బీసీల గురించి పట్టించుకోలే
అరిగిపోయినవి పెంకులు
రొట్టెలు తిన్న ఆరోగ్యంతో అన్నీ ఏలిండ్రు

స్వాతంత్ర అమృతోత్సవాలు
ఘనంగా సంబరాలు
సబ్బండులకు స్థానం లేని
స్వాహా స్వాతంత్ర్యం !
కమీషన్లు డిక్లరేషన్లు రిపోర్టులు

తీర్మానాలన్నీ పాడెలమీదే!
రిజర్వేషన్లు నువ్వు తగ్గించావంటే
నువ్వు వంచించావంటే
నువ్వు ముంచావంటే
నువ్వే కుండగొట్టావంటే
ఒకరి మీద ఒకరు దుమ్ముపోసుకోవడమే

గానిదగ్గరికి తీసింది లేదు
సత్యహరిచంద్ర నాటకం కన్నా
బిసి నాటకమే ఎక్కువ

అత్యున్నత అవార్డుకు ఎంపికైన
బిసి రిజర్వేషన్ల నాటకం!
పిల్ల పుట్టనేలేదు కుల్లలు కట్టింద్రు
మొగ్గలు విచ్చుకోనేలేదు మొగులుకు గుల్లాలు
సన్నాసుల సన్మానాలు
రాముడికి హనుమంతునిలా
పటేల్ పట్వారీలకు కావలి కారులా

బిసిల సేవలు జంగిడిలా మలుపుకున్నారు
బిసిలు అంటేబానిసలు కాదు బహుజనంనే
ను సంజీవ పర్వతం ఎత్తకపోతే

మీ రామాయణానికి చోటే లేదు
నేను కలం పట్టకపోతే భారతానికి పుట్టుకెక్కడిది
నేను బొటనవేలు ఇవ్వకుంటే నువ్వు
యుద్ధంలో గెలిచేవాడా అర్జునుడు

అభినందనలు అందుకునే వాడా?
రామా !ఇదేం నీతి
మనమంతా హిందువులం
గంగా, సింధు బిందువులం
అరిచి అరిచి ఎదలు అలిసినవి
మేఘాలు కమ్ముకున్న ప్రతిసారి
ఎక్కడేసిన గొంగడి ఆడ్నే వుంది
బిసిలం  హిందువులం కామా

'మమ్మల్ని అడగలేదు 'మమ్మల్ని అడుగుతేనే
9వ షెడ్యూలుకు తోరణం కడ్తాం?
కాషాయంలో కులఅహంకారం
శూద్రులు రాజకీయాలకు శాపమా
బిసిల కన్నీళ్ళు కన్నీళ్లు కావా
బిసిలెప్పుడు మీ కుర్చీలకు కాళ్లేనా
ఇడబ్ల్యుఎస్‌లో ఎవరిని అడిగి
పదిశాతం పెట్టింద్రు
వంచించడానికి అమోదాలుంటాయి
కులగణన క్రెడిట్ నాదేనంటూ
బోనాలెత్తి డోళ్లు కొట్టి డొల్లయింద్రు
అమ్మవారికి బోనం ఎక్కముందే
నైవేధ్యం పులసింది !
నోటికాడి కూటికుండను పగులగొట్టిన
కుట్రలన్నీ బొందపెడ్తాం సాధిస్తాం
బిసిల స్వప్నాలను

**– వనపట్ల సుబ్బయ్య**
**9492765358**

## సిఆర్‌టి, ఎస్‌జిటి పరీక్షలు ప్రశాంతం

ప్రజాపక్షం / ఆసిఫాబాద్ : జిల్లాలో ఆదివారం నిర్వహించిన సిఆర్‌టి, ఎస్‌జిటి పరీక్షలు ప్రశాంతంగా ముగిశాయి. జిల్లా కేంద్రంలోని టిజిటిడబ్ల్యుయుఆర్‌జెసి. (పిజిటి బాలుర), ఆశ్రమ పాఠశాల (బాలికలు), ఆసిఫాబాద్ (స్పోర్ట్స్ స్కూల్)లలో ఏర్పాటు చేసిన పరీక్షా కేంద్రాలను జిల్లా అదనపు కలెక్టర్ దీపక్ తివారి పరిశీలించారు. అదనపు కలెక్టర్ మాట్లాడుతూ అభ్యర్థులకు అన్ని సౌకర్యాలు కల్పించినట్లు తెలిపారు. అత్యవసర సేవల నిమిత్తం వైద్య సిబ్బందిని నియమించి,మందులను అందుబాటులో ఉంచామన్నారు.



## వంతెన కోసం రాస్తారోకో



ప్రజాపక్షం/తానూర్: మండలంలోని ఝరి(బి) గ్రామస్తులు బ్రిడ్జి నిర్మాణం చేపట్టాలని ఆదివారం బెల్ తరోడా,హైవేపై రాస్తారోకోను చేపట్టారు. ఎన్నో సంవత్సరాలుగా వంతెన నిర్మించాలని కోరుతున్నా ఎవరు పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. తానూర్ ఎస్‌ఐ షేక్ జుబేర్,ఘటన స్థలానికి చేరుకుని వారిని సముదాయించే ప్రయత్నం చేశారు. కలెక్టర్,ఆర్డిఓ,అధికారులు వచ్చి తమకు హామీ ఇచ్చేవరకు రాస్తారోకోను ఆపే ప్రసక్తి లేదని స్పష్టం చేశారు. ముధోల్ సిఐ మల్లేష్, ఎంపీడీఓ నసురుద్దీన్ వచ్చి బైంసా ఆర్డిఓ కోమల్‌రెడ్డికి ఫోను చేశారు. సమస్య పరిష్కరిస్తానని హామీ ఇవ్వడంతో గ్రామస్తులు రాస్తారోకో విరమించారు.

## జిపిఒ లైసెన్స్ సర్వేయర్ పరీక్షకు 14మంది గైర్హాజరు

### నిజామాబాద్ కలెక్టర్ వినయ్‌కృష్ణారెడ్డి



ప్రజాపక్షం/నిజామాబాద్ : గ్రామ పాలన అధికారులు (జీపీఓ), లైసెన్స్‌డ్ సర్వేయర్ల నియామకం కోసం నగరంలోని గిరిరాజ్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఆదివారం నిర్వహించిన పరీక్షా కేంద్రాలను కలెక్టర్ టి.వినయ్‌కృష్ణారెడ్డి ఆకస్మికంగా తనిఖీ చేశారు. పరీక్షల నిర్వహణ తీరును నిశితంగా పరిశీలించారు. అభ్యర్థుల హాజరుపై ఆరా తీశారు. గ్రామపాలన అధికారి పరీక్షకు 60 మంది అభ్యర్థులకు గాను 46మంది హాజరయ్యారని 14 మంది గైర్హాజరైనట్లు కలెక్టర్ తెలిపారు. పోలీసు బందోబస్తు నడుమ సజావుగా పరీక్షలు నిర్వహిస్తుండటాన్ని గమనించిన కలెక్టర్ సంతృప్తి వ్యక్తం చేశారు. అదనపు కలెక్టర్ కిరణ్‌కుమార్, పరీక్ష కేంద్రం చీఫ్ సూపరింటెండెంట్ రామ్మోహన్‌రావు, సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ ఎడీ అశోక్, జిల్లా పరిశ్రమల కేంద్రం జనరల్ మేనేజర్ సురేష్‌కుమార్, కలెక్టరేట్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ ప్రశాంత్ తదితరులున్నారు.

## నిర్మల్‌లో 18మంది గైర్హాజరు

### నిర్మల్ కలెక్టర్ అభిలాష అభినవ్



ప్రజాపక్షం/నిర్మల్ టౌన్ : జిపిఓ (గ్రామ పాలన అధికారులు) లైసెన్స్డ్ సర్వేయర్ల నియామక పరీక్షల నిర్వహణను జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ అదివారం పరిశీలించారు. అదనపు కలెక్టర్ (రెవెన్యూ)తో కలిసి పట్టణంలోని చాణక్య హైస్కూల్, ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో పరీక్షా కేంద్రాలను తనిఖీ చేశారు. జిపిఓ పరీక్షకు మొత్తం 55 మంది అభ్యర్థులు హాజరుకావలసి ఉండగా,37 మంది మాత్రమే హాజరయ్యారని, 18 మంది గైర్హాజరయ్యారని తెలిపారు.ఆర్డీవో రత్నకళ్యాణి,నోడల్ అధికారి ఆర్.సుదర్శన్,పర్యవేక్షకులు మోతీరాం,సూర్యారావు,రాజేశ్వర్ గౌడ్,తహసిల్దార్ రాజు,పోలీసు సిబ్బంది,ఇతర అధికారులు పాల్గొన్నారు.

## 'నేడు' రేషన్ కార్డుల పంపిణీ

ప్రజాపక్షం / సిర్పూర్ టి : పేదల సంక్షేమమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన నూతన రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమం సోమవారం సిర్పూర్ టౌన్‌లో జరుగనుంది. మండల కేంద్రంలోని రైతు వేదికలో మధ్యాహ్నం 2 గంటలకు ఈ కార్యక్రమం నిర్వహించనున్నారు. 282 నూతన రేషన్ కార్డులు, 608 సభ్యుల నమోదు కార్డులు లబ్ధిదారులకు అందజేయనున్నట్లు అధికార వర్గాలు వెల్లడించాయి. జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి జుపెల్లి కృష్ణారావు, ఎంఎల్‌సి దండె విట్టల్, శాసనసభ సభ్యులు పాల్వాయి హరీష్‌బాబు ముఖ్య అతిథులుగా హాజరవుతారని తహసీల్దార్ రహీముద్దీన్ తెలిపారు. లబ్ధిదారులు సకాలంలో హాజరై కార్డులు పొందాలని ఆయన సూచించారు.

## పేకాట గుట్టురట్టు

### ఏడుగురు అరెస్ట్, నగదు, వాహనాలు స్వాధీనం



ప్రజాపక్షం / మందమర్రి : మందమర్రి పోలీస్ స్టేషన్ పరిధిలో అసాంఘిక కార్యకలాపాలపై ఉక్కుపాదం మోపుతున్నామని పట్టణ ఎస్‌ఐ రాజశేఖర్ తెలిపారు. ఆదివారం అందిన పక్కా సమాచారంతో శాంతినగర్ కాలనీలో గల శివ అనే వ్యక్తి ఇంట్లో నిర్వహిస్తున్న పేకాట స్థావరంపై దాడి చేసినట్లు చెప్పారు. ఈ దాడిలో పేకాట ఆడుతున్న ఏడుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకొని, వారి వద్ద నుంచి రూ.38,150 నగదు, ఆరు సెల్‌ఫోన్లు, రెండు ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నామని పేర్కొన్నారు. పేకాట ఆడేందుకు స్థలాన్ని అనుమతించి కమీషన్ వసూలు చేస్తున్న ఇంటి యజమాని శివపై కూడా కేసు నమోదు చేశామని తెలిపారు. పేకాటదారులైన కట్టా దుర్గారావు, దాసరి నర్సయ్య, పుడమ శివ, గరిక కుమార్, మేకల రాజశేఖర్, కట్టా రమణ, తన్నీరు రవిని అదుపులోకి తీసుకున్నామని వివరించారు. నగదు, సెల్‌ఫోన్లు, ద్విచక్ర వాహనాలను సీజ్ చేసినట్లు వెల్లడించారు. ఈ ఆపరేషన్‌లో చాకచక్యంగా వ్యవహరించిన ఎస్‌ఐ రాజశేఖర్‌తో పాటు, ఎఎస్‌ఐ మిలింద్ కుమార్, కానిస్టేబుళ్లు శ్రీనివాస్, రాకేష్, విశ్వనాథ్, కృష్ణ, చైతన్యలను సర్కిల్ ఇన్‌స్పెక్టర్ శశిధర్ రెడ్డి అభినందించారు.

## బాలల హక్కుల సంరక్షణపై ప్రత్యేక దృష్టి

### రాష్ట్ర కమిషన్ సభ్యులు వందనగౌడ్



ప్రజాపక్షం/గజ్వేల్: రాష్ట్రంలో బాలల హక్కులు, సంరక్షణపై ప్రత్యేక దృష్టి సారించి చర్యలు తీసుకుంటున్నట్లు రాష్ట్ర బాలల హక్కుల కమిషన్ సభ్యులు వందన గౌడ్ పేర్కొన్నారు. ఆదివారం అల్లిపూర్ కేజీబీవీ పాఠశాల సందర్శించిన సందర్భంగా చైల్డ్ వెల్ఫేర్ కమిటీతో కలిసి ఆమె మాట్లాడారు. బాలలచే వెట్టి చాకిరి చేయించడం చట్టరీత్యా నేరమని, బడి ఈడు పిల్లలందరూ బడుల్లోనే ఉండాలని ఆకాంక్షించారు. బాలల హక్కులు, సంరక్షణ తదితర అమలుకు ప్రత్యేక కార్యాచరణ రూపొందించి పటిష్ట చర్యలు తీసుకుంటున్నట్లు వివరించారు. కాగా మొదటగా అక్కడ గల వసతులు, లోటుపాట్లను పరిశీలించి తీసుకోవాల్సిన చర్యలను వివరించారు.

## ప్రజలు అప్రమత్తంగా ఉండాలి



ప్రజాపక్షం/రేగోడ్: మండల కేంద్రంలోని ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వైద్యాధికారి శ్వేతా వికాస్ అన్నారు గత నాలుగు రోజులుగా కురుస్తున్న వర్షాలకు ప్రజలు అప్రమత్తంగా ఉండాలని టైఫాడ్ జరం మలేరియా డెంగు చికెన్ గున్న వంటి విషజ్వరాలు వస్తున్నాయని ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అన్నారు ప్రతి ఒక్కరు పరిశుద్ధులతో పాటు పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని అన్నారు ఇంటి పరిసరాల్లో మురికి నీళ్లు నిలవకుండా చూడాలని అన్నారు ఎవరైనా సర్ది జ్వరంతో బాధపడితే ప్రభుత్వ ఆసుపత్రిలో పరీక్షలు చేసుకోవాలని అన్నారు.

# అమ్మకానికి 'గౌరవ డాక్టరేట్లు'!



### రౌడీ షీటర్ల నుంచి ఉపాధ్యాయుల వరకూ కొనుగోలు దందా

ప్రజాపక్షం/ మంచిర్యాల : గౌరవ డాక్టరేట్ అనే పదానికి ఓ గౌరవం ఉంది. ఇది సాధారణంగా సాహిత్యం, కళలు, ప్రజాసేవ, విజ్ఞాన శాస్త్రం వంటి రంగాల్లో గొప్ప కృషి చేసిన వారిని గుర్తించి యూనివర్సిటీలు ప్రత్యేకంగా ప్రదానం చేసే పతకం. ఇది సంపాదించే పదవి కాదు, సంపాదించిన గౌరవం. నిజంగా సేవ చేసినవారికి ఇది అందితే ఆ గౌరవం పదిలంగా నిలుస్తుంది. కానీ ప్రస్తుతం గౌరవ డాక్టరేట్ విలువను కొన్ని సంస్థలు నాశనం చేస్తున్నాయి. కిందటి రెండు ఏళ్లుగా జిల్లాలో గౌరవ డాక్టరేట్ పతకాలు అమ్మకానికి మారాయి. చాలా మంది పేరు చెప్పుకోలేని యూనివర్సిటీల పేరిట డాక్టరేట్ పట్టాలనుకొంటున్నారు. ఎంతటివారైనా సులువుగా డాక్టర్ అనే పదాన్ని ముందు పెట్టుకోవచ్చు. ఇందులో ఆశ్చర్యకరమైన విషయమేమిటంటే ఓ రౌడీ షీటర్ కూడా డాక్టరేట్ పట్టా పొందడం జరిగింది. అతనిని చూసి ఓ రాజకీయ నేత కూడా అదే రూట్ లో డాక్టర్ అయిపోయాడు. ప్రస్తుతం ఈ ట్రెండ్ పాఠశాలల యాజమాన్యాలు, ఉపాధ్యాయులు వైపు కూడా పాకుతోంది. తమ పేరుకు ముందు డాక్టర్ అన్న పదం ఉండాలని, తాము అందరికంటే గొప్పవారని చెప్పుకోవాలనే ఆలోచనతో కొందరు ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలు ఇప్పుడు డాక్టరేట్ పట్టాల కోసం పోటీ పడుతున్నారు. కొన్ని సంస్థలు ఈ అవకాశాన్ని వాణిజ్యంగా మలుచుకుని 1.5 లక్షల నుంచి 3 లక్షల రూపాయల వరకు వసూలు చేస్తున్నాయి. ఇక ఉత్సాహంగా పెట్టుబడి పెట్టి డాక్టరేట్ పట్టా కొన్నవారు సోషల్ మీడియాలో డాక్టర్ పేరిట ప్రకటనలు పెడుతున్నారు.

### డాక్టర్ అనే పదానికి విలువ లేకుండా..?

గౌరవ డాక్టరేట్ అనేది నిజమైన ప్రజాసేవకులకు ఇవ్వాల్సిన గౌరవం. దాన్ని వ్యాపారంగా మార్చడం వల్ల పట్టాకు విలువ పోతోందని విద్యావేత్తలు మండిపడుతున్నారు. ఒరిజినల్ యూనివర్సిటీలను మోసం చేసే విధంగా ప్రైవేట్ సంస్థలు తనిఖీలకు గురికాకుండా నకిలీ గౌరవ డాక్టరేట్ పతకాలు పంపిణీ చేస్తున్నాయి. వాస్తవంగా గుర్తింపు ఉన్న విశ్వవిద్యాలయాలు ఇలాంటి వ్యవహారానికి పాల్పడవు. జిల్లాలో ఇప్పుడు డాక్టరేట్ కొనుగోలు దందా వేగంగా పెరుగుతోంది. ఇది ఆగకపోతే, నిజమైన కృషి చేసినవారికి ఇచ్చే గౌరవం నశించిపోతుందన్నది విద్యావర్గాల్లో జోరుగా చర్చ జరుగుతుంది.

### డాక్టరేట్ వెనక అసలు వాస్తవాలు..

గౌరవ డాక్టరేట్ అనేది పేద, ధనిక భేదం లేకుండా అత్యుత్తమ సేవలకు గుర్తింపుగా ఇవ్వాల్సిన గౌరవం. ప్రస్తుతం రూ. 1.5 లక్షల నుంచి రూ.3 లక్షల వరకూ కొన్ని సంస్థలు డబ్బు తీసుకుని పట్టాలను ఇస్తున్నాయి. జిల్లాలో ఇప్పటికే ఒక్క రౌడీ షీటర్, ఒకరు రాజకీయ నాయకుడు, పలువురు ప్రైవేట్ పాఠశాల యాజమాన్యాలు గౌరవ డాక్టరేట్‌లు పొందారు. కొన్ని సంస్థలు ఆన్‌లైన్‌లోసర్టిఫికెట్‌లు పంపించడమే కాకుండా, ప్రత్యేక సభలు నిర్వహించి డాక్టరేట్ పట్టాలను పంపిణీ చేస్తున్నాయి. ఇది ఆగకపోతే, గౌరవ పతకాలకు మరింత అవమానం తప్పదు. విద్యా సంస్థలు, ప్రభుత్వం దీనిపై చర్యలు తీసుకోవాలన్నది విద్యావేత్తల డిమాండ్. గౌరవాన్ని డబ్బుతో కొనే ఈ పద్ధతిని ఇప్పుడు ఆపకపోతే, నిజమైన విలువలకు మరింత నష్టం జరుగుతుందని స్పష్టంగా చెబుతున్నారు.

## నేరాల నిర్మూలనకే కమ్యూనిటీ కాంటాక్ట్

### కాగజ్‌నగర్ రూరల్ సిఐ కుమారస్వామి



ప్రజాపక్షం/కాగజ్‌నగర్ రూరల్ : నేరాల నిర్మూలనకే కమ్యూనిటీ కాంటాక్ట్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు కాగజ్‌నగర్ రూరల్ సిఐ కుమారస్వామి పేర్కొన్నారు. కాగజ్‌నగర్ మండలంలోని ఈస్‌గాం పోలీస్ స్టేషన్ పరిధిలోని అనుకోడ గ్రామంలో జిల్లా ఎస్పి కాంతిలాల్ పాటిల్ ఆదేశాల మేరకు ఉదయం ఈస్‌గాం ఎస్‌ఐ కళ్యాణ్ , పోలీసు సిబ్బందితో కలిసి కమ్యూనిటి కాంటాక్ట్ నిర్వహించినట్లు తెలిపారు.800లీటర్ల గుడుండా పానకం, రెండు బస్తాల ఇప్ప పువ్వు స్వాధీనం చేసుకొని ధ్వంసం చేసినట్లు తెలిపారు. అదేవిధంగా తనిఖీలో భాగంగా 20 బైకులు, 2 ఆటోలు, 1 ట్రాక్టర్ పత్రాలను తనిఖీ చేసినట్లు తెలిపారు.సిఐ మాట్లాడుతూ ప్రజల రక్షణ, భద్రత పోలీసుల బాధ్యత అని ప్రజలందరూ పోలీసులకు సహకరించాలని అన్నారు. చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.గ్రామాల్లో కొత్త వ్యక్తులు వచ్చినట్లయితే సమాచారం అందించాలని అన్నారు. గ్రామాల్లో సమస్యలు ఉన్న డయల్ 100కు సమాచారం అందించాలన్నారు. సైబర్ నేరాళ్ల ఫోన్ కాల్, మెస్సేజ్, వాట్సాప్ కాల్స్‌లకు స్పందించరాదన్నారు. ఈ కార్యక్రమంలో ఈస్‌గాం ఎస్‌ఐ కళ్యాణ్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

## పోచారంలో నాగుల పుట్ట, పోచమ్మ గుడి ధ్వంసం

### గ్రామస్తుల ఆందోళన



ప్రజాపక్షం/ఎడపల్లి: నిజామాబాద్ జిల్లా ఎడపల్లి మండలంలోని పోచారం గ్రామ శివారులో గుర్తు తెలియని వ్యక్తులు నాగుల పుట్టను, పోచమ్మ గుడిని తవ్వేసిన ఘటన ఆదివారం వెలుగు చూసింది. గుప్త నిధుల కోసమే ఈ విధ్వంసానికి పాల్పడి ఉంటారని గ్రామస్తులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పోచారం గ్రామ శివారులోని ఒమాజీపల్లి వద్ద ఉన్న నాగుల పుట్టను, పక్కనే ఉన్న పోచమ్మ గుడిని కొందరు గుర్తు తెలియని వ్యక్తులు జెసిబిలతో తవ్వేసినట్లు గ్రామస్తులు తెలిపారు. ఆదివారం ఉదయం అటుగా వెళ్లిన గ్రామస్తులు తవ్వకాల ఆనవాళ్లు చూసి దిగ్భ్రాంతి చెందారు. గ్రామస్తులు మాట్లాడుతూ.. ప్రతీ సంవత్సరం నాగుల పంచమి రోజున తమ గ్రామానికి చెందిన మహిళలు ఈ నాగుల పుట్ట వద్దకు వచ్చి నాగేంద్రునికి పాలు పోసి ప్రత్యేక పూజలు నిర్వహించేవారని తెలిపారు. మంగళవారం నాగుల పంచమి జరగనుండగా, ఇప్పుడు పుట్ట ధ్వంసం కావడంతో పూజలు ఎలా నిర్వహించాలో తెలియక ఆవేదన వ్యక్తం చేశారు. పుట్టను తవ్వి, పోచమ్మ గుడిని ధ్వంసం చేసిన వ్యక్తులు గుప్త నిధుల కోసమే ఈ దుశ్చర్యకు పాల్పడ్డారా..? లేక మరేదైనా ఉద్దేశం ఉందా..? అనేది పోలీసులు తేల్చాలని డిమాండ్ చేశారు. ఘటనపై సమాచారం అందుకున్న బోధన్ రూరల్ సిఐ విజయ్ బాబు, ఎడపల్లి ఎస్‌ఐ రమ సంఘటన స్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు. ఈ ఘటనకు కారణమైన వారిని వెంటనే పట్టుకుంటామని పోలీసులు హామీనిచ్చారు. ఇందులో గ్రామస్తులు నీరడి రవి కుమార్, గ్రామ కమిటీ అధ్యక్షుడు అంజనీ కుమార్, కోశాధికారి కట్ట లక్ష్మయ్య, కోల విజయ్ చందర్, జక్కు చిట్టిబాబు, ముత్తన్న, యూత్ కాంగ్రెస్ గ్రామ కమిటీ అధ్యక్షులు అనిల్, ఇర్ఫాన్, ఫక్రుల్లా ఖాన్ తదితరులు ఉన్నారు.

## మహిళల ఆర్థిక, సామాజిక అభివృద్ధే ధ్యేయం

### ఎమ్మెల్యే వినోద్, కలెక్టర్ దీపక్



ప్రజాపక్షం / బెల్లంపల్లి : బెల్లంపల్లి నియోజకవర్గ మహిళల ఆర్థిక శక్తీకరణకు ప్రభుత్వం కట్టుబడి ఉందని ఎంఎల్‌ఎ గడ్డం వినోద్ వెంకటస్వామి తెలిపారు. ఆదివారం బెల్లంపల్లి పట్టణంలోని తిరుమల హిల్స్ ఆర్‌పి గార్డెన్‌లో నిర్వహించిన ఇందిర మహిళ శక్తి సంబరాల్లో ఆయన జిల్లా కలెక్టర్ కుమార్‌దీపక్‌తో కలిసి పాల్గొన్నారు. వారు మాట్లాడుతూ మహిళల ఆర్థిక, సామాజిక అభివృద్ధే ప్రజా ప్రభుత్వ ప్రధాన ధ్యేయమని, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నేతృత్వంలోని ప్రభుత్వం కోటిమంది మహిళలను కోటీశ్వరులుగా చేయాలని సంకల్పించిందని, మహిళా సంఘాల ద్వారావడ్డీలేనిరుణాలు, బ్యాంక్ లింకేజీ, బీమా, పింఛన్లు, కొత్త రేషన్ కార్డులు వంటి పలు పథకాలను అమలు చేస్తోందని, ఇది మహిళ సాధికారత వైపు ఓ మైలురాయి అని అన్నారు. సంబరాల్లో బెల్లంపల్లి, నెన్నల్, కన్నెపల్లి, భీమిని, వేమనపల్లి, తాండూర్, కాసిపేట మండలాల పరిధిలోని స్వయం సహాయక సంఘాలకు వడ్డీలేని రుణాలు, బ్యాంక్ లింకేజీ పథకాల ద్వారా రూ. 25 కోట్లు విడుదల చేశారు. 2024, 25లో వడ్డీలేని రుణాల కింద రూ. 6.76 కోట్లు,లోన్ భీమా కింద 38మంది సభ్యులకు రూ. 30.17 లక్షలు, ప్రమాద బీమా కింద 4 కుటుంబాలకు రూ. 40 లక్షలు అందించారు. శ్రీనిధి స్కీమ్ కింద లక్ష్యంగా పెట్టుకున్న రూ.16.49 కోట్లలో ఇప్పటివరకు రూ. 6.80 కోట్లు మంజూరు చేశారు. చేయూత పింఛన్ల కింద మే నెలలో 26,363 లబ్ధిదారులకు రూ. 643.79 లక్షలు విడుదల చేశారు. మొబైల్ ఫిష్ రిటైల్ అవుట్ లెట్ స్కీమ్ కింద రూ. 10లక్షలవిలువైనమద్దతులభించింది.వానకాలం, యాసంగి వరి కొనుగోలుకు రూ. 17.56 కోట్లు, బోనస్ కింద రూ. 24.62 లక్షలు రైతులకు చెల్లించారు. రైతు భరోసా పథకంలో 47,500మందికి రూ. 67 కోట్లు అందించారు. గృహజ్యోతి పథకంలో 32,891 కుటుంబాలకు మంజూరైంది.మహాలక్ష్మి పథకంద్వారా రూ. 200 కోట్లు మంజూరై, ఆర్‌టిసికి రూ. 6,700 కోట్లు అందించారు. కొత్త రేషన్ కార్డులను 4,565 కుటుంబాలకు పంపిణీ చేశామని తెలిపారు. సంబరాల్లో ముందుగా మహిళలు ఎంఎల్‌ఎ వినోద్, కలెక్టర్ దీపక్‌కు స్వాగతం పలికారు. బతుకమ్మ పాటలకు మహిళలతో కలిసి ఎంఎల్‌ఎ నృత్యం చేశారు. ఈ కార్యక్రమంలో డిఆర్‌డిఎ కిషన్, డిపిఎం స్వర్ణలత, మహిళా సంఘ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

## పొంగిపొర్లుతున్న గంగమ్మవాగు



ప్రజాపక్షం/మెదక్ : మూడు రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాలకు పొంగి పొర్లుతున్న హవేలీ గణపురం మండలం దూప్ సింగ్ తండా గంగమ్మ వాగును పంచాయతీరాజ్ శాఖ అధికారులు పరిశీలించారు. ఎస్ ఇ జగదీశ్వర్, ఇఇ నర్సింలు వాగు నీటిని పరిశీలించారు. తాండవాసులు ఇళ్లలోనే ఉండేలా చూడాలని తహాసిల్దార్‌కు సూచించారు. డిఇ పాండురంగారెడ్డి, వర్క్ ఇన్‌స్పెక్టర్ పోచాద్రి ఉన్నారు.

## కొండ గొర్రెను రక్షించిన అధికారులు



ప్రజాపక్షం / ఆసిఫాబాద్ : ఆసిఫాబాద్ మండలం రవిచంద్ర కాలనీ సమీపంలో ఆదివారం దారితప్పి వచ్చిన ఓ కొండ గొర్రెను అటవీశాఖ అధికారులు రక్షించి, అడవిలో వదిలిపెట్టారు. ఆసిఫాబాద్ డిప్యూటీ రేంజర్ యోగేష్ వివరాల ప్రకారం.. అడవి నుండి దారితప్పి రవిచంద్ర కాలనీ సమీపంలోకి కొండ గొర్రె వచ్చినట్లు సమాచారం అందిందని, అధికారులు కొండ గొర్రెను రక్షించారని తెలిపారు. అయితే, అడవి నుండి పారిపోతూ దాని కాలికి గాయం అయినట్లు గుర్తించారు. వెంటనే దానిని స్థానిక పశువైద్య ఆసుపత్రికి తరలించి చికిత్స అందించారు. చికిత్స అనంతరం కొండ గొర్రెను తిరిగి అడవిలో సురక్షితంగా వదిలిపెట్టినట్లు యోగేష్ వివరించారు.అధికారి మహేందర్, బీట్ అధికారులు సాధిక్ పాషా, కిషోర్, అటవీ వాచర్లు అన్వేష్, రవీందర్ పాల్గొన్నారు.

## అవినీతికి కొమ్ముకాస్తున్న అధికారులకు మూల్యం తప్పదు : నడిపెల్లి

ప్రజాపక్షం /మంచిర్యాల టౌన్ : మంచిర్యాల ఎంఎల్‌ఎ ప్రేమ్ సాగర్ రావు అవినీతి, అక్రమాలకు కొమ్ముకాస్తున్న అధికారులకు భవిష్యత్తులో భారీ మూల్యం తప్పదని మాజీ శాసనసభ్యులు నడిపెల్లి దివాకర్ రావు హెచ్చరించారు. ఆదివారం మంచిర్యాలలోని తన నివాసం వద్ద విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్పొరేషన్ కమిషనర్ బదిలీ వెనుక ఎంఎల్‌ఎ ఒత్తిడిఉందని,చేయనిపనులకు బిల్లులు రాయాలని కమిషనర్‌పై ఒత్తిడి తేవడంతోనే ఆయన బదిలీపైవెళ్లిపోయారనిఆరోపించారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ఓటమి, మంచిర్యాలలో ప్రేమ్ సాగర్‌రావు ఓటమి ఖాయమని ఆయన జోస్యం చెప్పారు. మితిమీరిన అవినీతి, దాడులు, వెంచర్లలో డబ్బుల వసూలు, తప్పుడు కేసులు, భూ కబ్జాలు ఆయన ఓటమికి కారణాలు అవుతాయని ధ్వజమెత్తారు. రాబోయే ఎన్నికల్లో రాష్ట్రంలో, మంచిర్యాలలో గులాబీ జెండానే ఎగురుతుందని ఆయన ధీమా వ్యక్తం చేశారు. అధికారులకు హెచ్చరికలు జారీ చేస్తూ కొంత మంది కాంగ్రెస్ ఎంఎల్‌ఎకు కొమ్ముకాస్తున్నారని, వారిపై భవిష్యత్తులో చట్టపరమైన చర్యలు తప్పవు అని అన్నారు. గోదావరిలో ఇసుక, మట్టి అక్రమ రవాణాకు సహకరించిన అధికారులను వదిలిపెట్టబోమన్నారు. ఇంటిగ్రేటెడ్ మార్కెట్‌ను కూలగొట్టడం, వెంకటేశ్వర థియేటర్, లక్ష్మీ టాకీస్ జంక్షన్లను అక్రమంగా కూల్చిన అధికారులపైనాచర్యలు తీసుకుంటామన్నారు.తమ పార్టీ నాయకులైన మందిపెల్లి శ్రీనివాస్, గడప రాకేష్, బేర సత్యనారాయణ తదితరులపై అక్రమ కేసులు పెట్టిన అధికారులనువదిలిపెట్టబోమన్నారు. ప్రేమ్‌సాగర్ రావు ఓడిపోయిన తర్వాత హైదరాబాద్‌కు పరిమితమవుతారని, కానీ తప్పు చేసిన అధికారులు ఎక్కడికి పోతారని ప్రశ్నించారు. బిఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## పాఠశాలల బలోపేతానికి కృషి చేయాలి

### ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి



ప్రజాపక్షం/ఎడపల్లి: ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని, ప్రభుత్వ పాఠశాలల్లో సౌకర్యాలను తమ ప్రభుత్వం మెరుగు పరుస్తుందని బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి పేర్కొన్నారు. రెంజల్ మండలంలోని నీలా ఉన్నత పాఠశాల హెడ్మాస్టర్, పీఆర్టీయుఉమ్మడి జిల్లాల మాజీ అధ్యక్షుడు, పీఆర్టీయు అసోసియేట్ అధ్యక్షుడు ఇల్తెపు శంకర్ ఈ నెల 31న స్వచ్ఛంద ఉద్యోగ విరమణ పొందానున్నారు. ఈ మేరకు ఎడపల్లి మండల కేంద్రంలోని ఓపంక్షన్ హాల్లో ఉద్యోగ విరమణ మహోత్సవ కార్యక్రమం ఏర్పాటు చేశారు. ముఖ్య అతిథి బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి, పీఆర్టీయు జిల్లా, రాష్ట్ర నాయకులు, పలువురు ఉపాధ్యాయ సంఘాల నాయకులు మాట్లాడారు. విద్యార్థుల భవిష్యత్‌నుతీర్చిదిద్దేది టీచర్లేనని, సమాజంలో ఉన్నత స్థాయిలో ఉండాలన్నా టీచర్లే ముఖ్య కారణమన్నారు. రైతులు, ప్రభుత్వానికి రెండు కళ్లు లాంటి వారిని దేశ భవిత వారి చేతుల్లోనే ఆధారపడి ఉంటుందని తెలిపారు. ఇల్తేపు శంకర్ ఏడు మండలాల్లో పని చేయడమే కాకుండా పీఆర్టీయు యూనియన్‌లో రాష్ట్ర స్థాయి పదవులు పొంది ఉపాధ్యాయుల సమస్యలపై గళాన్ని వినిపించి సమస్యల పరిష్కారానికి విశేష కృషి చేశారని, దాంతో మంచి పేరును సంపాదించారన్నారు. స్వచ్ఛంద ఉద్యోగ విరమణ పొం దిన సందర్భంగా ఆయన ఇక శేష జీవితాన్ని సేవా కార్యక్రమాలతో పాటు కుటుంబ సభ్యులతో ఆనందంగా, సంతోషంగా గడపాలని కోరారు. శంకర్‌ను పలువురు ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయు లు, పిఆర్టియు నాయకులు, మాజీ సర్పంచ్‌లు, మాజీ ప్రజాప్రతినిధులు, పాఠశాలల యాజమాన్యాలు సన్మానించారు.రాష్ట్ర అధ్యక్షులు గుండు లక్ష్మణ్, బోధన్ సబ్ కలెక్టర్ వికాస్ మహాతో, కాంగ్రెస్ నాయకులు తాహెర్ బిన్ హందాన్, మానాల మోహన్ రెడ్డి, గడుగు గంగాధర్, నగేష్ రెడ్డి, జిల్లా పరిషత్ మాజీ ఛైర్మన్ దాదన్న గారి విఠల్, రాష్ట్ర నాయకులు వంగ మహేందర్ రెడ్డి, జిల్లా అధ్యక్షులు మోహన్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి కిషన్, కామారెడ్డిజిల్లా అధ్యక్షులు కుషాల్, పిఆర్టియు నాయకులు జలంధర్, వెంకటేశ్వర్‌గౌడ్, ఎంబెల్లి శంకర్, సోమలింగం,కిషోర్, హన్మంతు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా సినారె పురస్కారాలు అందజేత

### నిర్మల్ డా.దామెర రాములుకు అరుదైన గౌరవం



ప్రజాపక్షం/నిర్మల్ రూరల్: యాదాద్రి భువనగిరి జిల్లా రచయితల సంఘం ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా నిర్వహించిన ఉమ్మడి జిల్లాల సినారె పురస్కారాల ప్రదానోత్సవ సభ సాహితీ లోకాన్ని అలరించింది. జ్ఞానపీఠ అవార్డు గ్రహీత, పద్మవిభూషణ్ డాక్టర్ సి. నారాయణరెడ్డి 94వ జయంతిని పురస్కరించుకొనిఈపురస్కారాలను అందజేశారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా, నిర్మల్ తరపున ప్రముఖ సాహితీవేత్త,విద్యావేత్త డాక్టర్ దామెర రాములు ఘన సన్మానం అందుకున్నారు. తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి కూనూరు లక్ష్మణ్, తెలంగాణ సాహిత్య అకాడమీ తొలి అధ్యక్షుడు నందిని సిద్ధారెడ్డితో పాటు పలువురు సాహిత్య ప్రముఖులు, మేధావులు,అభిమానులసమక్షంలోడాక్టర్ దామెర రాములు సినారె పురస్కారాన్ని స్వీకరించారు. వక్తలు మాట్లాడుతూ,సినారె తెలుగు సాహిత్యానికి అందించిన సేవలను కొనియాడారు. ఆయన రచనలు, పరిశోధనలు, సినీ గీతాలు సాహితీ ప్రియులను ప్రభావితం చేశాయని గుర్తు చేశారు. డాక్టర్ దామెర రాములు మాట్లాడుతూ సినారె పేరు మీద పురస్కారం అందుకోవడం తన అదృష్టంగా భావిస్తున్నానని,ఇది తన భాద్యతను మరింత పెంచిందని అన్నారు.ఈ పురస్కారం తన సాహిత్య ప్రస్థానంలో ఒక మైలురాయి అని,దీనిని అందుకున్నందుకు యాదాద్రి భువనగిరి జిల్లా రచయితల సంఘానికి,సభా నిర్వాహకులకు కృతజ్ఞతలు తెలియజేశారు.

## ఎమ్మెల్యేలను కలిసిన దేవస్థాన చైర్మన్



**ప్రజాపక్షం/ఇల్లందకుంట:** కరీంనగర్‌లో డిసిసి అధ్యక్షుడు, మానకొండూర్ ఎమ్మెల్యే కవ్వంపెల్లి సత్యనారాయణ, చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యంలను ఆర్‌అండ్‌బి గెస్ట్‌హౌజ్‌లో దేవస్థాన చైర్మన్ ఇంగిలె రామారావు కలిసి శాలువాతో సన్మానిశారు. ఇల్లందకుంట శ్రీసీతారామచంద్రస్వామి దేవస్థానం మెమొంటో, స్వామివారి ముత్యాల తలంబ్రాలు అందజేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు సలీం, ఎండి లాల్, హుజురాబాద్ యూత్ కాంగ్రెస్ నాయకులు ఉమ్మడి సందీప్ తదితరులున్నారు.

## మహాత్మ జ్యోతిబాపూలే పాఠశాల ఆకస్మిక తనిఖీ




**ప్రజాపక్షం /సుల్తానాబాద్ :** సుల్తానాబాద్ మండలంలోని భూపతిపూర్‌లో గల మహాత్మ జ్యోతిబాపూలే బాలుర పాఠశాలను జ్యోతిబాపూలే పాఠశాలల రాష్ట్ర జాయింట్ సెక్రెటరీ తిరుపతి అకస్మిక తనిఖీ చేశారు. తనిఖీల్లో భాగంగా కిచెన్, డైనింగ్ హాల్, టాయిలెట్స్, స్టోర్ రూమ్స్, క్లాస్ రూమ్స్ లను క్షుణ్ణంగా పరిశీలించారు. అనంతరం విద్యార్థులతో మాట్లాడుతూ విద్యార్థులకు అందించే భోజనం వివరాలను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులు పాఠశాలలో నాణ్యమైన భోజనంతోపాటు, ఉన్నత విద్యను అందిస్తున్నారని జాయింట్ సెక్రెటరీ తిరుపతికి తెలపడంతో విద్యార్థుల నుండి వచ్చిన స్పందనను చూసి ప్రిన్సిపల్ జక్కని రాజేశం ను ప్రత్యేకంగా అభినందించారు.

# మహిళలను అన్ని రంగాల్లో తీర్చిదిద్దడమే ప్రభుత్వ లక్ష్యం

### మంత్రి పొన్నం ప్రభాకర్





**ప్రజాపక్షం / హుస్నాబాద్ /కొహెడ :** గత పదిఏళ్లుగా చేయలేని పనిని నేడు కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తుందని అందులో మహిళలను అన్ని రంగాల్లో తీర్చిదిద్దడమే కాంగ్రెస్ ప్రభుత్వం లక్ష్యంమని తెలంగాణ బిసి, రవాణశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. అదివారం హుస్నాబాద్ మండలంలోని పలు సంక్షేమ కార్యక్రామాలను పాల్గొన్నారు. పొతారం (ఎస్)జాతీయ రహదారి ప్రక్కన జిల్లా కలెక్టర్ కె హైమవతితో కలిసి మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడు మొక్కలను నాటారు. అనంతరం పొతారం లోని శుభం గార్డెన్లో సిఎంరిలీఫ్ ఫండ్, కల్యాణల, షాదీ మూబారక్, చెక్కులను, కొత్త రేషన్ కార్డులను లబ్ధి దారులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ గత 10 ఏళ్లుగా కొత్త రేషన్‌కార్డుల రాక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారని మండలంలోని నూతనంగా 1279 మందికి కొత్త కార్డులు వచ్చాయని పేర్కొన్నారు. నూతన కార్డులతో పాటు పాతవి కలుపుకుని 1882 మందికి రేషన్‌కార్డులు వచ్చాయన్నారు. మొత్తం రేషన్‌కార్డులదాలు 5600వందల మంది లబ్ధిదారులకు 6కిలోల చొప్పున సన్న బియ్యాం పంపిణీ చేస్తామని అన్నారు. మండలంలో 310 మందకి కొత్తగా ఇందిర్మ ఇళ్లు ఇచ్చాయని అన్నారు. అడబిడ్డల కళ్లలో అనందరం చూడటం కోసం ఇందిరమ ఇళ్లు, ఉచిత బస్సుప్రయాణం, 200 వందల యునిట్ల ఉచిత కరంటు, షోలార్ యునిట్లు ఇందిరమ క్యాంటిన్లు, అమ్మ అదర్శపాఠశాలలు తీసుకువచ్చామన్నారు. పట్టణాల్లో గ్రామాల్లో ఎక్కడైన ప్లస్టాక్ వాడం నిశేదించాలని వాటితో క్యాన్సర్ వ్యాధి వస్తుందని తెలియజేశారు. ఇళ్లులేక ఎన్నో ఎళ్లుగా ఎదిరి చూస్తున్న పేదలు వారి కాంగ్రెస్ ప్రభుత్వం ఇస్తున్న ఇందిర్మ ఇళ్లు మంచిగా కట్టుకుని తొందరగా గృహప్రమేశాలు చేసుకుని సంతోషంగా ఉండాలని కలెక్టర్ కె హైమవతి ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు సూచించారు. గత 10ఏళ్లుగా ఎదిరి చూస్తున్న వారికి నూతన రేషన్‌కార్డులు రావడంతో ప్రభుత్వానికి ధన్యావాదంలు తెలిపారు. ఈ ఏడాది మహిళా సంఘాలకు 8 కోట్ల రూపాయల విలువైన సోలార్ ప్లాంట్ యునిట్ ప్రోసిడింగ్44 లక్షల రూపాయల విలువైన వడ్డీలేని రుణాల చెక్కులను, కల్యాణ లక్ష్మి చెక్కును, స్టాల్‌బ్యాంకులను అందించారని తెలపారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ చైర్మన్ కె లింగమూర్తి, ఆర్‌డిఒ రాంమూర్తి, సహకార సంఘం చైర్మన్ శివయ్య, జిల్లా పౌరసరఫరాల అధికారి, డిఆర్‌డిఒ పాల్గొన్నారు.

### హుస్నాబాద్‌ను అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తా : మంత్రి పొన్నం ప్రభాకర్

హుస్నాబాద్‌ను అన్ని రంగాలల్లో అభివృద్ధి చేస్తానని రాష్ట్ర రవాణా, బిసి సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. ఆదివారం కొహెడ మండలంలోని రైతు వేదికలో నూతన రేషన్‌కార్డులు, కల్యాణ లక్ష్మీ , షాదీ ముబారక్ చెక్కులు, సిఎంఆర్‌ఎఫ్ చెక్కులు, కాటమయ్య రక్షణ కవచాలు, మహిళలకు వడ్డీలేని రుణాలు చెక్కులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ ఇటీవల కొహెడ మండలంలో 39 మహిళా సంఘాలకు స్టీల్ బ్యాంక్ పంపిణీ చేశామని, అందరు స్టీల్ బ్యాంక్ వాడి ఆరోగ్యాన్ని కాపాడుకోవాలన్నారు. గతంలో దొడ్డు బియ్యం వచ్చేవని, ఇప్పుడు ప్రజా పాలన ప్రభుత్వంలో సన్న బియ్యం ఇస్తున్నామని, గత పది సంవత్సరాలుగా ఒక్క రేషన్‌కార్డు రాలేదని, కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చక కొత్తరేషన్ కార్డులు జిల్లాలో 26వేల రేషన్ కార్డులు, మండలంలో 1117కొత్త రేషన్ కార్డులు, రాజకీయాలకు అతీతంగా అర్హత ఉన్న అందరికి ఇవ్వ డం జరిగిందని, కొత్తగా 1996 మంది రేషన్ కార్డులో పేర్లు యాడ్ అయ్యాయని అన్నారు. ఇందిరమ్మ ఇండ్లు 506 ఇళ్లలో 432 ఇళ్లు నిర్మాణంలో ఉన్నాయని, మిగిలిన 72 మంది ముగ్గులు పోసినావరని, బేస్మెట్ కాగానే లక్ష రూపాయలు అకౌంట్‌లో పడతాయన్నారు. 200 యూనిట్ల ఉచిత విద్యుత్, మహిళలు 200 కోట్ల టికెట్లతో ఉచిత ప్రయాణం, ఇప్పటి వరకు 41 కల్యాణ లక్ష్మీ షా ది ముబారక్ 41 లక్షల 4 వేల 756 రూపాయల చెక్కులను అందించామన్నారు.రెండు వందల మందికి కాటమయ్య రక్షణ కవచాలు పంపిణీ, మండలంలో 200 కో ట్ల రూపాయలు యంగ్ ఇండియా ఇంటిగ్రేటుడ్ రెసిడెన్షియల్ స్కూల్ వచ్చింది. కూరెళ్ల రోడ్డుకు శంకుస్థాపన, బస్వాపూర్ రోడ్డు పూర్తి, గురుకులాల్లో మెస్ చార్జీలు పెంచడం జరిగిందన్నారు. కొహెడ మండలం తంగళ్ళపల్లి గ్రామంలో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ స్థలాన్ని పరిశీలించి, పెండింగ్‌లో ఉన్న పనులు వెంటనే పూర్తి చేయాలని, స్థలంలో ఉన్న విద్యుత్ పోల్స్ షిఫ్ట్ చేయాలని ఆదేశించారు. అనంతరం పోరెడ్డిపల్లి, నాగ సముద్రాల, బస్వాపూర్ గ్రామంలో వన మహోత్సవంలో భాగంగా ఈత మొక్కలను నాటారు. వన మహోత్సవంలో 40 లక్షల ఈత, ఐదు లక్షల తాటి మొక్కలు నాటాలని లక్ష్యం పెట్టుకోవడం జరిగిందన్నారు. ఇబ్రహీంపట్నంలో కాటమయ్య కేసులు కిట్స్ ప్రారంభోత్సవంలో ఈ సారి ఈత, తాటి మొక్కలు నాటాలని ముఖ్యమంత్రి చెప్పడం జరిగిందన్నారు. రోడ్లకు ఇరువైపుల ఈత మొక్కలు నాటాలన్నారు.ఇందిరమ్మ ఇళ్ల తులసి, జామ, నిమ్మ, మునగ, కరివేపాకు వంటి మొక్కలను నాటాలన్నారు. మొక్కలు నాటడం మన జీవితంలో భాగస్వామ్యం కావాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ హైమవతి, సిద్దిపేట గ్రంథాలయ సంస్థ చైర్మన్ లింగమూర్తి, మార్కెట్ కమిటీ చైర్మన్ నిర్మలా జయరాజ్, ఎక్సైజ్, అటవీ శాఖ అధికారులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## జూడో క్రీడాకారులు రాష్ట్రస్థాయి పోటీల్లో రాణించాలి

### అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ పోలీస్ విజయ్ కుమార్



**ప్రజాపక్షం/కరీంనగర్ సిటీ:** జిల్లా జూడో క్రీడాకారులు రాష్ట్రస్థాయి పోటీల్లో రాణించాలని కరీంనగర్ జిల్లా అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ పోలీస్ విజయ్ కుమార్ అన్నారు. కరీంనగర్‌లోని ప్రాంతీయ క్రీడా పాఠశాలలో ఆదివారం జరిగిన జిల్లా స్థాయి జూడో సబ్ జూనియర్, క్యాడెట్ బాలబాలికల ఎంపిక పోటీలకు ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ క్రీడలు స్నేహభావాన్ని పెంపొందిస్తాయని, క్రీడల ద్వారా ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని అభిప్రాయపడ్డారు. జిల్లా జూడో సంఘం అధ్యక్ష కార్యదర్శులు సాదవేణి వినయ్, దామోదర్‌లు మాట్లాడుతూ జిల్లాలో జూడో క్రీడాకారులకు కొదవ లేదని, ఆత్మస్థైర్యానికి ఆత్మవిశ్వాసానికి జూడో క్రీడ ఎంతో దోహదపడుతుందని అన్నారు. జిల్లాలో జూడో క్రీడ అభివృద్ధికి కృషి చేస్తామని వారు పేర్కొన్నారు. ఈ సంధర్బంగా వివిధ మండలాల నుంచి విచ్చేసిన జిల్లా క్రీడాకారులు తమ క్రీడా నైపుణ్యాన్ని ప్రదర్శించారు. అనంతరం జరిగిన మెడల్స్, సర్టిఫికెట్ల ప్రధాన కార్యక్రమానికి సబ్ ఇన్స్‌పెక్టర్ సురేష్ చేతుల మీదుగా క్రీడాకారులకు అందించారు. జిల్లా అధ్యక్ష కార్యదర్శి సాదవేని వినయ్, దామోదర్, కోశాధికారి మన్నాన్, జిల్లా జూడో సంఘం బాధ్యులు శ్రీనివాస్ వాసు, వెంకటరమణ, గోలి సుధాకర్, రవీంద్ర చారి, ఎన్. శ్రీకాంత్, ఎస్.శ్రీకాంత్, పిడిలు, జూడో కోచ్‌లు క్రీడాకారులు, క్రీడాభిమానులు తదితరులు పాల్గొన్నారు.

## సహాయ కార్యదర్శికి రాజేష్‌కు పరామర్శ



**ప్రజాపక్షం/పెద్దపల్లి :** సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ ఏఐటియుసి జిడికె వన్ ఇంక్లైన్ పిట్ సహాయ కార్యదర్శి కలవేణి రాజేష్ ఆదివారం గంగానగర్ మిలీనియమ్ క్వార్టర్స్ ఏరియా దగ్గర లో జరిగిన రోడ్డు ప్రమాదం లో తీవ్రంగా గాయపడి గోదావరిఖని సింగరేణి ఏరియా హాస్పిటల్ లో వైద్యం కోసం అడ్మిట్ ఐన విషయం తెలిసి పరామర్శించిన ఏఐటియుసి ఉప ప్రధాన కార్యదర్శి మడ్డి ఎల్లా గౌడ్. రాజేష్ తలకు తీవ్ర గాయాలయ్యాయని మెరుగైన వైద్యం అందించాలని డాక్టర్లను ఎల్లా గౌడ్ కోరారు. ఇంకా పరామర్శించిన వారిలో ఏఐటియుసి వన్ ఇంక్లైన్ పిట్ సెక్రటరీ మానాల శ్రీనివాస్, నాయకులు నేరెళ్ళ తిరుపతి, దేవేందర్ రెడ్డి, విజయ్ కుమార్, పి.రమేష్ గౌడ్,ఎర్రగోల్ల చేరాలు తో పాటు తదితరులు ఉన్నారు.

## ఆర్థిక ఇబ్బందులు భరించలేక మున్సిపల్ కార్మికుడు ఆత్మహత్య



**ప్రజాపక్షం/పెద్దపల్లి రూరల్ :** పెద్దపల్లి మండలం రంగంపల్లి పదో వార్డుకు చెందిన మామిడిపల్లి ప్రవీణ్ గత కొంతకాలంగా సుల్తానాబాద్ మున్సిపల్ కార్యాలయంలో పారిశుద్ధ్య కార్మికునిగా విధులు నిర్వహిస్తున్నాడు. నిరుపేద కుటుంబానికి చెందిన మామిడిపల్లి ప్రవీణ్ ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతూ ఆందోళన చెందుతూ ఉండేవాడు. వచ్చే జీతంతో ఇల్లు గడవక ఆర్థిక భారం మీద పడి, తీసుకున్న అప్పులు తీర్చలేక భయాందోళనకు గురై మూడు రోజుల క్రితం పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకోగా, వెంటనే బంధువులు వరంగల్ ఎంజిఎం ఆసుపత్రికి తరలించి చికిత్స పొందుతుండగా శనివారం మామిడిపల్లి ప్రవీణ్ మృతి చెందినట్లు బంధువులు తెలిపారు. నిరుపేద కుటుంబానికి చెందిన మామిడిపల్లి ప్రవీణ్ కుటుంబాన్ని అధికారులు ఆదుకోవాలని పలువురు కోరుతున్నారు.

## ఆల్ ఇండియా కరాటే పోటీల్లో సత్తా చాటిన విద్యార్థులు



**ప్రజాపక్షం/ఇబ్రహీంపట్నం :** తమిళనాడు రాష్ట్రంలోని పాండిచ్చేరిలో ఆదివారం జరిగిన ఆల్ ఇండియా చాంపియన్ షిప్ కరాటే పోటీలలో జగిత్యాల జిల్లా ఇబ్రహీంపట్నం నుండి కరాటే మాస్టర్ పసునూరి అవినాష్ ఆధ్వర్యంలో కరాటే విద్యార్థులు పాల్గొన్నారు. కటాస్ స్పారింగ్ విభాగంలో మండల కేంద్రానికి చెందిన కుంట మధు శాలిని గౌడ్ అండ్ 21ఇయర్స్ విభాగంలో ప్రథ మ స్థానం గెలుపొందగా, అండర్ 12 ఇయర్స్ వి భాగంలో దండిక వికాస్ ద్వితీయ స్థానంలో నిలిచారు. కరాటేలో ప్రతిభ క నబర్చిన విద్యార్థులకు ట్రోఫిలను ప్రశంసా పత్రాలను చాంపియన్ షిప్ క రాటే ఆర్గనైజేషన్ నిర్వాహకులు అందజేశారు. రు. ఈ కార్యక్రమంలో జగిత్యాల డిస్ట్రిక్ట్ ఇన్స్ట్రక్టర్ మాస్టర్ పసునూరి అవినాష్ విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు. గెలుపొందిన విద్యార్థులను గ్రామస్థులు పలువురు అభినందించారు.

## తహసీల్దార్ ఉదారత..

ప్రజాపక్షం ఎఫెక్ట్

**ప్రజాపక్షం/ఎల్లారెడ్డిపేట :** మండలంలోని గుం దం శ్రీనివాస్‌కు చెందిన విస్తారంగా కురుస్తున్న వర్షానికి ఇల్లు కూలిందని ప్రజాపక్షం జాతీయ ది నపత్రికలో ప్రచురణ జరుగగా తహసీల్దార్ సుజా త తనవంతు తక్షణ సహాయంగా మూడువేల రూపాయలు అందించినట్లుగా బాధితుడికి అందచేసినట్లుగా సమాచారం. అంతేకాకుండా ప్రభుత్వ పరంగా వచ్చే ఆర్థిక సహాయం కోరినట్టు గుండం శ్రీనివాస్ ప్రజాపక్షంతో మాట్లాడారు. తహసీల్దార్‌కు దన్యవాదములు తెలుపుతున్నానని అన్నారు.పేదల పట్ల సానుభూతి వ్యక్తం చేసినందుకు ఎమ్మార్వోకు కృతజ్ఞుడినని అన్నారు.

## పట్టిపీడిస్తున్న క్యాన్సర్ భూతం

**ప్రజాపక్షం/ఎల్లారెడ్డిపేట :** ఉమ్మడి మండలంలో క్యాన్సర్ బాధితులు ఎక్కువగుతున్నరని ఆహర నియమాలు పాటించాలని వైద్య నిపుణులు తెలుపుతున్నారు. ఇటీవల క్యాన్సర్ మహమ్మారి పట్టి పీడిస్తుందని పలువురు ఆందోళన చెందుతున్నారు. వెంకటాపూర్ గ్రామంలో వారంలోనే ఒకరు, మండల కేంద్రంలో చరవాణి చూస్తు బ్రేయిన్‌డెడ్‌కు గురవ్వడంతో పెద్దదిక్కుగా ఉన్న తల్లిదండ్రులకు పుత్రశోకం మిగిలిస్తున్నారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా సంబంధిత అధికారులు క్యాన్సర్ మహమ్మరిపై అవగాహన కల్పించాలని పలువురు అభిప్రాయపడుతున్నారు.

## ఉత్సాహంగా.. ఉల్లాసంగా 3వ మారథాన్

### ఎంపి రఘునందన్‌రావు




**ప్రజాపక్షం/ సిద్దిపేట :** ఆరోగ్యంగా ఉంటేనే ఏ రంగంలోనైన రాణించగలుగుతారని మెదక్ ఎంపి రఘునందన్‌రావు అన్నారు. ప్రధాని న రేంద్రమోదీ పిలుపునిచ్చిన విధంగా ఖేలో ఇండియా, ఫిట్ ఇండియా వైపు ప్రజలకు చైతన్యం వచ్చిందన్నారు. సిద్దిపేట జిల్లా కేంద్రంలోని రంగనాయక్‌సాగర్ రిజర్వాయర్ కట్టపై మూడవ విడుత మారథాన్ రన్‌ను జెండా ఊపి ఎంపి రఘునందన్‌రావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపి రఘునందన్‌రావు ఆరోగ్యమే మహా భాగ్యమని.. ప్రతి ఒక్కరు ఆరోగ్యంగా ఉండాలంటే ఈలాంటి మారథాన్‌ను ప్రోత్సహించాలన్నారు. నేను బాగుండాలని..తన ఇల్లు బాగుండాలని స్థితి నుండి ప్రజలందరు బాగుండాలనే స్థితికి వచ్చినట్లు తెలిపారు.డయబెటిక్ పుట్టిల్లు భారతదేశం స్థితి నుండి బయటకు రావాలన్నారు. ఆరోగ్యవంతమైన సమాజం కోసం ప్రజలందరికి అవగాహన రావటం వల్ల శుభాకాంక్షలు తెలిపారు. నరేంద్రమోదీ పిలుపునిచ్చిన విధంగా ఖేల్ ఇండియా పిట్ ఇండియా వైపు ప్రజల్లో చైతన్యం వచ్చిందన్నారు. ఇంత చక్కని కార్యక్రమం నిర్వహించిన నిర్వాహకులకు అభినందనలు తలిపారు. ప్రముఖ సినీ నటుడు సంపూర్ణేష్ బాబు మాట్లాడుతూ మన ఆరోగ్యాన్ని మనమే రక్షించుకోవాలన్నారు. ఆరోగ్యమే మహా భాగ్యమన్నారు. యువత,డ్రగ్స్, బెట్టింగ్ యాప్‌ల బారినపడి బంగారు భవిష్యత్తును నాశనం చేసుకుంటున్నారన్నారు. సిద్దిపేట రన్నర్స్ ఆసోసియేషన్ అధ్యక్షుడు రాజు మాట్లాడుతూ ఆప్ మారథాన్‌లో సిద్దిపేట ప్రజలు పెద్దఎత్తున భాగస్వామ్యం కావటం పట్ల సంతోషం వ్యక్తం చేశారు. మారథాన్‌లాంటి కార్యక్రమాలు గ్రామీణ క్రీడకారులకు అందుబాటులో ఉండాలని సిద్దిపేటలో ఆఫ్ మారథన్ నిర్వహించినట్లు తెలిపారు. సిద్దిపేట జిల్లా కేంద్రంలోని రంగాధాంపల్లి రిజర్వాయర్ కట్టపై ఆఫ్ మారథాన్‌లో వందలాది మంది యువతి, యువకులు ఉత్సాహంగా. ఉల్లాసంగా పాలుపంచుకున్నారు. యువత కేరింతలో ఆఫ్ మారథాన్ 5కే, 10కె, 21కె నిర్వహించారు. విజేతలకు ఎంపి రఘునందన్‌రావు, సినీ సంపూర్ణేష్‌బాబులు బహుమతులు ప్రధానం చేశారు. ఈసందర్భంగా యువత నృత్యాలు చేస్తూ ఆకట్టుకున్నారు.ఈకార్యక్రమంలో బిజెపి జిల్లా అధ్యక్షుడు బైరి శంకర్, కౌన్సిలర్ ధర్మవరం బ్రహ్మం, పాల సాయిరాం, పోచపోయిన శ్రీహరి, వంగ రాజేశ్వర్‌రెడ్డి, సిఐ బాలు, ఆసోసియేషన్ ప్రతినిధులు నిమ్మకిష్టారెడ్డి, రమేశ్, అశోక్, రాజిరెడ్డి, హరికృష్ణ, గోపాల్, శ్రవణ్, లింగారెడ్డి, వీరన్న, జైపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ఉచిత మెగా వైద్య శిబిరం



**ప్రజాపక్షం/కరీంనగర్ టౌన్:** సుడా చైర్మన్, కరీంనగర్ నగర కాంగ్రెస్ అధ్యక్షుడు కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి ఆధ్వర్యంలో సన్‌రైజ్ హాస్పిటల్స్ సౌజన్యంతో ముకరంపురలోని వాణినికేతన్ పాఠశాలలో ఏర్పాటు చేసిన ఉచిత మెగా వైద్య శిబిరం మెగా సక్సెస్ కావడం పట్ల నరేందర్‌రెడ్డి సంతోషం వ్యక్తం చేశారు. 500మందిపైగా ప్రజలు ఆరోగ్య పరీక్షలు చేయించుకున్నారని తెలిపారు. అనుభవం గల వైద్యుల పర్యవేక్షణలో ఉచితంగా ఇసిజి, టుడి ఇకోతో పాటు అన్ని రకాల పరీక్షలు చేసి ఉచితంగా మందులు ఇవ్వడం జరిగిందని నరేందర్ రెడ్డి పేర్కొన్నారు. ఇటువంటి ఉచిత వైద్య శిబిరాల వల్ల ప్రజలకు ఎంతో మేలు కలుగుతుందన్నారు. ప్రజలు ఆరోగ్య పరీక్షలు చేసుకోవడం వల్ల ముందు జాగ్రత్తగా ఆరోగ్యాన్ని కాపాడుకున్న వారవుతారని నరేందర్ రెడ్డి పేర్కొన్నారు. ఈ మెగా వైద్య శిబిరంలో సీనియర్ కార్డియాలజిస్ట్ డా.కె.కిరణ్ కుమార్, జనరల్ ఫిజీషియన్లు డా.జె.సురేష్, సిహెచ్ కార్తీక్, న్యూరో సర్జన్ డా.కె శివ కుమార్, ఆర్థోపెడిక్ డా.కె కుమార్, ఆర్థోపెడిక్ డా.కె రవికాంత్, గైనకాలజిస్ట్ డా.ఇ.నయని, మార్కెటింగ్ హెడ్ కె.ప్రసాద్, సిబ్బంది, మాజీ కార్పోరేటర్లు మల్లిఖార్జున రాజేందర్, అర్ష మల్లేశం, కాంగ్రెస్ నాయకులు గడమల్ల శ్రీనివాస్, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

## ఎరువుల అమ్మకంలో జాప్యం జరిగితే చర్యలు

### జగిత్యాల జిల్లా కలెక్టర్ బి. సత్య ప్రసాద్



**ప్రజాపక్షం /జగిత్యాల రూరల్ :** జగిత్యాల జిల్లా కేంద్రంలోని జగిత్యాల ప్యాక్స్ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాన్ని ఆదివారం నాడు జగిత్యాల జిల్లా కలెక్టర్ బి.సత్యప్రసాద్ ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ యూరియా, ఇతర ఎరువుల స్టాక్ వివరాలను, ఎరువుల సరఫరా పై యూరియా ప్రతీ రైతుకి ఎన్ని బస్తాలు సరఫరా చేస్తున్నారో పరిశీలించి వారి భూమి వివరాలను డాటా ఎంట్రీలో తనిఖీ చేశారు.అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ రైతులకు అవసరమైన ఎరువులు అందుబాటులో ఉన్నాయా ఎరువుల క్రయ విక్రయాలకు సంబంధించిన రికార్డులను తప్పనిసరిగా ఆధార్ కార్డుతో నమోదు చేయాలని జిల్లా కలెక్టర్ బి. సత్య ప్రసాద్ అన్నారు. ప్రస్తుతం రైతులు వేసిన పంటకు అవసరమైన ఎరువులు మాత్రమే సరఫరా చేయాలని అధికారులకు సూచించారు. రికార్డులు పరిశీలించి స్టాక్ ఎంత వచ్చింది ఎంత సరఫరా చేస్తున్నారు తప్పనిసరి రికార్డ్ చేసుకావాలని అధికారులకు జిల్లా కలెక్టర్ ఆదేశించారు. రైతులకు ఎవరికైనా ఎక్కువ మొత్తంలో ఎరువులు 28 కోరమండల్, డిఏపి, యూరియా, బస్తాలు ఎక్కువ పంపిణి చేసినట్లయితే అట్టి సొసైటీ సిబ్బంది పై మరియు వ్యవసాయ శాఖ సిబ్బందిపై కఠిన చర్యలు తప్పని అధికారులను హెచ్చరించారు. కలెక్టర్ వెంట జగిత్యాల జిల్లా మున్సిపల్ అధికారి స్పందన, జగిత్యాల మండల అగ్రికల్చర్ ఆఫీసర్ వినీల, నాగరాజు, సహకార పాక్స్ కార్యదర్శి వేణు, పాక్స్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## భిన్నత్వంలో ఏకత్వం.. భారత సంస్కృతి

### పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయ రమణారావు



**ప్రజాపక్షం/పెద్దపల్లి /సుల్తానాబాద్ :** భిన్నత్వంలో ఏకత్వం భారతదేశ సంస్కృతి అని పెద్దపెల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరావుణరావు అన్నారు. ఆదివారం రోజున స్థానిక కలెక్టరేట్ సమీపంలో నూతనంగా ఏర్పాటు చేసిన ఫిర్దోస్ మజీద్ షాపింగ్ కాంప్లెక్స్ ను ఆయన ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభోత్సవం చేశారు.ఈ సందర్భంగా మజీద్ కమిటీ సభ్యులు ఎంఏ మోహిద్, అబ్దుల్ హై జావిద్, హాది లు ఆయనను ఘనంగా సన్మానించారు. అనంతరం ఎమ్మెల్యే చింతకుంట విజయ రమణారావు మాట్లాడుతూ పెద్దపల్లి జిల్లా కేంద్రంలో మతతారతమ్యాలు లేకుండా హిందూ ముస్లింలు కలిసి కట్టుగా ఉంటారని, అన్ని పండుగలు కలిసి చేసుకుంటారని అన్నారు. పట్టణం లోనే కాకుండా తన నియోజకవర్గంలో ముస్లిం మైనార్టీల అభ్యున్నతికి తప్పకుండా కృషి చేస్తానని, పేద ముస్లిం లకు త్వరలోనే ఇందిరమ్మ ఇండ్లు మంజూరు అయ్యేటట్టు చూస్తానని, తాను ఎన్నికైనప్పటి నుండి ఇప్పటివరకు ముస్లిం వాడల్లో అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నామని, మిగిలిన పనులు ఉంటే అవి కూడా త్వరలోనే పూర్తి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మజీద్ కమిటీ సభ్యులు, సిపిఐ జిల్లా కార్యదర్శి తాండ్ర సదానందం, మార్కెట్ కమిటీ చైర్మన్ ఈర్ల స్వరూప,కాంగ్రెస్ మైనార్టీ నాయకులు సయ్యద్ మస్రత్, మైనార్టీ సంక్షేమ అధికారి రంగారెడ్డి, పిఎన్జీవోస్ జిల్లా అధ్యక్షులు బొంకూరు శంకర్, చాంబర్స్ ఆఫ్ కామర్స్ జిల్లా అధ్యక్షులు కమల్ కిషోర్ శారడ, పట్టణానికి చెందిన ప్రముఖ వ్యాపారస్తులు, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

**సాయి అన్విత్‌ను అభినందించిన ఎమ్మెల్యే:** సుల్తానాబాద్ పట్టణంలోని గాంధీనగర్ కు చెందిన శ్యామల సాయి అన్విత్ పదవ తరగతిలో ఉత్తమ ప్రతిభ కనబరిచినందుకుగాను పెద్దపెల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయ రమణారావు ప్రత్యేకంగా అభినందించారు. 2024 సం. పదో తరగతిలో అత్యధిక మార్కులు సాధించిన పద్మశాలి విద్యార్థులకు జిల్లా పద్మశాలి సంఘం అడ్ హాక్ కమిటీ అధ్యక్షుడు వలస నీలయ్య ఆధ్వర్యంలో ప్రతిభా పురస్కారాలు అందజేశారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని నిర్వహించిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయ రమణారావు సుల్తానాబాద్ పట్టణంలోని గాంధీనగర్ కు చెందిన సామల సాయి అన్విత్ ను చేనేత వస్త్రంతో సత్కరించి జ్ఞాపిక బహూకరించి రూ.550 నగదు పురస్కారం అందజేశారు. పెద్దపల్లి ఆరీఒ బొద్దుల గంగయ్య, పద్మశాలీ సంఘం నా యకులు బూర్ల లక్ష్మీ నారాయణ, పెగడ చందు, సామల రాజేంద్ర ప్రసాద్, మంచికట్ల లక్ష్మీ పతి, పర్శ రమేష్, మామిండ్ల రమేష్,పర్శ శ్రీనివాస్‌పాల్గొన్నారు.

## పేరుకే మండల కేంద్రం.. రోడ్డు మాత్రం అద్వానం..



**ప్రజాపక్షం / ఇబ్రహీంపట్నం :** జగిత్యాల జిల్లా ఇబ్రహీంపట్నం మండల కేంద్రంలోని ప్రధాన రోడ్డు పరిస్థితి రోజు రోజుకు అద్వానంగా మారుతుంతి. దీనికి తోడు గత ఐదు రోజుల నుండి కురుస్తున్న వర్షాలతో ఇందిరా గాంధీ చౌరస్తా వద్ద నుండి కొత్తూరు వెళ్లే రోడ్డు వెంబడి మసీదు వరకు పెద్ద పెద్ద గోతులు ఏర్పడి వర్షపు నీటితో ఆ గోతులు ఏర్పడక వాహనదారులు గ్రామ ప్రజలు ఎంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మండలంలోని పలు గ్రామాల ప్రజలు వివిధ పనులు, కార్యాలయాల పనుల నిమిత్తం మండల కేంద్రానికి రావడానికి ఈ రోడ్డు వెంబడి ప్రయాణం చేయాల్సి ఉంటుంది. దీంతో ఈ రోడ్డు పరిస్థితి ఇలా ఉండడంతో మండల కేంద్రానికి రావాలంటేనే జంకుతున్నారు. ఇటీవలే కొద్ది రోజు క్రితం మండల కేంద్రాన్ని కలెక్టర్ సత్యప్రసాద్ సందర్శించారు. కలెక్టర్ ఇదే రోడ్డు వెంబడి ప్రభుత్వ హస్పిటల్‌కు కూడా వెళ్లారు. ఆ సమయంలో ఈ రోడ్డు పరిస్థితి కలెక్టర్‌కు కనిపించకపోవడం విడ్డూరంగా ఉందని గ్రామ ప్రజలు ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు. గత సంవత్సరం వర్షాకాలం సమయంలో ప్రజాపక్షం దినపత్రికలో ఈ రోడ్డు పరిస్థితిపై ప్రత్యేక వార్తా కథనం అందించింది. అప్పుడు కూడా కలెక్టర్ మండల కేంద్రాన్ని సందర్శించినప్పుడు కాంగ్రెస్ నాయకులు గ్రామ ప్రజలు కొత్త బస్టాండ్ వద్దడ్రైనేజి అసంపూర్తిగా ఉండడంతో అందులో నుండి మురుగునీరు, వర్షపు నీరు రోడ్డుపై ప్రవహించి దుర్గంధం వెదజల్లిన తీరును కలెక్టర్‌కు వివరించారు. అప్పటి నుండి ఇప్పటి వరకు అధికారులు, ప్రజా ప్రతినిధులు ఎలాంటి చర్యలు చేపట్టకపోవడంతో రోడ్డు పరిస్థితి కనీస మరమ్మత్తులకు నోచుకోలేని దుస్థితి ఏర్పడింది. మరికొద్దిరోజుల్లో స్థానిక సంస్థల ఎన్నికలు జరుగుతుండడంతో ఓట్లు ఎలా అడుగుతారు అనే ప్రశ్న మండల కేంద్ర ప్రజల్లో ఉత్పన్నం అవుతుంది.

## ఆల్ఫోర్స్‌లో ఘనంగా పేరెంట్స్ డే వేడుకలు



**ప్రజాపక్షం/కరీంనగర్ సిటీ:** కరీంనగర్‌లోని కొత్తపల్లిలో గల ఆల్ఫోర్స్ ఇటెక్నో పాఠశాలలో పేరెంట్స్ డే ఉత్సవ్ పేరిట వేడుకలు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఆల్ఫోర్స్ విద్యాసంస్థల చైర్మన్ వి. నరేందర్ రెడ్డి సతీమణి డాక్టర్ వనజా నరేందర్‌రెడ్డి హాజరై వేడుకలను ప్రారంభించి మాట్లాడారు. తల్లిదండ్రుల మాటలను అనుసరించిన వారికి, అమలు చేసిన వారికి విజయం తప్పనిసరిగా చేకూరుతుందన్నారు. వారి జీవితంలో అత్యుత్తమ స్థానంలో స్థిరపడతారని చెప్పడంలో ఎటువంటి సందేహం లేదన్నారు. తల్లిదండ్రుల మాటలను క్రమం తప్పకుండా ప్రతి ఒక్కరు పాటించాలని, వారిని పరిరక్షించాల్సిన బాధ్యత కుటుంబానిదేనని గుర్తు చేశారు. నేటి పోటీ ప్రపంచంలో సాంకేతిక పరిజ్ఞానం అభివృద్ధితో తల్లిదండ్రులతో సమయం గడపకపోవడం చాలా విచారకరమని తెలుపుతూ ప్రతి ఒక్కరూ ప్రాథమిక విధిగా విదేశాల్లో ఉన్నప్పటికీ వారితో కనీస సమయం కేటాయించి వారి యోగక్షేమాలతో పాటు బాగోగులను తెలుసుకుని ఆదర్శంగా నిలవాలని చెప్పారు. జీవితంలో తల్లిదండ్రుల పాత్ర వెలకట్టలేని పవిత్రమైనదన్నారు. కార్యక్రమంలో భాగంగా తల్లిదండ్రులు ప్రదర్శించిన పలు సాంస్కృతి కార్యక్రమాలు అలరింపచేసాయి. వారికి పలు క్రీడలు నిర్వహించగా ఉత్సాహంగా పాల్గొన్నరు. పాఠశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# క్రీడ

# శతకొట్టిన గిల్



కెప్టెన్‌గా తొలి సిరీస్‌లోనే పరుగుల వరద పారిస్తున్న భారత కెప్టెన్ శుభ్‌మన్ గిల్ మాంచెస్టర్ టెస్టులోనూ శతకంతో కదం తొక్కాడు. నాలుగో రోజు నుంచి ఓపికగా క్రీజులో నిలిచిన అతడు.. ఐదో రోజు తొలి సెషన్‌లో సెంచరీ సాధించాడు. క్రిస్ వోక్స్ ఓవర్లో డబుల్స్.. ఆ తర్వాత సింగిల్ తీసి ఈ సిరీస్‌లో నాలుగో సారి మూడంకెల స్కోర్ అందుకున్నాడు గిల్. కేఎల్ రాహుల్ ఔటయ్యాక వాషింగ్టన్ సుందర్(10)తో కలిసి కీలక భాగస్వామ్యం నెలకొల్పిన సారథి.. జట్టు స్కోర్ 200 దాటించాడు. ఇంకా ఇండియా 101 రన్స్ వెనకబడే ఉంది.

తద్వారా ఒకే సిరీస్‌లో నాలుగు సెంచరీలతో విరాట్ కోహ్లీ, సునీల్ గవాస్కర్ రికార్డు సమం చేశాడీ హిట్టర్. కెప్టెన్‌గా బ్రాడ్‌మన్, సునీల్ గవాస్కర్ ఒకే సిరీస్‌లో నాలుగు సెంచరీలు బాదారు. ఆ తర్వాత ఎందరో గొప్ప ఆటగాళ్లు వచ్చినా.. గిల్ తరహా విధ్వంసంతో ఈ అరుదైన క్లబ్‌లో చోటు సంపాదించలేకపోయారు. భారత ఆటగాళ్ల విషయానికొస్తే.. గవాస్కర్, విరాట్ కోహ్లీ, యశస్వీలు అతడి కంటే ముందు ఈ ఘనత సొంతం చేసుకున్నారు.



### సారథిగా 700 రన్స్

బర్మింగ్‌హామ్‌లో రెండు ఇన్నింగ్స్‌ల్లో సెంచరీలతో కదం తొక్కి సంచలనం సృష్టించిన గిల్.. మరో రికార్డు నెలకొల్పాడు. మాంచెస్టర్ టెస్టు రెండో ఇన్నింగ్స్‌లో జట్టును గట్టెక్కించే ఇన్నింగ్స్ ఆడుతున్న సారథి.. 700 రన్స్‌తో చరిత్రకెక్కాడు. ఒక టెస్టు సిరీస్‌లో అత్యధిక రన్స్ కొట్టిన మొట్ట మొదటి భారత కెప్టెన్‌గా గిల్ అవతరించాడు. ఆటగాడిగా చూస్తే.. ఈ ఘనత సాధించినా నాలుగో ఇండియన్‌గా రికార్డు తన పేరిట రాసుకున్నాడీ యువ నాయకుడు. మాంచెస్టర్ టెస్టులో పీకల్లోతు కష్టాల్లో పడిన జట్టును ఆదుకునే పనిలో పడిన గిల్ అర్ధ శతకంతో రాణించాడు. ఈ సిరీస్‌లో 700 పరుగులకు చేరువైన అతడు.. లెజెండ సునీల్ గవాస్కర్ రికార్డు బద్దలు కొట్టాడు. ఇక కెప్టెన్‌గా ఏడొందలకు పైగా రన్స్ చేసిన దిగ్గజాల సరసన నిలిచాడు గిల్. అతడి కంటే ముందు డాన్ బ్రాడ్‌మన్ గ్యారీఫీల్డ్ సోబర్స్, గ్రెగ్ ఛాపెల్, డేవిడ్ గోవర్, గ్రాహమ్ గూచ్, గ్రేమ్ స్మిత్‌లు ఈ మైలురాయిని సాధించారు.

## పాకిస్థాన్‌తో ఆడే ప్రసక్తే లేదు!

శిఖర్ ధావన్



ఈ ఏడాది ఆసియా కప్‌లో భారత్, పాకిస్థాన్ తలపడనున్నాయనే వార్తల నేపథ్యంలో మాజీ ఓపెనర్ శిఖర్ ధావన్ మరో సారి తన వైఖరిని వ్యక్తం చేశాడు. ఎట్టి పరిస్థితుల్లోనూ పాక్‌తో క్రికెట్ ఆడే ప్రసక్తే లేదని గబ్బర్ తెలిపాడు. ఒకవేళ అది వరల్డ్ ఛాంపియన్స్ లీగ్ ఆఫ్ లెజెండ్స్ సెమీ ఫైనల్ అయినా సరే నేను ఆడను. లీగ్ మ్యాచ్ తరహాలోనే బాయ్‌కాట్ చేస్తాను అని ధావన్ వెల్లడించాడు. పహల్గాంలో ఉగ్రదాడి, ఆపరేషన్ సిందూర్ తదనంతర పరిణామాలతో భారత్, పాక్‌ల మధ్య క్రికెట్ సంబంధాలపై అనిశ్చితి కొనసాగుతోంది. ఐసీసీ టోర్నీల్లో మాత్రమే ఆడేందుకు ఇరుబోర్డులు అంగీకరిస్తున్నాయి. ఈ పరిస్థితుల్లో టీమిండియా మాజీ ఆటగాళ్లు మాత్రం దాయాది జట్టుతో మ్యాచ్ ఆడేందుకు ససేమిరా అంటున్నారు. వరల్డ్ ఛాంపియన్స్ లీగ్ ఆఫ్ లెజెండ్స్‌లో భాగంగా జూలై 20 ఆదివారం జరగాల్సిన మ్యాచ్‌ను బాయ్‌కాట్ చేశారు. ఇకపై కూడా అదే రిపీట్ అవుతుందని అంటున్నాడు ధావన్. చిరకాల ప్రత్యర్థులు సెమీస్ చేరితే అప్పుడు ఏం చేస్తారు? అని మీడియా ప్రశ్నించగా.. గబ్బర్ మాత్రం తన నిర్ణయం మార్చుకోనని స్పష్టం చేశాడు.

## రెండొందలు కొట్టినా తప్పని ఓటమి




ప్రపంచ క్రికెట్‌లో వెస్టిండీస్ ఒకప్పుడు ఎంతో భయంకరమైన జట్టు. హిట్టర్లతో, ఆల్‌రౌండర్లతో నిండిన విండీస్ రెండుపర్యాయాలు పొట్టి వరల్డ్ కప్ ఛాంపియన్ కూడా. అలాంటి టీమ్ ఇప్పుడు ఒక్కటంటే ఒక్క విజయం కోసం అపసోపాలు పడుతోంది. సిరీస్ పోతే పోయింది కనీసం ఒక్క మ్యాచ్ అయినా గెలిస్తే చాలు పరువు దక్కుతుంది అనే పరిస్థితిని ఎదుర్కొంటోంది. ఇప్పటికే ఆస్ట్రేలియా ధాటికి మూడు టీ20ల్లో మట్టికరిచిన షాయ్ హోప్ సేన నాలుగో పోరులోనూ చతికిలపడింది. స్వదేశంలో ఏ జట్టైనా పులిలా గర్జిస్తూ.. ప్రత్యర్థుల భరతం పడుతుంది. కానీ, వెస్టిండీస్ మాత్రం చెత్త ఆటతో వరుసగా సిరీస్‌లు సమర్పించుకుంటోంది. ఇదివరకూ సొంతగడ్డపై ఇంగ్లండ చేతిలో వైట్‌వాష్‌కు గురైన విండీస్ ఇప్పుడు ఆసీస్ చేతిలోనూ అదే అవమానానికి చేరువలో ఉంది. టిమ్ డేవిడ్ విధ్వంసక సెంచరీతో మూడో టీ20లో జయభేరి మోగించిన కంగారూ జట్టు.. నాలుగో మ్యాచ్‌లోనూ కరీబియన్ సైన్యాన్ని చిత్తు చేసింది.

సెయింట్ కిట్స్‌లో జరిగిన గేమ్‌లో రొవ్‌మన్ పావెల్(28), రొమారియో షెపర్డ్28)లతో పాటు అందరూ సమిష్టిగా రాణించగా 205 రన్స్ కొట్టింది విండీస్. ఈ మ్యాచ్ అయినా గెలిచి పరువు కాపాడుకుందామనుకున్న హోప్ బృందం ఆశలు ఆడియాసలయ్యాయి. భారీ ఛేదనలో కామెరూన్ గ్రీన్(55 నాటౌట్), వికెట్ కీపర్ జోష్ ఇంగ్లిస్(51) లు చెలరేగి ఆడి లక్ష్యాన్ని కరిగించారు. ఇంగ్లిస్ ఔటయ్యాక అరోన్ హర్డీ(23) ధనాధన్ ఆడడంతో 19.2 ఓవర్లలో ఏడు వికెట్ల తేడాతో ఆసీస్ గెలుపొందింది. ఇరుజట్ల మధ్య చివరిదైన ఐదో టీ20 జూలై 28న జరుగనుంది.

# ఫోకస్ ఆరోగ్యం


**ప్రపంచ ఆరోగ్య సంస్థ ప్రణాళిక ప్రకారం 2030 నాటికి హెపటైటిస్ రహిత ప్రపంచాన్ని నిర్మించాలనే లక్ష్యాన్ని నిర్ణయించారు**



## హెపటైటిస్‌కు చికిత్స సాధ్యమే!

### ముందస్తు పరీక్షలే కీలకం

ప్రపంచవ్యాప్తంగా 325 మిలియన్ల ప్రజలకు హెపటైటిస్ సోకిందని కూడా వారికి తెలియదు. ఇలాగే అజాగ్రత్త వహిస్తే 2030 నాటికి మరో 76 మిలియన్ల ప్రజలకు కూడా సంక్రమించే ప్రమాదం లేకపోలేదు. హెపటైటిస్ వైరస్ సోకిందని తెలియని కారణంగా మిలియన్ల అభాగ్యులు అనారోగ్యంతో బాధపడుతూ మరణం అంచున నిస్సహాయంగా కొట్టుమిట్టాడుతున్నారు. విశ్వవ్యాప్తంగా సాలీనా 1.3 మిలియన్ల హెపటైటిస్ కారణ మరణాలు నమోదుతో పాటు ప్రతి రోజు 3,500 మంది హెపటైటిస్ వ్యాధులతో చనిపోవడం జరుగుతున్నది. భారత్‌లో 40 మిలియన్ల ప్రజలకు హెపటైటిస్ 'బి' వైరస్ సోకడం, 12 మిలియన్ల ప్రజలకు హెపటైటిస్ 'సి' వైరస్ సోకడం జురుగుతున్నది. బీహార్, పంజాబ్, హర్యానా, ఎంపీ, ఒడిసా రాష్ట్రాల్లో హెపటైటిస్ రోగులు అధికంగా ఉన్నట్లు గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి. ముందు జాగ్రత్తలతో హెపటైటిస్ వైరస్‌ను కట్టడి చేయని యెడల హెచ్ఐవీ, టిబీ, మలేరియా మరణాల కన్న హెపటైటిస్ మరణాలు అధికంగా జరగవచ్చని హెచ్చరిస్తున్నారు. హెపటైటిస్ వైరస్ సోకడం వల్ల సంక్రమించే కాలేయ సంబంధ వ్యాధి పట్ల ప్రజల్లో సంపూర్ణ అవగాహన కల్పించాలనే సదుద్దేశంతో ప్రతి ఏట 28 జూలై రోజున ప్రపంచ హెపటైటిస్ దినం పాటించడం 2010నుంచి ఆనవాయితీగా మారింది.ప్రపంచ హెపటైటిస్ దినం2025 ఇతివృత్తంగా హెపటైటిస్ : ఈ వ్యాధిని కట్టడి చేద్దాం అనబడే అంశాన్ని తీసుకొని ప్రచారాన్ని నిర్వహిస్తున్నారు. హెపటైటిస్ 'బి' వైరస్‌ను కనుగొన్న నోబెల్ బహుమతి గ్రహీత 'బి. ఎస్. బ్లూంబెర్గ్' అను శాస్త్రజ్ఞుడి పుట్టిన రోజు 28 జూలై రోజున హైపటైటిస్ దినం పాటించడం పరిపాటి అయ్యింది. టిబీ వ్యాధి తర్వాత అధిక మరణాలను నమోదు చేస్తున్న వ్యాధిగా హెపటైటిస్‌ను గుర్తించారు.



### వైరస్‌ల్లో రకాలు:

ప్రపంచ ఆరోగ్య సంస్థ ప్రణాళిక ప్రకారం 2030 నాటికి హెపటైటిస్ రహిత ప్రపంచాన్ని నిర్మించాలనే లక్ష్యాన్ని నిర్ణయించారు. హెపర్నా వైరిడే కుటుంబానికి చెందిన హెపటైటిస్ వైరస్‌లు 'ఏ', 'బి', 'సి', 'డి', మరియు 'ఈ' అనబడే ఐదు రకాలు ఉన్నాయి. వీటిలో ఏ, బి, సి వైరస్‌లు అతి సాధారణమైనవి. హెపటైటిస్‌ఏ, బి వైరస్‌లకు టీకాలు అందుబాటులో ఉన్నప్పటికీ కేవలం 42 శాతం పిల్లలకు మాత్రమే ఈ టీకాలు ఇవ్వబడుతున్నాయి. రోగి మలం, ద్రవాలు, లేదా రక్తం ద్వారా ఈ వ్యాధి ఇతరులకు సోకుతుంది. రోగులతో కలిసి ఒకే ప్లేట్‌లో తినడం, వైరస్ సోకిన వ్యక్తిని స్పర్శించడం లాంటి కారణాలతో కూడా వైరస్ సోకవచ్చు. భారత్‌లో దాదాపు 3 5 శాతం ప్రజలకు హెపటైటిస్ 'బి' వైరస్ సోకిందని తెలుస్తున్నది. 'సి' వైరస్ సోకిన వారికి కాలేయ క్యాన్సర్ కూడా రావచ్చు. 'సి' వైరస్ సోకివడన వారిలో 30 శాతం మందికి చికిత్స లేకుండానే వ్యాధి నయం కావచ్చు. 'బి' వైరస్ సోకిన వారికి కూడా 'డి' వైరస్ సోకే అవకాశం ఉన్నందున 'డి' వైరస్‌ను 'సూపర్ ఇన్‌ఫెక్షన్' అని కూడా అంటారు. కలుషిత ఆహారంతో సోకే హెపటైటిస్ 'ఈ' వైరస్ వ్యాప్తి పేద దేశాల్లో అధికంగా కనిపిస్తున్నది.

### వ్యాధి లక్షణాలు, నివారణ మార్గాలు:

హెపటైటిస్ వైరస్ సోకడం వల్ల కాలేయ వాపు, వాంతులు, పచ్చ కామెర్లు, కడుపు నొప్పి, జ్వరం, అలసట, కీళ్ల నొప్పులు, మూత్రం ముదురు పసుపు రంగులో ఉండడం, పసుపు రంగు చర్మం, ఆకలి నశించడం, గర్భిణులకు ఆరోగ్య సమస్యలు రావడం లాంటి వ్యాధి లక్షణాలు కనిపిస్తాయి. హెపటైటిస్ వ్యాధిని పరీక్షలు చేయించుకొని త్వరగా గుర్తించడం, వైరస్‌లు సోకకుండా తగు జాగ్రత్తలు తీసుకోవడం, తరుచుగా వ్యాధి నిర్ధారణ పరీక్షలు చేయించుకోవడం, తల్లి నుంచి శిశువుకు సోకకుండా జాగ్రత్త పడడం లాంటి జాగ్రత్తలు తీసుకుంటే హెపటైటిస్ వైరస్‌తో పాటు వ్యాధి కూడా దూరం అవుతుంది. హెపటైటిస్ వైరస్ సోకకుండా ఉండడానికి తీసుకోవలసా జాగ్రత్తల్లో పరిసరాల పరిశుభ్రత, వ్యక్తిగత శుభ్రత, మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండడం, ఆల్కహాల్ సేవనానికి పరిమితులు విధించుకోవడణ, ప్రమాదకర టాక్సిన్స్‌కు దూరంగా ఉండడం, టీకాలను తీసుకోవడం, సురక్షిత లైంగిక సంబంధాలు, డిస్పోజబుల్ సూదులు వాడడం, తగు చికిత్సలు తీసుకోవడం, వైరస్ సోకిన వ్యక్తి రక్తం మన రక్తంతో కలవకుండా చూసుకోవడం, సురక్షిత తాగు నీటిని తీసుకోవడం, మూఢ విశ్వాసాలను బొంద పెట్టడం, వైద్య సిబ్బందికి తగు శిక్షణలు ఇవ్వడం లాంటి జీవనశైలి మార్గాలను పాటించాలి. బ్లూబెర్రీస్, క్రాన్‌బెర్రీస్, ద్రాక్ష పండ్లు, బీట్‌రూట్ రసం, చేపలు లాంటి పోషకాహారాన్ని అధికంగా తీసుకోవాలి.

ప్రపంచ హెపటైటిస్ దినం వేదికగా వైరల్ హెపటైటిస్ పట్ల అవగాహన కల్పించడం, ఔషధాలను అందుబాటులో ఉంచడం, తరుచుగా వ్యాధి నిర్ధారణ పరీక్షలతో పాటు తగు చికిత్సలు చేయించుకోవడం, శుభ్రతను పాటించడం లాంటి ముందు జాగ్రత్తలు తీసుకోవాలి. లైంగిక సంబంధాల్లో కండోమ్స్ వాడడం, రక్త మార్పిడి సందర్భంగా తగు జాగ్రత్తలు తీసుకోవడం, డిస్పోజబుల్ సూదులు వాడడం లాంటి విషయాలను పాటించాలి. చెవులు కుట్టించుకోవడం, ముక్కు కుట్టించుకోవడం, పచ్చబొట్టు వేయించుకోవడం లాంటి సందర్భాల్లో వాడే పరికరాలను మరొకరికి వాడకుండా లేదా వాటికి తగు రీతిలో శుభ్రం చేసే విధంగా చూసుకోవాలి. ఐరాస ఆశించినట్లు 2030 నాటికి హెపటైటిస్ రహిత ప్రపంచాన్ని నిర్మించుకునే మహా యజ్ఞంలో మన వంతు కర్తవ్యాన్ని నిర్వహిద్దాం.

**ఈ శీర్షికన ఇచ్చిన సమాచారం కేవలం పాఠకుల అవగాహన కోసం మాత్రమే. ఆరోగ్య సమస్యలకు వైద్యులను సంప్రదించడం తప్పనిసరి**

## జిల్లా సమగ్రాభివృద్ధికి పోరాటాలు

సిపిఐ వరంగల్ జిల్లా కార్యదర్శి మేకల రవి




**ప్రజాపక్షం/వరంగల్ టౌన్ :** రానున్న రోజులలో జిల్లా సమగ్రాభివృద్ధికి సమరశీల పోరాటాలు నిర్వహించాలని సిపిఐ వరంగల్ జిల్లా కార్యదర్శి మేకల రవి కార్యకర్తలను కోరారు. ఆదివారం వరంగల్ చింతల్ ఫ్లై ఓవర్ అల్పాహారం ఫంక్షన్ హాల్ లో జరిగిన సిపిఐ వరంగల్ మండల మహాసభకు పరికిరాల రమేష్, మేడిది అశోక్, తాళ్లపల్లి రహేలా అధ్యక్ష వర్గంగా వ్యవహరించగా ముఖ్యఅతిథిగా హాజరై మేకల రవి మాట్లాడారు. వేలాదిమంది అమరుల త్యాగాలతో లక్షలాది ఎకరాల భూములు పంచిన ఘనత సిపిఐ సొంతమన్నారు. పేద, మధ్యతరగతి ప్రజల సమస్యల పరిష్కారం కోసం అనేక ఉద్యమాలు చేసి ప్రజల కోసం ప్రాణాలర్పించిన మహనీయుల స్ఫూర్తితో రానున్న రోజుల్లో పోరాటాలను ఉధృతం చేసి పాలకుల ప్రజా వ్యతిరేక విధానాలను ఉపసంహరించుకునేలా చేస్తామన్నారు. జూలై 30,31 తేదీల్లో సిపిఐ వరంగల్ జిల్లా మహాసభలకు ముఖ్య అతిథులుగా సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యులు చాడ వెంకట్ రెడ్డి, రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాసరావు హాజరుకానున్నారని, ఈ మహాసభలను విజయవంతం చేయాలని కోరారు. మండల మహాసభలో సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు పంజాల రమేష్, సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి ఎస్‌కె బాష్ మియా, పనాస ప్రసాద్, జిల్లా కార్యవర్గ సభ్యులు దండు లక్ష్మణ్, వీరగోని శంకరయ్య, జిల్లా సమితి సభ్యులు ఓర్సు రాజు, ఎండి అక్బర్, లాదెల్ల శరత్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం ముప్పై రెండు మందితో మండల సమితిని ఏకగ్రీవంగా ఎన్నుకోగా మండల కార్యదర్శిగా గుండె బద్రి, సహాయ కార్యదర్శిగా జన్ను రవి ఎన్నికయ్యారు.

## 29న సిపిఐ జిల్లా మహాసభ

కరపత్రాలు విడుదల

**ప్రజాపక్షం/మోత్కూర్ :** ఈనెల 29వ జరిగే సిపిఐ జిల్లా మహాసభలను విజయవంతం చేయాలని సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి యానాల దామోదర్‌రెడ్డి పిలుపునిచ్చారు. ఆదివారం సిపిఐ మండల సమితి ఆధ్వర్యంలో కెఆర్ భవన్‌లో మహాసభ కరపత్రాలను విడుదల చేశారు. కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై యానాల దామోదర్‌రెడ్డి మాట్లాడుతూ పార్టీ నాలుగవ జిల్లా మహాసభలు ఈనెల 29న వలిగొండలో జరుగుతున్న సందర్భంలో కమ్యూనిస్టు శ్రేణులు జిల్లా మహాసభలను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సిపిఐ మండల కార్యదర్శి అన్నెపు వెంకట్, గీత పనివారల సంఘం జిల్లా అధ్యక్షులు చాపల అంజయ్య, ఎఐవైఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులు మొగుళ్ల శేఖర్ రెడ్డి, మండల సహాయ కార్యదర్శి పుల్కరం మల్లేష్, మోత్కూరు పట్టణ కార్యదర్శి బోయిన ఉప్పలయ్య, పోచం కన్నయ్య, పెండెం వెంకటేశ్వర్లు, వల్లపు అంతయ్య, ఎర్ర బాబు, దొండ ఎల్లయ్య, కొమ్ము రాములు, గొలుసుల యాదగిరి తదితరులు పాల్గొన్నారు.




## 'సింగరేణి' లాభాల వాటా ప్రకటించాలి

వాసిరెడ్డి సీతారామయ్య, కొరిమి రాజ్‌కుమార్




**ప్రజాపక్షం/జయశంకర్ భూపాలపల్లి :** సింగరేణిలో యాజమాన్యం లాభాల వాటా ప్రకటించాలని ఎఐటియుసి గుర్తింపు సంఘంగా కోరడం జరిగిందని, త్వరలోనే లాభాల వాటా ప్రకటిస్తారని సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ (ఎఐటియుసి) అధ్యక్ష, కార్యదర్శులు వాసిరెడ్డి సీతారామయ్య ప్రధాన కార్యదర్శి కొరిమి రాజ్ కుమార్ తెలిపారు. ఆదివారం జయశంకర్ భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని స్థానిక ఎఐటియుసి కొమురయ్య భవన్‌లో బ్రాంచ్ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. లాభాల వాటా గతంలో 33 శాతం ఇవ్వడం జరిగిందని, ఈసారి 35 శాతం ఇవ్వాలని యాజమన్యాన్ని కోరడం జరిగిందన్నారు. గతంలో టిబిజికెఎస్ గుర్తింపు సంఘంగా ఉన్నప్పుడు ఒక్క స్ట్రక్చర్ మీటింగ్ జరగలేదని, ఇప్పటికే మూడుసార్లు గుర్తింపు సంఘంగా స్ట్రక్చర్ మీటింగులు నిర్వహించడం జరిగిందన్నారు. స్ట్రక్చర్ మీటింగ్‌లో కార్మిక సమస్యలను యాజమాన్యం అంగీకరించి, కొన్నింటికి సర్క్యులర్ జారీ చేసిందని తెలిపారు. అట్లాగే కార్మికుల విద్య, వైద్యం, సొంతింటి పథకం కోసం ఎఐటియుసి కృషి చేస్తుందని, యాజమాన్యం కమిటీ వేసిందని కమిటీ రిపోర్టు రాగానే సొంతింటి కల నెరవేరుతుందని తెలిపారు. విద్య విషయంలో ఆర్ జీ1లో సెంట్రల్ సిలబస్ ప్రారంభమైందని, అట్లాగే శ్రీరాంపూర్, భూపాలపల్లి, కొత్తగూడెంలో సెంట్రల్ సిలబస్ ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. వైద్యం విషయంలో హైదరాబాదులో యాజమాన్యం ప్రత్యేక సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ ఏర్పాటు కోసం యాజమాన్యంతో చర్చించడం జరిగిందన్నారు. డిస్మిస్ కార్మికుల మళ్లీ అవకాశాలు కల్పించాలని, ఐదు సంవత్సరాలు 100 మస్టర్లు ఉండే విధంగా డిస్మిస్ కార్మికులను విధుల్లోకి తీసుకోవాలని కోరడం జరిగిందన్నారు. మారుపేర్ల సమస్యను పరిష్కరించి వారి పిల్లలకు ఉద్యోగాలు ఇవ్వడం కోసం యాజమాన్యం అంగీకరించిందన్నారు. గుర్తింపు సంఘంగా కార్మికులకు ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చే దిశగా యాజమాన్యంతో సంప్రదింపులు జరిపి కార్మికుల పక్షాన పోరాడుతుంటే ఆరున్నర సంవత్సరాలు టిబిజికెఎస్ గుర్తింపు సంఘంగా అధికారంలో ఉండి స్ట్రక్చర్ మీటింగులు, ఎన్నికలు నిర్వహించకుంటే మాట్లాడని ఇతర సంఘాల నాయకులు ఎఐటియుసిపై విమర్శ చేసే అర్హత లేదన్నారు. రాబోయే రోజులలో ఇచ్చిన హామీ ప్రకారం కార్మికుల ప్రతి సమస్యను నెరవేర్చే దిశగా ఎఐటియుసి పోరాడుతుందని వారు తెలిపారు. సమావేశంలో డిప్యూటీ జనరల్ సెక్రెటరీ మడ్డి ఎల్లయ్య, బ్రాంచ్ వైస్ ప్రెసిడెంట్ మాతంగి రామచందర్, అసిస్టెంట్ బ్రాంచ్ సెక్రటరీలు గురిజేపల్లి సుధాకర్ రెడ్డి, గంగసరపు శ్రీనివాస్, కాంట్రాక్ట్ కార్మికుల ఇంచార్జ్ నూకల చంద్రమౌళి, ఏఐటీయూసీ ప్రధాన కార్యదర్శి క్యాతరాజు సతీష్, జిల్లా కార్యవర్గ సభ్యులు సోతుకు ప్రవీణ్ కుమార్ కార్యదర్శి సదయ్య తదితరులు పాల్గొన్నారు.

## పోరాట ఫలితంగానే ఆస్పత్రి కార్మికులకు పెండింగ్ వేతనాలు విడుదల

ఎఐటియుసి జిల్లా ఉపాధ్యక్షుడు రాంబాబు

**ప్రజాపక్షం/కల్లూరు :** ఆసుపత్రి కార్మికులకు పెండింగ్ వేతనాలు ఎఐటియుసి పోరాట ఫలితంగానే విడుదల అయ్యాయని ఎఐటియుసి జిల్లా ఉపాధ్యక్షుడు వేము రాంబాబు తెలిపారు. కల్లూరులో ఆదివారం జరిగిన కార్మికుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గత వారం రోజులు క్రితం రోజువారి విరామ సమయంలో నిరసన కార్యక్రమాలు చేయడంతో ప్రభుత్వం దృష్టికి తెచ్చిన ఎఐటియుసి పోరాట ఫలితంగా వేతనాలు విడుదల అయ్యాయని పేర్కొన్నారు. అదేవిధంగా నియోజకవర్గ పరిధిలోని కల్లూరు, సత్తుపల్లి, పెనుబల్లి, ఆసుపత్రిలలో పరిధిలో ఉన్న కార్మికులకు, వేతనాలు విడుదలయ్యాయన్నారు. వేతనాలు విడుదల కావడంతో కార్మికులు హర్షం వ్యక్తం చేస్తూ మిఠాయిలు పంచుకుంటూ ఎఐటియుసి నాయకులకు ధన్యవాదములు తెలిపారు. రాబోయే రోజుల్లో కనీస వేతనం చట్టం అమలుకు ఉద్యమాలు చేస్తామని ఈ సందర్భంగా ఎఐటియుసి నాయకులు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎఐటియుసి నాయకులు తడికమళ్ళ యోబు, దామాల దయాకర్‌రావుతో పాటు ఆసుపత్రి కార్మికులు ప్రమోదు, వంశీ ,సత్యవతి, నాగమణి, రమాదేవి, మేరీ సరోజిని, లక్ష్మీ ప్రసన్న, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.




## గతపాలనలో 'పంచాయతీ'లు నిర్వీర్యం




సిపిఐ జిల్లా కార్యదర్శి విజయసారథి

**ప్రజాపక్షం/మహబూబాబాద్ :** గత పదేండ్ల బిఆర్‌ఎస్ హయాంలో తండాలను గ్రామపంచాయతీలుగా మార్పుచేసి నిధులు ఇవ్వకుండా నిర్వీర్యం చేశారన్నారని సిపిఐ జిల్లా కార్యదర్శి బి.విజయసారథి ఆరోపించారు. గ్రామపంచాయతీలకు నిధులు రాక ఎంతోమంది గిరిజన సర్పంచ్‌లు ఆత్మహత్యలు చేసుకున్నారని, ఎస్టీ ప్లాన్ నిధులను దారి మళ్లించి పూర్తిగా నిర్వీర్యం చేశారన్నారు. తెలంగాణ గిరిజన సమాఖ్య జిల్లా సమితి సమావేశం స్థానిక వీరభవన్‌లో లావుడియా రాము నాయక్ అధ్యక్షతన ఆదివారం జరిగింది. సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరై విజయ సారథి మాట్లాడుతూ తండాల్లో ఇప్పటికీ సిసి రోడ్లు, సిసి డ్రైనేజీలు లేక ఎక్కడి వేసిన గొంగడి అక్కడే అన్నాట్టు అభివృద్ధి ఉందన్నారు. కొత్తగా వచ్చిన కాంగ్రెస్ ప్రభు త్వం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి గ్రామ పంచాయతీలకు నిధు లు కేటాయించి గిరిజన తండాల్లో ఆదివాసీగూడాల్లో మౌలిక సదుపాయాలు కల్పించి అభివృద్ధి పరచాలన్నారు, గిరిజనులకు ఆదివాసీలకు పోడు రైతులకు హక్కు పత్రాలు ఇచ్చి ఆదుకోవాలని అన్నారు తెలంగాణ గిరిజన సమాఖ్య ఆధ్వర్యంలో నాడు ఆందోళన చేశామని వారిపై పెట్టిన అక్రమ కేసులు ఎత్తివేసి వారికి పట్టాలు ఇవ్వాలని కోరారు. ఆగస్టు 2 న గూడూరు మండల కేంద్రంలో తెలంగాణ గిరిజన సమాఖ్య జిల్లా మహాసభను విజయవంతం చేయాలని గిరిజన సమాఖ్య మహబూబాబాద్ జిల్లా అధ్యక్షు, ప్రధాన కార్యదర్శులు పిలుపునిచ్చారు. గిరిజన సమాఖ్య మహబూబాబాద్ జిల్లా మహాసభ ఆగస్టు రెండున గూడూరు మండల కేంద్రంలో జరుగుతుందని వారు తెలిపారు. వందలాదిగా గిరిజనులు, ఆదివాసీలు మహాసభలో పాల్గొనాలని గిరిజన సమాఖ్య జిల్లా అధ్యక్షుడు లావుద్యా రామునాయక్, ప్రధాన కార్యదర్శి మాలోతు రవీందర్ నాయక్ పిలుపునిచ్చారు. సమావేశంలో సిపిఐ మాజీ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ బి.అజయ్‌సారధిరెడ్డి, నాయకులు యాక్య నాయక్ బాలాజీ, బిచ్చు నాయక్, రాము, విజయ్, రాగం మల్లయ్య, బాబ్ సింగ్, పెరుగు కుమార్ తదితరులు పాల్గొన్నారు

## వ్యవసాయ కార్మికులపై వివక్ష

వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కర్ణకుమార్

**ప్రజాపక్షం/ఖమ్మం :** కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వ్యవసాయ రంగం కార్మికుల పట్ల వివక్ష కొనసాగిస్తున్నాయని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి సిద్దినేని కర్ణకుమార్ ఆరోపించారు. పెరిగిన నిత్యావసర వస్తువులతో పేదలు తీవ్ర ఇబ్బందులు పడుతుంటే పాలకవర్గాలు కనీసం స్పందించడం లేదని ఆయన విమర్శించారు. వ్యవసాయ కార్మిక సంఘం ఖమ్మం జిల్లా కమిటీ సమావేశం ఆదివారం తాటి వెంకటేశ్వర రావు అధ్యక్షతన స్థానిక గిరిప్రసాద్ భవన్‌లో జరిగింది. సమావేశంలో కర్ణకుమార్ మాట్లాడుతూ కేంద్రప్రభుత్వం ఎన్ఆర్‌జిఎస్ పథకంలో పని దినాలకు కోత విధించడమే కాకుండా రోజు వారి వేతనం సైతం గిట్టుబాటు కాకుండా చేస్తుందని ఆరోపించారు. రోజుకు రూ.600గిట్టుబాటు అయ్యేవిధంగా కనీసం 250 రోజులు పని దినాలు కల్పించాలని ఆయన డిమాండ్ చేశారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికలకు ముందు వ్యవసాయ కార్మికులకు ఆత్మీయ భరోసా క్రింద ఏడాదికి రూ.12వేలు ఖాతాల్లో జమ చేస్తామని చెప్పిందని ఇటీవల ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క సైతం జమ చేస్తున్నట్లు ప్రకటించారని కానీ ఇంతవరకు అమలు కాలేదన్నారు. రైతు భరోసా మాదిరి కూలీలకు భరోసా కల్పించే పథకాలు అమలు చేయాలని ఆయన సూచించారు. సమావేశంలో వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు కంపసాటి వెంకన్న, మేళ్లచెరువు వీరబాబు, పిట్టల రాంబాబు, సింగారపు సత్యనారాయణ, గోగుల ఆది, జిల్లా నాగరాజు, మందా ఈశ్వరమ్మపాల్గొన్నారు.







## పంట పొలాలను పరిశీలించిన మంత్రి పొంగులేటి

**ప్రజాపక్షం/కల్లూరు:** కల్లూరు మండల పరిధిలోని మంత్రి పొంగులేటి స్వగ్రామం నారాయణపురంలో పంట పొలాలను పరిశీలించారు. సొంత పొలాలతో పాటు పరిసర ప్రాంతాలలో పంట పొలాల సాగు విధానం తెలుసుకుంటూ రైతులతో మాట్లాడి వివరాలను అడుగుతున్నారు. ఎన్ని పనులున్నా బిజీగా ఉన్నా కూడా తమ స్వగ్రామంలో ఉన్న తమకు చెందిన పంట పొలాలలో వరి పంటతో పాటు తదితర పంటలు సాగు అవుతున్న విధానాన్ని పరిశీలించారు. సుమారు ఒక గంట పాటు గ్రామంలో పంట పొలాలను కలియ తిరిగారు. ఆయన వెంట స్థానిక కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు ఉన్నారు. చంద్రుపట్ల గ్రామంలో ఇటీవల అనారోగ్యంతో ఉన్న మాజీ ఎంపిటిసి కుక్క నాగమ్మ కుటుంబాన్ని పరామర్శించారు.



## ఉమ్మడి జిల్లాకు 2,646 మెట్రిక్ టన్నుల యూరియా




**ప్రజాపక్షం/చింతకాని:** చింతకాని మండలం పందిళ్లపల్లి రైల్వే రేక్ పాయింట్‌కు ఆదివారం 2646 మెట్రిక్ టన్నుల యూరియాతో రైల్వే వ్యాగన్ వచ్చింది. ఈ యూరియా రాకతో ఉమ్మడి ఖమ్మం జిల్లా రైతులకు ఎంతో ఊరట కల్గించనుంది. వ్యాగన్ల ద్వారా వచ్చిన యూరియాను ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలకు సంబంధించి మార్క్‌ఫెడ్, ప్రైవేటు డీలర్లకు పంపిణీ చేసినట్లు రాక్ పాయింట్ ఆఫీసర్ పవన్‌కుమార్ తెలిపారు. ఖమ్మం జిల్లాకు 1346 మెట్రిక్ టన్నుల యూరియాను కేటాయించగా వాటిలో 868 మెట్రిక్ టన్నులు మార్క్‌ఫెడ్‌కు, 578 మెట్రిక్ టన్నులు ప్రైవేటు డీలర్లకు పంపిణీ చేశారు. భద్రాద్రి జిల్లాకు 1200 మెట్రిక్ టన్నుల యూరియాను పంపగా ఖమ్మం సిఆర్‌పి పాయింట్‌లో 100 మెట్రిక్ టన్నులను నిల్ల ఉంచారు. వ్యాగన్ నుంచి యూరియా దిగుమతిని రాక్‌పాయింట్ ఆఫీసర్‌తో పాటు సంబంధిత కంపెనీ బాధ్యులు పర్యవేక్షించారు.

## 'దండి'గా సురేష్‌కు అభినందనల వెల్లువ



**ప్రజాపక్షం/ఖమ్మంరూరల్:** సిపిఐ జిల్లా కార్యదర్శిగా నూతన బాధ్యతలు స్వీకరించిన దండి సురేష్‌కు అభినందనల వెల్లువ కొనసాగుతుంది. ఈ మేరకు ఆయనను ఏదులాపురం నివాసంలో, వరంగల్ క్రాస్‌రోడ్ సిపిఐ కార్యాలయంలో సిపిఐ పార్టీ నాయకులు, పలు కాలనీవాసులు ఆదివారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా నాయుడుపేట, వరంగల్‌క్రాస్‌రోడ్ సిపిఐ శాఖలు, సాయిబృందావనం, సాయిప్రభాత్‌నగర్, ఆదిత్యనగర్, ఓరుగంటినగర్, వెంపటి నగర్ కాలనీవాసులు, ఏదులాపురం ప్రైమరీ, హైస్కూల్ మధ్యాహ్న భోజనం వర్కర్స్,ఎఐటియుసి వర్కర్లు కలిసి పుష్పగుచ్ఛాలను అందజేసి శాలువాలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ నాయకులు ,పలు కాలనీవాసులు ,తదితరులు పాల్గొన్నారు.

## అమరవీరులకు సిపిఐ జిల్లా నూతన నాయకత్వం నివాళి



**ప్రజాపక్షం/ఖమ్మంరూ ర ల్:** ఖమ్మంరూరల్ మండలంలోని కామంచికల్, దారేడు, రామన్నపేట, దానవాయిగూడెంలో సిపిఐ జిల్లా కార్యదర్శి దండి సురేష్, సహాయకార్యదర్శి జమ్ముల జితేందర్‌రెడ్డి ఆదివారం పర్యటించా రు. ఈ సందర్భంగా ఆ ప్రాంతాలలో ఉన్న హనుమంతు కృష్ణయ్య స్మారకస్థూపంతో పాటు పలువురు అమరుల స్థూపాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అలాగే ఎడవల్లి రామారావు విగ్రహానికి పూలమాలలు వేశారు. ఈ సందర్భంగా తమ శాఖలకు విచ్చేసిన వారిరువురికి సిపిఐ శ్రేణులు ఘన స్వాగతం పలికి పూలమాలలు వేసి శాలువాలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు మిడకంటి చిన్న వెంకట్‌రెడ్డి, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు పుచ్చకాయల కమలాకర్, జిల్లా సమితి సభ్యుడు మామిండ్ల శ్రీనాథ్‌రెడ్డి, సిపిఐ మండల కార్యదర్శి పుచ్చకాయల సుధాకర్, సహాయకార్యదర్శి కాలింగి మోహన్‌రావు, ఆయా సిపిఐ శాఖల నాయకులు , తదితరులు పాల్గొన్నారు.

## దోస్త్ ప్రత్యేక విడత కౌన్సెలింగ్ ప్రారంభం

**ప్రజాపక్షం/ మధిర :** డిగ్రీ బిఎ, బిఎస్సీ ,బికాం కోర్సుల్లో ఈ విద్యాసంవత్సరం ప్రవేశాల కోసం దోస్త్ ప్రత్యేక విడత కౌన్సిలింగ్ ప్రక్రియ ప్రారంభమైనట్లు ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ఎం.రవీంద్రారెడ్డి తెలిపారు. ఈ విద్యాసంవత్సరంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో చేరేందుకు ఇది చివరి అవకాశం అని, విద్యార్థినీ, విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. దోస్త్ ప్రత్యేక విడత రిజిస్ట్రేషన్ ప్రక్రియ జూలై 25 నుండి జూలై 31తేదీవరకు జరుగుతుందని, ఆగస్టు 3వ తేదీన దోస్త్ ప్రత్యేక విడత సీట్ల కేటాయింపు ఉంటుందని, ఆగస్టు 3 నుండి 6వ తేదీ వరకు ఆన్‌లైన్ ద్వారా సెల్ఫ్ రిపోర్టింగ్ చేయాలని తెలిపారు. ఇతర వివరాలకు 9440257256 9441786508 నెంబర్లకు సంప్రదించాలని సూచించారు.

## ఇందిరమ్మ ఇండ్లకు శంకుస్థాపన



**ప్రజాపక్షం/ముదిగొండ:** మండల కేంద్రమైన ముదిగొండ, వెంకటాపురం గ్రామాల్లో ప్రభుత్వం మంజూరు చేసిన ఇందిరమ్మ ఇళ్ల కు డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క సతీమణి అమ్మ ఫౌండేషన్ చైర్మన్ మల్లు నందిని ఆదివారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, రాష్ట్రంలో బడుగు బలహీన వర్గాల ప్రజల కోసం కాంగ్రెస్ ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్లు, సన్న బియ్యం, మహిళలకు ఉచిత బస్సు, రైతులకు రుణమాఫీ, పేదలకు రేషన్ కార్డులు వంటి సంక్షేమ పథకాలు సమర్థవంతంగా అమలు చేస్తుందని ఆమె అన్నారు. అనంతరం యడవల్లి లో సీఎం రిలీఫ్ ఫండ్ కింద మంజూరైన చెక్కులను అందజేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ , కాంగ్రెస్ జిల్లా అ ధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, మండల నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

## కారేపల్లిలో కోతులు హల్చల్



**ప్రజాపక్షం/కారేపల్లి:** కారేపల్లిలో కోతుల బెడదతో ప్రజలు తీవ్ర భయాందోళనకు గురవుతున్నారు. కారేపల్లిలో ఒక ప్రదేశం అని కాకుండా ప్రతి వీధిలో ఈ కోతులు బీ భత్సం సృష్టిస్తున్నాయి. అంతే కాకుండా మనుషులపైన కూడా దాడి చేస్తున్నా యి. ఇళ్లల్లోకి చొరబడి అందిన వస్తువులు ఎత్తుకెళ్తున్నాయి. వి విధ గ్రామాల నుండి వచ్చిన ప్రజలు బస్టాండ్ సెంటర్‌లో కిరాణం, కూరగాయాలు, పండ్ల దుకాణాల్లో వస్తువులు కొనుక్కొని వెళ్తున్న ప్రజల చేతుల్లో ఉన్న కవర్లను కో తులు లాక్కొని వెళ్తూ తీవ్ర భయభ్రాంతులకు గురిచేస్తున్నాయి. ఇప్పటికైనా అధికారులుస్పందించి కోతులబారి నుండి కాపాడాలని ప్రజలు కోరుతున్నా రు.

## ఒక్క వరదకే ధ్వంసమైన..
# బిటి రహదారి 'కాజ్‌వే'!



ధ్వంసమైన కాజ్‌వే దృశ్యం

*రూ. కోటి 70 లక్షలు వరద పాలు
* నాణ్యతపై అనుమానాలు

**ప్రజాపక్షం/పాల్వంచ :** పిల్లి గుడ్డిదైతే .. ఎలుక ఎకసక్కాలాడుతుందనే సామెతలాగా .. అధికారులు మామూళ్ళ మత్తులో కళ్ళుమూసుకోవటంతో గుత్తేదారు తమ ఇష్టారీతిన పనులు చేస్తారని అంటారు. సుమారు కోటి 70 లక్షలతో నిర్మించిన బిటి రహదారితో పాటుగా కాజ్‌వే ఒక్క వరదకే ధ్వంసమైనది. దీనితో వాటి నాణ్యత బట్టబయలైనది. కోట్ల నిధులు వరదపాలైనాయని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మండల పరిధి పుల్లాయిగూడెం నుండి రెడ్డిగూడెం ( ప్రభాత్ గూడెం )వరకు సుమారు 70 లక్షల 2024, 25 సిఆర్‌ఆర్ నిధులతో బిటి రహదారితో పాటుగా కిన్నెరసాని వాగుపై కోటి నిధులతో చేపట్టిన కాజ్‌వే నిర్మాణ పనులకు 23.05.2025న, ఎంఎల్‌ఏ కూనంనేని సాంబశివరావు శంఖుస్థాపన చేశారు. పనులను దక్కించుకొన్న గుత్తేదారు నాణ్యతకు తిలోదకాలు ఇస్తూ తమ ఇష్టారీతిన నిర్మాణ పనులు కొనసాగిస్తున్నారు. దీనితో సుమారు రెండు కోట్లతో చేపట్టిన పనులు నీటి పాలవుతున్నాయనే విమర్శలు వస్తున్నారు. పర్యవేక్షించే పంచాయితీ రాజ్ శాఖ అధికారులు అటువైపు కన్నెత్తి చూడటం లేదనే ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. దీనితో నిర్మాణ పనుల నాణ్యతపై స్థానికులు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. ఈ నెల 24వ, తేదీ రాత్రి 10 గంటలకు కిన్నెరసాని ప్రాజెక్టు ఒక గేటు ఎత్తి వేసిన అధికారులు వేయి క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేశారు. వచ్చిన కొద్దిపాటి వరద ఉధృతికి తట్టుకోలేక కాజ్‌వే తో పాటు, బిటి రహదారి కోతకు గురై కొట్టుకొనిపోయి ధ్వంసం అయింది. రాబోయే రోజుల్లో కిన్నెరసాని ప్రాజెక్టు ద్వారా భారీగా వరద నీటిని విడుదల చేసే అవకాశం ఉందని (గతంలోనూ విడుదల చేశారు) అప్పుడు ఎలా ఉంటుందో అని సందేహాలు తలెత్తుతున్నాయి. రోజులు గడుస్తున్నా అధికారులు అటువైపు కన్నెత్తి చూడక పోవటంతో ఆ శాఖ అధికారుల తీరుపై పలు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. ఇకనైనా సంభందిత అధికారులు క్షేత్ర స్థాయిలో పరిశీలించి ప్రజల సొమ్ముతో నిర్మిస్తున్న పనులను పది కాలాల పాటు పదిలంగా ఉండేటట్లు చర్యలు తీసుకోవాలని పలువురు అంటున్నారు.

*** ఏమైంది ? అంటూ ఫోన్ కట్ :**
ఈ విషయంపై పంచాయితి రాజ్ డిఈ రామక్రిష్ణను ఫోన్ ద్వారా వివరణ కోరగా .. ఏమైందంటూ వివరణ ఇవ్వకుండా ఫోన్ కట్ చేయటం ఆయన నిర్లక్ష్యానికి అద్దం పడుతోంది.

## రాజకీయంలో నమ్ముకున్న వ్యక్తి లేకపోవడం బాధాకరం

### జక్కంపూడి ప్రథమ వర్ధంతి సభలో మంత్రి తుమ్మల



**ప్రజాపక్షం/ తల్లాడ :** 43ఏళ్ల రాజకీయ జీవితంలో నేను కష్టనష్టాల్లో ఉన్నప్పటికీ నన్ను నమ్ముకున్న వ్యక్తిగా సుదీర్ఘకాలం పాటు నా రాజకీయ జీవితంలో నాతో నడిచిన కృష్ణమూర్తి లేకపోవడం తనకెంతో తీరని లోటని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. ఆదివారం తల్లాడ మండలంలోని బిల్లుపాడు గ్రామంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు స్వర్గీయ జక్కంపూడి కృష్ణమూర్తి ప్రథమ వర్ధంతి నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మంత్రి తుమ్మలతో పాటు సత్తుపల్లి ఎమ్మెల్యే మట్టా రాగమయి దయానంద్ హాజరయ్యారు. ఈ సందర్భంగా తుమ్మల ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం జక్కంపూడి కుమారుడు కిషోర్ అధ్యక్షతన జరిగిన సభలో మంత్రి మాట్లాడుతూ కృష్ణమూర్తి లాంటి స్నేహితులు ఉండటం వల్లే తాను ఈ గ్రామాన్ని మండలాన్ని అభివృద్ధి చేశానని గుర్తు చేశారు. ఆయనతో పాటు ఈ ప్రాంత ప్రజలు అంటే తనకెంతో నమ్మకమని, ఏ పార్టీలో ఉన్నప్పటికీ తనను ఆశీర్వదించారని అన్నారు. కృష్ణమూర్తి మన మధ్య లేకపోయినప్పటికీ ఆయన చుట్టుపక్కల గ్రామాలకు చేసిన అభివృద్ధి నిరంతరం గుర్తుంటుందని అన్నారు. అనంతరం ఎమ్మెల్యే రాగమయి మాట్లాడుతూ సత్తుపల్లి నియోజకవర్గంలో జరిగిన ఎన్నికల్లో తన గెలుపుకు కృష్ణమూర్తి అహర్నిశలు శ్రమించారని, అధికారంలోకి వచ్చిన తర్వాత ఆయన లేకపోవడం బాధాకరమని అన్నారు. ఆయన కోరిక మేరకు గ్రామాన్ని, మండలాన్ని నియోజకవర్గాన్ని అభివృద్ధి చేస్తానని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షులు కాపా సుధాకర్, తదితరులు పాల్గొన్నారు.

## ఎంఆర్‌పి కంటే ఎక్కువకు విక్రయిస్తే కఠిన చర్యలు

### వివి. పాలెం సొసైటీని సందర్శించిన ప్రత్యేకాధికారి సురేంద్రమోహన్



**ప్రజాపక్షం/రఘునాథపాలెం :** ఎరువులను ఎంఆర్‌పి కంటే ఎక్కువ ధరకు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఉమ్మడి ఖమ్మం జిల్లా ప్రత్యేకాధికారి వ్యవసాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ సురేంద్రమోహన్ తెలిపారు. ఆదివారం ప్రత్యేకాధికారి సురేంద్రమోహన్ వి. వెంకటాయపాలెం సొసైటీని సందర్శించి అక్కడ యూరియా, డిఏపి స్టాక్‌ను పరిశీలించారు. రైతులతో ముచ్చటించారు. యూరియా, ఇతర ఎరువులు సకాలంలో అందుతున్నాయా, సరిపోయినంతా ఇస్తున్నారా అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సొసైటీలు, ప్రైవేటు డీలర్లు తప్పనిసరిగా యూరియా, ఇతర ఎరువులకు సంబంధించి స్టాక్ బోర్డును విధిగా షాపు ఎదుట డిస్‌ప్లే చేయాలన్నారు. ఎంఆర్‌పి కంటే ఎక్కువకు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. రైతులు అధైర్యపడవద్దని రాష్ట్రంలో అవసరమైన మేర ఎరువులు అందుబాటులో ఉన్నాయన్నారు. ఎరువుల కృత్రిమ కొరత సృష్టిస్తే చర్యలు తప్పవన్నారు.జిల్లా వ్యవసాయ అధికారి ధనసరి పుల్లయ్య, వ్యవసాయ సహాయ సంచాలకులు కొంగర వెంకటేశ్వరరావు, ఏఎంసి ఛైర్మన్ యరగర్ల హన్మంతరావు, సొసైటీచైర్మన్, వైస్ చైర్మెన్లు రావూరి సైదబాబు, రావెళ్ల శ్రీనివాస్, మండల వ్యవసాయ అధికారి ఉమామహేశ్వరరెడ్డి, టెక్నికల్ ఏవో పవన్ కుమార్, ఏఈవో శిరణ్మయి, సొసైటీ కార్యదర్శి ఐతగాని తిరుపతి రావు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్ర స్థాయి క్రీడా పోటీలకు ఎంపికలు పూర్తి



**ప్రజాపక్షం/కల్లూరు:** కల్లూరులో రాష్ట్రస్థాయి క్రీడా పోటీలకు ఆదివారం ఎంపికలు పూర్తయినట్లు వ్యాయామ ఉపాధ్యాయులు వీరరాఘవయ్య తెలిపారు. ఎనిమిది సంవత్సరాల నుంచి 16 సంవత్సరాల వారికి విడివిడిగా క్రీడా పోటీలు నిర్వహించడం జరిగిందని పేర్కొన్నారు. క్రీడాపోటీల వివరాలు పరుగు పందెం, స్టాండింగ్ బ్రాడ్ జంప్, ఫైవ్ మీటర్స్ అప్రోచ్ లాంగ్ జంప్ కిడ్స్ జావిలన్ త్రో ఖమ్మం జిల్లా స్థాయి అథ్లెటిక్స్ పోటీలలో ప్రథమ, ద్వితీయ స్థానాలలో ఉన్నవారికి ఆగస్టు ఏడో తారీఖున జనగామలో జరిగే రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేయడం జరిగిందని వారు వివరించారు. పోటీలలో అత్యంత ప్రతిభ కనబరిచిన క్రీడాకారులు రాష్ట్రస్థాయి పోటీలలో పాల్గొంటారని శిక్షకులు రాధాకృష్ణ, త్రివేణి, గౌతంరెడ్డి, గోపి, సతీష్ కుమార్, నాగబాబులు తెలిపారు. ఈ కార్యక్రమంలో వంద మంది క్రీడాకారులు పాల్గొన్నారు. మండల విద్యాశాఖ అధికారి నివేదిత క్రీడాకారులను దీవించి అభినందించారు. ఈ కార్యక్రమానికి లయన్స్ క్లబ్ వారు సహకరించారు.

## 'మొక్కలను' తినేస్తున్న నత్తలు

### కోతులే నయమంటున్న రైతులు
### సాంప్రదాయ పంటల స్థానంలో జామాయిల్ సాగు



**ప్రజాపక్షం/ఖమ్మం:** ప్రకృతిలో వస్తున్న మార్పులు వ్యవసాయ రంగంపై తీవ్ర ప్రభావం చూపుతున్నాయి. ఇప్పటికే అతివృష్టి అనావృష్టి మధ్య కూనారిల్లుతున్న వ్యవసాయానికి ఇప్పుడు నత్తల బెడద వచ్చిపడింది. ఖమ్మం జిల్లాలోని పలు గ్రామాల్లో పంట పొలాల్లోని మొక్కలను నత్తలు తినేస్తున్నాయి. ముఖ్యంగా మధిర మండలం మల్లవరం గ్రామంలో ఈ నత్తల కారణంగా రైతులు సాంప్రదాయ వ్యవసాయ పద్ధతిని కాదని జామాయిల్ సాగు వైపు మొగ్గు చూపుతున్నారు. నత్తలు రాత్రికి రాత్రే మొక్కల ఆకులతో పాటు కాండాలను సైతం తినేస్తున్నాయి. దీనితో పత్తి, మొక్కజొన్న వరి నారును సైతం తినేస్తున్నాయి. రాత్రి పూట వేల సంఖ్యలో నత్తలు సంచరిస్తూ మొక్కలను తినేస్తున్నాయి. ఒక మల్లవరం గ్రామంలోనే పత్తి, మొక్కజొన్న, ఇతర పంటల సాగును రైతులు వదిలేశారు. జామాయిల్ సాగును చేస్తున్నారు. నత్తలను ఎలా నివారించాలో అర్థం కావడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నత్తల కంటే కోతులే నయమని కాపలపెట్టి పొలాల నుంచి వెళ్ల గొట్టేవారిమని ఇతర రక్షణ చర్యలు తీసుకునే వారిమని ఇప్పుడు ఆ పరిస్థితి లేదని రైతులు అంటున్నారు. వ్యవసాయ శాస్త్రవేత్తలు ఒకసారి పరిశీలించి నత్తల నివారణకు తగు చర్యలు సూచించాలని రైతులు కోరుతున్నారు.

## రాష్ట్ర అభివృద్ధే కాంగ్రెస్ లక్ష్యం: మట్టా



**ప్రజాపక్షం/ తల్లాడ:** తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రజాపాలనలో సిఎం రేవంత్‌రెడ్డి నేతృత్వంలో అభివృద్ధిలో ఎంతో మందుకు దూసుకుపోతుందని, తెలంగాణ అభివృద్ధే కాంగ్రెస్ ప్రభుత్వం లక్ష్యమని సత్తుపల్లి ఎమ్మెల్యే మట్టా రాగమయి దయానంద్ అన్నారు. తల్లాడ మండలం బిల్లుపాడు గ్రామంలో నూతన అంగన్వాడీ భవనానికి ఆదివారం శంకుస్థాపన చేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక తెలంగాణ రాష్ట్రంలో అభివృద్ధి శరవేగంగా జరుగుతుందని, ప్రజలందరికీ సంక్షేమ పథకాలు అందుతున్నాయన్నారు. రాబోయే రోజుల్లో స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి మద్దతు ఇచ్చి ప్రజలందరూ కాంగ్రెస్ అభ్యర్థుల్ని గెలిపించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో తల్లాడ మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు, ఉన్నతాధికారులు, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## జిల్లా మహాసభకు హాజరైన ప్రతినిధులు



**ప్రజాపక్షం/ఆళ్లపల్లి:** అశ్వారావుపేట పట్టణం లో జరుగుతున్న భద్రాద్రి కొత్తగూడెం మూడవ జిల్లా మహాసభలకు ఆళ్లపల్లి మండలం నుండి ప్రతినిధులుగా25మందిహాజరుకావడం జరిగింది. కామ్రేడ్ పువ్వాడ నాగేశ్వరరావు జెండా ఆవిష్కరణ చేసి ప్రారంభించారు. బొల్లోజు అయోధ్య జ్యోతి ప్రజ్వలన చేసి, అంగరంగ వైభవంగా అ ధ్యక్షులను ఎన్నుకున్నారు. మహాసభలో జాతీయ, రాష్ట్ర నా యకులు పాల్గొని వచ్చిన పార్టీ ప్రతినిధులను ఉత్సాహపరుస్తూ ప్రసంగించారు. సంతోషంగా ఉందని కమ్యూనిస్టుల గు రించి తెలుసుకునే అవకాశం వచ్చినందుకు గర్వపడుతున్నామని తెలిపారు.

## పేదల పక్షపాతి కాంగ్రెస్ ప్రభుత్వం



**ప్రజాపక్షం/మధిర:** తెలంగాణలో అధికారం చేపట్టిన కాంగ్రెస్ ప్రభుత్వం పేదల పక్షపాతి అని 17వ డివిజన్ అధ్యక్షుడు తలుపుల వెంకటేశ్వర్లు అన్నారు. ఆదివారం మధిర మున్సిపాల్టీ పరిధిలోని 17వ డివిజన్‌లో డిప్యూటీ సిఎం మల్లు భట్టివిక్రమార్క ఆదేశాల మేరకు పేద లబ్ధిదారులకు మంజూరైన ఆహార భద్రత కార్డుల మంజూరు పత్రాలను అందచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అర్హులందరికీ రేషన్‌కార్డులు, ఇందిరమ్మ ఇళ్లు అందచేయటం జరుగుతుదని తెలిపారు.రేషన్‌కార్డు తీసుకున్న ప్రతిఒక్కరూ ఆనందరం వ్యక్తం చేస్తూ రేషన్ కార్డుల మంజూరుకు చొరవ చూపిన భట్టివిక్రమార్కకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపినట్లు పేర్కొన్నారు.

# నిండుకుండలా చెరువులు, కుంటలు

### కల్లూరుసర్కిల్‌లో అలుగులు పారుతున్న200కు పైగా చెరువులు



**ప్రజాపక్షం/కల్లూరు:** గత వారం రోజుల నుంచి కల్లూరు మండలంలో కురుస్తున్న విస్తారమైన వర్షాలకు గాను చెరువులు, కుంటలు పూర్తి స్థాయిలో నిండటంతో జల కళ సంతరించుకుంది. కల్లూరు సర్కిల్ పరిధిలో కల్లూరు, తల్లాడ, పెనుబల్లి, సత్తుపల్లి, వేంసూరు, మధిర, ఎర్రుపాలెం, చింతకాని, బోనకల్, ముదిగొండ మండలాల పరిధిలో ఉన్న 514 చెరువులు, కుంటలు పరిధిలో 200 చెరువులు పూర్తిస్థాయిలో నిండి అలుగులు పారుతున్నట్లు కల్లూరు సర్కిల్ ఎస్ ఇ వాసంతి తెలిపారు. మరికొన్ని 75% నిండుకున్నట్లు వారు పేర్కొన్నారు. ఖరీఫ్ సీజన్ కు గాను చెరువులు కుంటలు పూర్తి స్థాయిలో నిండి ఉండటం వలన రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఖరీఫ్ సీజన్లో పంటలకు పుష్కలంగా నీరు చేరడంతో పత్తి మిర్చి మొక్కజొన్న ,వరి పంటలు సాగుకు ఇప్పటికే రైతులు సిద్ధం కాగా మెట్ట మాగాణి పంటలు కు 30 వేల నుంచి 60 పైగావేల వరకు పెట్టుబడితో సాగును కొనసాగిస్తున్నారు. కల్లూరు మండల పరిధిలోని ముత్సవరం, పెద్ద కోరుకొండి, చిన్న కోరుకొండి, చెన్నూరు, లింగాల, బత్తులపల్లి, పేరువంచ తదితర గ్రామాలలో రైతులు వ్యవసాయ పనుల్లో బిజీ బిజీగా ఉన్నారు. గత వారం రోజుల నుంచి కురుస్తున్న వర్షాలకు గాను జలమయంగా మారాయి. పత్తి చేలలో నీరు నిలవబడి ఉండటంతో మరో వారం రోజులు ఇదే విధంగా ఉంటే పత్తి దిగుబడి తగ్గే అవకాశం ఉందని రైతులు పేర్కొంటున్నారు. మండలంలో పోచవరం, లోకవరం ,కల్లూరు పేరువంచ, ముచ్చవరం పాయపూరు తదితర గ్రామాల్లో ఉన్న పెద్ద చెరువులన్నీ పూర్తిస్థాయిలో నిండుకుండలా ఉన్నాయి. దీనివలన రైతులు ఖరీఫ్ రబీకి కూడా నీరు పుష్కలంగా ఉంటాయని పేర్కొంటున్నారు. కల్లూరు సర్కిల్ పరిధిలో 514 చెరువులకు గాను 200 పూర్తిస్థాయిలో నిండి అలుగులు ప్రవహిస్తుండటంతో సర్కిల్ పరిధిలో సుమారుగా లక్షా 1,50,000 వేల మంది రైతులు ఈ సీజన్‌కు పత్తి, మిర్చి, వరి, మొక్కజొన్నపంటలు సంతోషంగా సాగు చేస్తున్నారు. ఖరీఫ్ లో కష్టాలు లేకుండా నీటి సరఫరాను ప్రభుత్వ ఆదేశాల మేరకు పుష్కలంగా అందిస్తామని అధికారులు సిబ్బంది పర్యవేక్షణలో నీటిని అందిస్తామని ఎస్ ఈ పేర్కొన్నారు. ప్రతి రోజు 10 మండలాల అధికారులతో సమీక్షలు నిర్వహించి కాలువలు, చెరువులు, కుంటలు ద్వారా అందిస్తున్న నీటిని సమీక్షల ద్వారా నేరుగా రైతులకు ఇబ్బందులు లేకుండా అందించేందుకు కృషి చేస్తామని పేర్కొన్నారు.



# స్థానికం

REGIONAL NEWS

వరంగల్, హన్మకొండ, జనగాం, భూపాలపల్లి, ములుగు, మహబూబాబాద్

## విద్యుత్ ఉపకేంద్రాలలో తనిఖీ

ఎడిఈ రణధీర్‌రెడ్డి

**ప్రజాపక్షం/జఫర్‌గడ్:** మండల పరిధిలోని 33/11 కేవీ జాఫర్‌గడ్, ఓబులాపూర్, కూనూరు, ఉప్పుగల్, విద్యుత్ ఉపకేంద్రంలో ఆదివారం ఏడీఈ రణధీర్‌రెడ్డి ఆకస్మిక తనిఖీ నిర్వహించి అక్కడ విధులు నిర్వహిస్తున్న సిబ్బందికి పలు సూచనలు చేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సబ్ స్టేషన్‌లో విధులు నిర్వహించే విద్యుత్ సిబ్బంది నిరంతర అప్రమత్తంగా ఉండాలన్నారు. ప్రతి గంటకు లాగ్‌బుక్‌లో రీడింగ్ నమోదుచేయాలన్నారు. సబ్‌స్టేషన్ పరిసర ప్రాంతాలలో పరిశుభ్రత పాటించాలన్నారు. ఉన్నతాధికారుల ఆదేశాలతో ప్రతీరోజు రెండు సబ్‌స్టేషన్లు తనిఖీ చేయడం జరుగుతుందని, విధులలో ఏమాత్రం అలసత్వం వహించినా ఉపేక్షించేది లేదన్నారు. తడి చేతులతో స్టాటర్ డబ్బాలను తాకకూడదని, సొంతంగా ట్రాన్స్‌ఫార్మర్ ఫీజులు మార్చకూడదన్నారు. వర్షం పడే సమయంలో విద్యుత్ స్తంభాలు ముట్టకూడదని, సరఫరాలో ఎలాంటి అంతరాయం కలిగినా సంబంధిత సిబ్బందికి సమాచారం అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆపరేటర్లు మురళి, శరత్, రాజు, రాంరెడ్డి, అన్‌మ్యాన్డ్ వర్కర్ చంద్రమౌళి,పాల్గొన్నారు.

## రామప్పలో శ్రావణ మాస పూజలు



**ప్రజాపక్షం/వెంకటాపూర్ :** మండలంలోని ప్రఖ్యాత రామప్ప రామలింగేశ్వర ఆలయంలో ఆదివారం భక్తుల సందడి నెలకొంది. శ్రావణమాసం ప్రారంభం కావడంతో పాటు ఆదివారం సెలవు రోజు కావడంతో జిల్లా నుంచే కాకుండా వివిధ ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో రామలింగేశ్వరుని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ ప్రధాన అర్చకులు హరి శర్మ ఉమా శంకర్ రామలింగేశ్వర కి ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తులకు తీర్థ ప్రసాదాలను అందజేశారు. ఆలయ విశిష్టతను టూరిజం గైడ్లు గోరంట్ల విజయకుమార్, తాడబోయిన వెంకటేష్ వివరించారు. ఆలయంలోని శిల్పకళా సౌందర్యాలను ఆలయ విశిష్టతను చూసి భక్తులు మంత్రముగ్ధులయ్యారు.

## మాట నిలబెట్టుకున్న పుట్ట మధు



**ప్రజాపక్షం/భూపాలపల్లి :** జయశంకర్ భూపాలపల్లి జిల్లా కాటారం మండల కేంద్రానికి చెందిన గంట జ్యోత్స్న ఎంబీబీఎస్ కోర్సు పూర్తయ్యే వరకు ఖర్చులు భరిస్తానని మాట ఇచ్చిన మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్ తన మాట నిలబెట్టుకున్నారు. రెండు రోజుల క్రితం బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ జన్మదిన వేడుకల్లో బాగంగా గిఫ్ట్ ఏ స్మైల్ ద్వారా ఏడాదికి ఖర్చు అయ్యే రూ.2లక్షల సాయం అందిస్తానని జ్యోత్స్న కుటుంబానికి భరోసా ఇచ్చారు. ఈ క్రమంలో ఆదివారం భూపాలపల్లి జిల్లా మొగుళ్ళ పల్లి మండలం ఇస్సిపేట గ్రామంలోనీ శ్రీ లక్ష్మి సాయి గార్డెన్ లో గంట జ్యోత్స్నకు మాజీ మంత్రి, బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ చేతుల మీదుగా రూ.2లక్షల చెక్కు అందజేశారు. మాట ఇచ్చి తన భవిష్యత్‌కు బంగారు బాట వేసిన మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్, బీఆర్ఎస్ పార్టీ శ్రేణులకు జ్యోత్స్న కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో భూపాలపల్లి జిల్లా పరిషత్ మాజీ ఛైర్పర్సన్ జక్కు శ్రీహర్షిణి రాకేష్, బీఆర్ఎస్ పార్టీ శ్రేణులు తదితరులు పాల్గొన్నారు.

## జిల్లా ప్రైవేట్ వ్యాయామ విద్య ఉపాధ్యాయ సంఘం నూతన కార్యవర్గం ఎన్నిక



**ప్రజాపక్షం/నర్సంపేట :** న్సంపేట పట్టణంలోని సిటిజన్ క్లబ్ ఆవరణలో వరంగల్ జిల్లా ప్రైవేట్ వ్యాయామ విద్య ఉపాధ్యాయ సంఘం నూతన కార్యవర్గం జిల్లా ప్రైవేట్ వ్యాయామ విద్య ఉపాధ్యాయ సంఘం గౌరవ అధ్యక్షులు డాక్టర్ పుల్లూరి శ్రీనివాస్ గౌడ్ ఆధ్వర్యంలో ఏకగ్రీవ ఎన్నిక చేశారు. వరంగల్ జిల్లా ప్రైవేట్ వ్యాయామ విద్య ఉపాధ్యాయ సంఘం నూతన అధ్యక్షులుగా పరికి ప్రశాంత్ , ప్రధాన కార్యదర్శిగా యాట రవికుమార్ ముదిరాజ్ , కోశాధికారిగా రచ్చ భవాని చందు , ఉపాధ్యక్షులుగా ఇటుకాల దేవేందర్, కందకట్ల సతీష్, ఇరుగదిండ్ల వెంకటరత్నం, నాడం సంతోష్ పటేల్ , సహాయ కార్యదర్శులుగా ఓరుగంటి మహేష్, ఉరుసుల శేఖర్ యాదవ్, కుంట విజేందర్ యాదవ్, పడిశాల సురేష్, క్రీడల సెక్రెటరీగా మాదాసి అజయ్ కుమార్, సాంస్కృతిక సెక్రటరీగా పుల్లూరి సుమన్ గౌడ్ , మీడియా సెక్రెటరీగా సిరపురపు మహేష్ , కార్యవర్గ సభ్యులుగా వజ్జ రాజేష్, ఉడుతల శ్రీకాంత్ ముదిరాజ్, కదారి అశోక్, మైదం రాజశేఖర్, కీర్తి శివప్రసాద్, ఎండి రియాజుద్దీన్, భూక్య చందు, ఈక కృష్ణ, బూర్క మహేందర్, తోలం సూర్యం, దుగ్గిడి సురేష్, భూక్య జగన్, వనపర్తి మౌనిక, బిజ్జ సంధ్యారాణి, దొమ్మటి గణేష్, దొడ్డ కిరణ్ యాదవ్, కొత్త రాము గౌడ్, కుంట నరేష్ ముదిరాజ్‌లు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈఎన్నికలకు ఎలక్షన్ ఆఫీసర్లుగా వరంగల్ జిల్లా ఎస్‌జిఎఫ్ఐసెక్రెటరీ సోనబోయిన సారంగపాణి, అసిస్టెంట్ సెక్రటరీ కందుల స్వామి గౌడ్, నర్సంపేట డివిజన్ వ్యాయామ విద్య ఉపాధ్యాయ సంఘం ప్రధాన కార్యదర్శి గుండేటి రవీందర్ గౌడ్‌లు వ్యవహరించారు.

## రాళ్ల వాగులో పడి వ్యక్తి మృతి



**ప్రజాపక్షం/గూడూరు:** మండలంలోని బిసకోబాల్ తండా గ్రామానికి చెందిన బానోతు బాలు (50) శనివారం రాత్రి దసరు తండా నుండి కొబల్ తండాకు వెళ్లే మార్గ మధ్యలో వాగు దాటుతుండగా గుంత ఉండడంతో ప్రభాదావశత్తు గుంతలో కాలు జారీ పడి నీటిలో మునిగి మరణించడం జరిగింది. ఆదివారం ఉదయం కుటుంబ సభ్యులు బాలు కొరకు వెతుకుతుండగా రాళ్లవాగులో శవమై కనిపించాడు. భర్త శవాన్ని చూసి బుజ్జి కేకలు వేయడంతో అది విన్న గ్రామస్తులు రాళ్లవాగు దగ్గరికి వచ్చి న తండా వాసుల సహాయంతో శవాన్ని బయటకు తీసి పోలీసులకు సమాచారం అందించి న తరువాత పోలీసులు శవ పంచాంగం నిర్వహించారు. అనంతరం మృతుని భార్య బానోతు బుజ్జి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై గిరిధర్ రెడ్డి తెలిపారు.

## విద్యుత్ షాక్‌తో లైన్‌మెన్‌కు తీవ్ర గాయాలు

**ప్రజాపక్షం/కొత్తగూడ:** విద్యుత్ షాక్‌తో జూనియర్ లైన్‌మెన్‌కు తీవ్ర గాయాలైన సంఘటన మండలంలోని కుందనపల్లి గ్రామ శివారులో ఆదివారం చోటుచేసుకుంది. మండలంలోని సాదిరెడ్డిపల్లి సబ్ స్టేషన్ లో జూనియర్ లైన్మెన్ గా విధులు నిర్వర్తిస్తున్న లింగాల మహేష్ విధి నిర్వహణలో భాగంగా ఓటాయి ఫీడర్ లోని కుందన పెల్లి గ్రామం పక్కన ఒక రైతు పొలంలో ఉన్న కరెంటు స్తంభం ఎక్కి విద్యుత్ మరమత్తులు చేస్తుండగా ప్రమాదవశాత్తు విద్యుత్ షాక్‌కు గురై స్తంభం పైనుంచి కిందకు పడి తీవ్రంగా గాయపడ్డాడు. వెంటనే స్థానికులు విద్యుత్ సిబ్బంది మహేష్ ను నర్సంపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.. విషయం తెలుసుకున్న ఏఈ సురేష్, సిబ్బంది ఆసుపత్రికి చేరుకున్నారు. క్షతగాత్రుడిని ప్రవేట్ ఆస్పత్రికి వైద్యం కోసం తరలించారు..

# స్పోర్ట్స్ హబ్‌గా వరంగల్‌ను తీర్చిదిద్దుతాం

ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి




**ప్రజాపక్షం/హనుమకొండ టౌన్ :** వివిధ రంగాల్లో వేగంగా అభివృద్ధి చెందుతున్న వరంగల్ మహానగరాన్ని ఇప్పుడు క్రీడా రంగంలోనూ ప్రతిష్టాత్మక స్థాయికి తీసుకెళ్లేందుకు,స్పోర్ట్స్ హబ్‌గా తీర్చి దిద్దేందుకు ప్రభుత్వం తీవ్రంగా కృషి చేస్తోందని, ముఖ్యంగా యువతలో క్రీడా స్ఫూర్తిని పెంపొందించేందుకు మరిన్ని అవకాశాలు కల్పించేందుకు చర్యలు చేపడుతున్నామని వరంగల్ పశ్చిమ నియోజకవర్గ శాసన సభ్యులు నాయిని రాజేందర్ రెడ్డి తెలిపారు.ఆదివారం హనుమకొండ ఆఫీసర్స్ క్లబ్ వేదికగా జరిగిన 11వ తెలంగాణ రాష్ట్ర స్థాయి అండర్ 17 బ్యాడ్మింటన్ చాంపియన్ షిప్ 2025 ముగింపు సమావేశంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యే, మూడు రోజులపాటు జరిగిన పోటీల్లో విజేతలైన క్రీడాకారులకు ట్రోఫీలు, ప్రశంసాపత్రాలు అందజేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మన యువత ప్రతిభకు వేదికలు సిద్ధం చేయడం ప్రభుత్వ బాధ్యత. త్వరలో వరంగల్ నగరంలో అంతర్జాతీయ ప్రమాణాలకే సరిపడే క్రికెట్ స్టేడియం ఏర్పాటు కానుందన్నారు. క్రీడా పాఠశాల కోసం ప్రభుత్వం సన్నద్ధతతో ముందడుగు వేసిందని, నూతన భవన నిర్మాణానికి నిధులు విడుదలయ్యాయని, తరగతుల ప్రారంభానికి కూడా తగిన చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు.తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అభివృద్ధిపై, ముఖ్యంగా యువత భవిష్యత్ పై అపారమైన దృష్టి పెట్టి, వరంగల్ నగరాన్ని అన్ని విభాగాల్లో ముందుకు తీసుకెళ్లే దిశగా పలు నిర్ణయాలు తీసుకుంటున్నారు. ప్రజా ప్రభుత్వంగా విద్య, వ్యవసాయం, వైద్యం, క్రీడలు అన్నీ సమాన ప్రాధాన్యంతో అభివృద్ధి చేయాలన్నదే లక్ష్యం అని తెలిపారు. ఈ సందర్భంగా హనుమకొండ ప్రాంతానికి చెందిన క్రెడాయి ప్రధాన కార్యదర్శి శాఖమూరి అమరేందర్ కుమారుడు ఐఏఎస్ అధికారి సాయి ఆశ్రిత్ ను ఎమ్మెల్యే ప్రత్యేకంగా అభినందించారు. ఈ సందర్భంగా ఆయనను సత్కరించారు.ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, జిల్లా అధికారులు, క్రీడా సంఘాల ప్రతినిధులు, కోచ్‌లు, క్రీడాభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

**ప్రారంభోత్సవానికి హాజరైన ఎమ్మెల్యే నాయిని**

హనుమకొండ 5వ డివిజన్ లో కేయుసి రోడ్ ఎస్ బిఐ బ్యాంక్ ఎదురుగా వారాహి టిఫిన్ సెంటర్ ప్రారంభోత్సవానికి వరంగల్ పశ్చిమ నియోజకవర్గ శాసనసభ్యులు నాయిని రాజేందర్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆదివారం ఎమ్మెల్యే చేతుల మీదుగా ప్రారంభోత్సవం చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ పోతుల శ్రీమన్నారాయణ, కాంగ్రెస్ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ తోట వెంకన్న, కాంగ్రెస్ డివిజన్ అధ్యక్షురాలు గాండ్ల స్రవంతి, అనిత, రాణి, సురేష్, శ్రావణ్ కుమార్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

**ఇందిరమ్మ ఇండ్లకు కార్పొరేటర్ శ్రీమాన్ శంఖుస్థాపన**

హనుమకొండ ఐదవ డివిజన్ లో ఇందిరమ్మ ఇండ్లు మంజూరైన పలు లబ్ధిదారులకు ఆదివారం స్థానిక కార్పొరేటర్ పోతుల శ్రీమన్నారాయణ ఇండ్ల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షురాలు గాండ్ల స్రవంతి, ఇందిరమ్మ కమిటీ సభ్యులు, వార్డు ఆఫీసర్, కాంగ్రెస్ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## పరీక్ష నిర్వహణ తీరును పరిశీలించిన జిల్లా అదనపు కలెక్టర్



**ప్రజాపక్షం/జనగామ టౌన్:** లైసెన్స్‌డ్ జీపీవో, లైసెన్స్డ్ ల్యాండ్ సర్వేయర్ల అర్హత పరీక్ష సజావుగా సాగిందని అదనపు కలెక్టర్ రోహిత్‌సింగ్ తెలిపారు. ఆదివారం స్థానిక ఏబీవీ డిగ్రీ కళాశాలలో ఏర్పాటుచేసిన పరీక్ష కేంద్రాన్ని వారు సందర్శించి పరీక్ష నిర్వహణ తీరును, హాజరు శాతాన్ని పరిశీలించడం జరిగింది. మొత్తం అభ్యర్థులు 173 మంది కాగా, అందులో లైసెన్స్డ్ సర్వేయర్ పరీక్షకు ఉదయం 170 మంది, మధ్యాహ్నం పరీక్షకు 167 మంది అభ్యర్థులు హాజరయ్యారన్నారు. అదనపు కలెక్టర్ వెంట స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు, ఏడీ సర్వేల్యాండ్ అధికారి, తదితరులున్నారు.

## భూభారతి దరఖాస్తుల పరిష్కారానికి చర్యలు



**ప్రజాపక్షం/హసన్ పర్తి :** భూభారతి దరఖాస్తులను ఆన్లైన్ చేసిన తర్వాత త్వరగా పరిష్కరించేందుకు చర్యలు చేపట్టాలని హనుమకొండ జిల్లా అదనపు కలెక్టర్ ఎ.వెంకట్ రెడ్డి అన్నారు. ఆదివారం హసన్ పర్తి తహసిల్దార్ కార్యాలయంలో భూభారతి దరఖాస్తుల ఆన్లైన్ ప్రక్రియను అదనపు కలెక్టర్ పరిశీలించారు.ఇప్పటి వరకు ఆన్లైన్ చేసిన భూభారతి దరఖాస్తులను గురించి స్థానిక తహసిల్దార్ చల్లా ప్రసాద్ ను అదనపు కలెక్టర్ వెంకట్ రెడ్డి అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా తహసిల్దార్ చల్లా ప్రసాద్, నాయబ్ తహసిల్దార్ రహీం పాషా, ఇతర అధికారులు పాల్గొన్నారు.

**గురుకుల విద్యాలయం సందర్శన**

హసన్పర్తి ఎర్రగట్టు గుట్ట సమీపంలోని తెలంగాణ రాష్ట్ర బాలికల గురుకుల పాఠశాలను అదనపు కలెక్టర్ సందర్శించారు. పలు తరగతి గదులను పరిశీలించి విద్యార్థినులతో మాట్లాడారు. వంటగదిని తనిఖీ చేసి విద్యార్థినులకు వండుతున్న భోజన పదార్థాలను పరిశీలించారు.

హనుమకొండలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నిర్వహిస్తున్న గ్రామ పాలన అధికారులు, లైసెన్సుడ్ సర్వేయర్ల పరీక్షను అదనపు కలెక్టర్ పరిశీలించారు. ఈ కేంద్రంలో పరీక్ష జరుగుతున్న తీరును పరిశీలించి వాటి వివరాలను అధికారులను అదనపు కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు.

# భాష మార్చుకోకపోతే బుద్ధి చెబుతాం

కెటిఆర్‌కు
ఎమ్మెల్యే రేవూరి హెచ్చరిక



**ప్రజాపక్షం/పరకాల :** ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పట్ల మాజీ మంత్రి కేటీఆర్ మాట్లాడే భాష తీరును మార్చుకోక పోయినట్లయితే తగిన విధంగా బుద్ధి చెప్పడం ఖాయమని పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డి అన్నారు. ఆదివారం తన క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని ఉద్దేశించి మాజీ మంత్రి టిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ వాడు, వీడు అని సంబోధిస్తూ మాట్లాడడం ఆయన అవివేకానికి నిదర్శనమని ఎమ్మెల్యే మండిపడ్డారు. తన చదువు సంస్కృతి నేర్పిన పద్ధతి ఇదేనా అని ఆయన ప్రశ్నించారు. ముఖ్యమంత్రి పట్ల మాట్లాడే భాష ఇట్లా ఉంటే మంచిది కాదని ఆయన హితవు పలికారు. తెలంగాణలోని కాంగ్రెస్ ప్రభుత్వం విభిన్న వర్గాల సంక్షేమం కోసం పనిచేస్తుందన్నారు. రైతుల మేలు కోసం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం రెండు లక్షల రుణమాఫీ సన్నవడ్లకు బోనస్ తో పాటుగా రైతుబంధు సకాలంలో అందించి ఆదుకుంటుందన్నారు. కేంద్ర ప్రభుత్వం చేసిన నిర్వాకం వల్ల తెలంగాణ రైతులకు సకాలంలో యూరియా అందరి మాట నిజమేనని ఆ దోషం కేంద్రాన్ని ఎమ్మెల్యే వివరించారు. తెలంగాణ వ్యవసాయ శాఖ మంత్రి , ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డి ఢిల్లీ లోని సంబంధిత మంత్రులతో మాట్లాడి యూరియా కొరత లేకుండా ప్రయత్నాలు చేశారని ఈ సందర్భంగా తెలిపారు. టెక్స్టైల్ పార్కులో అవినీతి జరిగిందని నిరూపిస్తే దేనికైనా సిద్ధమన్నారు. కేంద్ర ప్రభుత్వం మంజూరు చేస్తే రాష్ట్రం గొప్ప ఏముందని ఆయన ప్రశ్నించారు. రైతుల చేతులకు సంకెళ్లు వేసిన వ్యక్తులు రైతుల కోసం మాట్లాడడం దయ్యాలు వేదాలు వల్లించినట్టుగా ఉందని పరకాల ఎమ్మెల్యే అన్నారు. 2018 నుండి రైతులకు ఐదేళ్లపాటు ఉచితంగా ఎరువులు పంపిణీ చేస్తామని చెప్పి ఎన్నికల్లో లబ్దిపొంది మాట మరిచిన విషయం నిజం కాదా అని ఆయన మండిపడ్డారు. కాంగ్రెస్ ప్రభుత్వం పేద ప్రజల సంక్షేమం కోసం నిరంతరం పాటుపడుతుందని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో పరకాల పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కోయడ శ్రీనివాస్, కుంకుమేశ్వర ఆలయ ట్రస్ట్ బోర్డు చైర్మన్ రాజేశ్వరరావు , మాజీ కౌన్సిలర్లు పంచగిరి జయమ్మ తో పాటు పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# నాణ్యమైన పెట్రోలు సరఫరా చేయాలి

ఎమ్మెల్యే కెఆర్ నాగరాజు



**ప్రజాపక్షం/హసన్‌పర్తి:** నాణ్యమైన పెట్రోలు సరఫరా చేయాలని వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు అన్నారు. ఆదివారం గ్రేటర్ వరంగల్ 65వ డివిజన్ నిరూపనగర్‌తండాలో నిర్వాహకులు భూక్య వెంకటయ్య, రాజు, అశ్విన్‌లు నూతనంగా ఏర్పాటుచేసిన ఆదిత్య ఫిల్లింగ్ స్టేషన్ ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ పెట్రోలు బంక్‌ను వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజును ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. నిర్వాహకులు ఇండియన్ ఆయిల్ కార్పోరేషన్ వరంగల్ డివిజన్ ద్వారా నాణ్యమైన పెట్రోలు సరఫరా చేసి వినియోగదారులతో స్నేహ పూర్వకంగా నడుచుకొని వారి మన్ననలను పొందాలన్నారు. అలాగే ఉత్తమ పనితీరు కనబర్చే కస్టమర్ సర్వీసు అటెండెంట్లకు ప్రత్యేకంగా ఐఓసీఎల్ బ్యాక్ ప్యాక్‌లతో సన్మానం పొందే విధంగా కృషి చేయాలన్నారు. అనంతరం బంక్ నిర్వాహకులు భూక్య వెంకటయ్య, రాజు, అశ్విన్ ఎమ్మెల్యే కేఆర్ నాగరాజును శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో 65వ డివిజన్ కార్పోరేటర్ గుగులోతు దివ్యరాణి రాజు నాయక్, హసన్‌పర్తి, కాజీపేట తహసీల్దార్లు చల్ల ప్రసాద్, బావ్‌సింగ్, ఫూల్‌సింగ్ 65వ డివిజన్ బీఆర్ఎస్ జిల్లా నాయకులు పుట్ట శంకర్, రవీందర్‌రావు, ఆత్మకూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ ఛైర్మన్ తంగళ్లపల్లి తిరుపతి, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు పోరెడ్డి మహేందర్‌రెడ్డి, 65వ డివిజన్ కార్పోరేటర్ అభ్యర్థి పోరిక రాజునాయక్, 56వ డివిజన్ నాయకుడు శంకర్ నాయక్, రియల్ ఎస్టేట్ వ్యాపారి లడ్డు రాజు తదితరులు పాల్గొన్నారు.

# అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇందిరమ్మ ఇండ్లు



**ప్రజాపక్షం/రాయపర్తి:** అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇందిరమ్మ ఇండ్లు అందిస్తామని టీపీసీసీ మాజీ కార్యదర్శి బిల్లా సుధీర్‌రెడ్డి అన్నారు. ఆదివారం మండల కేంద్రానికి చెందిన ఇందిరమ్మ ఇండ్ల లబ్దిదారులు మచ్చ స్వరూప, మల్యాల శోభారాణి, ఎనగందుల కవిత, జంపాల లక్ష్మి, సరికినేని నర్సమ్మలకు చెందిన ఇందిరమ్మ ఇండ్ల భూమి పూజ కార్యక్రమంలో వారు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఇండ్లు లేని నిరుపేదలకు ఇందిరమ్మ ఇండ్లు అందిస్తుందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం పేదల పక్షపాతి ప్రభుత్వమన్నారు. నిరుపేదల సొంతింటి కల కాంగ్రెస్ ప్రభుత్వంతోనే సాధ్యమన్నారు.ఈ కార్యక్రమంలో మండల సీనియర్ నాయకులు, ఇందిరమ్మ కమిటీ సభ్యుడు మచ్చ నీలయ్య, ఆకుల సురేంద్ర రావు, మాజీ మండల పార్టీ అధ్యక్షుడు మాచర్ల ప్రభాకర్, పీఏసీఎస్ డైరక్టర్ కుంట రమేష్, రాయపర్తి పట్టణ అధ్యక్షులు మచ్చ రమేష్, మాజీ రాయపర్తి పట్టణ ఉప సర్పంచ్ ఎండీ మహిమూద్, బిక్షపతి, నాయకులు నయీం, వనజరాణి, ఉస్మాన్, నరసింహమూర్తి, అశోక్, సాయిలు, శ్రీనివాస్, వెంకన్న, ప్రవీణ్, వెంకన్న, సోమన్న, తదితరులు పాల్గొన్నారు.

## రైతులను నమ్మించి మోసం చేసిన కాంగ్రెస్

ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత



**ప్రజాపక్షం/హనుమకొండ :** రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ రైతులను నమ్మించి మోసం చేసిందని, రైతులకు ఇచ్చిన హామీలు అమలు చేయడంలో, పంటలకు మద్దతు ధర అందించడంలో విఫలం అయిందని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు, బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత అన్నారు. ఆదివారం హనుమకొండలో ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో కవిత మాట్లాడుతూ రాహుల్ గాంధీన తీసుకొచ్చి కాంగ్రెస్ నేతలు వరంగల్ లో రైతు డిక్లరేషన్ చేయించారని,రైతు డిక్లరేషన్ లో ఇచ్చిన ఏ ఒక్క హామీని కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా అమలు చేయలేకపోయిందన్నారు.

రైతు డిక్లరేషన్ వల్ల రైతులు కాంగ్రెస్ పార్టీని నమ్మి ఓటేశారని, నమ్మి ఓటేసిన రైతులను కాంగ్రెస్ ప్రభుత్వం నిండా ముంచిందని అన్నారు.

రాహుల్‌గాంధీ మళ్లీ వరంగల్ వచ్చి రైతు డిక్లరేషన్ అమలుకు పూనుకోవాలని డిమాండ్ చేశారు. రైతు డిక్లరేషన్ లో మొట్టమొదటి అంశమైన రైతు మాఫీని సాగదీసి సాగదీసి అమలను ప్రకటించినా ... 50 శాతం మంది రైతులకు ఇంకా రైతు రుణ మాఫీ కాలేదని, కాంగ్రెస్ పార్టీ హామీని నమ్మి అనేక మంది రైతులు కొత్తగా రుణాలు తీసుకున్నారని, కానీ వారి రుణాలను మాఫీ చేయకుండా కాంగ్రెస్ ప్రభుత్వం మోసం చేసిందన్నారు.

కౌలు రైతులకు ఏడాదికి రూ 15 వేలు ఇస్తామని ఇచ్చిన హామీ ఏమైంది ? అని,అధికారంలోకి వచ్చిన తర్వాత సీఎం రేవంత్ రెడ్డి కౌలు రైతుల గురించి మాట్లాడడం లేదని,కౌలు రైతులను మరిచిపోయినందుకు సీఎం రేవంత్ రెడ్డికి, కాంగ్రెస్ పార్టీకి ఏం శిక్ష వేయాలి ? అని ప్రశ్నించారు.

రేవంత్ రెడ్డి ప్రభుత్వం ప్రభుత్వ లోగోలో ఉన్న కాకతీయ తోరణాన్ని మార్చి మన వారసత్వాన్ని కించపరిచిందని, మన సంస్కృతిని కాపాడుకునేందుకు పోరాడాలని అన్నారు.ఆగస్టు 6న జయశంకర్ జయంతి ఉత్సవాలను వరంగల్ లో తెలంగాణ జాగృతి పెద్ద ఎత్తున నిర్వహిస్తుంది. అదే రోజు తెలంగాణ జాగృతి ఆవిర్భావం సందర్భంగా ప్లీనరీ నిర్వహిస్తామని చెప్పారు. ఈ విలేఖరుల సమావేశంలో దాస్యం విజయభాస్కర్, మహిళా అధ్యక్షురాలు మాదవి, నాయకులు నలమాస శ్రీను, రాజు, మధు తదితరులు పాల్గొన్నారు.

# కాళేశ్వరం ఆలయంలో శ్రావణమాసం భక్తుల సందడి

## సామాన్య భక్తులకు అందని ద్రాక్షలా మిగిలిన లక్షపత్రి పూజలు

**ప్రజాపక్షం/కాళేశ్వరం:** జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో ప్రసిద్ధి గాంచిన కాళేశ్వరం ఆలయంలో ఆదివారం శ్రావణమాసం సందర్భంగా భక్తుల తాకిడి పెరిగింది. ఆదివారం సెలవు రోజు కావడంతో వివిధ ప్రాంతాల నుండి ఉదయం నుండే భారీగా భక్తులు తరలివచ్చి ముందుగా త్రివేణి సంగమ గోదావరిలో పుణ్య స్నానాలు ఆచరించారు. అనంతరం కాళేశ్వర ముక్తీశ్వర స్వామి వారిని భక్తి శ్రద్ధలతో దర్శించుకొని స్వామి వారికి ప్రత్యేక అభిషేకాలు, శుబానంధ అమ్మవారికి కుంకుమార్చన పూజలు నిర్వహించారు. భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకొని ఆలయ వర్గాలు తగిన ఏర్పాట్లు చేశారు.

**సామాన్య భక్తులకు అందని ద్రాక్షలా లక్షపత్రి పూజలు**



శ్రావణమాసం సందర్భంగా కాళేశ్వర ముక్తీశ్వర స్వామి వారికి అత్యంత ప్రాముఖ్యత గల లక్షపత్రి పూజలు సామాన్య భక్తులకు అందుబాటులో లేకుండా పోయాయి. ఆలయంలో లక్షపత్రి పూజలు సామాన్య భక్తులకు అందని ద్రాక్షలా మిగిలి సంపన్న వర్గాల భక్తులు మాత్రమే నిర్వహించుకునే విధంగా ఆలయ అధికారులు ఇబ్బడిముబ్బడిగా పెంచినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. గత సంవత్సరం శ్రావణమాసంలో రూ.6000 వేలు ఉన్న లక్షపత్రి పూజలు ధరలు ఈ ఏడాది శ్రావణమాసంలో రూ.8000 లకు పెంచడంతో సామాన్య భక్తుల నుండి ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి.

# రీల్



## అన్నపూర్ణ స్టూడియోలో 'మైసా' సందడి

పాన్ ఇండియా హీరోయిన్ రష్మిక మందాన ప్రధాన పాత్రలో 'మైసా' సినిమా పూజ కార్యక్రమాలతో షూటింగ్ ప్రారంభమైంది. అన్న పూర్ణ స్టూడియోలో జరిగిన ఈ షూటింగ్ ప్రారంభోత్సవంలో ప్రముఖ నిర్మాత దగ్గుబాటి సురేష్ బాబు క్లాప్ కొట్టారు. ఈ సినిమాకు రవీంద్ర పుల్లే ఈ సినిమా ద్వారా దర్శకుడిగా పరిచయం అవుతున్నారు. ఇచ్చాను హను రాఘవపూడి దగ్గర పని చేశారు. దీన్ని లేడి ఓరియంటెండ్ సినిమాగా తెరకెక్కిస్తున్నారు. అజయ్, అనిల్ సయ్యపురెడ్డి కలిసి ఈ సినిమాను నిర్మిస్తున్నారు. శ్రేయాస్ కృష్ణన్ సినిమాటోగ్రాఫర్‌గా పని చేస్తున్న ఈ సినిమాను యాక్షన్ బ్యాక్ డ్రాప్ లో నిర్మిస్తున్నామని నిర్మాతల్లో ఒకరైన అజయ్ తెలిపారు. ఇప్పటికే ఈ సినిమాకు సంబధించిన ఫస్ట్ లుక్ పోస్టర్ ను విడుదల చేశామని, ఆ పోస్టర్‌కు మంచి స్పందన లభించిందని అన్నారు. ఇప్పటివరకు రష్మిక హీరోలతో కలసి చేసిన సినిమాలోని పాత్రల కన్నా ఇందులో చాలా పవర్ ఫుల్ పాత్రను రష్మిక పోషిస్తోందని దర్శకుడు చెప్పారు. యాక్షన్ నేపథ్యంలో సాగే థ్రిల్లర్ సినిమా అని ఆయన అన్నారు. రష్మిక మందాన మాట్లాడుతూ ఇప్పటివరకు చేసిన సినిమాల కన్నా ఇది పూర్తి భిన్నమైన కథ అన్నారు. ఇంతవరకు ఇలాంటి క్యారెక్టర్ చేయలేదన్నారు. ఫస్ట్ టైం యాక్షన్ ఫైట్స్ కూడా చెయ్యబోతున్నా అని చెప్పారు. దర్శకుడు చెప్పిన కథ చాల బాగా నచ్చిందని తెలిపారు.




## 'కింగ్డమ్' ట్రైలర్ విడుదల

తెలుగులో రూపొందుతోన్న భారీ చిత్రాల్లో 'కింగ్డమ్' ఒకటి. విజయ్ దేవరకొండ కథానాయకుడిగా నటిస్తున్న ఈ చిత్రంలో సత్యదేవ్, భాగ్యశ్రీ బోర్సే ముఖ్య పాత్రలు పోషిస్తున్నారు. గౌతమ్ తిన్ననూరి దర్శకత్వం వహిస్తున్నారు. శ్రీకర స్టూడియోస్ సమర్పణలో సితార ఎంటర్‌టైన్‌మెంట్స్, ఫార్చ్యూన్ ఫోర్ సినిమాస్ పతాకాలపై సూర్యదేవర నాగ వంశీ, సాయి సౌజన్య ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్నారు. జూలై 31న ప్రేక్షకుల ముందుకు రానున్న 'కింగ్డమ్' తాజాగా ఈ చిత్ర ట్రైలర్ విడుదలైంది. తిరుపతిలోని నెహ్రూ మున్సిపల్ గ్రౌండ్స్ లో 'కింగ్‌డమ్' ట్రైలర్ ఆవిష్కరణ వేడుక ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా హీరో విజయ్ దేవరకొండ మాట్లాడుతూ.. 'గత సంవత్సర కాలంగా 'కింగ్డమ్' గురించి ఆలోచిస్తున్నాను. నాకు ఒక్కటే అనిపిస్తుంది. మన తిరుపతి ఏడుకొండల వెంకన్న స్వామి నా పక్కనుండి నడిపిస్తే.. చాలా పెద్దోడిని అయిపోతాను. ఎప్పటిలాగే ఈ సినిమాకి కూడా ప్రాణం పెట్టి పనిచేశాను. దర్శకుడు గౌతమ్, సంగీత దర్శకుడు అనిరుధ్, నిర్మాత నాగవంశీ, హీరోయిన్ భాగ్యశ్రీ బోర్సే అందరూ కూడా ప్రాణం పెట్టి పనిచేశారు. ఇప్పటికీ పనిచేస్తూనే ఉన్నారు. ఆ వెంకన్న స్వామి దయ, మీ అందరి ఆశీస్సులు ఉంటే. ఈ సినిమాతో ఘన విజయం సాధిస్తాను. 31న థియేటర్లలో కలుద్దాం అని అన్నారు.

## 'వన్ వే టికెట్' షురూ



హీరో వరుణ్ సందేశ్ తాజాగా మరో చిత్రం షూటింగ్ ప్రారంభించారు. 'వన్ వే టికెట్' పేరుతో వరుణ్ సందేశ్ హీరోగా కుష్బూ చౌదరి హీరోయిన్‌గా రూపొందుతున్న ఈ సినిమా షూటింగ్ ఆదివారం ప్రారంభమైంది. ప్రముఖ నిర్మాత సి.కళ్యాణ్ క్లాప్ కొత్తగా, ధమాకా దర్శకుడు నక్కి త్రినాధరావు కెమెరా స్విచాన్ చేశారు. బలగం సినిమా నిర్మాత హర్షిత్ రెడ్డి స్క్రిప్ట్ ను అందజేశారు. మనోజ్ నందన్ దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమా షూటింగ్ రెగ్యులర్‌గా జరుననుండి. వైవిధ్యమైన కథతో థ్రిల్లర్‌గా ఈ సినిమాను తెరకెక్కిస్తున్నామని హీరో వరుణ్ సందేశ్ చెప్పారు.



## వేమన పద్యాలకు సంగీత స్వరం

సంగీత దర్శకుడు బల్లేపల్లి మోహన్ శ్రీకారం

తెలుగు సినిమా సంగీత దర్శకుడు, గాయకుడు బల్లేపల్లి మోహన్ ఒక పక్క సినిమాలకు సంగీతం చేస్తూనే మరోపక్క కొత్త అధ్యాయానికి తెరలేపారు. అందరూ మరచిపోయిన వేమన పద్యాలకు తనదైన సంగీతం సమకూర్చి భవిష్యత్తు తరాలకు సాహిత్య, సంగీత సంపదను అందిస్తున్నారు. మరుగున పడిపోతున్న వేమన సాహిత్య సంపదను యువతకు చేరవేసే మహత్తర ప్రయత్నానికి ఆయన శ్రీకారం చుట్టారు.ఈ క్రమంలో ఇప్పటివరకు 75 వేమన పద్యాలకు పైగా తానే స్వయంగా గానం చేసి, మ్యూజిక్ కూడా పూర్తి చేశారు. వేమన పద్యాలను సామాజిక మాధ్యమాల్లో సంగీత రూపంలో ప్రచారం చేస్తున్నారు. తాత్వికతను, నీతి నిజాయితీలను, విలువల సమాజాన్ని ప్రతిబింబించే గొప్ప వేమన పద్యాలనూ జనాల్లోకి తీసుకుపోవడంతో బల్లేపల్లి మోహన్ విశేషంగా ప్రశంసలు అందుకుంటున్నారు. తమిళనాడు రాజ్ భవన్‌లో ఇటీవల 'కబీర్దాస్ వేమన తిరువళ్లూర్ సాహిత్య సెమినార్' జరిగిన సందర్భంలో బల్లేపల్లి మోహన్ కు ఆహ్వానం పంపించి మరీ ప్రత్యేకంగా వేమన పద్యాలను పాడించారు. వేమన పద్యాలపై ఆయన చేస్తున్న విశిష్ట సంగీత సాధనను మెచ్చుకొని బల్లేపల్లి మోహన్ కు ప్రత్యేక అవార్డు ప్రదానం చేశారు. ఈ క్రమంలోనే ఇటీవల సినీ ప్రముఖుల సమక్షంలో దాసరి ఫిలిం అవార్డును కూడా బల్లేపల్లి మోహన్ కు అందజేసి ఘనంగా సత్కరించారు. వేమన పద్యాలతో పాటు, ఆయన స్వరపరిచిన మరో తాత్విక గీతం 'శిలానీవే – శిల్పంనీవే', 25 చరణాలతో కూడిన ఈ విశిష్ట పాటకు అందించిన సంగీతం సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారింది. మానవీయ విలువలను ఈ పాట గాఢంగా వ్యక్తపరుస్తోంది. ప్రేమ, క్షమ, సహనం, స్వచ్ఛత, కుటుంబ బంధాలు, దేశభక్తి వంటి అంశాలను అద్భుతంగా మేళవించిన ఈ గీతం సమాజ ఔన్నత్యాన్ని పెంపొందించే ధ్యేయంతో రూపొందించబడింది.ఈ పాటను ప్రముఖ రచయిత జయరాజ్ రచించారు. ఇంతేకాదు, ఇటీవల భారత్–పాకిస్తాన్ యుద్ధ సమయంలో భారత సైనికులు చూపిన అపూర్వ వీరత్వానికి నివాళిగా బల్లేపల్లి మోహన్ స్వరపరిచి, స్వయంగా పాడిన ఆపరేషన్ సింధూరం అనే జాతీయ గీతం, ప్రజల్లో దేశభక్తిని రగిలించే స్ఫూర్తిదాయక గీతంగా వెలుగొందుతోంది.

ప్రముఖ సంగీత దర్శకుడు వందేమాతరం శ్రీనివాస్ వద్ద శిష్యరికం చేసిన బల్లేపల్లి మోహన్ రేలంగి నరసింహ రావు దర్శకత్వంలో వచ్చిన 'ఎలుక మజాకా' వంటి సినిమాలకు సంగీతం అందించారు. పంచముఖి, అబ్బో వాడా, నువ్వే నేను నేనేనువ్వు సినిమాలకు సంగీతం అందిస్తూనే సమాజంలో తనకు ఓ ప్రత్యేక గుర్తింపు లభించాలంటే తనకు వచ్చిన విద్య సంగీతంలోని ప్రత్యేకతను సాధించాలనే తపనతో వేమన పద్యాలను స్వరపరచి స్వయంగా పడుతున్నానని బల్లేపల్లి మోహన్ తెలిపారు. ఖమ్మం జిల్లా బల్లేపల్లి గ్రామానికి చెందిన మోహన్ తెలంగాణ ఉద్యమం సమయంలోనూ అనేక పాటలకు సంగీతం అందించారు. అంతేకాదు బల్లేపల్లి మోహన్ సంగీత సారథ్యంలో కాళేశ్వరం ప్రాజెక్టుపై ముప్పై మంది తెలుగు సినిమా గాయకుకు పాడిన పాటను కూడా రికార్డ్ చేశారు. ఇవన్నీ ఒక ఎత్తయితే వేమన పద్యాలకు సంగీతం సమకూర్చి జనాల్లోకి తీసుకుపోతుంటే, ప్రేక్షకుల నుంచి వచ్చే స్పందన చూసి జీవితం ధన్యమైనట్టుగా భావిస్తున్నాను అని మోహన్ సంతోషం వ్యక్తం చేశారు. వేమన పద్యాలకు సంగీత స్వరాన్ని జోడించి జనాల్లోకి తీసుకుపోవడమే ప్రస్తుతం లక్ష్యంగా పెట్టుకున్నానని బల్లేపల్లి మోహన్ చెప్పారు. వేమన కథను సినిమాగా తీసే ఆలోచన కూడా ఉందని, ఏవరైనా అభిరుచి గల నిర్మాత ముందుకు వస్తే వేమన జీవిత చరిత్రను పెద్ద తెర మీద ఆవిష్కరించాలనుకుంటున్నట్లు ఆయన పేర్కొన్నారు.

## డైలాగ్ కింగ్ నటనకు 50 ఏళ్లు



విలక్షణ నటుడు సాయి కుమార్ పేరు వింటే ఎన్నో అద్భుతమైన డైలాగ్లు మన కళ్ల ముందు మెదులుతాయి. హీరోగా, విలన్‌గా, కారెక్టర్ ఆర్టిస్ట్‌గా, డబ్బింగ్ ఆర్టిస్టుగా ఎన్నో అద్భుతమైన చిత్రాలతో దక్షిణాది సినీ ప్రేక్షకుల్ని ఆకట్టుకున్నారు. జూలై 27 ఆయన 65వ పుట్టిన రోజు ఘనంగా జరుపుకున్నారు. ఈ ఏడాదితోనే ఆయనకు నటుడిగా 50 ఏళ్లు నిండాయి. ఈ 50ఏళ్ల ప్రస్థానంలో ఎన్నో గొప్ప చిత్రాలతో మెప్పించిన సాయి కుమార్ ఈ ఏడాది బ్లాక్ బస్టర్ ప్రాజెక్టలతో బాక్సాఫీస్ వద్ద సందడి చేశారు. 1975 జనవరి 9న 'దేవుడు చేసిన పెళ్లి' చిత్రంతో నటుడిగా అరంగేట్రం చేశారు. ఆచిత్రం కూడా సంక్రాంతికి విడుదలై అప్పట్లో సంచలనం సృష్టించింది. నటుడిగా 50వ ఏటలోకి అడుగు పెట్టిన సాయి కుమార్ ఈ ఏడాది 'సంక్రాంతికి వస్తున్నాం' అనే చిత్రంలో నటించి మెప్పించారు. ఆ సినిమా ఇండస్ట్రీ హిట్‌గా నిలిచిన సంగతి తెలిసిందే. ఇక ఇదే ఏడాది సాయి కుమా ర్ ప్రధాన పాత్రను పోషించిన 'కోర్ట్' మూవీ కూడా భారీ విజయాన్ని సా ధించింది. కొత్త తరం ఆర్టిస్టులు వస్తున్నా, గట్టి పోటీ ఏర్పడినా.. నటుడిగా 50 ఏళ్లు గడిచినా కూడా సాయి కుమార్ ఇప్పటికీ చేతి నిండా ప్రాజెక్టులతో బిజీగా ఉంటూ.. ప్రతీ సినిమాతో ప్రేక్షకుల్ని మెప్పిస్తున్నారు. ప్రస్తుతం ఆయన సాయి ధరమ్ తేజ్ 'సంబరాల ఏటిగట్టు', నాగ శౌర్య 'బ్యాడ్ బాయ్ కార్తిక్', కిరణ్ అబ్బవరం 'కే ర్యాంప్', అల్లరి నరేష్ '12ఏ రైల్వే కాలనీ', 'ధర్మస్థల నియోజకవర్గం', 'రాజాధి రాజా', కోన వెంకట్‌తో ఓ సినిమా, ఎస్వీ కృష్ణారెడ్డితో మరో చిత్రం ఇలా ఫుల్ బిజీగా ఉన్నారు.

సాయి కుమార్ కేవలం తెలుగు ప్రాజెక్టులతోనే కాకుండా కన్నడ, తమిళ చిత్రాలతోనూ సందడి చేస్తున్నారు. కన్నడలో 'చౌకీదార్', 'సత్య సన్నాఫ్ హరిశ్చంద్ర', శివ రాజ్ కుమార్ తో ఒక సినిమా చేస్తున్నారు. తమిళంలో 'డీజిల్', విక్రమ్ ప్రభుతో ఒక సినిమాలో నటిస్తున్నారు. ఇక వెబ్ సిరీస్‌లలో కూడా తద్దైనా నటనతో దూసుకుపోతున్నారు. దేవా కట్టా దర్శకత్వంలో తెరకెక్కిన రాజకీయ చిత్రం 'మయసభ', క్రిష్ తెరకెక్కిస్తున్న 'కన్యాశుల్కం'లో పవర్ ఫుల్ పాత్రలను పోషిస్తున్నారు. సాయి కుమార్ తన తనయుడు ఆదితో కలిసి 'ఇన్‌స్పెక్టర్ యుగంధర్' అనే చిత్రంలో నటిస్తున్నారు.



## 'ఫైటర్ శివ' ఫస్ట్ లుక్

అరుణగిరి ఆర్ట్స్ కౌండిన్య ప్రొడక్షన్స్ బ్యానర్లపై సంయుక్తంగా నిర్మించిన 'ఫైటర్ శివ' చిత్రం షూటింగ్ పూర్తి చేసుకుని ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ దశలో ఉంది. ఈ చిత్రం ఫస్ట్ లుక్ పోస్టర్ ను ప్రముఖ దర్శకుడు సంపత్ నంది ఆవిష్కరించారు. ప్రభాస్ నిమ్మల దర్శకత్వం వహించిన ఈ చిత్రంలో మణికాంత్ ప్రధాన పాత్రలో నటించగా, ఐరా బన్సల్ కథానాయికగా నటించారు. ఈ చిత్రంలో సునీల్ , వికాస్ వశిష్ట దర్యాప్తు అధికారులుగా ప్రత్యేక పాత్రల్లో నటించారు. మధుసూదన్, యోగి ఖత్రి, దిల్ రమేష్, లక్ష్మ ణ్, అభయ్, ఆనంద్ భారతి, ఘర్షణ శ్రీనివాస్, మాస్టర్ శాన్విత్ నిమ్మల తదితరులు ఇతర పాత్రల్లో నటించారు.

## 'బోట్' నుంచి 'యుద్ధమే రాని' పాట విడుదల



డార్లింగ్ కృష్ణ, మనీషా హీరో హీరోయిన్స్‌గా శశాంక్ దర్శకత్వంలో రూపొందుతున్న మల్టీ లింగ్వల్ మూవీ 'బ్రాట్. డాల్ఫిన్ ఎంటర్టైన్మెంట్ బ్యానర్ పై మంజునాథ్ కందుక్కూర్ ఈ సినిమాని నిర్మించారు. తాజాగా మేకర్స్ ఈ సినిమా నుంచి 'యుద్ధమే రాని' సాంగ్ ని రిలీజ్ చేశారు. సిద్ శ్రీరామ్ పాడిన ఈ పాటని సీనియర్ నటుడు డాక్టర్ నరేష్ లాంచ్ చేశారు. అర్జున్ జన్య సంగీతం అందించిన ఈ పాటకు సనారె లిరిక్స్ రాశారు. ఈ సందర్భంగా నరేష్ మాట్లాడుతూ మంజునాథ్ మంచి స్నేహితుడు. మంచి వ్యక్తి. ఆడియన్స్ పల్స్ తెలిసిన ప్రొడ్యూసర్. నాతో కన్నడలో సూపర్ డూపర్ హిట్ సినిమా చేశారు. చాలా రోజుల తర్వాత అద్భుతమైన సినిమా బ్రాట్ తో వస్తున్నారు. ఈ సినిమా ఐదు భాషల్లో చిత్రీకరించి విడుదల చేస్తున్నారు.

## ఆలయంలో తొక్కిసలాట

(మొదటి పేజీ తరువాయి)

ప్రమేంద్ర సింగ్ దోబాల్ పిటిఐకి తెలిపారు. తీవ్రంగా గాయపడన 35 మందిని ఆసుపత్రికి తరలించగా, వారిలో ఆరుగురు మరణించారని ఆయన చెప్పారు. ఉదయం 9 గంటల ప్రాంతంలో ఈ ఘటన జరిగిందన్నారు. ఆదివారం కావడంతో 500 అడుగుల కంటే ఎక్కువ ఎత్తులోని శివాలిక్ కొండలపై ఉన్న ఆలయం వద్ద పెద్ద సంఖ్యలో భక్తులు గుమిగూడారన్నారు. ఆలయ ఇరుకైన ద్వారం వద్దకు వెళ్తునన పిల్లలు, మహిళలు సహా ప్రజలు అదే విధంగా ఆసుపత్రి వెలుపల ఆందోళన చెందుతూ కుటుంబ సభ్యులు కిక్కిరిసిపోయిన వీడియోల వైరల్‌గా మారాయి. కాగా, ఘటనపై ఉత్తరాఖండ్ ముఖ్యమంత్రి పుష్కర్ సింగ్ ధామి మెజిస్టీరియల్ దర్యాప్తుకు ఆదేశించినట్లు తెలిపారు. ఒక పుకారు కారణంగా ఉదయం మానసా దేవి ఆలయంలో తొక్కిసలాట జరిగిందని, ఈ ఘటనపై మెజిస్టీరియల్ దర్యాప్తుకు ఆదేశించామని, ఈ పుకారు వ్యాప్తి చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ధామి విలేకరులకు తెలిపారు. తొక్కిసలాటలో ప్రాణాలు కోల్పోవడం తనను తీవ్రంగా బాధపెట్టిందని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ అన్నారు. 'తమ ప్రియమైన వారిని కోల్పోయిన వారికి సంతాపం. గాయపడిన వారు త్వరగా కోలుకోవాలని కోరుకుంటున్నాను. స్థానిక అధికార యంత్రాగం బాధితులకు సహాయం చేస్తోంది' అయని ఆయన ఎక్స్‌లో పోస్ట్‌లో చేశారు. ఘటనాస్థలిలో రాష్ట్ర విపత్తు ప్రతిస్పందన దళం (ఎస్‌డిఆర్‌ఎఫ్), అగ్నిమాపక దళం సహాయక చర్యల్లో నిమగ్నమై ఉన్నాయి. మృతుల బంధువులకు రూ. 2 లక్షలు, గాయపడిన వారికి రూ.50,000 ఆర్థిక సహాయాన్ని సిఎం ప్రకటించారు. హరిద్వార్‌లోని జిల్లా ఆసుపత్రిలో గాయపడిన వారిని పరామర్శించారు. వారి కుటుంబాలకు అన్ని విధాలా సహాయం చేస్తామని హామీ ఇచ్చారు. తొక్కిసలాటలో ఆరుగురు మరణించారని, 28 మంది గాయపడ్డారని, వారిలో ఐదుగురిని రిషికేశ్‌లోని ఆల్ ఇండియా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (ఎయిమ్స్‌కు)కి రిఫర్ చేసినట్లు డెహ్రాడూన్‌లోని స్టేట్ ఎమర్జెన్సీ ఆపరేషన్ సెంటర్ (ఎస్ఇఒసి) తెలిపింది. మృతులను ఆరుష్ (12), షకల్ దేవ్ (18), విక్కీ (18), విపిన్ (18), వకీల్ మరియు శాంతిగా గుర్తించారు. విద్యుత్తు తీగలు తెగిపోయి ప్రవహిస్తోందనే పుకారు తర్వాత తొక్కిసలాట జరిగినట్లు కనిపిస్తోందని జిల్లా మేజిస్ట్రేట్ మయూర్ దీక్షిత్ హరిద్వార్‌లో విలేకరులకు తెలిపారు. ఆ ప్రదేశంలో కొన్ని విరిగిన వైర్లు కనిపించాయని, కొంతమంది వాటిని పట్టుకుని ఆలయానికి మెట్లు ఎక్కడానికి ప్రయత్నించారని ప్రాథమిక నివేదికలు సూచిస్తున్నాయని ఆయన అన్నారు.

## విలువలతో కూడిన జర్నలిజం మాత్రమే చేయాలి



### తెలంగాణ మీడియా అకాడమీ చైర్మన్ కె.శ్రీనివాస్‌రెడ్డి

ప్రజాపక్షం/ వరంగల్: పాత్రికేయులు సామాజిక బాధ్యతతో విలువలతో కూడిన జర్నలిజాన్ని మాత్రమే చేయాలని తద్వార సమాజంలో ప్రజల ఆదరణ పొందుతామని తెలంగాణ రాష్ట్ర మీడియా అకాడమీ చైర్మన్ కె.శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. వరంగల్ పట్టణంలోని ఉర్స్ కరీమాబాద్ తాళ్ల పద్మావతి ఇంటర్నేషనల్ స్కూల్లో తెలంగాణ మీడియా అకాడమీ ఆధ్వర్యంలో ఆదివారం వరంగల్ జిల్లా ప్రింట్ ఎలక్ట్రానిక్ మీడియా జర్నలిస్టులకు రెండు రోజులపాటు శిక్షణ తరగతుల కార్యక్రమం నిర్వహించారు. ఈ శిక్షణ తరగతులకు శ్రీనివాస్‌రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్‌రెడ్డి 'నైతిక నియమాలు మీడియా చట్టాలు' అనే అంశంపై ప్రసంగించారు. మీడియా అకాడమీ నిర్వహిస్తున్న పాత్రికేయుల శిక్షణ తరగతుల వల్ల మరింత జ్ఞానాన్ని పెంచుకునే అవకాశం ఉంటుందన్నారు. వార్తల సేకరణలో సామాజిక ప్రభావం వంటి అంశాలు పూర్తిగా కొత్త రూపం దాల్చాయని తెలిపారు. ప్రస్తుతం డిజిటల్ మీడియా రంగంలో వేగంగా వార్తల సేకరణ సులభం అవుతుందని, మారుతున్న కాలానికి అనుగుణంగా జర్నలిస్టులకు కావలసిన శిక్షణ ఇవ్వడానికి మీడియా అకాడమీ అన్ని చర్యలను చేపట్టి శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నామన్నారు. పాత్రికేయులు నైతిక విలువలు కాపాడుకోవడంతోపాటు పారదర్శకతతో కూడిన వార్తలను ప్రచురించినప్పుడే ప్రజల్లో పాత్రికేయులపై గౌరవం పెరుగుతుందన్నారు. జర్నలిస్టులు నైతిక ప్రమాణాలు పాటించాలన్నారు. ప్రెస్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా ఆవిర్భావం, వర్కింగ్ జర్నలిస్ట్.. నాన్ వర్కింగ్ జర్నలిస్ట్ తదితర అంశాలపై ఆయన విపులంగా తెలియజేశారు. భవిష్యత్తులో పత్రిక నిర్వహణలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ప్రధాన పాత్ర పోషించబోతుందని, తదనుగుణంగా రాబోవు కాలంలో జర్నలిస్టులకు టెక్నాలజీ, ఫ్యాక్ట్ చెక్ వంటి టెక్నికల్ అంశాలతో కూడిన తరగతులను మీడియా అకాడమీ తరపున నిర్వహిస్తామన్నారు. మాజీ సంపాదకులు కె.శ్రీనివాస్ మాట్లాడుతూ తెలంగాణ జర్నలిజం గతం, వర్తమానం, భవిష్యత్తు మీడియా, ధోరణులు ఆధునిక యుగంలో మీడియాలో వస్తున్న మార్పుల గురించి వివరించారు. సోషల్ మీడియా యూట్యూబ్‌లో వస్తున్న వార్తలు క్షణాల్లో ప్రజల్లో వెళ్తున్నాయని తెలిపారు. సీనియర్ జర్నలిస్ట్, బ్యూరో ఆఫ్ నెట్‌వర్క్ వెలుగు ఇన్‌చార్జి చిల్ల మల్లేశం భాష, తప్పొప్పులు, దిద్దుబాట్లపై జర్నలిస్టులకు కూలంకషంగా వివరించారు. ఆయా రిపోర్టర్లు వార్తలను డెస్క్‌కు పంపించే సమయంలో వాడుక భాషలో మాత్రమే వార్తలను పంపాలని, అవసరంలేని సాహిత్య పదజాలం, అర్థం కాని తెలుగు పదాలను వార్తలలో ఉపయోగించకూడదన్నారు. సీనియర్ జర్నలిస్ట్ దిలీప్ రెడ్డి సమాచార హక్కు చట్టం 2005 గురించి సమగ్రంగా వివరించి జర్నలిస్టుల సందేహాలను నివృత్తి చేశారు. ఈ కార్యక్రమంలో మీడియా అకాడమీ కార్యదర్శి వెంకటేశ్వరరావు, టియుడబ్ల్యుజె(ఐజెయు) అధ్యక్షులు శ్రీరామ్ రామ్ చందర్, ప్రధాన కార్యదర్శి మట్టదుర్గా ప్రసాద్, తాళ్ళ పద్మావతి విద్యా సంస్థల డైరెక్టర్ డా.వరుణ్, డిపిఆర్ఓ ఆయుబ్ అలీ, పాత్రికేయులు తదితరులు పాల్గొన్నారు.

## వాణిజ్య బెదిరింపులు

(మొదటి పేజీ తరువాయి)

ప్రకటించారు. ఇద్దరు నాయకులతో తాను మాట్లాడాననీ, వారు కలిసి కాల్పుల విరమణపై మాట్లాడుకునేందుకు ఒప్పుకున్నారని సోషల్ మీడియా వేదికగా పోస్టింగ్ పెట్టారు. 'మీరు ఇదే విధంగా శత్రుత్వాలు కొనసాగిస్తే మీతో వ్యాపారం చేసేదిలేదని రెండు దేశాలకూ హెచ్చరిక చేశాను, దీంతో కాల్పుల విరమణపై సంప్రదింపులకు అంగీకరించాయి' అని ట్రంప్ పోస్టింగ్ చేశారు. ఐతే ట్రంప్‌తో ఫోన్ సంభాసణ తర్వాత థాయ్‌లాండ్ తాత్కాలిక ప్రధానమంత్రి ఫుంథాన్ వెచాయచాయ్ ఒక ప్రకటన చేస్తూ, 'ట్రంప్ చాలా ఆందోళన వ్యక్తం చేశారు, ఆయనకు చూపిస్తున్న శ్రద్ధకు మా కృతజ్ఞతలు, కాల్పుల విరమణపై చర్చలకు అంగీకరిస్తున్నాం, కానీ మాదొక షరతు, మూడో దేశ జోక్యాన్ని మేం కోరుకోవడంలేదు, కాంబోడియాతో మేం ఇంకా చర్చలు ప్రారంభించలేదు' అన్నారు. కాంబోడియా ప్రధానమంత్రి హన్ మనెట్ ట్రంప్‌తో ఫోన్‌లో మాట్లాడిన వెంటనే ఒక ప్రకటన చేస్తూ, తమ దేశం తక్షణ, బేషరతుగా కాల్పుల విరమణకు అంగీకరించిందన్నారు. ''దాడులు ఆపేసేందుకు థాయ్‌లాండ్ అంగీకారం తెలియజేసిందని ట్రంప్ నాకు చెప్పారు, ఇది మా రెండు దేశాల సైనికులకు, ప్రజలకు చాలా సానుకూలమైన, మంచి వార్త' అని హన్ మనెట్ చెప్పారు. థాయ్‌లాండ్‌తో తదుపరి చర్చలు జరిపే ప్రక్రియ బాధ్యతలను ఉప విదేశాంగ మంత్రి ప్రాక్ సోఖోన్‌కు అప్పగించామని, అమెరికా విదేశాంగమంత్రి మార్కో రుబియోతో కూడా ప్రత్యక్షంగా మాట్లాడే బాధ్యతలు ఆయనకే అప్పగించామని హన్ మనెట్ చెప్పారు. ట్రంప్ జోక్యం చేసుకున్న కొద్దిసేపటికే రెండు దేశాలూ పరస్పరం ఆరోపణలు చేసుకున్నాయి. కానీ నాలుగోరోజు కూడా ఉద్రిక్తతలు కొనసాగాయి. ఉదయం తెల్లారకముందే సరిహద్దుల్లో దాడులు జరిగాయంటూ కాంబోడియా–థాయ్‌లాండ్ పరస్పర ఆరోపణలు చేశాయి. 'మీరంటే మీరే మొదట దాడులు ప్రారంభించారు' అంటూ రెండు దేశాల ప్రభుత్వాలు గడచిన గురువారం నుండి ఆరోపణలు చేసుకుంటున్నాయి. ఆదివారంనాడు కూడా అవే ఆరోపణలు కొనసాగాయి. రెండు దేశాలమధ్యా 867 కి.మీ నిడివిగల సుదీర్ఘమైన సరిహద్దు ఉంది. బేషరతుగా యుద్ధం ఆపేందుకు కృషి చేయాలని భద్రతా మండలికి కాంబోడియా ప్రభుత్వం శనివారం నాడు విజ్ఞప్తి చేసింది. యుద్ధంలో మొత్తం 34 మంది మరణించారు. రెండు దేశాల సరిహద్దు ప్రాంతాల నుండీ దాదాపు 1,68,000 మంది ప్రజలు ఇళ్ళు ఖాళీచేసి సురక్షిత ప్రాంతాలుక వెతుక్కుంటూ వెళ్ళిపోయారు. ఇలా వెళ్ళినవారిలో థాయ్ ప్రజలే ఎక్కువమంది ఉన్నారు. ప్రభుత్వాలు కూడా సరిహద్దు గ్రామాలను ఖాళీ చేయాలని ఆదేశాలు జారీ చేశాయి. థాయ్‌లాండ్‌లో 20 మంది మరణించగా, కాంబోడియాలో 13 మంది మరణించారు.

## చర్యలు తీసుకుంటున్నాం

(మొదటి పేజీ తరువాయి)

సురేంద్రమోహన్, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్, ఖమ్మం జిల్లా కలెక్టర్ అవినాష్ తదితరులు పాల్గొన్నారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం చారిత్రక నిర్ణయం అని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క అన్నారు. ఉమ్మడి జిల్లా అధికారులతో పాల్వంచలోని ఐడిఓసిలో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. వర్షాభావ పరిస్థితులను ఎదుర్కొనేందుకు అధికారులు సిద్ధంగా ఉండాలన్నారు. గోదావరి నదికి వరదలు వచ్చే అవకాశం ఉందని, దీనిని దృష్టిలో పెట్టుకుని అధికారులు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. జల వికాసం పథకం ద్వారా రైతులకు మేలు చేయాలన్నారు. మూడేళ్లలో సం.కు రూ.12,600 కోట్లను ఖర్చు చేసి ఈ పథకం ద్వారా గిరిజన రైతులకు అభివృద్ధి ఫలాలు అందిస్తామన్నారు. యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ పాఠశాలలు 25 ఎకరాల్లో నిర్మించి ఇతర విద్యాసంస్థలకు ఆదర్శంగా నిలవాలన్నారు. విద్యార్థుల ఆరోగ్యాల పట్ల వర్షాకాలంలో జాగ్రత్తలు తీసుకోవాలని, నిరంతరం వైద్య పరీక్షలు నిర్వహించాలన్నారు. పేదల సంక్షేమానికి ఇందిరమ్మ ఇళ్లు, ఉచిత బస్ రవాణా, రూ.500లకే గ్యాస్, 200 యూనిట్ల ఉచిత విద్యుత్ అందిస్తున్నామని, దేశంలో ఎక్కడా లేని విధంగా రూ.5 లక్షలతో ఇందిరమ్మ ఇళ్లు నిర్మిస్తున్నట్లు తెలిపారు. మహిళా పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించేందుకు బ్యాంకుల ద్వారా కోట్లాధి రూపాయల రుణాలు ఇచ్చించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. మహిళా సంఘాల ద్వారా చేపపిల్లల ఉత్పత్తి కేంద్రాలు స్థాపించడం ద్వారా ఆర్థికంగా అభివృద్ధి చెందే అవకాశం ఉందన్నారు. అనంతరం ఇంచార్జ్ మంత్రి శ్రీహరి మాట్లాడుతూ ప్రభుత్వపథకాలు ప్రజలకు చేరేలా అధికారులు కృషి చేయాలని చెప్పారు. రైతుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం తగిన చర్యలు తీసుకుంటుందన్నారు. ఇందిరమ్మ ఇళ్ల ఆవరణలో ఐదు మొక్కలు నాటే విధంగా చూడాలన్నారు. అనంతరం మంత్రి తుమ్మల మాట్లాడుతూ.. ఉమ్మడి ఖమ్మం జిల్లాను రాష్ట్రంలోనే అభివృద్ధి మోడల్‌గా తీర్చిదిద్దేంకు అధికారులు పనిచేయాలన్నారు. అనంతరం మంత్రి పొంగులేటి మాట్లాడుతూ.. ప్రభుత్వ లక్ష్యాలను ముందుంచుకుని అధికారులు పనిచేయాలన్నారు. రెవెన్యూ శాఖలో అవినీతి అక్రమాలకు పాల్పడే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఇందిరమ్మ ఇళ్లు త్వరితగతిన పూర్తి చేసి గృహ ప్రవేశాలు జరిగేలా చూడాలన్నారు. ప్రతీ సోమవారం లబ్దిదారుల ఖాతాల్లో విడతలవారీగా నగదు జమలవుతున్నాయని చెప్పారు.

పంచాయితీరాజ్, ఆర్‌అండ్‌బి శాఖ పరిధిలో పెండింగ్‌లో ఉన్న అన్ని పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. వానాకాలంలో నీరు కలుషితమయ్యే అవకాశం ఉందని, జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఆస్పత్రులు, వసతి గృహాల పర్యవేక్షణకు ఒక ప్రత్యేకాధికారిని ఏర్పాటు చేసి పర్యవేక్షణ చేయించాలన్నారు. ఈ సమీక్షా సమావేశంలో ఎస్‌పి రోహిత్ రాజ్, ఖమ్మం పార్లమెంట్ సభ్యులు రామసహాయం రఘురామిరెడ్డి, మహబూబాబాద్ ఎంపి పోరిక బలరాం నాయక్, కొత్తగూడెం ఎంఎల్‌ఎ కూనంనేని సాంబశివ రావు, భద్రాచలం ఎంఎల్‌ఎ డా.తెల్లం వెంకట్రావు, ఇల్లెందు ఎంఎల్‌ఎ పాయం వెంకటేశ్వర్లు, అశ్వారావు పేట ఎంఎల్‌ఎ జారే ఆదినారాయణ, సత్తుపల్లి ఎంఎల్‌ఎ రాగమయి, వైరా ఎంఎల్‌ఎ రామ్‌దాస్ నాయక్, అటవీ అభివృద్ధి సంస్థ చైర్మన్ పొదెం వీరయ్య, టిజిఐడిసి చైర్మన్ మువ్వ విజయ్ బాబు, జిల్లా అధికారులు తదితురులు పాల్గొన్నారు.

## మాటల యుద్ధం!

(మొదటి పేజీ తరువాయి)

అఖిలేష్ యాదవ్‌తో పాటు అనేక మంది ఇతర నాయకులు ప్రభుత్వంపై ఆరోపణలు చేసే అవకాశముంది. శుక్రవారం ఉభయసభలు వాయిదా పడ్డ తరువాత పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరణ్ రిజిజు మాట్లాడుతూ, సోమవారం లోక్‌సభలో, మంగళవారం రాజ్యసభలో పహల్గామ్ దాడి, ఆపరేషన్ సిందూర్‌పై చర్చ ప్రారంభించడానికి ప్రతిపక్షాలు అంగీకరించాయని చెప్పారు. ఉభయసభల్లోనూ 16 గంటల పాటు జరిగే చర్చకు ఇరుపక్షాలు అంగీకరించాయన్నారు. అనురాగ్ ఠాకూర్, సుధాంషు త్రివేది, నిషికాంత్ దూబే వంటి మంత్రులు, నాయకులతో పాటు, ఆపరేషన్ సిందూర్ తర్వాత భారతదేశం తరపున వాదనను వినిపించడానికి 30కి పైగా ప్రపంచ రాజధానులకు ప్రయాణించిన ఏడు బహుళపార్టీల ప్రతినిధుల నుండి అధికార ఎన్‌డిఎ తమ సభ్యులను చర్చలోకి దింపాలని భావిస్తున్నట్లు వర్గాలు తెలిపాయి. వారిలో శివసేనకు చెందిన శ్రీకాంత్ షిండే, జెడి(కు)కు చెందిన సంజయ్ ఝా, టిడిపికి చెందిన హరీష్ బాలయోగి తదితరులు ఉన్నారు. అమెరికాతో పాటు ఇతర దేశాలకు ప్రతినిధి బృందానికి నాయకత్వం వహించిన శశి థరూర్‌ను కాంగ్రెస్ స్పీకర్‌గా ఎంపిక చేస్తుందా అనేది పెద్ద ప్రశ్నగా మారింది. ఉగ్రవాద దాడి తర్వాత ప్రభుత్వం తీసుకున్న చర్యను శశి థరూర్ ఆమోదించడంతో ఆయనకు పార్టీతో ఉన్న సంబంధాలను దెబ్బతీసింది. కాగా, ఏప్రిల్ 22న జరిగిన పహల్గామ్ ఉగ్రవాద దాడి వెనుక ఉన్న నిఘా లోపాలు, భారత్, పాకిస్థాన్ మధ్య కాల్పుల విరమణకు మధ్యవర్తిత్వం వహించినట్లు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చేసిన వాదనలకు సంబంధించి ప్రతిపక్ష పార్టీలు ప్రభుత్వంపై బహిరంగ విమర్శలు చేశాయి. ఆపరేషన్ సిందూర్‌లో భారతదేశానికి అంతర్జాతీయ మద్దతు లభించలేదని, పాలక కూటమిని లక్ష్యంగా చేసుకోవడానికి ట్రంప్ తరచుగా మధ్యవర్తిత్వం వహించారని రాహుల్ గాంధీ ప్రభుత్వ విదేశాంగ విధానాన్ని పదే పదే విమర్శిస్తున్నారు. పహల్గామ్ దాడి తర్వాత పాకిస్థాన్, పాకిస్థాన్ ఉగ్రవాద స్థావరాలను లక్ష్యంగా చేసుకున్న ఆపరేషన్ సిందూర్‌ను మోదీ తన వంతుగా ప్రశంసించారు. ఇదిలా ఉండగా, బిహార్‌లో ఎన్నికల కమిషన్ కొనసాగిస్తున్న స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్) ఓటర్ల జాబితాపై పార్లమెంటులో చర్చ జరగాలనే డిమాండ్ ప్రభుత్వానికి, ప్రతిపక్షానికి మధ్య మిగిలి వివాదంగా ఉంది. ఈ ప్రక్రియ ఎన్నికలు జరగనున్న రాష్ట్రంలో బిజెపి నేతృత్వంలోని కూటమికి సహాయం చేయడమే లక్ష్యంగా ఉందని పేర్కొంటూ పార్లమెంట్ సమావేశాల మొదటి వారంలో ఐక్య ప్రతిపక్షం ఈ అంశంపై ఉభయసభల్లో ఆందోళన చేపట్టింది. ప్రతి అంశాన్ని ఒకేసారి పార్లమెంటులో చర్చకు తీసుకోలేమని, నిబంధనలకు అనుగుణంగా ఎస్ఐఆర్ చర్చకు ప్రభుత్వం తర్వాత నిర్ణయం తీసుకుంటుందని రిజిజు చెప్పారు.

Printed & Published on behalf of M/s Navachethana Vignana Samithi by its president **Palla Venkat Reddy,** Printed at M/s Navachethana Vignana Samithi, 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda (Nagole), GSI Post Hyderabad-500068, Telangana State, Published at Plot No 302, Venkata Sai Towers, Nehrunagar, KHAMMAM 507 002 Telangana State. RNI TELTEL /2018/76759, **Editor : Makkena Subbarao,** E-mail : editorprajapaksham@gmail.com